

విరహిణి - నృత్యభంగిమము

చిత్రకారుడు : శ్రీ బాలగోపాల భాస్కరరాజు.

భారతి

సంపుటము 23 | మార్చి, 1946 | సంచిక 3

పార్థివ ఫాల్గునము

ఆ నవ్వు

•

= శ్రీ కలపటపు రామగోపాలామాత్యుడు =

౧

ఆరామమెల్ల విరిసిన - యారామమనోభిరామహాసోదయమం
దారామ పూర్ణశశిగా - నారాత్రికమయ్యె జీవితాంబరతమముల్.

౨

తీయని పాటగా వలపుదీవెల బాటగ పూట లూటలౌ
ప్రాయపు వేకువన్ బ్రతుకుప్రాంగణమెల్ల గులాబితోటలం
గాయగ, రేకకొక్క కలగా బులకించు హృదంతరాగశో
భాయుగసంధ్యలో నుదయమయ్యె నొకే మధుహాసరేఖతోన్.

3

నన్నొక యింటివానిగ నొనర్పదలంచిన పెద్దయూహలే
చిన్నతనంబు నొందినవి శీతకరాన్వయదివ్యమైన యా
సన్నిధి మందహాసవిలసన్మయస్వర్గమహాముహూర్తమం
దెన్నొయుగాలగాథ లొకటేయిలుగా బయలై వెలుంగుచోన్.

౪

పున్నమి రేల పూర్వభవపుణ్యములే మలయానిలమ్ములై
సన్నగ జాజిమల్లియల చక్కిలిగింతలు వెట్టు, కల్వపూ
దొన్నెల నాడు తుమ్మెదలు తొంగలిరెప్పల జోలబాడు, వే
గన్నుల పర్వ మానగవుకౌగిలిలో నజరామరంబుగన్.

౫

వికచాంబుజశ్రీల నొక మహోదయవేళ 'ప్రియతమా' యని నన్ను బిలుచుకొనును
ధీరమై తారకావారమై యొక రాత్రి 'మిత్రమా' యని పురోగాత్రమగును,
లీలగా దీపాల మాలగా నొకసంజ నన్నా యటంచు నన్నావరించు
శరదిందుచంద్రికాసరళమై యొకరేయి 'నాయనా'యని గుండె నూయలూచు,
కన్నులున్న కబోదినై కానలేక - కలతనిద్దుర బ్రతుకులో కలవరింప,
వారినిధిపంక్తి ఫేననివాళియగును - నిత్యనూతన విశ్వసత్యావబోధ!

౬

వెన్నెలకన్నతల్లి యగు, వెన్నెలు సున్నితమా, నుమస్సులో
గ్రొన్నన దివ్యసౌరభము గూర్చెదు దొనన నామహత్త్వసం
పన్నజగమ్ములో నొదవు భాగ్యముచేతనె: కాళరాత్రులం
దన్నగవే వెలుంగు విపులాంబరనేత్రసహస్రదీతులన్.

౭

ఆ నవ్వు బ్రహ్మదేవుని సృష్టిమేళాన శర్వాణివీణపై బర్వులిడునో,
ఆ నవ్వు లోకరక్షాదక్షవక్షాన లక్ష్మీకటాక్షవీక్షణములగునో,
ఆ నవ్వు లయకాలహరశిరశ్చంద్రికై గంగమ్మ యందాల కానుపగునో,
ఆ నవ్వు వటపుటశయానునానససీమ నాశావిశాలమై యలముకొనునో,
అందులో సాగరము లేదు చిందులాడు - అందులో పంచభూతాలు సందడించు,
నవనవోన్మేష మఖిలజీవప్రకాశ - మది మహావిశ్వసంతోష మమరభాష.

౮

కాలహేలావిలోలలోకాలలీల - బ్రతుకు లెన్నెన్నొ మడతలుబడిన గుణము,
అంద మానంద మొకబిందువైన యెడము - అది యుగమ్ముల సారాంశమైన క్షణము!

ప్రథమాంధ్ర కవితాపితామహుఁడు శివదేవయ్య

•

= శ్రీ నిడుదవోలు వెంకటరావు =

తెలుఁగుకవిస్తుతులలో శివదేవకవినిగూర్చి యీ క్రిందిప్రబంధములలో గానవచ్చుచున్నది:

౧. కృష్ణరాయని (కాలము క్రీ. శ. ౧౫౦౯-౧౫౩౦) వాఁడగు ఎడపాటి ఎఱ్ఱన మల్హణచరిత్రము—

"వినుతు లొనర్తు నంద్రసుక
విప్రభు, నన్నయభట్టు, తిక్కయ
జ్వను, శివదేవు, భాస్కరుని,
జక్కన, నాచనసోము, సర్వదే
వుని, భరదూరు, వేము, నల
పోతన, పిల్లలమఱ్ఱివీరభ
ద్రుని, శరభాంకు, వీరకవి,
ధూర్జటి, కేతన, భట్టబాణునిన్."

౨. అయ్యలరాజు బాలసరస్వతి - రామకవి నాగరఖండము—

"శివతత్త్వ, శివదేవు, చిన్మయు, భవదూరు
శరభాంకు, రాజశేఖరుని, వేము
నన్నపను దిక్కనను ప్రబంధపరమేశు..."

(పై జంటకవులు మహమ్మదుకుతుబుశాహాకాలములోనివారు. క్రీ. శ. ౧౫౫౮ గ్రంథరచనాకాలము.)

౩. పింగళి ఎల్లన (దామెర వెంకటాద్రిపునికాలములోవాఁడు. క్రీ. శ. ౧౬౨౦) తోభ్యచరిత్రలో—

"చెలగి యథావాక్యముల యన్నమయ్యగారి
భజియించి మ్రొక్కిడి పాలకురికి
సోమన్నగారి బ్రస్తుతిచేసి, ప్రియమంది
శివదేవముఖవవకవుల నెంచి."

పై వానివలన క్రీ.శ. ౧౫౦౦ ప్రాంతమునకు పూర్వము శివదేవకవి యనునతఁ డున్నట్లు తెలియుచున్నది.

క్రీ. శ. ౧౩౮౦ ప్రాంతమువాఁడగు మడికిసింగన తాను సంధానించిన సకలనీతిసమ్మతము అను గ్రంథములో 'పురుషార్థసారము' అనునొక గ్రంథమునుండి పలు పద్యముల నుదాహరించియున్నాఁడు. సింగన గ్రంథములో గ్రంథకర్తలను పేర్కొనలేదు. కాని 'పురుషార్థసారము' లక్షణగ్రంథములలో శివదేవయ్య పురుషార్థసారమని పేర్కొనబడుటచేత దరచయితయగు శివదేవయ్య క్రీ.శ. ౧౩౮౦కి పూర్వుఁడని తెలియుచున్నది.

కవిబ్రహ్మ తిక్కనసోమయాజి పురుషార్థసారము నెఱిగినట్లు భారతము స్త్రీపర్వమున "పురుషుఁడు పురుషార్థసారభూషణుఁడుగదె" (౭-౧౧౧) అను పాదము ధ్వనించుచున్నది. ఇంతియేగాక తిక్కన శివదేవయ్యను స్వయముగా సందర్శించిన ట్లీక్రిందివిషయము వలన స్పష్టము. తిక్కనప్రభువగు మనుమసిద్ధి అక్కన బయ్యనలనువారిచే రాజ్యచ్యుతుఁడై, తిరిగి కాకతీయగణపతి దేవచక్రవర్తిచేఁ బునఃప్రతిష్ఠితుఁడగుట శాసనమూలమున ప్రమాణమైనసంగతి. తిక్కన కాకతీయగణపతిదేవుని యాస్థానమునకు వెళ్లి, తన పాండిత్యవిశేషముచే నాతని మెప్పించి, యాతని సాయముచే తన ప్రభువగు మనుమసిద్ధిని గద్దె నెక్కించెనని స్థానికచరిత్రలు (ప్రతాపచరిత్ర, సిద్ధేశ్వరచరిత్ర, సోమదేవరాజీయము) చెప్పుచున్నవి. ఆ సందర్భమున కాకతీయగణపతిచక్రవర్తి మంత్రియగు శివదేవయ్యనుగూర్చి తిక్కన "ఈతఁడు కేవల మీశ్వరుఁడుగాని మనుజుఁడు గాఁడు. కావున నీతని యనుమతమున నీవు రాజ్యము నేలు"మని చెప్పినట్లు పై గ్రంథములలో గలదు. కావున కాకతీయచక్రవర్తి గణపతిదేవుని కాలములో తిక్కనసమకాలికుఁడుగ శివదేవయ్య యుండెననుట స్పష్టము. గణపతిదేవ చక్రవర్తి చాలకాలము, అనగా ౬౨ ఏండ్లు (క్రీ. శ. ౧౧౯౯-౧౨౬౧) రాజ్యపాలనము చేసినవాఁడు. కావున నీకాలములో శివదేవయ్య యెప్పు డుండెనో తెలిసికొనుట యావశ్యకము. తిక్కన గణపతిదేవచక్రవర్తికడకు వెళ్లిన కాలము క్రీ. శ. ౧౨౫౫-౫౬ ప్రాంతము కావున శివదేవకవియు నప్పటివాఁడే యగును.

గణపతిదేవ చక్రవర్తికాలములో సాక్షాత్తు మహేశ్వరావతారమని చెప్పదగిన వ్యక్తి విశ్వేశ్వర

శివదేశికు లను ప్రసిద్ధశైవాచార్యుడు. ఈతడు గణపతి దేవచక్రవర్తికి దీక్షాగురువు, రాజగురువు నై విలసిల్లిన వాడు. ఈతని వ్యవహారనామము శివదేవయ్య యని ప్రతాపచరిత్ర సోమదేవరాజీయాదులయందు తెలియ వచ్చుచున్నది. మఱియు నాగ్రంథములలో నీతడు మంత్రులలో మంత్రిగాను, కవులలో కవిగాను పేర్కొనబడినవాడు. క్రీ. శ. ౧౨౬౧ లో గణపతి దేవచక్రవర్తి మందర మను గ్రామమును, గణపతిదేవ చక్రవర్తికూతురు రుద్రమాంబ వెలగపూడి యను గ్రామ మును శివదేవయ్యకు దానముచేయగా, నీతడు విశ్వేశ్వరగోళకి యను మఠమును, నగ్రహారమును నచ్చట నెలకొల్పి, మఱికొన్ని యగ్రహారములను దానముగావించి శాసనముచేసినాడు. అదియే ప్రసిద్ధ మగు మల్కాపురశాసనము. కావున నీ శాసనమున పేర్కొనబడిన విశ్వేశ్వరశివదేశికులును, శివదేవయ్య యు నొకరే యని చారిత్రకులు నిర్ణయించిరి.

మల్కాపుర శాసనమున విశ్వేశ్వర శివదేశి కులును, స్థానికచరిత్రలయందు పేర్కొనబడిన శివ దేవయ్యయు నొకరే యని చెప్పుటకు మఱియొక యాధారముగలదు.

శరభరాజీయ మనుపేర వైద్యశాస్త్ర గ్రంథము తెనుగున రచియించిన తుర్లూరి శరభరాజకవి తన వంశ మునుగూర్చి తెలుపుచు నిట్లు వ్రాసినాడు:

"శ్రీమదష్టాంగయోగ ప్రసిద్ధాభ్యాసి
ధర నోరుగంటి సత్పురనివాసి
అమల శ్రీవత్ససంయమి గోత్రపావని...
అనగ నతికెక్కు శివదేవు డనెడి యోగి
నాయకుండు సదా మోక్షదాయకుండు.

"అతడు ప్రతాపరుద్రవసు
ధాధిపుచేత నవాగ్రహారముల్
హితమతి నంది నిత్యసచి
వేశ్వరసంతతి కెల్ల మేటియై
అతులిత సంస్కృతాంధ్రకవి
తావళి కెల్ల పితామహుండునై
సతతము వన్నెకెక్కు బుధ
సంఘములోన మహాప్రసిద్ధుడై."

పైదానిని బట్టి ప్రతాపరుద్రునికి శివదేవు డనెడు మంత్రి గలడనియు, నాత డగ్రహారాది సమ్మానము గాంచినవాడనియు, కవియై, సంస్కృ తాంధ్ర కవితా పితామహుడని ప్రసిద్ధిగాంచినవా డనియు స్పష్టమగుచున్నది. మఱియు తాను 'శివ దేవకుల సుధార్ణవహిమాంశుండును' అని చెప్పుకొనుట వలన పైవిషయము దృఢమగుచున్నది. ఇక శివ దేవయ్య యిందు ప్రతాపరుద్రుని కాలమువాడని యుండుటచే నతడు క్రీ. శ. ౧౩౨౩ కు తరువాతి వాడో, లేక యప్పటివాడో కాదగునని సందేహము గలుగును. దానిని 'శ్రీవత్ససంయమి గోత్రపావని' అను వాక్యము తీర్చివేయుచున్నది. మల్కాపురశాసనమున శివదేశికుని గోత్రము తెలుపబడకపోయినను నందు విశ్వేశ్వరశివదేశికులు తన స్వగ్రామమగు పూర్వగ్రామ నివాసులును, సామవేదులును, శ్రీవత్సగోత్రులునగు బ్రాహ్మణులకు ముప్పదిపుట్ల భూమి నిచ్చినట్లు చెప్ప బడినది. కావున గణపతిదేవచక్రవర్తికి మాఱుగా ప్రతా పరుద్రుడని శరభరాజకవి వ్రాసెనని యూహింపనగును.

శరభరాజకవికి ప్రతాపరుద్రుని కాలమున, ననగా క్రీ. శ. ౧౨౯౫-౧౩౨౩ లో శివదేవకవి యున్నట్లు నాగవారాధ్యు డను కవి ద్విపదబసవవిజ యమున నిట్లు చెప్పియున్నాడు:

"అనుచు నా శివదేవు డాప్రతాపునకు
వినిపించి బసవయ్యవిఖ్యాతమహిమ
విని సంతసిల్లి యా వీరప్రతాప
జనవరేణ్యుడు తన సయ్యనమంత్రి
శివదేవునకు మహాశ్రీ లుల్ల సిల్ల
వివిధాంబరంబులు వివిధవస్తువులు
రూపింపగా నిచ్చె రుద్రనరేంద్రు
చేపట్టియుండె సుస్థిరకాలమెల్ల"

దీని ననుసరించి పద్యబసవవిజయమున తుమ్మల పల్లి నాగభూషణకవి గ్రంథాంతమున గద్యమునందు ఇట్లు చెప్పినాడు: "శివదేవుడు ప్రతాపరుద్రదేవునకు బసవన్నమాహాత్మ్యంబు వినిపించిన నతండు విని సంత సిల్లి వివిధాంబరంబులు వివిధవస్తువులు ప్రతాపరుద్రుం డొసంగి యతని సంతుష్టుం జేసి సుఖంబుండె."

శివదేవకవి ప్రతాపరుద్రుని కాలమున (క్రీ. శ. ౧౨౯౫-౧౩౨౩) నుండుట యసంభవము కాదుగాని, అందునకు తగిన యాధార మేమియు కానరాదు.

సకలనీతిసమ్మతమున పురుషార్థసారములోనివిగా నుదాహరింపబడిన పద్యములలో ౪ పద్యములు (౬౫౪-౬౫౭) అసంపూర్ణముగ నున్నవి. మిగిలిన భాగములోని భావములు వక్రోక్తిచతురములై హృదయంగమము లగుచున్నవి. ఇందలి కవితారచన ప్రౌఢమై, వస్తునిష్కృష్టియు, రసభావసమగ్రతయు, నిమిశికయు గలిగియున్నది. (పీఠిక-౧ పుట)

శివదేవకవి పురుషార్థసారముగాక 'శివదేవధీమణీ' అను మకుటము గల యొకశతకముగూడ రచించినట్లందుండి రెండుపద్యములు సకలనీతిసమ్మతము పీఠిక ౪, ౫ పుటలలో నుదాహృతములైనవి. అవి యివి:

"ప్రాణునపాను గూర్చి, యుల
పాము గదల్చి, తదూర్ధ్వకీలితో
ద్యానము నొత్తి మేను దృఢ
మై నిగుడం బిగియించి దృష్టులం
ఘాణము చేర్చి యా ప్రణవ
ఘోషము నే విని యందు మానస
క్షీణము చేసినం బవన
సిద్ధుడవా శివదేవధీమణీ!

"అరయగ చిన్నవాట సిరి
యాళుడునై, ఎలబ్రాయమందు సుం
దరు డను నంబియై, పదను
దప్పిన గుండయగారి చందమై
ధర చరియింపగల్గిన త
థాస్తు వృథాపరిపాకరూపదు
ష్కరజన నంబిదేమిటికి
కాలుపనే శివదేవధీమణీ!"

పైపద్యములు శివదేవకవిని వేఱొకకవి సంబోధించుచు చెప్పెనో, లేక యాతడే వేమూలుడు, శరభాంకుడు, వేమన మొదలగువారివలె తన్నుదాను సంబోధించుకొనెనో తెలియరాదు.

శరభరాజకవి చెప్పినట్లు శివదేవకవి సంస్కృతాంధ్రకవితాపితామహు డను ప్రసిద్ధి వహించియుండ వచ్చును. ఆంధ్రకవితాపితామహబిరుద మొకటి పెద్దనకు గలదని యందఱెఱుగుదురు. *కాని యిట్టి బిరుదముం దతనికుండు చాలకాలముక్రిందటనే వెలసినట్లు మన మూహింపదగును. ఈ క్రిందిపట్టిక యాబిరుదము గల కవులను దెలుపును.

౧. శివదేవకవి—క్రీ. శ. ౧౨౬౦ ప్రాంతము. సంస్కృతాంధ్రకవితాపితామహుడు.

౨. భీమకవి— క్రీ. శ. ౧౩౦౦ ప్రాంతము. ఈతడు సింహాసనద్వాత్రింశికకర్తయగు కొరవి గోపరాజునకు బినతాత. ఈతని పేరు సత్తెనారన. (ఇది సత్యనారాయణశబ్దతద్భవము) ఈతడు రామాయణము రచించెనట. గోపరాజీతని సాంధ్రకవిపితామహునిగా నుతించియున్నాడు.

"రామాయణకృతికృతియై
తా మెఱయుచు సంధ్రకవిపితామహు డనగా
భూమిని మించిన భీమన
నామంబున బరగె సత్తెనారన ఘనుడై."

3. అల్లసాని పెద్దన-క్రీ. శ. ౧౫౦౯-౧౫౩౦. ఆంధ్రకవితాపితామహుడు. కృష్ణదేవరాయ లీబిరుదముతో తన్ను సంబోధించుటయు, గద్యమున నీబిరుద ముండుటయు మనుచరిత్రవలన స్పష్టము.

౪. ఉప్పుగుండూరి వేంకటకవి—క్రీ. శ. ౧౬౦౫. ఈతడు మట్లయనంతరాజు వాస్థాని. కకుస్థవిజయమున నవతారికలో నీతడు 'ఆంధ్రకవి పితామహు'డని పేర్కొనబడినాడు. ఈతడు సుదంతాపరిణయమును రచియించిన యుప్పుగుండూరి పెరియన్నకవితండ్రి.

౫. మహామహోపాధ్యాయ పార్వతీశ్వరశాస్త్రి—క్రీ. శ. ౧౮౩౩-౧౮౯౭. ఈ ప్రౌఢవిద్వత్కవి అభినవాంధ్రకవితాపితామహబిరుదము గలవాడు.

* ఆంధ్రకవితాపితామహబిరుదము పెద్దనకు ముందు శివదేవకవికిగూడ నుండుటచేగాబోలు లక్షణగ్రంథములలో నీక్రింది పురుషార్థసారములోని పద్యము పెద్దనదిగా నుదాహరింపబడియున్నది. 'పర' అనే ఉపసర్గకు పురుషార్థసారములో పెద్దన—

"రాజులు సమ్మతిన్ తరత
రంబుల బ్రాతల భక్తియుక్తులన్
రాజిత శస్త్రపాణుల ప
రాక్రమవంతుల నప్రమత్తులన్
భోజనహేమవస్త్రపరి
పుష్టులనై......నవారిగా
నోజ నొనర్పగా వలయు
నొద్దన పాయక యుండు భృత్యులన్."
(యతిప్రాసవిలాసము)

ఈ పద్యము సకలనీతిసమ్మతమున ౧౬౮ పద్యముగా నుదాహృతమైయున్నది.

నన్నయ కవితాశిల్పము

★

= శ్రీ నండూరి రామకృష్ణమాచార్యులు =

ఆంధ్ర వాఙ్మయ ప్రపంచములో ఆదికవిగా, ఆంధ్ర కవితాలోకములో త్రిమూర్తులుగా విలసిల్లిన కవిత్రయములో ప్రథమునిగా వెలసిన నన్నయకవి 'మూర్తిని' భావుకలోకము చిరకాలము మనఃఫలకములో చిత్రించుకొని సాక్షాత్కరింపజేసికొను చున్నది. నేడు రసజ్ఞుడైన చిత్రకారుడు ఈ మహాకవి మూర్తికి రూపకల్పన చేయుటకు ప్రయత్నింపవచ్చును. చిత్రలేఖనములోని వర్ణసమ్మేళనమువలన, వెలుగు నీడలవలన, రేఖావిన్యాసమువలన నన్నయకవిభౌతిక రూపమును చిత్రించి దిఙ్మాత్రముగా ప్రదర్శింప వచ్చును. కాని నన్నయకవి ఆత్మీయతను, అంతరాత్మను చిత్రించి చూపు శక్తి ఏ చిత్రకారుని కుంచెకు లేదు.

కవిఅంతరాత్మ కావ్యములో ప్రతిఫలించును. కవిఆత్మకు, కావ్యమునకు బింబ ప్రతిబింబ భావము గలదు. అనిన లౌకిక ప్రపంచములోని కవి భౌతికస్వరూపముగాని, వాస్తవిక జగత్తులోని కవి ఆత్మీయతగాని కావ్యమున ద్యోతకముగాదు. కావ్యములో గన్పించునది కవిఅంతరాత్మ. అతని దివ్య స్వరూపము. నన్నయకవి 'దివ్యమూర్తి'ని సాక్షాత్కరింపజేసికొనదలచు భావుకుడు ఆమూర్తిని నన్నయభారతములోనే దర్శింపగలడు.

నన్నయ విపుల శబ్దశాసనుడు. నన్నయభారతము ఆంధ్రవాఙ్మయమున ఆదికావ్యము. ఆనాడు దేశీయములైన శబ్దములను, సంస్కృతశబ్దములను ఏరికూర్చి నుడికారపు సొంపులను తీర్చిదిద్దిన శబ్దశాసనుడు. నన్నయకు పూర్వము తెలుగులో శిలాశాసనములు కానవచ్చుచున్నవి. ఆంధ్రభాషలో సాహిత్యవ్యవసాయము నన్నయకు పూర్వమే ఆరంభించినది. వ్యవహారములో, శిలాశాసనములలో అవ్యవస్థితముగ నున్న విపులశబ్ద జాలమును తీర్చిదిద్ది నియతికల్పించి శాసించిన కవి నన్నయభట్టారకుడు. తెలుగుపదములకు సంస్కృత శబ్దములకు, తెలుగుఛందస్సునకు సంస్కృతఛందస్సునకు తీరుతీయములు దిద్ది పద్యములు చెక్కిన శిల్పి నన్నయకవి.

నన్నయ అవిరళజపహోమ తత్పరుడు. సంహితాభ్యాసుడు. 'తెలుంగునన్ మహాభారత సంహితారచనబంధురుడు.' బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాననిరతుడు. లోకజ్ఞుడు. నన్నయకు అర్థముమీద, అంతకంటె శబ్దముమీద నిష్ఠ గలదు. దీనికి కారణము నన్నయ శబ్దశాసనుడగుటకాదు. నన్నయకవి నిష్ఠ శబ్దముమీద మాత్రమేగాదు. రమణీయార్థమును ప్రతిపాదించు శబ్దములు, వాని కూర్పు, గురులఘువుల ఆనుపూర్వి మాత్రమేగాక ఏతదుచ్చారణమీద మెండు. దీనినే 'అక్షర రమ్యత' అని నన్నయకవి చెప్పికొన్నాడు. ఈ అక్షరరమ్యత శబ్దముల కూర్పులో, అక్షరముల ఆనుపూర్విలో, ఏతదుచ్చారణవల్ల అభివ్యక్తమగు నాదములో నున్నది. నన్నయ నాదబ్రహ్మోపాసి. లలితలలితములైన సంస్కృతపదములు, కమ్మని నుడికారపు సొంపుల నీను తెనుగుపదముల నన్నయ పద్యములలో—ఆ గురులఘువుల ఆనుపూర్విలో అక్షరరమ్యతగా వెల్లివిరిసినవి.

'నిండు మనంబు నవ్యనవనీత సమానము' అన్న పద్యములోని రమణీయార్థమును అటుంచ తెల్గుపదముల కూర్పు, సంస్కృతపదముల సమాసము రెంటిని మేళవించిన పద్యమునడక, ఆనడకలో జనించు 'నాదము' అక్షరరమ్యతగా పరిణమించుచున్నది. ఈ అక్షరరమ్యత సర్వజనైకవేద్యము. శబ్దార్థములకు అతీతము. విశిష్టము. అనగా తెలుగురానివారుగూడ విని ఆనందింపవచ్చును.

అక్షర సమ్మేళనమువలన జనించు నాదముపై నన్నయకు గల నిష్ఠ కచదేవయాని ఘట్టములో నన్నయ కవితాహృదయమును చీల్చుకొని స్వయంవ్యక్తమగు చున్నది. కచుడు శుక్రుని ఉదరమును చీల్చికొని వచ్చినాడు. ఆసందర్భమున—

"విగత జీవుడై పడియున్న వేదమూర్తి
అతనిచేత సంజీవితుడై వెలింగె
దనుజమంత్రి యుచ్చారణ దక్షుచేత
అభిహితంబగు శబ్దంబునట్లపోలె"

మృతుడైన వేదమూర్తి శుక్రుడు ఉచ్చారణ దక్షుచేత అభిహితమైన శబ్దమువలె తిరిగి సంజీవితుడై నాడు. భంగ్యంతరమున చెప్పవలసివచ్చిన ఉచ్చారణ దక్షుడు కానివాడు ఉచ్చరించిన శబ్దము మృత ప్రాయము. ఉచ్చారణదక్షుడు వేరు; సంగీత విద్వాంసు డు వేరు. సంస్కృత మహాభారతములో లేని ఈ ఉప మానము నన్నయకవితాహృదయమునుండి వెల్లి విరిసినది.

నన్నయకవితాశిల్పములో అక్షరరమ్యత కు తోడుపడినది "ప్రసన్న కథా కలితార్థయుక్తి". నానా రుచిరార్థ సూక్తినిధి నన్నయకవి కావ్యములో నీఅక్షర రమ్యతయు, ప్రసన్నకథాకలితార్థయుక్తియు నల్లిబిల్లిగ పడుగు పేకవలె నల్లుకొనియున్నవి. పూర్వోక్తములైన సూత్రములకు నన్నయమహాభారతమంతయు నిదర్శన ప్రాయమే. అర్థప్రపంచార్థమై కొన్ని పద్యములను ఉదాహరింప వచ్చును.

"వాడిమయూఖముల్ గలుగు
వా డపరాంబుధి గ్రుంకె ధేనువుల్
నేడిట వచ్చె నేకతమ
నిష్ఠ మెయిన్ భవదగ్నిహోత్రముల్....."

ఇవి దేవయాని కచునిరాకకు నిరీక్షించుచు తండ్రితో పల్కిన పలుకులు. ఈ పద్యములో 'సూర్యుడు' అను అర్థములో 'వాడిమయూఖముల్ గలుగువాడు' అని నన్నయ ప్రయోగించినాడు. సూర్యుని చండప్రచండ కిరణములు 'వాడిమయూఖము లలో' గనిపింపవు. ఈదీర్ఘసమాసమును, ఈదీర్ఘాక్షర ములను ఉచ్చరించునప్పుడు పుట్టునాదము సుకుమార స్త్రీ కంఠస్వరము. లేజవరాలు, శుక్రుని గారాబుపట్టి, ఆశ్రమవాటికలోని తాపసకన్యక దేవయాని నోటిలో 'తీక్ష్ణప్రచండకిరణుడు' వాడిమయూఖములు గలుగు వాడైనాడు ఇట్లే యీ పద్యమునంతయు పఠించినచో గురు లఘువుల ఆనుపూర్వి, దీర్ఘాక్షరములు ప్లుతములుగా నినదించుట, వాడి.....మయూఖ....మృగరాక్షస.... ఈపూర్వ కన్యకాకంఠస్వరమును మాత్రమే స్ఫురింప జేయును. నన్నయ అక్షరప్రపంచమున మేటిశిల్పి.

దుశ్శాసనుడు ద్రౌపదిని సభలోని కీడ్చి తెచ్చి నాడు.

"ఆవనజాననన్ గురు కు
లాపతేదుండు గడంగి రాజసూ
యావభృథంబునందు వసు
ధామరమంత్రపవిత్రవారి ధా
రావలిఁజేసి పావనము
లైన శిరోజములన్ దెమల్చి పా
పావహుఁ డీడ్చి తెచ్చె"........

ఈపద్యములో రమణీయార్థప్రతిపాదకములైన శబ్ద ములుమాత్రమే నన్నయకవితాశిల్పమునకు తార్కాణము లుకాజాలవు. నన్నయ వాడిన ఆశబ్దములనే వాడి ఆపద్య మును గద్యముగా చెప్పిన తొల్లిటి రసస్ఫూర్తి గల్గదు. లేతగులాబిపువ్వును రేకలురేకలుగా విడదీసి అరచేతిలో పెట్టి చూపినట్లు ఆఅందము మటుమాయమై పోవును. తిక్కనసోమయాజి కూడ నన్నయకవితాశిల్పముపై పూజ్యభావము గలవాడనుటకు ఈపద్యము ధ్వజప్రాయ మైన నిదర్శనము. తిక్కనగూడ చంపకమాలనే, ఆ 'వ'కార ప్రాసతోనే, 'రాజసూయావభృథంబునందు' అను ఆమాటలనే వాడి శ్రీకృష్ణునితో ద్రౌపదిచే తన పడిన భంగపాటును చెప్పించినాడు.

శ్రీకృష్ణుడు ధర్మరాజునకు పదునాలుగు వేల మత్తేభములను రాజసూయయాగమున బహుమానముగా నిచ్చును.

"మందితకూర్మగర్మరుచి
మన్మణిహారచయంబుతో గట
స్యంది సుగంధిదానజల
సంపద నొప్పెడువాని దేవకీ
నందను డిచ్చె బ్రీతి పదు
నాలుగు వేల గజంబులన్"

పదునాలుగు వేల మత్తేభములు. కనుచూపుమేరకు అందకుండ కదలివచ్చుచున్నవి. ఆమత్తేభములు సాలంకృతములు. మణిహారములలో ప్రతిఫలించు సూర్యరశ్మి సూర్యకాంతిని తిరస్కరించుచున్నది. ఈరమణీయార్థమును శబ్దములచే ప్రతిపాదించినాడు.

"మండిత సూర్యరశ్మి, రుచి సన్మణిహార చయంబుతో, గటస్థలంది సుగంధి దానజల సంపద నొప్పెడువాని దేవకీనందను డొప్పె..."—ఈదీర్ఘ సమాసములు, ఏకరుచ్చారణవలన పుట్టునాదము, ప్రాసవైన 'ండ' కారముల పౌనఃపున్యము మత్తేభయానముల గంభీర మందగమనమును స్ఫురింపజేయుచున్నవి.

విశ్వసాహిత్య ప్రపంచములో శబ్దార్థములకు, ఛందస్సునకు భిన్నమైన నాదముచే కవితాశిల్పమును నిర్మించిన మహాకవులను వ్రేళ్లపై లెక్కింపవచ్చును. ఈమహాకవులలో నన్నయ మేరుప్రాయ.

దుశ్శాసనుడు ద్రౌపదికలువలొలిచినప్పుడు భీముని ప్రతిజ్ఞను చెప్పు పద్యము :

"కురువృద్ధుల్ గురువృద్ధబాంధవులనే
కుల్ సూచుచుండన్ మదో
ద్ధురుడై ద్రౌపది నిట్లు చేసినఖలున్
దుశ్శాసనున్ లోకభీ
కరలీలన్ వధియించి తద్విపులవ
క్షశ్శైలరక్తౌఘని
ర్ఘరమూర్విపతి సూచుచుండ నని నా
స్వాదింతు నుగ్రాకృతిన్"

ఈపద్యములో కురువృద్ధుల్, గురువృద్ధ...మదోద్ధురుడై—ఇత్యాది సమాసములు, 'ద్ధ' కారప్రయోగ పౌనఃపున్యము భీముని రౌద్రాకృతిని, భీమసేనుడు తన గదాదండమును పలుమారు నేలపై ఝుళిపించి ప్రతిజ్ఞను సల్పుటను చెప్పక చెప్పుచున్నది. 'తద్విపుల వక్షశ్శైల...నిర్ఘర' మను దీర్ఘ సమాసము నుచ్చరించుచున్నపుడు భీముడు పండ్లు పటపటకొరికినట్లు, 'ఉగ్రాకృతిన్' అని త్రేన్చినట్లును స్ఫురించుచున్నది. పద్యములో నున్న ఏపదమును ఈ అర్థమును చెప్పకున్నను అక్షరముల ఆనుపూర్వి, ఏకరుచ్చారణలో జనించు నాదము వలన నదియంతయు స్వయంవ్యక్తమగుచున్నది.

ఇట్లే రాజసూయయాగమున శిశుపాలుని నిందావాక్యములను. ధర్మరాజును అధిక్షేపించుచు శిశుపాలుడు "అవనీనాథులనేకులుండగ విశిష్టారాధ్యులార్యుల్ మహీదివిజుల్ పూజ్యులు పల్వురుండగ ధరిత్రీనాథ......" అనుచు సభనుండి లేచిపోయినాడు. అవనీనాథులనవపుడు 'నీ' గురువు మాత్రమే గాదు. ప్లుతము. ఆవేశుడైన శిశుపాలుడు రెండుచేతులను నేలపై మోపి లేచుటను స్ఫురింపజేయుచున్నది. 'విశిష్టారాధ్యులు'—ఆరాధ్యులు అని ఆరాలను ప్లుతముగా నుచ్చరించి గట్టిగ తిరిగినాడు. 'ధరిత్రీనాథ', అను సంబోధనమున 'రిత్రీ' రెండు గురువులు, రేఫము. 'రిత్రీ' అనునప్పుడు జారి రెండడుగులు ముందునకు వైచినాడు. 'దాశార్హుండు పూజార్హుడే' అని ఏకారముతో తల పలుమారు పంకించి ప్రశ్నించినాడు. ఇది నన్నయ కవితాశిల్పములోని విశిష్టత.

ఛందస్సుతో, ఛందస్సుకంటె అతీతమైన విశిష్టమైన నాదముతో, గురులఘువుల ఆనుపూర్వితో, ఏకరుచ్చారణచే నుద్భవించు నాదముచే నన్నయ రసప్లుతముగావించుచున్నాడు. కవి ఉపపాదించు అర్థము అనిర్వాచ్యమని, వాచామగోచరమని, వర్ణనాతీతమని ఆలంకారికులు వర్ణించుచున్నారు. కవి అతీంద్రియములైన సత్యమును, సౌందర్యమును దివ్యచక్షువుచే దర్శించి కావ్యమున ప్రదర్శించును. వ్యవహారములోని శబ్దమునకీ శక్తి లేదనుట 'వర్ణనాతీతమనుటలో గతార్థము.

నన్నయకవితాశిల్పమును సమీక్షించినచో "రమణీయార్థ ప్రతిపాదకః శబ్దః కావ్యమ్" అన్న శ్రీ జగన్నాథ పండితరాయల కావ్యనిర్వచన మెంత అతివ్యాప్తి దోషమునకు పాల్పడుచున్నదా యనిపించును. కావ్యము రసాత్మకమనుట, రసానందము సద్యఃపరనిర్వృతి అనుట ఋషికల్పులైన భారతీయాలంకారికుల ప్రాచీన సిద్ధాంతము.

తండ్రికొడుకుల కలయిక: కొన్ని కావ్యములు

✻

— శ్రీ కపిల వేంకటరావు —

దైవదుర్విపాకమున నొకరినొకరు దూరమై, యొకరి నొకరెరుగని తండ్రికొడుకు లాకస్మికముగా గలుసుకొను సన్నివేశమును మహాకవులు కొందరు చిత్రించినారు. గ్రీసు దేశీయుడైన సోఫోక్లీజు కవిశేఖరుని 'ఈడిపస్సురాజు' (Oedipus the king) అను నాటకములో నిట్టి సన్నివేశము పూర్వకథలోని భాగమై ప్రధానముగా గాకపోయినను వెనుకటి వృత్తాంతమును పాత్రలు స్మృతిపథమునకు దెచ్చుకొను సందర్భములలో వర్ణింపబడియున్నది. లెయస్సు (Laius) అను రాజునకు అయొకాస్టా (Iocasta) అను భార్యవలన గలిగిన పుత్రుకు తండ్రిని జంపి, తల్లిని పెండ్లాడునని జోస్యము చెప్పబడుటచేత నాత డాపుత్రుని చంపి రండని భటుల కిచ్చి యడవుల కంపించెను. కొన్ని యేండ్లు గడచిన తరువాత లెయస్సు కొద్దిమంది పరివారముతో నెచ్చటికో పోయి తిరిగి రాడయ్యెను. రాజ్య మరాజకమై యొక దుష్టభూతము పాలబడెను. తాను చేసిన ప్రశ్నకు సదుత్తరమిచ్చెడువాడు వచ్చినగాని విడిచిపోనని యా భూతము చెప్పుచుండెను. యువకుడైన ఈడిపస్సు వచ్చి ప్రశ్నకు సమాధానము చెప్పి యా భూతమును సాగనంపగా బ్రజ లాతనికి రాజ్యమును, రాణినిగూడ కట్టబెట్టిరి. ఈడిపస్సున కామె యందు సంతానము గలిగెను. కొన్నాళ్లకు రాజ్యమందు మహామారి రేగి ప్రజలు వేలాదిగా మరణించుచుండిరి. మహామారికిని, సంఘమరణములకును రాజే ప్రతిక్రియ నాలోచింపవలెనని ప్రజ లాతనితో మొర పెట్టుకొందురు. రాణిసోదరుడగు క్రియోన్ (Kreon) వచ్చి మహాపాపి యొక డారాజ్యమందుండుటచేత నట్టి విపరీతములు పుట్టినవని చెప్పును. తర్వాత టైరీసియసు (Teireisius) వచ్చి యా మహాపాపి స్వయముగ నీడిపస్సే యని చెప్పివేయును. తండ్రియైన లెయసును చంపుట, తల్లియైన యయొకాస్టాను పెండ్లాడుట అను మహాపాతకములు రెండింటిని రాజునెత్తిని మోపి యాతడు క్రోధపరవశుడైన రాజునకు బుజువులు చెప్పును. రాణి చెప్పిన గుర్తులు, మరి యితరులు చెప్పిన గుర్తులు నన్నియు విని, రాజు నిజముగా తాను మహాఘోరపాపములు చేసిన పాపినని తెలుసుకొని కండ్లు పొడుచుకొని రాజ్యత్యాగము చేయుటమూలముగా తన్ను దాను శిక్షించుకొనును. రాణి యాత్మహత్య చేసుకొనును.

ఈ యితివృత్తము మన సంప్రదాయములకు విరుద్ధమై మనకు దుర్భరముగా నుండును. మనము చూడవలసిన దా తండ్రికొడుకుల సమావేశ మెట్లు చిత్రింపబడినదో యదియే.

తండ్రిని తాను గలిసిన విషయమును వర్ణించుచు రా జిట్లనుచున్నాడు:

***"As nigh that triple way, I journeyed on**
Even there a herald and a man that rode
Upon a horse-wain, even as thou say'st
Met me; and there fore runner from the Path

*** From Dr. A. S. Way's translation.**

With that old man, essayed by force to thrust me
Then I in wrath that chariot footman smote,
Who jostled me. The elder marked the deed
And, as I passed the car he watched his time
And on mine head dashed down the double goad
His punishment exceeded the offence
For with the staff in mine hand swiftly struck
Out of the car's midst backward was he hurled
Yea, the whole band I slew."

నన్నాతడు గట్టిదెబ్బకొట్టగా నేను మరింత గట్టిదెబ్బ యాతనిని గొట్టితినని రాజు చెప్పనేగాని, యారథికుని జూడగనే తనకు,తన్ను జూడగనే యా రథికునకు నెట్టి స్నేహము నుదయించినట్లు చెప్పడు. చని పోయిన నీ భర్తరూపురేఖ లెట్టివని యీడిపస్సు రాణి నడుగగా నామె "His favour? Sooth, not at all unlike to thine" అని బదులు చెప్పెను. ఈడిపస్సును వివాహమాడునప్పు డామెకు నెట్టి వికారము గలిగినట్లు గన్పడదు. జోస్యమేమియో యామెకు దెలియును. ఈడిపస్సు, తనకు కొడుకుగాదగిన వయస్సు వాడు. రూపమా, తన భర్తనే పోలియున్నది. ఇట్టి స్థితిలో నామె కెట్టి యనుమానమును కలుగకపోవుట విపరీతమే.

ఫిరదౌసి వ్రాసిన 'షానామా' యను గ్రంథములోని కథలో రుస్తుము నామధేయుడైన యొక వీరాగ్రేసరుడు దూరదేశమున నొక కాంతను వివాహమాడి యామె గర్భవతియై యుండగనే యామె నచ్చట విడిచి స్వదేశమున కేతెంచెను. ఆమె యొక మగపిల్లవానిని గని వానికి సొహరాబని పేరుపెట్టెను. సొహరాబు దినదిన ప్రవర్ధమానుడై, వీరుల కుచితమైన విద్యలం నేర్చి, విజయముపై విజయము నందుచు పిన్నవయసుననే కీర్తి బడసియుండెను. ఆలుబిడ్డల సమాచారమును దెలిసికొనిరమ్మని రుస్తుము పంపిన దూతతో నచ్చటి వారు గర్భస్థుడైన బాలుడు పుట్టెనని చెప్పిరి. జగదేక వీరుడైన రుస్తుమే తన తండ్రి యని సొహరాబునకు దెలియును. అట్టి తండ్రికి తాను బిడ్డడైనందు కాతని కెంతయో గర్వము. ఎట్లైన నాతని సన్నిధిని చేరవలెనని యెంచి సొహరాబు తురేనియా దేశాధిపుడగు నఫ్రాసియాబునొద్దకు బోయి, పర్షియనలపై దాడి వెడలుటకనుమతి గోరెను. అనుమతి యిచ్చుచు నాతడు సైన్యమున కిద్దరు నమ్మకమైన తన సర్దారులను నాయకులనుగా జేసి యేవిధముచేతను రుస్తుముసొహరాబులు పరస్పర మెరుగరాదనియు, నా యిద్దరి నెట్లైన నొకరినొకరు డీకొనునట్లు చేయవలెననియు, నట్టిపరస్పరయుద్ధములో నా యిద్దరిలో నెవరో యొకడు చచ్చునట్లు చూడవలెననియు ఆ సర్దారుల కాజ్ఞ యిచ్చెను. కొడుకుచేతిలో దండ్రియే చచ్చుననియు, దర్వాత గొడుకును తాను కృత్రిమమున జంపింపవచ్చుననియు నాఫ్రాసియాబు నూహ...తురేనియను, పర్షియనుల మధ్యను యుద్ధమారంభమైనది. రాత్రియైనది. ఇంత కీర్తిగల యీ చిన్నవాడెవరని చూచుటకై చీకటిచాటున రుస్తుము శత్రుసేనానివహముపై పరిగి, యచ్చట సొహరాబును చూచి నివ్వెరజెందును. కాని యాతడు తన సంతానమేయని యెరుగడు. సొహరాబు యొక్క వీరవిహారమును నిజసేవకులు వినిపింపగా రుస్తుము తన తండ్రియైన 'శాము'ను తలచుకొనుచు—

"A horseman hath appeared like Sam
Now from our people this would not be strange
But from the Turkmans 'tis incredible.
None sayeth and I know not, where he is,
The daughter of the King of Samangan
Bore me a son but he is still a child,
The noble boy at present wotteth not
Of warfare, of attack and self-defence
I sent his mother gold and precious stones,
In plenty, and the messenger brought answer-
The darling is not growing very fast,

But quaffeth wine with life that savour
milk,
No doubt he will be eager soon for war
And then his onslaught will be lion like
He will lay low the head of many a
horseman."

మరునాడు సొహరాబొక గుట్టనెక్కి రుస్తుము సైన్యమును పరిశీలించును. నిన్న సొహరాబు చెరపట్టిన యాతడు వేర్వేరు నాయకుల పేర్లు దెలుపుచు, రుస్తుమును చూపక, యాతని డేరామాత్రము చూపి, సింహపరాక్రముడగు రుస్తుము దూరమం దెక్కడనో యున్నాడని చెప్పును. సొహరాబు శత్రుసేనాముఖ్యమునకు సుగ్రము పరికించుకొనిపోయి వారిని సవాలు చేయును. అశ్వారూఢుడై రుస్తుము రంగములోనికి వచ్చును. కన్నకుమారుని సుందరవిగ్రహమును గాంచి యావీరుని హృదయములో శోకవిస్మైన జాలిగలిగెను.

"Fair youth, the earth is hard and cold,
the air
Is soft and warm, old am I but have seen
Full many a stricken field......................
yet saw I never
Myself overcome............ [feet
My might hath laid the world beneath my
And now my heart doth yearn in ruth for
I would not take thy life." [thee

అని తండ్రి కొడుకుతో బలుకును. తండ్రి మాట్లాడుచున్నంతసేపును కొడుకుగుండెలలో నేదో చెప్పరాని తల్లడము గలుగుచుండెను. ఈ మహాపురుషుడే తన తండ్రియైయుండునా యన్న యనుమాన మాతనికి కలిగెను. ఆతడు— [art

"I think that thou art Rustum, that thou
Sprung from the noble race of Nariman."

నారిమనుకొడుకు శాము. శాము కొడుకు రుస్తుము. ఆ బిడ్డ డట్లు తన వంశపురుషులను పేర్కొనుట వినియును రుస్తుము నీ కాపేరు లెవరు చెప్పిరని రైన నడుగడు; నిజ మొప్పుకొనడు. ఆతడు వాస్తవమే చెప్పుచున్నాడనుకొని సొహరాబుయొక్క యాశయంతయు వ్యర్థముకాగా నతని ముఖము వైవర్ణ్య మందును... యుద్ధములో బ్రుసునివలన బరాజితుడై, తండ్రి, తమ యాచారముప్రకారము మొక్కమారు మాత్రమే పడిపోయిన శత్రువీరుల శిరము లుత్తరించ కూడదనియు, రెండవపర్యాయము పడిపోయినప్పుడే యట్లు చేయవచ్చుననియు కొడుకుతో చెప్పగా, కొడుకు కొత్తవిశ్వాసమువలన కొంతవరకు, నౌదార్యము వలన కొంతవరకు, ప్రారబ్ధమువలన కొంతవరకు చోదితుడై తండ్రిని చంపక విడుచును. లోకోత్తరపరాక్రమము తనకు వలసినప్పుడు కలుగునట్లుగానున్న యొకానొక వరము ననుసరించి రుస్తుమునకు నూతన బలము లభించినది. రుస్తుముచేతులలో సొహరాబు హతుడైపోయెను. ప్రాణము పోవుటకుముందు సొహరాబు "నాతండ్రి రుస్తుము నీప్రాణములు దీయక విడువ"డని చెప్పుటతో నిజము బయల్పడి, రుస్తుము నెత్తి నీలను గొట్టుకొని వాపోవును.

'మాథ్యూ ఆర్నోల్డను (Matthew Arnold) నాంగ్లేయకవి యీకథనే కొద్దిమార్పులతో బద్యరూపముగా రచించెను. ఆయనకు మాతృక సర్ జాన్ మాల్కొలమ్ వ్రాసిన పర్షియా దేశచరిత్ర. అందులో రుస్తుముపంపిన దూతతో రుస్తుము భార్య తనకు గూతురు పుట్టిన దని చెప్పినట్లున్నది. మరియు, సొహరాబుతో యుద్ధము చేయగల మగవాడెవ్వడైన రావచ్చునని తురేనియనులు పలికిన ధీరములకు పర్షియనునాయకులలో నెవ్వరును బదులుచెప్పలేక, తుదకు రుస్తుము చేతనే యాపని చేయించవలెనని, భోజనము చేసి పెంపుడుడేగను వ్రేలిపై నాడించుచున్న యాతని కడకు బోయి పౌరుషములు పలికి యాతనిని యుద్ధోన్ముఖుని చేయుటకై యొకడు పోవును. ఆ పోయిన యాతడు సొహరాబు బలపరాక్రమములు, సమానుష చర్యలు పొగడగా విని రుస్తుము చిరునవ్వు నవ్వి యిట్లనును :

"The young may rise at Sohrab's vaunts,
not I [fame
For what care I, though all speak Sohrab's

For would that I myself had such a son
And not that one slight helpless girl I have
A son so famed, so brave, to send to war."

మరియు నట్టికుమారుడే నాకుండి, వాడు దిగ్విజయము చేయుచుండగా, నిశ్చింతగా నేను నాతండ్రికి సేవలుచేసుకొందునని యా మహావీరు డనుకొనును.

ఎట్టకేలకు రుస్తుము లేచి రంగములోనికి వచ్చును. ఆవలిప్రక్కనుండి సాహరాబును వచ్చును. రెండు దీర్ఘమైన యుపమాలంకారములను ప్రయోగించి కవి యీ సందర్భములో గొడుకును జూచిన తండ్రికి నిస్స్నేహమును నొక కుతూహలము కలిగినట్లును, మిక్కిలి జాలి గలిగినట్లును మాత్రము చెప్పియున్నాడు. అట్లు జాలిగలిగిన రుస్తు మాతనిని తనపక్షమున జేరి, తన కండయై, తనకు పుత్త్రుడై యుండుమని కోరును.

రుస్తుముపలుకులు విన్నంతనే సాహరాబున కాతడే తన తండ్రి యని తోచి, ముందుకు పర్విత్తిపోయి, మోకాలబడి, యాతని కాళ్లు కౌగిలించుకొని—

"O, by thy father's head, by thine own soul
Art thou not Rustum ? speak, art thou not he."

అని వేడుకొనును.

కొడుకంత యాత్రముగా వచ్చి యట్లడిగినను నాతండ్రి కేమియు జలనము కలుగలేదు. ఇతని కేదో దురూహయుండియుండవలెనని మనసులోననుకొనుచు, నాబాలు డంతయొట్టు పెట్టినను, తన యుదంతమును దాచుకొనును...తర్వాత యుద్ధమగును. ఒక సందర్భములో రుస్తుము పట్టుతప్పి నేలపై బడును. ఆ యదనున నతనిని పొడిచివేయక, యాతడు తిరిగి లేచువంతవరకూరకయుండి, సాహరాబు శాంతిగోరుచు—

"No, when I see thee wrath forsakes my soul
Thou say'st thou art not Rustum ; be it so.
Who art thou then that canst so touch my soul
Never was my heart thus touched before..
Are they from Heaven, these softenings of the heart ?"

అని ప్రశ్నించును. పితృప్రేమ దొలికించుచు నా బాలు డాడిన మాటలు పెడచెవినిబెట్టి, రుస్తుమంతట తన సంతానమైన యా వీరబాలకుని నీ వాడు పిల్లవని వెక్కిరించును. మరల యుద్ధము. ప్రకృతి విరుద్ధమైన యీ తండ్రికొడుకుల పోరాటము చూడలేక సూర్యుడే యస్తమించినట్లు, పెల్లగాలి వీచినట్లు, నిసుకదుమారము లేచినట్లు గవి వర్ణించినాడు. కన్నుమసకగా నున్న యా సమయములో సాహరాబుయొక్క కత్తి రుస్తుముడాలుపై తునకలై పోయినది. పిడియొక్కటే యాతని చేతిలో మిగిలెను. నిరాయుధుడై యాతడట్లున్న వేళ తండ్రి "రుస్తుమ్"ని సింహనాదము చేయుచు గొడుకుపై నురికెను. ఆ మాట చెవులబడి సాహరాబు, తప్పక యాతడే తన తండ్రియని తోచినది కాబోలు—

"Shrank amazed ; back he recoiled one step,
And scanned with blinking eyes the advancing form
And then he stood bewildered ; and he dropped
His covering shield and the spear pierced his side."

ఆత డిటునటు త్రోగి, నేలపై బడిపోయెను. అది కాగానే—

"And then the gloom dispersed, and the wind fell
And the bright sun broke forth and melted all
The cloud —"

షేక్స్పియరు రచించిన సింబలైను (Cymbeline) అను నాటకములో నంతిమాంకములో చనిపోయినారని యందరు ననుకొన్న యిద్దరు రాజకుమారులు తండ్రిని కలిసెడు సన్ని వేశ మున్నది. అసలుకథ యిది: రాజగు సింబలైను మోర్గన్ నామధేయుడైన యొక వీరుని రాజ్యమునుండి బహిష్కరించగా నాతడు కక్షచేత పసిపాపలగు రాజకుమారుల నిద్దరి నెత్తుకొని పోయి యెక్కడో మారుమూల నొక గుహలో వారిని బెట్టుకొని కాపురముచేయుచుండెను. అతడు తనకు

బెలారియస్సని పేరుపెట్టుకొని వారికి గైడీరియస్సు, ఆర్విరేగస్సు అని మారుపేర్లు పెట్టెను. రాజకుమారులు మరణించిరనియే యెల్లరితలంపునై యుండెను. రాజున కింక మిగిలినది ఇమొజెన్ అను కూతురుమాత్రమే. తన మెంటిమగని కొడుకు క్లోటెన్ కామె నిచ్చి పెండ్లి చేసినయెడల రాజ్య మాతనికే దక్కునని రాజు కట్టుకొన్న మారుమనువు రాణియాశ. కాని, యిమొజను తాను వలచిన యొక శూరవరుని పెండ్లాడును. రాణి కోపమునకు గురియైన యా శూరుకు రాజ్యబహిష్కార శిక్ష బొందును. రాణికుట్రలవలన నిల్లువిడిచి, పురుష వేషధారిణియై యిమొజను దేశమెల్ల ద్రిమ్మరుచు సోదరులున్నయెడకు వచ్చి వారిచే నాదరింపబడును. కొన్ని సందర్భములవలన నామె చనిపోయినదని వారనుకొందురు. కొంతకాలమున కా దేశమునకును, రోమకదేశమునకును యుద్ధము సంభవించి, యందులో రాజపుత్రులును, వారిని పెంచిన వీరుడును స్వదేశరక్షణార్థమై ప్రాణములకు తెగించి పోరాడి, రాజునకు విజయము చేకూర్చెదరు. వారుమువ్వురును రాజునెదుటకు వచ్చెదరు. మగయుడుపులలోనున్న ఇమొజను వచ్చును. ఆమెభర్తకూడ వచ్చును. ఆమెయందు కారణములేని యనుమానము వహించియున్న భర్త కాయనుమానము తొలగిపోవును. ఆమె తన కూతురని రాజునకు తెలియును. తన పైపు పోరాడి తనకు విజయము లభింప జేసిన యిద్దరు కుమారులను గౌరవించుచు రాజు తుదకు వారు తన సంతానమే యని తెలుసుకొనును.

కాని యా తండ్రికొడుకుల సమావేశమం దెట్టి హృదయచలనమును గలిగినట్లు కవి చూపించడు. పురుష వేషిణి యగు నిమొజనును చూచిన రాజు—

"I have surely seen him
His favour is familiar to me. Boy,
Thou hast looked thyself into my grace,
And art mine own. I know not why nor
To say 'live, boy'........." [wherefore

అనుచున్నాడు. ఇది నిక్కముగ ప్రేమోదయమే. మరియు నామెను తమ గుహలో గలిసికొన్నప్పుడు నిజ మెరుగని రాజకుమారుల కద్దానిపట్టి ప్రేమయే కలిగినట్లు కవి సూచించినాడు. కాని తండ్రియు, కొడుకులు ముఖాముఖి యైనప్పుడు వారి కేవిపరీతప్రవృత్తులు కలిగినట్లెక్కడను లేదు. తన కుమారులు మరణించినారనియే తండ్రికి గట్టినమ్మకము. తమ్ము పెంచినయాతడే తమ తండ్రియని యాయువకులకు గట్టినమ్మకము. అందువలననే కాబోలు షేక్స్పియ రారంగము నట్లు నిర్వహించినాడు. మరి యిమొజనుపై రాకుమారుల కాయవ్యాజానురాగ మేల కల్గినది?

భాసమహాకవివిరచితమైన 'మధ్యమవ్యాయోగ' మను రూపకములో భీమసేనుడు, నాతనికి హిడింబ యందు గలిగిన పుత్రుడు ఘటోత్కచుడు నాకస్మికముగా కలిసికొందురు. తల్లి కాహారమునిమిత్తమై ఘటోత్కచు డొక బ్రాహ్మణకుటుంబములోని నడిమి పుత్త్రుని గొనిపోవ నుద్యమించును. బ్రాహ్మణవటు డాలస్యము చేయుచున్నందున నతనిపై కినుకగ, 'మధ్యమా, మధ్యమా' యని యతనిని గూర్చి యెలుగెత్తి ఘటోత్కచుడు వైచిన కేక వ్యాయామవ్యాసంగుడై యున్న భీముని కర్ణముల దాకినది. ఆ కంఠస్వరమే భీముని కలత పెట్టినది. ఇదిగో—

* "భీమ—ఆహో, ఈస్వర మెవనిది చెపుమా!
చ. ....నామదికిం గడుపీడసేయునీ
ఘనభుజాగొంతు మావిజయు
కంఠము పోలిక నున్నదారయన్."
రక్తసంబంధ మెంతగట్టిది!

కుంతీపుత్రులలో మధ్యముడగు తన్నుగురించియే యా యాహ్వాన మనుకొని భీము డటువోయి కుమారుని చూచుచున్నాడు. చూచిచూడగనే,

"ఆహో! ఈపురుషు డెంత దర్శనీయుడు!
ఇతడు—
సీ. విపులదోర్బలుడంచు వీరనందనుడంచు
గీ. నసురజాతుండంచు శక్తమరయ్యో"

అనుచున్నాడు......బ్రాహ్మణబాలు డింకను రాడు. ఘటోత్కచుని తొందర యెక్కువగుచున్నది.

* శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముపంతులు గారి యనువాదమునుండి.

మరల మరల వానిని బిలుచుచున్నాడు. భీముడు ముందునకు పోయి 'ఇదిగో వచ్చితి' ననును. కొడుకును చూచిన తండ్రికివలెనే తండ్రిని చూచిన కొడుకునకును విచిత్రమైన భావము లుప్పతిల్లినవి.

"ఘటో—ఇతడు బ్రాహ్మణకుమారుడు గాడు. అహో! ఈపురుషు డెంత దర్శనీయుడై యున్నాడు!

గీ. ....యితండు
వికసితాంభోజనేత్రుండొ విష్ణుడొక్కొ
చూడ గనుపండు వొనరించు జుట్టమట్లు!"

చుట్టమేకదా! చాల దగ్గరచుట్టము.

ఈతండ్రికొడుకులకు కొంత సంభాషణ మగును. ఇంతలో బ్రాహ్మణబాలుడు రానేవచ్చును. ఆతని తండ్రియగు వృద్ధబ్రాహ్మణుడు పుత్రభిక్ష పెట్టుమని భీముని వేడగా నా యాపన్నరక్షకు డాతని కభయ మిచ్చి, వటువును విడిచిపుచ్చుమని ఘటోత్కచుని తాను వేడును. "విడువ"నని ఘటోత్కచుడు నిష్కర్షగ జెప్పును. కంఠస్వర మొక్కటే గాదు - విగ్రహము గాదు - పట్టుదలయు, నిర్భీకత్వమునుగూడ భీముని కేమేమియో జ్ఞప్తికి దెచ్చుటచే—

"భీమ—(తనలో) ఆహా! ఇత డెవరి కుమారుడై యుండునొ చెపుమా!

క. మాయేపురి భ్రాతలలో
నే యతనిం బోలునొక్కొ యీగుణచోరుం
డీ యతిశౌర్యము జూచిన
మా యభిమన్యుండు నాకు స్మరణకు వచ్చెన్."

పుత్రవాత్సల్యమే జనించుచున్నది భీమునికి. అది లోనడచుకొని యాతడు "(ప్రకాశముగా) ఓపురుషుడ! బ్రాహ్మణుని విడువుము"అని పలుకగా

"ఘటో—విడువను.

తే. నేడు మాయబ్బయే వచ్చి నీవు వీని
విడువుమంచు నమ్మికమెయి నుడువుగాక
యితని మాయమ్మ యాజ్ఞ బట్టితిని గాన
విడువజాల మువ్వాటికి విడువజాల."

అట్లు కఠినముగ జెప్పిన యాతని మాటలు, కుమారుని మాతృసేవాపరాయణత్వము భీమసేనునకు మోదమునే గలిగించినవి. పాండవులు మాతృసేవాపరాయణులేకదా!

"భీమ—(తనలో) ఏమీ, తల్లి యాజ్ఞ యనుచున్నాడు! ఇతడు గురుశుశ్రూషాపరుడగు తపస్వివలెనున్నాడు.

తే. తల్లి మానవులకు నెల్ల దలచిచూడ
దైవతంబులలోపల దైవతంబు
తల్లి యానతి శిరమున దాల్చికాదె
యీదృశావస్థ నొందితి మేవురమును."

ఇట్టి సుగుణములు గల యీతని వృత్తాంత మింకను తెలుసుకొనగోరి భీముడు "(ప్రకాశముగా) ఓ పురుషుడా! ని న్నొకటి యడుగవలసియున్నది." అనును.

"ఘటో—అడుగు. శీఘ్రముగా నడుగు.
భీమ—మీతల్లి పే రేమి?
ఘటో—హిడింబ యను రాక్షసి."

ఇంతటితో భీమునకు సత్యము తెలిసినది. అందు కనియే యా కంఠస్వరము, నా విగ్రహము, నా యతిశౌర్యము, నా మాతృసేవాదీక్షయును. కాని మనసులో-

"ప్రజాపై నంత నిష్కరుణవృత్తి
హృదయమం దెట్లు దాల్చెనో యెరుగరాదు"

అని సందేహ మొకటి మిగిలినది. మరి తల్లివంక నుండి వచ్చు పోలికల నాతడు గుర్తునకు తెచ్చుకొనలేదు. బ్రాహ్మణవటువును విడువుమని తండ్రియు, విడువనని కొడుకును వివాదపడి, తుదకు కొడుకువలన తండ్రి బంధితుడై, యిరువురు హిడింబయొద్దకు పోగా నామె తగవు తీర్చివైచును.

రసజ్ఞచక్రవర్తియగు కాళిదాసుడును దండ్రికొడుకుల సమావేశమును కనపరచినాడు. ఇంద్రుని పంపున రాక్షసబాధ నివర్తించి తిరిగిపోవుచున్న దుష్యంతుడు మారీచాశ్రమమున రథము డిగ్గి మహర్షిని సేవించిపోవలెనని యనుకొనుచు వచ్చుట గొంతసేపు చేసియుండును. ఇంతలో వానికి శుభసూచకముగ కుడిభుజ మదరును.

* "రాజు—(నిమిత్తమును సూచించి)

క. కోరికను నే వదలితిన్
వారక నీ వదరె దేల నమ్మ భుజమ్మా!
ధారిణిలో బూర్వం బవ
ధీరితమా మేలు వెండి తిరుగుటకలదే!"

శకుంతలాప్రథమసమావేశముముందు నిట్లేగదా యామహారాజుభుజ మదరినది.

"(తెరలో) వలదుసుమా, వలదుసుమా దుండగము. ఏమి, నిజప్రకృతినే పొందినాడు.

రాజు—(చెవియొగ్గి) ఇది యవినయమునకు చోటుకాదు. ఎవరిని శిక్షించుచున్నారు? (శబ్దము వచ్చినవైపు చూచి ఆశ్చర్యపడుచు) అహో, ఎవరీబాలుడు! తాపసపురంధ్రులు వలదని బతిమాలుచుండ నబాలసత్త్వచర్య నొప్పుచున్నాడు?

ఆ. తల్లిచనుల గ్రోలు దాని నాసగములో
నలుగులమున జూలు మెలికపడగ
నాటకొరకు బలిమి హర్యక్షపోతంబు
దొలగదివుచు వీడు దుండగీడు!"

ఆ యబాలసత్త్వచర్యలకు కారణము వంశానుగతమగు నమానుషసత్త్వమే. తాపసపురంధ్రులు వారించుచున్నను వినక బాలుడు సింగముతో జెరలాటలాడుచు దాని దంతములు తాను లెక్కించునిమిత్తమై యావులించుమని సింగపుగొదమను గోరుచున్నాడు. వా డెవరి బిడ్డడు! ఎవరి బిడ్డడో రాజునకు దెలియలేదు గాని యాతని హృదయముమాత్రము ముందునకు దుముకుచున్నది.

"రాజు—ఏమి యిది! ఈ బాలునియందు నౌరసపుత్రునియందుంబోలె నాయంతరాత్మ తగులుకొనుచున్నది!"

అట్లనుకొనియు, సజ్జనుల యంతఃకరణప్రవృత్తి యవశ్య మాలంబనీయమని శకుంతలాప్రథమసమాగమమునం దనుకొన్న రాజు తన కిప్పుడు పుట్టి పెల్లివిరియుచున్న భావములను "నిశ్చయముగా సంతతిలేమి యిట్టి వాత్సల్యమును బుట్టించుచున్న"దని యనునయించుకొనుచున్నాడు.

కొదమను విడువనిపక్షమున నాడుసింగము మీది కురుకునని తాపసకన్య బెదరించగా బాలు డామెను వెక్కిరించును. వాని పల్వరుసయు, వాని కాంతియు గని రాజు విస్మయపడును. బొమ్మ నందుకొనుటకై చాపిన వాని యరచేతిలో చక్రవర్తిలక్షణము లగపడగా రాజు మరియు నద్భుతము జెందును. బాలు డాసింగములను విడుచుటలేదు. మంచిబొమ్మ తెచ్చియిచ్చెదమని మునికన్యలు చెప్పగా నంతవరకు నాసింగములతోనే యాడుకొందునని చెప్పుచు నా పెంకెపిల్లవాడు వారలను చూచి నవ్వును. అప్పుడు—

"రాజు—ఈదుండగీనికై యాశగొనుచున్నాను.

మ. అనిమిత్తోదయహాసభాసురములై
యంతంత పల్గాన్పినన్
కననౌ నస్ఫుటవర్ణ జల్పన మనో
జ్ఞవ్యాహృతి వ్యగ్రులన్
అనపాయాంకసమాశ్లిష్టులౌ సుతుల గ్రో
డావాసులం జేసి పు
ణ్యనిధుల్ తద్వపురాత్తపాంసుధృతి సం
ప్రాపింత్రు ధన్యత్వమున్."

అనుకొనుచుండును.

వాడు కింకను బాల్యావస్థలోనే యున్నాడు. పోలికలు నిలుకడగ నేర్పడుటకు తగిన వయసు కాదు. కంఠస్వరములో నెట్టి సామ్యము బొడకట్టుట కవకాశము లేదు. రాజునకుమాత్ర మాదుండగీనిపై నంతయాశయు, నౌరసపుత్రునియందువలె నంతఃకరణము లగ్నమగుటయును.

తపస్వినీజనము కోరినట్లు సింగమునుండి బాలుని వేరుచేయుచు వాని మొదలు తగులగానే రాజునకు కలిగిన యానంద మాతని నోటనే విందము.

"రాజు—

తే. ఎవని వంశాంకురమొ వీడు! తవిలినంత
నాదు గాత్రము లిట్టు సమ్మోదితములు

* శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారి యనువాదమునుండి.

శేని దేహంపు మొలకరో వాని కట్టి
ప్రమదమోదంబు నీముద్దుగొమరు డిడునో!"

తండ్రి కట్టి యానందము కలుగగా నింక బాలు డెట్లున్నాడు? సింగములను జూలుమెలిపెట్టి లాగెడువానికి క్రొత్తవారికడ క్రొత్తజాపు నల వాటున్నను, తండ్రియొద్దకు చేరవగా, చనవుగా పోయినాడు. పోవుటయే కాదు. దుడుకుతనము మాని బుద్ధిమంతుడు కూడ నైనాడు. "చనవులేకయే యార్యునియొద్ద నీ డింత వినయవంతుగా నుండుట కాశ్చర్యపడుచున్నా"నని తాపసి చెప్పిన మాటయే యిందుకు సాక్ష్యము. మరియు నా తాపసి కా తండ్రి కొడుకులలో నెన్నో పోలికలును కనబడినవి. బాలుడు తనవలెనే పౌరవుడని వారు చెప్పగా వినిన రాజునకు పోలిక లందువలననే కలిగిన వను నూహ బోధమినది. బాలుని తల్లి యప్సరస్సంబంధము గలదనియు, నామె భర్తవలన త్యజింపబడినదనియు విని రాజున కాశలు తీగలుసాగును. బాలుని తల్లిపేరడుగదలచియు, పర భార్యావ్యవహారము తప్పిదమని యూరకుండును. ధీయుడు నిస్సంకోచముగా నడిగివైచినాడు. ఇంతలో నామె పేరు శకుంతల యని రాజునకు తెలియును. అయినను నామసాదృశ్యము లుండగూడదా యని రాజు మనసులో శంక. తల్లితండ్రులు తక్క మరెవ్వరు తాకినను పామై కరచు రక్షాకంకణమును- క్రింద పడి పోయినదానిని నిరపాయముగా రాజు తాకియెత్తుట జూచి యాశ్చర్యపడుచున్న తాపసకన్యలవలన నాసంగతి విని, రాజుసందేహనివృత్తి కాగా "ఏల యిపుడు మనోరథము పూర్ణమాయెనని సంతోషింప రాదు?" అని బాలుని కౌగిట బొదువును. ఇంతలో శకుంతలయే యచ్చటికి వచ్చి యన్ని సందేహములు నిశ్శేషముగా దీర్చినది.

కాళిదాసుని కన్న నొక్కవాసి మిన్నయే యని కొందరిచే శ్లాఘింపబడెడు భవభూతి కవీశ్వరుని యుత్తరరామచరితమును జూచెదము.

లాక్ష్మణేయుడగు చంద్రకేతుడు సైన్యసమేతుడయి రక్షించుచు వచ్చుచున్న యాశ్వమేధహయమును లవుడు పట్టి కట్టివైచును. అందుచేత లవునికి, జంద్రకేతునికి యుద్ధము పొసగును. వా రొండొరుల పయి దారుణాస్త్రములు ప్రయోగించుకొనుచుండిరి. శంబూకవధనిమిత్తమై యేగి తిరిగివచ్చుచున్న రామచంద్రుడు పుష్పకవిమానములోనుండి యా ప్రళయమును జూచి-

* "ఓహో! వీరకిశోరకుమార! భువనా
త్యుగ్రంబు లీ మీ రణో
త్సాహంబుల్ విరమింపు డింక"

ననుచు క్రిందికి దిగును.

కన్న తండ్రి కంఠస్వరమును విన్నంతనే లవుడు "అహో! ఏమీ యీ మేఘగర్జనము" అని యబ్బురపడుచున్నాడు. రామచంద్రుడు ప్రవేశించి చంద్రకేతుని కుశలప్రశ్న చేయుచు కౌగిలించుకొనును. లవునితో నంతవరకు యుద్ధము చేయుచున్న యా చంద్రకేతుడు లవుడు తన చెలికాడని చెప్పుచు, పెద్ద తండ్రితో "ఈ వీరప్రకాండుని నాయనగారు నన్నుగా గాని, అంతకు మించిన ప్రేమతో గాని లాలింపవలయునని నావిన్నప" మనుచున్నాడు. కంఠస్వరము వినుట మూలముననే గుండెలోతులు కలగిన లవునికి "ఈమహానుభావుడు నన్ను గూడ కౌగిలించుకొన్న బాగుండు" ననిపించుచున్నది.

"రామ—(లవుని నిరూపించి) నీ చెలికాడతి గంభీరాకారుడు, కల్యాణాత్ముడుసుమా! అహో!

చ. మనుప సమస్తలోకముల
నై ధరియించిన యస్త్రవేదమో
తనుప నజాండమెల్ల తిను
ధారణ చేసిన క్షాత్రతేజమో
గని యయినట్టి శక్తుల ని
కాయమొ! కాయమొ సద్గుణాళికిన్
కనులకు మూర్తమై తగు జ
గచ్ఛ్రయపుణ్యఫలైక రాశియో!"

లవుని మనోవృత్తియు నిట్లే యున్నది.

* శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంతకవిగారి 'యుత్తర రాఘవము' నుండి.

"లవు— (స్వగతము) అహో! ఈ మహా పురుషుకు పుణ్యానుభావసంపన్నుడుగదా.......... అహో, ఏమిది!

శా. వైరంబెల్ల నశించె శాంతరస ము
ద్భాసించె, దోర్గర్వవి
స్తారం బస్తమయంబు గాంచె, వినయ
స్వాంతంబు నవ్వాంచె, న
య్యారే! యీ పురుషాగ్రణిం గన దదే
కాయత్తమయ్యెన్ మనం
బౌరా! పుణ్యులు తీర్థముల్ బలె నమా
లక్ష్మీప్రభావోన్నతుల్"

మరల రామచంద్రుని జూడుడు.

"రాము—(స్వగతము) ఏమిది, ఈత డొక్కమారుగా నాకు దుఃఖశాంతి గావించుచున్నాడు. మరి యే నిమిత్తము చేతనో గాని నా యంతరాత్మను ప్రేమార్ద్రము గావించుచున్నాడు."

"అయినను స్నేహమునకు నిమిత్తమేమి" యని కాని యంతలోనే తనకు దాను సమాధాన మిచ్చుకొనుచున్నాడు. తండ్రి నెరుగని కొడుకు నమస్కరించగా, కొడుకు నెరుగని యాతండ్రి—

"రామ— ఆయుష్మంతుడా! రారమ్ము. (ప్రేమతో కౌగిలించి) ఓయి కుమారా! ఇంకేటికి? అతివినయము వలదు. రమ్ము: నన్ను గట్టిగా కౌగిలించుకొమ్ము.

గీ. పాకమై విచ్చు తమ్మిరేకు సోకువోలె
లలితమై నున్ననై మాంసలంబునైన
నీదు మైతాకు నాకు నామోదమయ్యె
జలువవెన్నెలతో గంద మలదురీల"

ఆ తండ్రి కాబిడ్డకౌగిలింత యంత యానంద మిచ్చినది.

"వీరికి నాపై నింతటి నిర్హేతుక ప్రేమము. అజ్ఞానమున వీరికే నేను మహాపచారము గావించితిని. కత్తిగట్టునంతటి దురుద్యోగమునకు నేనే దొరకొంటిని" అని చింతించుచు లవుడు క్షమాపణ వేడుచున్నాడు. నేను క్షమించవలసినంత యత్యాచారమును నీవేమియు జేయలేదు. క్షాత్రమున కిట్టి విక్రమ మలంకారమేసుమా యని రామచంద్రుడు పుత్త్రునికి నచ్చజెప్పి యస్త్రముల నుపసంహరింపుమని కోరును. లవు డట్లు చేయును. రామచంద్రుని కొక్కనికే స్వాధీనములైన జృంభకాస్త్రములు తనకు పుట్టువుతోడనే సిద్ధించెనని లవుడు తండ్రితో జెప్పగా నాయన కాగూడదా యనుకొనును. తన తమ్మునిపై భూపాలుర సైన్యకోటి కవిసిన దన్న వార్తను విని యుగ్రుడై ముల్లోకములను నాశనముచేసెద నని యార్చుచు కుశుడు ప్రతిజ్ఞలుపలుకును. పెద్దకొడుకు చేసిన సింహనాదము నూటిగా తండ్రిగుండెలలోని గూళ్ళవరకు దూసుకొనిపోయినది.

"రామ—ఓహో! ఎవ డీతడు ధ్వనిమాత్రము చేతనే నా యొడలు పులకరింపజేయుచున్నాడు. అతడే కాబోలు! నిర్ఘోషమునకు దగినట్లే శరీరముకూడ నీలమేఘశ్యామల కోమలమైయున్నది."

అతడే తన యన్న యని లవుడు చెప్పగా నా నీలమేఘశ్యాము డను తండ్రికి నీలమేఘశ్యాముడగు నా బిడ్డను మరింత దగ్గరగ చూడవలెనన్న కోర్కె బలవత్తరమైనదికాబోలు, చతుస్సాగరపరీతభూమండలైక చక్రవర్తి యరణ్యవాసియు, కేవలబాలుడు నైన లవుని "వత్సా, ఇచ్చటి కొక్కమారు రమ్మందువా?" యని యర్థించినాడు. కుశుడు ప్రవేశించి, ధను వాస్ఫాలించి, బీరములు పలుకుచు, వికటముగ పరిక్రమించును. రామచంద్రునికి హృదయమర్మములు కదలులాడుచున్నవి.

"రామ—(కుశుని గాంచి) ఆహో! ఈ క్షత్రియ బాలకుని పౌరుషాతిరేకమేమి!

చ. కఱకు వెరుంగుచూపు త్రిజ
గంబులు సత్వబలంబులన్ దృణీ
కరణ మొనర్చు, ధారుణి ది
గంబడు నాబడు ధీరయాన ము
ద్ధురతను గాలుడయ్యె గిరి
తో సరితోడగు గౌరవంబునన్
దురదుర వచ్చెడిన్ దనువు
తో వడుపీరమె లేక దర్పమో"

ఈ బిడ్డకు తండ్రిచాయయే కాదు, విక్రమమును వచ్చినది. రామాయణ మదివరకే కంఠస్థము చేసికొని, తత్కథానాయకునియందు భక్తిగౌరవములను పెంపొందించుకొన్న కుశునికి తండ్రియాకారము 'త్రిలోకారాధ్య'మనిపించినది. తెలియకయే 'తండ్రీ' యని సంబోధించి కొడుకు తండ్రికి నమస్కరించును. 'ఆయుష్మంతుడా, రారమ్మ'ని పిలుచుచు నా లోకైకజనకుడు తా నెరుగని తన బిడ్డతో-

"గీ. సజలజలదమనోహరశ్యామమగుచు
నిద్దమై ముద్దుగారెడు నీదు మేను
గాఢవాత్సల్యమున బిగ్గ గౌగిలింప
నాకు మనసయ్యె రాగదోయీ కుమార !"
యని మరల పిలిచి, కౌగిలించుకొని,

"ఈ బాలకు డెవ్వరి సంతానమోకాని,

శా. అంతర్నాడికలం దొరంగు నిజదే
హస్నేహసారంబొ, దృ
ష్టాంతాకారత పైకి నేర్పడిన దీ
వ్యచ్ఛేతనాధాతువో
భ్రాంతానందముచేత పొంగు హృదయ
స్రావంబొ, నాదేహ మా
ద్యంతం బీతెడు ముంచె గౌగిటసుధా
యాదోనిధానంబునన్"

అనుకొనుచున్నాడు. శ్రీరామచంద్రునంతవానికిని పెద్దకొడుకునం దంత ప్రేమయు, బక్షపాతమును. లవుని కౌగిలించినప్పు డంతర్నాడికలు, హృదయస్రావము నను మాటలే లేవు.

ఎండ హెచ్చుటచే నందరు మద్దిచెట్టునీడలోనికి బోయి కూర్చుందురు. ఆబాలురకు గల సామ్రాజ్యలక్షణములు సహజములైనవి కన్పించుచున్నవి. రఘుకుమారుల చందములు నెన్నియో కన్పించుచున్నవి.

"సూక్ష్మతరముగ మరిమరి జూచుకొలది
జానకీలీల లెన్నియో గానవగును
కనులలో నాడుచున్న చాకలికి మోము !"
ఇన్ని చూచి యాతండ్రి-

"హృదయమా! ఇంకను సందేహించెదవేల ! జానకీ వదనారవిందమే యీ కవలమోములం దుట్టిపడుచున్నది.

గీ. ఆణిముత్యాల పలుకాంతి నందగించు
ముద్దుమోవి యదే; కర్ణములును నవియె
రక్తనీలంబు లయ్యు నేత్రములలోని
సహజసౌభాగ్య గుణవిలాసంబు లవియె."

యనుకొనుచు, నింకను స్థలకాలాదులకు సంబంధించిన సాక్ష్యమునుగూడ వెదకుకొనుచు, "ఈ యానందాతిశయమే సందేహములచే నాందోళించు నా డెందమును నమ్మించుచున్నది" అని పుణ్యజీవియయిన తన యంతఃకరణప్రవృత్తి నాధారముగా జేసుకొనదలచియు నట్లు చేయక యూయ్యాలలూగుచున్నాడు.

తరువాతి యంకములో వాల్మీకిమహాముని యాడించిన నాటకములో సర్వము దెల్లమై యాబిడ్డలును, దల్లిసీతమ్మయు, దండ్రి రామచంద్రుడును కలియనే కలిసెదరు.

మనలో నాటకములు సుఖాంతములుగా నుండి తీరవలసిన నియమముచేత మన కవు లేవో కల్పించి యాకుటుంబములను నిలువబెట్టియుందురన్న వాదము చేయుటకు వీలు కనబడదు. సింబలైను వ్రాసిన షేక్స్పియరు కట్టిన నియమ మేమియున్నది? పశువులలో సైతము బలీయమై యుండు ప్రేమసంబంధము మనుజాలలో కనబడకపోవుట యెట్లు? పరస్పర మెరుగని సాహరాబురుస్తుములలో నాబాలు డట్లు తండ్రికై ప్రాకులాడనేల? రుస్తుమున కాయింతజాలిమాత్ర మెందులకు? ఈడిపస్సుచరిత్ర మనసును కంటగించునది. వీరపురుషుడైన రుస్తుమునకు తన బిడ్డపై నంత ప్రేమ, తనతండ్రిపై నంత ప్రేమ, మరి సాహరాబునకు నీతల్లి యెవ్వరనిగాని, నీతండ్రి యెవ్వరనిగాని యడుగవలెనన్న వాంఛ యేలో కమున బుట్టదేయని యతని చరిత్రయు సంకటమునే కలిగించును. సింబలైనుకు పరుడొకడట్టి పుట్టానవాళ్లతో చెప్పినగాని తన బిడ్డలపై పు దృష్టియే పోవదు, నాబిడ్డ

లకు వారినిపై దృష్టి పోవదుసు... ఇది యీమహాకవుల యందొక లోపమేనా? మానవస్వభావము సాంతముగా నవగతము చేసుకొన్న మహనీయులు వారి కవిత్వ సృష్టి యీనాటికిని నవకాంతులతో మెరసిపోవుట చూచిన యెవడట్టి మాట యనగలడు? ఆయా కథానాయకుల స్వభావములను పరిశీలించినచో మన కన్ని శంకలు తీరిపోవును. సంస్కృతియును, నిష్కల్మషము, నుదాత్తమగు హృదయమును గల వ్యక్తులకుమాత్రమే సహజసంబంధములు గోచరమగుననియు, నితరులకు సర్వప్రాణిసామాన్యములైన ప్రవృత్తులుకూడ నిష్ఫలములైపోయి వారి కట్టి సంబంధములు గోచరమేకాక వారు దుఃఖభాజను లగుదురనియు తేలగలదు. ఆయంశము నిరూపించుటకయ్యె యీమహాకవు లట్లు రచించియుందురు.



తులసీదాసు వైరాగ్యం

•

— శ్రీ కుమారరాఘవశాస్త్రి —

చనియెను శుక్లపక్షపు వసంతదినంబులు, మల్లెపూల వా
సనలకు దృష్టిగొట్టెను, రసాలఫలావళు లింక లేవు, ఎం
దనుకను పుట్టినింటి మమతల్ తనివోవవు నీకు, ప్రేమవా
రుణి మది నింకె నా కిట, విరోధికదా విధి! చూడు శ్రీమతీ!

ప్రేమకు హద్దువెట్టి, వలపించెడి నేరుపు కూడబెట్టి, నా
లో మమకారమున్ బెనిచి, లోతులుచూపని నీయెడందరూ
పేమొ యెరుంగనీక, తమిపెంచెడి కోరిక లారబెట్టి, మా
రా మొనరించి పోయి మరి రా విట దక్కెను 'రామ'మంత్రమే.

దోసిట తుమ్మిపూ ల్నినిచి, తొంగలిరెప్పల నవ్వులూచి, వి
శ్వాసము నచ్చబల్కి, విరజాజులు దొంగిలిపోయినట్టి నీ
కై సగమై కృశించి వడగందిన గుండియ నించుచున్న ని
శ్వాసము లింక సూర్యభగవానుని కర్ఘ్యము లయ్యె నెచ్చెలీ!

ఈహృదయంబు నీవు పగిలించిన ముక్కలు, చింది ధారుణీ
దాహము దీర్చుచున్న మధుధారలు, చూచెదు రమ్ము; పంక్తికం
ఠాహృతజానకీప్రవిరహార్తుడు రామనృపాలమౌళితో
'సోహ'మటన్న యాస్థితికి చొక్కెతి కర్కశవర్తులస్తనీ!

పావనమైన ప్రేమరసవాహిని నిండిన గుండెనైన ప
ద్మావతితో సదా ప్రణయతత్వము గానముచేసి, భక్తివి
ద్యావరపండితుండయిన ఆ జయదేవుని భాగ్యరేఖ ఈ
ర్ష్యావిలబుద్ధినై యిపుడు సంస్మరియింతు నభాగ్యుడన్ చెలీ!

నీ యసితాభ్రకేశములు, నీ యళినీలవిలోకనావళుల్
పాయని చీకటుల్ విరియ ప్రామిన యీప్రణయంపు నిత్యపా
రాయణ కింక స్వస్తి; ఉడురాజతుషారసితాచ్ఛమూర్తి, రా
మాయణకావ్యవల్లికి సమన్వితవాక్సతి నాశ్రయించెదన్.

రామపై మోహము రామునిపై భక్తిరసముగా వెల్లివిరిసి, రామాయణమహాకావ్యమును గానముచేసిన కృతార్థ జీవి తులసీదాసు. పుట్టినింటికి పోయి యెన్నాళ్లకు తిరిగిరాని భార్యమీద ఆయనమమకారము వైరాగ్యపు మూసలో కరగిపోవుచున్నప్పటి 'కళవెళ'రవములే యివి.

వైకుంఠాచార్యులు

[నాటిక]

= శ్రీ పి. వి. రాజమన్నారు =

రంగము ౧.

పల్లెటూరులో ఒక పాక

[ఒకవైపు సగానికి తెరకట్టి ఉన్నది. తెర ముందు చాపలు పరిచివుంచారు. చాపలమీద ఆవూరి వాళ్లు రంగడు, వెంకడు కూర్చున్నారు...తరవాత వచ్చి కూర్చుంటారు ఒకరు, ఇద్దరు, ముగ్గురుగా ఆవూరివాళ్లు, పొరుగూళ్ల వాళ్లు. ఆ వచ్చినవాళ్లలో ఇద్దరుమాత్రం పట్టణవాసులు: రామారావు, వెంకట్రావు...]

రంగడు— (కొత్తగా ప్రవేశించినవాడిని ఉద్దేశించి) ఏఁ సుబ్బయ్యా! ఇంతదూరం వచ్చావు?

సుబ్బయ్య—నీకు తెలవదూ రంగయ్యబావా? అత్తయ్య పోయింది.

రంగడు—అయ్యయ్యయ్యో!

సుబ్బయ్య—ఏం చేస్తాం!...ఇంకా ఆచార్య లోరు దరిశెనం ఇయ్యలే?

రంగడు—ఇంకా లే. అందుకనే నేనూ కాచు కూర్చున్నా. మొన్న మా నరిసిగాడు వైకుంఠం సేరి నట్టుగా కబురొచ్చిందో లేదో కనుక్కుందామని వచ్చా.

సుబ్బయ్య—ఏం వైకుంఠమో ... మా ఆవిడ అందుకే తరిమింది ఈ పొద్దుకి టిక్కట్టు పట్టుకురమ్మని.

రంగడు—దరిశెనం వేళ అయింది, తాళుకో. (సుబ్బయ్య పాక వెలుపల నిల్చుకొని చుట్ట వెలిగిస్తాడు.)

(రామారావు పట్టణవాసులలో నొకడు. ఆచార్యులవారి మాహాత్మ్యంగురించి కథలు విని, తన మిత్రుడు వెంకట్రావుతో విషయం తనిఖీ చెయ్యడానికి పూనుకొన్నాడు.)

రామారావు— క్షమించండి. ఈవూరికి కొత్త వాళ్లం. ఆచార్యులవారి పేరు, ప్రఖ్యాతి విన్నాము గాని సందర్భం బాగా తెలియదండి. టిక్కట్టు ఏమిటండి? ఎక్కడికండి?

రంగడు—ఇంకెక్కడికండి? సరీగా వైకుంఠానికే.

వెంకట్రావు—(నవ్వుతూ) భలే...చార్జీ కూడా వుందా?

రంగడు, ఇతరులు—నవ్వకండి...అప రాధం. చార్జీ వరహా.

రామారావు—అలాగా? టిక్కట్టు కొని ఏమి చెయ్యాలండి?

రంగడు—చెబుతా విను. నువ్వే రేపు సచ్చి పోతావనుకో. అప్పుడు మీబాబు ఒక వరహా ఇచ్చి ఒక టిక్కటు కొంటాడు. కొని నీబొందెతో దాన్ని దహనంచేస్తాడు. నీఆత్మ సేరుగా వైకుంఠం చేరుతుంది. ఆతరవాత రెండుమూడురోజులకి మన ఆచార్యులవారికి చీటీ వస్తుంది అక్కడినుంచి...చేరినట్టు...

వెంకడు—సద్దు. సద్దు. తెర తీస్తుండారు...

(అందరూ తొందరగా లేస్తారు. తప్పనిసరిగా రామారావు, వెంకట్రావు సహా. అప్పుడు మెల్లగా తెర తీయబడుతుంది. తెరవెనక పెద్ద తివాచీమీద పరుపు. పరుపుమీద వైకుంఠాచార్యులవారు ఆసీనులై వుంటారు. తిరునామములు లలాటముపైన, భుజముల పైన, రొమ్ముపైన ప్రకాశిస్తూవున్నవి. నిమీలితనేత్రు

లై వున్నారు. శిష్యుడు ముందు నిలబడివుంటాడు చేతులు కట్టుకొని.)

శిష్యుడు—ఆచార్యులవారు నిద్రలోనుంచి ఇప్పుడే బయటికివస్తారు. సావధానంగా ఉండండి.

ఆచార్యులు—(కండ్లు తెరచి) ఓం నమో నారాయణాయ!

రంగడు మొదలైనవారు — (చెంపలు వేసుకొంటారు.)

శిష్యుడు—కూర్చోండి. అందరూ కూర్చోండి.

ఆచార్యులు — వెంకటేశా! వైకుంఠంనుంచి ఏవైనా చీటీలు వచ్చినవా?

శిష్యుడు—వచ్చాయండి. వాళ్ల వాళ్లకి చదివి చెప్పమంటారా?

ఆచార్యులు – (అంగీకార సూచకంగా తల ఊపును.)

శిష్యుడు—(సంచిలోనుంచి తాటాకులు కొన్ని బయటికి తీసి, అందులో ఒకటి చదువుతాడు) — "శ్రీ శ్రీ వేదాంతి వేద్యులైన తిరుమంగాచార్యులనే వైకుంఠాచార్యులవారికి- వైకుంఠంనుంచి హయగ్రీవాచార్యులు వ్రాయించినది. ఉభయకుశలోపరి. తమరు మొన్న పంపిన రామాపురం చెంగళనరసిగాడి ఆత్మ సురక్షితంగా చేరినది. వానికి మూడవ లోకంలో మంచిస్థానం ఏర్పరచినాము..." ఎవడురా నరిసిగాడి బంధువు?

రంగడు—నేనే సామి. ఏదో మీ క్రుపవల్ల నేనున్నాడుగాని లేకపోతే వాడికి వైకుంఠం ఎక్కడిదండి...వాడు చేసిన దొంగతనాలకి ఏ నరకంలోనో పడి సావాలిసిందండి...ఏదీ ఆచీటీ కొంచెం ఇప్పిస్తారా. ఇంట్లో పెట్టుకొని పూజచేసుకుంటాం.

వెంకటేశం—తీసుకో. (అని ఇస్తాడు.)

రంగడు—(తీసుకొని కండ్లకద్దుకొని కూర్చుంటాడు.)

(శిష్యుడు ఈ విధంగా ఒక్కొక్క తాటాకు చదువుతుంటాడు.)

రామారావు—ఏదీ! ఒకమారు నేను చూడవచ్చా?

(రంగడు తాటాకు ఇస్తాడు. రామారావు, వెంకట్రావులు చదువుకొని గుసగుస మాట్లాడుకుంటారు. రామారావు మళ్లీ తాటాకు ఇచ్చేస్తాడు రంగడికి.)

సుబ్బయ్య—(చుట్టముక్క పారవేసి, లోపల ప్రవేశించి) సామీ! ఆలస్య మవుతోంది...మా అత్తయ్య కొక టికట్టు ఇప్పించండి.

శిష్యుడు—మీ అత్తయ్య అయితే పేరు లోకానికంతా తెలుస్తుందటరా?

సుబ్బయ్య—అత్తయ్య అని పిలవడమే గాని పేరు నాకు తెలవదండి. పోనీ లచ్చుమమ్మ అనండి. ఈ గొడవంతా మా ఆవిడదండి. వాళ్ల అమ్మను బొందెతోనే వైకుంఠం పంపగలిగితే దానికే టికట్టు ఇప్పించండి.

శిష్యుడు— ఛీ మూర్ఖా! మీఅత్తయ్య మీరాదేవి, సక్కుబాయి అనుకున్నావా బొందెతో వైకుంఠం వెళ్లడానికి...ఏదీ, తే వరహా!

సుబ్బయ్య—వరహా ఏమిటండి?

శిష్యుడు—టిక్కట్టుకు చార్జీరా.

సుబ్బయ్య—ఇదేమిటండీ? రైలుచార్జీ, బస్సు చార్జీలాగ?

శిష్యుడు—అధిక ప్రసంగం...

రంగడు—వరహా ఇచ్చుకో సుబ్బయ్యా! తప్పదు.

సుబ్బయ్య—ఇదేం ఖర్మంరా. బతికున్నన్నాళ్లూ పెట్టి పోషించా. చచ్చాకకూడా ఇలా పీక్కుతింటూందే ఈ అత్తముండ.

(ఈ సంభాషణ జరుగుతూ వున్నప్పుడు రామారావు మెల్లగా వెళ్లిపోతాడు.)

శిష్యుడు—ఏమయ్యా ఈ గోల? ఎందరో కాచుకున్నారు. నీమూలాన్ని ఆలస్యమవుతూవుంది. తే వరహా.

సుబ్బయ్య—వరహా ఎక్కడనుంచి తేనండి? నన్ను తాకట్టుపెట్టితేగాని రాదండి.

శిష్యుడు—అయితే వెళ్లిపో.

సుబ్బయ్య—మరేనండి. ఇంక మా అత్తయ్యకు వైకుంఠం లేకపోతేనా అండి...చాలా బత్తిగా వుండే దండి. బుజాలు కాల్చుకోవాలనికూడా పెయత్నం చేసిందండి.

శిష్యుడు—ఏమి చెయ్యగలము ? తప్పకుండా నరకానికే వెళ్లుతుంది.

సుబ్బయ్య—ఏం శెయ్యమంటారండి ... రేపో మాపో అంటే ఇచ్చుకుంటానండి.

ఆచార్యులు—(శిష్యుని పిలిచి చెవులో ఏదో చెప్పును.)

శిష్యుడు—ఆచార్యులవారు నీ మీద కనికరించి సెలవిచ్చారు. ఈ రోజు దహనం చేయించేసి, రేపు వరహా ఇప్పిస్తే ఆత్మ వైకుంఠం వెళ్లేటట్టు ఏర్పాటు చేస్తారు.

సుబ్బయ్య—దండాలు, బాబూ, దండాలు. ఎలాగైనా ఇచ్చుకుంటానండి రేపో, ఎల్లుండో... అయితే అంతవరకు మా అత్తయ్యఆత్మ నరకానికి ఎల్లకుండా ఆపుచేస్తారుకదండీ ?

శిష్యుడు—ఆలాగే...వెళ్లు.

(సుబ్బయ్య వెళ్లిపోవును. తరువాత కొందరు టికెట్లు కొనుక్కుంటారు.)

(పునఃప్రవేశము రామారావు)

రామారావు — (చేతిలో ఒక తాటాకుతో) హరిహరీ! ఎంత కఠోరమైన వార్త ... ఎంత విచారకరం...

అందరు—ఏమిటయ్యా?

రామారావు—వినండి. ధైర్యంతో...ఇప్పుడే గదా ఇక్కడనుంచి బయటికి వెళ్లాను! ఏదో పరధ్యానంగా నడుస్తూవుంటే అకస్మాత్తుగా ఎక్కడనుంచో ఈతాటాకువచ్చి సరీగా నాయెదుట పడింది. తీసి చదివితే !—ఏమి చెప్పను !—వైకుంఠంనుంచి మన ఆచార్యులవారికి వచ్చినట్లు స్పష్టంగా ఏర్పడ్డది. కాని... ఎంత ఘోరవార్త...నోరాడటంలేదు...ఇంకేముంది? రేపటితో - మనకూ, మన ఆచార్యులవారికీ రేపటితో ఋణం తీరిపోతుంది.

రంగడు, ఇతరులు—హా! హా! అయ్యో! అయ్యో! అదేమిటయ్యా-చెప్పవయ్యా-(అని కేకలు)

రామారావు—వినండి. చదువుతాను.

"శ్రీశ్రీ వేదాంతవేద్యులైన తిరుమంగాచార్యులనే వైకుంఠాచార్యులవారికి- వైకుంఠంనుంచి హయగ్రీవాచార్యులు. ఉభయకుశలోపరి. తమరు భక్తిశ్రద్ధలతో దినదినము ఇంతవరకు పంపుచుండిన ఆత్మలన్నీ సురక్షితంగా చేరినవి. ఇక వైకుంఠంలో చోటు చాలదు. చాలా ఇబ్బందిపడుచున్నారు ఉన్నవారే.. అదియుంగాక తమరు ఇక్కడికే వేంచేయవలసినదిగా సనకసనందనాది మునివర్యులందరు తీర్మానించియున్నారు. రేపటిదినము—అనగా ఆషాఢశుద్ధదశమినాడు పన్నెండుఘంటలకు - అనగా సూర్యోదయాదిగ౨౫ ఘడియలు ౨ర విఘడియలకు-తమరు పరమపదము చేరునట్లుగా విధింపబడినది. ఆబాలగోపాలము వైకుంఠమంతా నిరీక్షిస్తూ ఉన్నది..."

ఆహా! మన పెట్టి దరిద్రులము.

వెంకట్రావు—నిజము. మనమే దరిద్రులము. ఆచార్యులవారు ధన్యులే...వైకుంఠంలోనే సర్వదా ఉండవలసినవారు కర్మవశాత్తు ఈ పాపలోకంలో ఇన్నాళ్లు ఉన్నారు. ఇక రేపే మోక్షం వారికి.

రంగడు—రేపే. రేపే...

(అందరూ ఆశ్చర్యచకితులై ఒకరితో నొకరు మాట్లాడుకొనుచుందురు.)

ఆచార్యులు—వెంకటేశా ! ఏమిరా ఈ గందరగోళము ?

శిష్యుడు—(రామారావుతో) ఏదీ! ఆ తాటాకు ఇలా ఇవ్వండి, ఆచార్యులవారు అడుగుతున్నారు.

(రామారావు తాటాకు ఇచ్చును. శిష్యుడు ఆచార్యుల కందిచ్చును. ఆచార్యులు చదువుకొని ఏమీ తోచక ఊరకుందురు.)

శిష్యుడు—ఆచార్యులవారు ఈ విషయమై తమ యోగదృష్టితో పరిశీలిస్తామన్నారు. మీరందరు ఇక సెలవు తీసికొని వెళ్లిపొండి.

రామారావు—అలాగే వెళ్లిపోతాం. కాని రేపు మధ్యాహ్నం తప్పక అందరమూ ఆఖరుదర్శనానికి వస్తాము. ఆచార్యులవారి నిర్యాణాన్ని సేవించి పవిత్రుల మవుతాము. రండి. వెళదాము, రండి...

(ఆచార్యులు, శిష్యుడు తక్క అందరు నిష్క్రమిస్తారు.

ఆచార్యులు—(అందరు వెళ్లిన తరువాత) ఒరే! చాలా ప్రమాదం వచ్చిందిరా...ఆ టక్కరిముండకొడుకులు చేసిన పనిరా. ఈ పల్లెటూరివాళ్లు వట్టి మూర్ఖులు. మన దొంగతాటాకుల్ని ఎలా నమ్మినారో అలాగే వాళ్ల ఈ దొంగన్నరతాటాకు కూడా నమ్మినారు... ఈ సమస్యకు ఏమిటి విడుపు? ఎంత అవస్థలో పడ్డామురా!

వెంకటేశం—గురూజీ...ఒక్క ఉపాయం స్ఫురిస్తూవుంది...నా కొక తమ్ముడున్నాడు లెండి. (అని చెవులో ఏమో చెప్పును)

ఆచార్యులు—శహబాష్! నీ తెలివికి సాధ్యం కానిది లేదురా!...నీవు లేకపోతే నే నేమైపోయేవాడినో...(భుజం తట్టును)

వెంకటేశం—(ఇకిలిస్తూ) మీ అనుగ్రహం. (నడుంలోనుంచి బీడీ తీసి వెలిగిస్తూ ఉంటాడు)

(తెర)

రంగము ౨.

మ రు నా డు.

[అదే పాక. తెర వేసిఉంటుంది. తెరముందు పల్లెటూరివాళ్లు గుమిగూడి కూర్చున్నారు—రంగడు, వెంకడు ఇత్యాదులు. రామారావు, వెంకట్రావులు కూడా ఉన్నారు.]

రంగడు—(రామారావుతో) ఏమండోయి, మీచేతికి తగిలించుకున్నారే, అందులో ఎన్నిగంటలైందండీ?

రామారావు—పదకొండు దాటింది.

వెంకట్రావు—ఇంకొక గంటలో ఆచార్యులవారు ఈదేహం వదిలి వైకుంఠం చేరుకోవాలి. నిర్ణయింపబడ్డ కాలం తప్పకోడానికి సాధ్యమవుతుందా?

రంగడు—ఎలా అవుతుందండి? అది బెమ్మదేవుడికే సాధ్యంగాని పని.

(తెర తీయగా కనబడతారు ఆచార్యులవారు నిమీలితనేత్రులై. శిష్యుడు వెంకటేశం నిలబడి, వచ్చినవారిని ఉద్దేశించి మాట్లాడును.)

శిష్యుడు—భక్తులారా! సావధానంగా ఉండవలెను. ఆచార్యులవారు సమాధిలో వున్నారు. ఇక వారు మన లోకానికి దూరం అయిపోయినట్లే. కొన్ని ఘడియల్లో వైకుంఠంలో శ్రీమన్నారాయణుని తిరువడిగళులో చేరిపోతారు. మీ కందరికీ ఇదే ఆఖరు దర్శనం. ఆచార్యులవారు గొప్ప యోగీశ్వర్లు. వారి మరణం వారి చేతుల్లో వుంటుంది. వారు స్వయంగా ఆత్మను దేహంనుంచి వదిలిపోయేటట్లు చెయ్యగలవారు. అప్పుడు వారి శిరస్సు పగిలి జ్యోతిరూపకంగా ఎగిరిపోవును......

(అందరూ లేచి, చెంపలు వేసుకొంటారు. కొందరు నమస్కారం చేస్తారు. కొందరు ఏడుస్తారు. రామారావు, వెంకట్రావులకు ఏమీ తోచడంలేదు; ఏమి జరుగుతుందా అని నిరీక్షిస్తున్నారు.

ఇంతలో వెలుపలనుండి "ఆగండి! ఆగండి!" అని కేకలు.)

రంగడు—ఎవడురా అది?

(అందరు తిరిగి చూస్తారు.

ప్రవేశం: వెంకటేశంతమ్ముడు శేషాచలం. పెద్ద తలపాగ పెట్టుకొని, నామాలతో, పోల్చడానికి వీలు లేకుండా ఉన్నాడు.)

శేషాచలం—ఆగండి! ఆగండి. (రొజుతూ నిలబడతాడు.)

వెంకడు—ఆగడ మేంటయ్యా? ఏమిటీ గొడవ?

శేషాచలం—ఆగండి. అన్యాయంగా మోసపోకుండా ఆగండి. ఆచార్యులవారిని వృథాగా ధారపోసుకోకుండా ఆగండి.

రంగడు—మా కేమీ అర్థమవటంలే నీబాస.

శిష్యుడు—అనుగ్రహించి త్వరగా చెప్పండి. ఆచార్యులవారి అవసానకాలం సమీపిస్తున్నది.

శేషాచలం—లేదు, లేదు. వినండి...ఆ శ్రీమన్నారాయణుడే పంపబట్టిగాని లేకపోతే...అయ్యయ్యో! ఏమైపొయ్యేది...వినండి, నేనూ తొందరగా ఇక్కడికే వస్తున్నా...హఠాత్తుగా ఒక పెద్ద గరుత్మంతుడు "కృష్ణా కృష్ణా" అంటూ ఆకాశంలో ఎగురుతూవచ్చి నా ఎదట సరీగా ఈ తాటాకును పడేశాడు. (అని తాటాకు తీసి) తీసి చూసేసరికి ఆ గరుత్మంతుడు మాయమైపోయాడు...గుండెలు కొట్టుకొంటూ చదివినా...ఆహాహా! ఏమి చెప్పను. ఎంత మోసం. ఎంత కుటిలం...ఇదిగోనండి, శిష్యులుగారూ! మీరే చదివి చెప్పండి. ఆలస్యమైపోతూవుంది. (తాటాకు ఇచ్చును.)

శిష్యుడు—(అందుకొని) అ రే! వైకుంఠం నుంచే...(చదువును) "శ్రీ శ్రీ వేదాంత వేద్యులైన తిరుమంగాచార్యులవారికి. వైకుంఠం హయగ్రీవాచార్యులవారు తెలియజేయు ముఖ్యవిషయం. ఖరవిఖరులనే ఇద్దరు రాక్షసులు మనుష్యరూపంతో సంచరిస్తూ వైకుంఠంనుంచి వచ్చినట్లుగా దొంగచీటీని సృష్టించి లోకుల్ని మోసపుచ్చడానికి ప్రయత్నిస్తున్నట్లున్నూ, తమబోటి భక్తశిఖామణులను అకాలముగా ఆత్మహత్య చేసుకొనునట్లుగా కుట్రలు పన్నుచున్నట్లున్నూ తెలియవచ్చినది. అట్టి కుతంత్రములకు మోసపోవలదు. జాగ్రత్త..."...ఎంత మోసము!

(అందరూ నిశ్చేష్టులగుదురు)

ఆచార్యులు—(కండ్లు తెరచి) నా యోగదృష్టిలో అదియే నాకును తెలిసినది. అరుగో! ఖరవిఖరులు. (అని రామారావు, వెంకట్రావులను చూపును) హ హ హ హ!

(రామారావు, వెంకట్రావులకు విస్మయంతో సహా భయంకూడా కలుగుతూవుంది. అందరి దృష్టులూ వారిమీదనే)

రంగడు—(బిగ్గరగా) ఇంకా ఊరుకుంటారే మిట్రా! రాక్షసుల్ని హంతంచేసేయక...పట్టుకోండి.

(కొందరు రామారావుని, వెంకట్రావుని పట్టుకొంటారు. వారు తప్పించుకొని, పాకనుంచి బయటికి దూకి పరుగిడుతారు.)

వెంకడు—పదండిరా, పట్టుకుందాం. ఎక్కడికెళ్ల గలరో సూస్తాం.

(అని కేకలు వేసుకుంటూ అందరూ వెంబడిస్తారు. కొంతసేపటికి ఆచార్యులు, వెంకటేశం, శేషాచలం తప్ప ఎవ్వరూ మిగలరు. శేషాచలం కడుపుపగల నవ్వుతుంటాడు.)

ఆచార్యులు—చాలులే నవ్వు...అబ్బ! గండం గడిచిందిరా...అయినా ఈ వూళ్లో ఇంక వుండడం తగదు. ఇంకో మజిలీలో మకాంవెయ్యాలి...ఏం వెంకటేశం!

వెంకటేశం—(బీడీ వెలిగిస్తూ) ఊ!...

శేషాచలం— అంతేగాదు. వైకుంఠాచార్యులవార్ని నిజంగా వైకుంఠానికే పంపేయండి. తదుపరి మీరు సదాశివబ్రహ్మంగా మారిపోండి! ఇక మన హెడ్ ఆఫీసు కైలాసానికి మార్చేద్దాం.

[తెర]

వైయాకరణుని కావ్యగౌరవము

✽

— శ్రీ బులుసు వేంకటేశ్వర్లు —

ఆంధ్రభాషాయోష సమూల్యాభరణములతో నలంకరించిన కవితల్లజులలో ననేకు లనంత శాస్త్రజ్ఞులు, నష్టభాషాపరిపూర్ణులు, నఖండమేధా నిధులు కలరు. వారివారి యభిమానశాస్త్రములలోఁ గడుంగడు నిష్ణాతులై యుండియు సర్వసమర్థులనుటఁ గావ్యకళారాధనమున వారు భాషామాతృహృదయము నూఱగొనియున్నారు. కాని, వారివారి యభిమానశాస్త్రముల ప్రభావ మనంతముగా నాయాకావ్యములఁ బ్రతిఫలించుచుండు టాయాశాస్త్రాభిమానుల కానందజనకముగను, సామాన్యజనులకుఁ గొంచె మేవగింపుగను గానవచ్చుచుండుట సహజము. ఎవ్వ రేవిధముగ నెంచినను భాషామాతకుమాత్ర మవి విలువగల నగలే యగుచున్నవి. ప్రస్తుతము కవిశిరోభూషణ మను నహోబలపండితీయమును రచించిన యహోబలపతి గొప్ప వైయాకరణుఁడు; బహుశాస్త్రజ్ఞుఁడు. అతఁడు "కవిమనోపాధ్యాయభట్టారక, అభినవవన్నయభట్టారక" బిరుదాంచితుఁడు. అంతతోఁ దృప్తిపడక 'కాళిందీకన్యాపరిణయ'మను నొక ప్రౌఢకావ్యమును రచించి యాతఁ డాంధ్రసారస్వతమునఁ జక్కనికీర్తి గడించియున్నాఁడు. పరమవైయాకరణుఁడగు నాతని పాండితీవిభవ మిందుఁ బలువిధముల విజృంభించినది. కాని, యాతని యభిమానశాస్త్రమగు వ్యాకరణము కూడ నిం దెట్టికల్పనల కాలవాలమైనదో, యెంతటి ప్రభావము నాతని కావ్యకళపైఁ బఱపినదో స్థాలీపులాకన్యాయమునఁ గాంచి యానందించుటకే యీ వ్యాస ముద్దేశింపఁబడినది.

ఈతఁడు కావించిన సత్కవిస్తుతిలో "ప్రాణివర్ణక తద్ధర్మభవ్యనామ, సరళపదసామహాన్మహాత్. క్షీరమయాంధ్ర, వాఙ్మగకర్త భూకవి వాగ్విసేత" యని శబ్దశాసనుని బలుకుటలో నీతని వ్యాకరణశాస్త్రాభిమానము విదితమగుచున్నది. ద్వారకాపురమునందలి కరీంద్రములను వర్ణించుపట్టున—

"వాచకశబ్దముల్ పరని
పాతముచే విలసిల్లు వాచ్యతన్
రోచిలు మాడ్కిఁ దాతృతత
రుచ్యముగా కితరార్థరీతిగా
నౌచితిగా దటంచు మది
నారసియో పరపాతనక్రియ
లోఁచి వహించు నప్పురి న
మోఘబలాన్వితముల్ కరీంద్రముల్."

అనియు,

"ఊకారంబు సవర్ణదీర్ఘ యుగళీ
యుక్తంబు గావింపుచున్
లోకన్ హ్రస్వముఖస్వరాంకములఁ దా
సూత్రింబువన్యాటఁగా
వ్యాకర్తా మునిమధ్యచిస్ఫురణిమ
త్వం బచ్చుటన్ మానమం
చూకారాకృతి త్రిప్రకారముగ బ్రో
యుం గాలవిద్వాంసముల్."

అని కాలవిద్వాంసముల ప్రెఁతేమ దృతీయావ్యాసమునను జమత్కరించి సంస్కృతవ్యాకరణ సాంప్రదాయమును, దానిపై దన యభిమానమును జక్కఁగా వెల్లడించినాఁడు.

నారదుని యాగమనము వర్ణించుసందర్భమున—

"సంగతతత్పురుషపద నిష్ఠామూర్తి
నలరారు పాణినీయం బనంగ
సిద్ధసాధ్యవిశేషబుద్ధ స్వరూపతఁ
బ్రాకృతవ్యాకృతిభక్కి యనఁగ

జ్ఞాతాత్మరీతి నిర్ధూతాంజనాత్మత
సాధ్వలంకృతి విశేషం బనంగ
పరశస్థిర కళాప్రశస్తి సద్భావత
పరసాంధ్ర శబ్దశాసన మనంగ
నరుగు దెంచెను నారాయణాభిధాయ
కావ్యవర్ణ మనూత్తంస కాభిధాన
చతురచతురస్వరస్వర స్వరవిశేష
హారిమహాతీకరుండు శుభాకరుండు."

అని పాణినీయమును, ప్రాకృతవ్యాకరణా దులను, మఱియొకచో—

"ప్రకృతి ననుసరించి పరగును జగతిలో
వికృతి యిద్ది వింత వెలఁదియందుఁ
బ్రకృతి నడచి వికృతి ప్రబలమై కనుపట్టె"

నని ప్రాకృతవ్యాకరణమును వివరించెను. ఈవిధముగా వ్యాకరణాభిమానాభినివేశము లితని కావ్యమునఁ బ్రవేశింపక మానినవి కావు. మఱియుఁ బూర్వోక్తమగు "పరశస్థిరకళాప్రశస్తి సద్భావత పరసాంధ్ర శబ్దశాసనమనంగ" అనియు,

"గుణవృద్ధు లగుచు రాజిలు
ఫణిరాజశయాను భోగములు పరికించునుగా
గుణిగణము వక్రమే యిది
గణుతింపఁగ వక్రతమమె కా యిది
యనుచున్."

అని యాంధ్రవ్యాకరణ సాంప్రదాయములను చేర్కొనియున్నాఁడు.

మఱి యహోబలపండితీయమున "సంధ్యభావోపి న దోషాయ" యని యహోబలపతి నిర్ణయించినవాఁ డగుట—

"అమరు విద్యున్మాల యగును దనూయష్టి
మత్తేభగతియగు మంజుపదము,
అల భుజంగ ప్రయాతమై యారు దనరు."

మున్నగుచోట్ల విసంధితఁ బాటించి, యది దోషము కాదని తన సూత్రమును బలపఱచుకొనుటకై కేలివనవర్ణనవ్యాజమున—

"అమితధ్వని వైచిత్రియుఁ
గ్రమహీనత్వాదిదోష రహితము వనికా
వ్యమనఁగఁ బరగె సపిద్ధో
పమత విసంధితయు గుణతఁ బరగ నరిదిగన్."

అనియును, మఱియొకపట్టునఁ గాళిందీకన్యచనుదోయి వర్ణించుచు—

"కలయఁ బ్రసాద మొప్పు నధి
కస్ఫుటమై మధురత్వ మొందఁ గే
వలపరుషస్వభావపటు
బంధము మీఱ సమస్తభూషణా
కలితము దలిర్ప సర్వరస
వాసితఁ గావ్యమునాఁ జెలంగు నె
చ్చెలిచనుదోయి క్లిష్టతను
జేకొని మానదువో విసంధితన్."

అని చక్కఁగాఁ జమత్కరించి వాక్యాంత పాదాంతముల విసంధి దోషముగాఁ బాటింపఁదగ దను భావమును వెల్లడించి తన యభిమతసూత్రమునకుఁ దన కావ్యమునసే ప్రామాణ్యమును జూపి తరువాతివారి కీవిషయమున దోషము లేదని చాటియున్నాఁడు.

ఇదేవిధముగా నహోబలపండితీయమునఁ గల "సంస్కృతసమాసాంతస్థిత స్యాచోపి క్వచి త్సంధిః" అను సూత్రమును బలపఱచుచు, తత్సమాచ్ఛులకుఁ జాలచోటుల సంధికార్యము చేసినాఁడు. "పారతేక సరస లెడలక", "వ్యాకర్త్రాముని" మున్నగు పలుతావులిందుల కుదాహరణములు. ఉత్తమపురుషైకవచన నకారసంధికిఁగూడ నహోబలపండితీయమున "ఉత్తమ పురుషేతు 'ప్రాయస్తు స్యా త్కిమాదిక స్యైతః' ఇతి సూత్రేణ సంధిః:—చేసితివచ్యుతార్చనము-చేసి తచ్యుతార్చనము...ఇత్యాదౌ విభాషేతి ప్రయోగతో వగంతవ్యః అని వ్రాసియుండుటచేఁ దన కావ్యమున నీసూత్రమును బాటించి -

"అంతరమాతమంబు బలు
పాటుప సేరుపుగల్గె నాకు నే
కాంత మనంతమా నుదయ
మంది తనంతపదంబు గంటి..."

మున్నగుచోట్ల నిట్టిప్రయోగములు తనకు సమ్మతమనుటఁ జాటినాఁడు. మఱియుఁ దా నహోబలపండితీయమున "...ఏతేన 'రాయంచకాల్లఁ దొలకయమున్న' ఇత్యాదికవిప్రయోగాణాం నకించిద నృసామంజస్య మితి ధ్యేయం" అని రఁయతి నంగీకరించి "లలితవైఖరి గనియు నబ్రంబు గాఁగ" యనియు, మఱి యితరస్థలములను నీయతి వాడి వ్యాకరణసాంప్రదాయములను, వానికిఁ దాను భావించిన నిర్ణయములను బూర్వాపరవిరుద్ధరహితముగఁ దన కావ్యమునఁ జాటి నిజవ్యాకరణశాస్త్రాభిమానమును వ్యక్తీకరించియున్నాఁడు.

ఇంతేకాక యహోబలపతి తన కావ్యమునఁ బలుతావుల సమయమును బురస్కరించుకొని తన యభిమానశాస్త్రమగు వ్యాకరణముపై ననేకాభిప్రాయములు వెల్లడించియున్నాఁడు. శరత్కాలవర్ణనసందర్భమున:

"ప్రకటితకాశాకాశా
వికలసవర్ణత శరత్తు విదితంబయ్యెన్
వికృతికిఁ బ్రకృతిత్వము గొని
ప్రకృతికి వికృతిత్వమొందు భాషన్నగుచున్."

అని పలికినాఁడు. ఈతఁడే కాళిందీకన్యచుక్కబొట్టును జక్కఁగ వర్ణించుట ప్రశంసార్హము:

"ద్విత్వరహితంపు టాకృతిఁ దెజరిల్లి
ప్రాకృతాఖ్యాకభాషనా భావితద్వి
రేఫవైఖరి గలిగి త్రిలింగదేశ
సూక్తి యన నొప్పఁ గస్తూరిచుక్కబొట్టు."

అని బుధులు మెచ్చఁబలికి ప్రాకృతత్రిలింగదేశసూక్తికిఁ జుక్కబొట్టుఁ బెట్టి కవి నిజముగా శ్లాఘ్యుఁడైనాఁడు. ఈవిధముగ భాషావ్యాకరణశాస్త్రములను వర్ణనలలో సమ్మిళితముచేసి సహృదయ హృదయారవిందములఁ జూఱగొనుట సామాన్యకవికి సాధ్యముగాని పని. ఇట్టివానివలన నీవైయాకరణుని కావ్యగౌరవ మినుమడించిన దనుటలో సందియములేదు. ఇదే విధముగ నీతని బహుశాస్త్రపరిజ్ఞాన మీకావ్యమున విదితమగుచున్నది. ప్రకృతాంశమగు నొక్క వ్యాకరణవిషయమే యిట సంగృహీతము. అహోబలపతి యీ వ్యాకరణాభిమానము తుదకు శ్రీకృష్ణుని కాళిందీకన్యాసమాగమసందర్భమున నామెకుచోపగూహనసమయమునఁగూడఁ బరుషసరళపదప్రయోగమునసే వర్ణింపఁ జేసినది:

"పరుషంబులనుటఁ గుచములు
సరళంబులు గాకయున్న సఖి చిత్రంబే
స్థిరములగుచున్న వబ్రము
పరమాణుసమానమధ్య పరికింపంగన్."

ఇట్లని యహోబలపతి రచితమగు కాళిందీకన్యాపరిణయమున బహు సత్కావ్యలక్షణములు గలవు. కాని, వాని యన్నిటికన్న మిన్నగా వైయాకరణసార్వభౌముఁడనుట వ్యాకరణాభిమానము ముద్దుగట్టి కొన్నిపా ళ్లధికమై సామాన్యులగు రసజ్ఞులకుఁ గొంత యేవగింపు కలిగింపకమానదు. ఐన నది యాతని దోషము కాదు. వ్యాకరణాభిమానులగు రసజ్ఞులకిదియ ముదావహము. వివిధాభరణాలంకృతయగు నాంధ్రమాత కిదియు విశిష్టభూషణమే కాఁగలదు. ఇంతకు నహోబలపతి కభిమానపురుషులు నన్నయాథర్వణులు. వారిలో నన్నయ—

"ప్రకృతియుగంబు దీర్చు ముని
వర్యులకున్ సముఁడైన పుణ్యునిన్
వికృతికి శిక్షగాఁగఁ బద
విద్య రచించినవాని నంధ్రవా
క్ప్రకటకవిత్వకల్పతరు
రాజము బీజము సర్వవాక్యశా
సకబిరుదాంక (నన్నన) వి
చక్షణచంద్రుఁడు."

మఱి యథర్వణాచార్యుఁడో? వికృతివివేకము గన్నవాఁడు; మహర్షితుల్యుఁడును. అనుటఁ జైరీతి నహోబలుని వ్యాకరణాభిమానము సాహిత్యస్ఫోరకమేయైనదని సంతసింపవచ్చును.

ప్రాచీన భారతరాజ్యాంగ విధానము

= శ్రీ పంద్రంగి రాజేశ్వరరావు =

మానవజాతివృద్ధితో పాటు శాస్త్రబద్ధమగు రాజ్యాంగవిధానముకూడ దినదినాభివృద్ధి పొందునని పరిణామసిద్ధాంతముయొక్క నిర్వచనము. అట్టి అభివృద్ధి ఎల్లప్పుడును సరళముగను, సవ్యముగను ఉండక అప్పుడప్పుడు తప్పటడుగులు, వెనుకంగలుకూడ వేయుచుండును. ప్రాచీనభారతరాజ్యాంగవిధానమునకు సంబంధించిన విషయములను సాకల్యముగ పరిశీలించుటకు తగినంత సామగ్రి లేదు. అందుబాటునందున్న సాధనసామగ్రి నాధారముచేసుకొని సానుభూతితో అవగాహనచేసుకొన్నవారుకూడ తక్కువనియే చెప్పవలసియున్నది. అయినప్పటికిని ఈ విషయమును యథాశక్తితో ఉచితరీతిని పరిశీలించుట చాల ముఖ్యమగు పని యనెడుసంగతి నిర్వివాదాంశము.

అథర్వవేదమందు ప్రజలే రాజునెన్నుకొనెడు పద్ధతి చాలచోట్ల నిర్వచింపబడియున్నది. ప్రజలసహాయమును, రాజభక్తిని పెంపొందించుటకు రాజు కుండవలసిన ఆతురతకూడ నిర్వచింపబడియున్నది. దేశమునుండి వెడలగొట్టబడిన రాజుకూడ అప్పుడప్పుడు తిరిగి ఆహ్వానింపబడుచుండెడువాడు. ఒక రాజు పదభ్రష్టుడయినపిమ్మట మరియొక రాజు నెన్నుకొను పద్ధతి కూడ విశదీకరింపబడియున్నది. అథర్వవేదప్రకారము ఆస్థానకవి, దండనాధికారి, శిల్పి, రాజబంధువులు, పురోహితుడు, పట్టమహిషి, రాజుచే పరిత్యజింపబడిన భార్యలు, సేనానాయకుడు, సుంకరి, కోశాధికారి కలిసి రాజునెన్నుకొనెడువారు. చట్టబద్ధమగు పరిపాలన (Rule of law) హైందవరాజ్యాంగవిధానమునకు మూలమంత్రమని చెప్పవలసియున్నది. హిందూదేశముపై ఆదిని దండెత్తివచ్చిన ఆర్యులు పరివారముచే ఎన్నుకొనబడిన సేనానాయకులుగాని రాజులు కారను విషయమును జ్ఞప్తియందుంచుకొనవలయును. ఐతరేయ బ్రాహ్మణముప్రకారము ఆదినుండియు అధికారము చెలాయించు వ్యక్తి ఎన్నుకొబడెడివాడు. రాజగు సగరుని మరణానంతరము ప్రజలు సాత్వికుడగు అంశుమానుని ప్రభువుగా ఎన్నుకొనిరి. ప్రజాసభలు, మంత్రిపరిషత్తులు రాజును సరియగు కట్టుబాటులో నుంచెడివి. దశరథుడు రామునకు పట్టాభిషేకము చేయదలచి ముందుగా తన అభిప్రాయమును ప్రజాప్రతినిధుల సభయందు వెలిబుచ్చి, అందులకు అనుమతిని పొందెను. ప్రభువునకు, ప్రజాసమితికి అన్యోన్య మత్యవసరమని, అందుమూలముగనే దేశాభివృద్ధి చేకూరునని ఋగ్వేదము నిర్వచించుచున్నది. ప్రజాసభకు, ప్రభువుకు మనోవాక్కాయకర్మలందు ఐక్యత చేకూర్చుటకై ప్రార్థన కూడ కలదు. దశరథుని మరణానంతరము రాముడు దండకారణ్యమున కేగుటచే రాజగురువగు వశిష్ఠుడు ప్రజాభిప్రాయము ననుసరించి భరతునకు పట్టాభిషేకము చేసెను. యయాతిమహారాజు తన జ్యేష్ఠకుమారునకు బదులు కనిష్ఠకుమారునకు పట్టాభిషేకము చేయుటకు ముందుగా ప్రజాభిప్రాయమును తీసుకొనెను. ప్రదీపుడు తన జ్యేష్ఠకుమారుడగు దేవాపికి పట్టాభిషేకము చేయదలచినపుడు అతనికి చర్మవ్యాధి కలదని, అందుచేత పరిపాలన కనర్హుడని ప్రజలు అభ్యంతరము పెట్టుటచేత మరొక కుమారుడగు శంతనునకు పట్టాభిషేకము చేయవలసివచ్చెను. అవధ్యుడు రాజగుట దైవమెన్నడును హర్షింపడని ఉద్యోగపర్వమందు చెప్పబడియున్నది. కురువంశమందు జ్యేష్ఠుడగు ధృతరాష్ట్రుడు గుడ్డివాడగుటచే పాండురాజు రాజ్యముచేసెను. పాండురాజు చనిపోయిన తర్వాత తాత్కాలికముగా రాజ్యాధికారము ధృతరాష్ట్రునకు సంక్రమించినప్పటికిని దగ్గరవారసు లెవ్వ రనెడు సమస్య యుధిష్ఠిరునకు యుక్తవయస్స

వచ్చినపిమ్మట ఏర్పడెను. అపుడపుడు ప్రజలే ప్రభువును చాటముగా ఎన్నుకొనినట్లు తార్కాణములు కలవు. ఆదిపర్వమందు సంవర్ణుని కుమారుడగు కురుని ప్రజలే రాజుగా ఎన్నుకొన్నట్లు చెప్పబడియున్నది. మరియు జనమేజయుడు బాలుడైనప్పటికిని ప్రజలందరిచే ఏకగ్రీవముగా రాజుగా ఎన్నుకొనబడెను. వంశపారంపర్యాధిపత్యమను రాజరిక రివాజు ఉన్నప్పటికిని చివరకు ప్రజల అనుమతి పొందవలసియుండెను. యుధిష్ఠిరుడు సర్వసంగపరిత్యాగము చేయుటకుముందు తన తమ్ముని మనుమడగు పరీక్షిత్తునకు రాజ్యాభిషేకము చేయదలచి, ముందుగా ప్రజలందరిని పిలిపించి తన అభిప్రాయమును వెలిబుచ్చెను. వారందుల కభ్యంతరము చెప్పగా నచ్చజెప్పి చివరకు ఒప్పించెను. రాజెల్లప్పుడును మంత్రులను సలహాచేయుచుండవలెనని సభాపర్వమందు నారదుడు చెప్పియున్నాడు. అదనపు పన్నులు విధించుటకుముందు రాజు ప్రజలకు పరిస్థితులు విశదీకరింపవలెనని శాంతిపర్వమందు చెప్పబడియున్నది. విదుర, భీష్మ, ద్రోణాదుల సలహాను పెడచెవిని పెట్టుటచే ధృతరాష్ట్రుడు భీష్మపర్వమందు తీవ్రముగా నిందింపబడెను. ప్రజల శ్రేయోభివృద్ధి పెంపొందించుటయే పరిపాలనయొక్క పరమావధియని శాంతిపర్వమందు చెప్పబడియున్నది. అయోధ్యకాండయందు ప్రజలను నిష్కారణముగ సరయూనదియందు త్రోసి ఆనందించు రాజకుమారుడు తండ్రిచే వెడలగొట్టింపబడెనను కథ కలదు.

ప్రజాభీష్టము ననుసరించి పరిపాలించు పద్ధతి ఒకప్పుడు హైందవవలసరాజ్యమగు చంపా (ప్రస్తుతము అన్నాము అని పిలువబడెడు దేశముయొక్క దక్షిణభాగము) యం దమలులో నున్నట్లు తెలియుచున్నది. రాజు చనిపోగానే మంత్రివర్గమే వేరొక రాజును ఎన్నుకొనుట, లేక చనిపోయిన రాజుచే పేర్కొనబడినవానికే పట్టాభిషేకము చేయుచుండుట ఆచారమైయుండెను. ఒక్కొక్కప్పుడు జనకంటకులగు రాజులు పదభ్రష్టులుగావింపబడిరి. చంపాయందు రాజెప్పుడును మధ్యాహ్నమువరకు ప్రజలకు దర్శనమిచ్చి స్వయముగా వారి కష్టనిష్ఠురములను వినుచుండెడివాడు. రాజవంశములో సరియగు వారసు లేనప్పుడు ప్రజలే శక్తిసామర్థ్యములుగల ఒక వ్యక్తిని రాజుగా ఎన్నుకొనెడువారని గ్రీకు గ్రంథకర్తయగు అరియన్ 'ఇండికా' అను గ్రంథమునందు వ్రాసియున్నాడు. మరియు పురోహితులవల్ల రాణులకు కలిగిన కుమారులు రాజులుగా ఎన్నుకొనబడుచుండువారు. ఈ ఆచారము నేటికిని ఒకవిధముగా కొచ్చిను సంస్థానమునందు కానవచ్చుచున్నది. కొచ్చిను రాజకుమార్తెలకు నంబూద్రి బ్రాహ్మణులు మంగళసూత్రముకట్టు ఆచారము నేటికిని పండుగగా పరిగణింపబడుచున్నది.

పట్టాభిషేకసమయమందు జరిగెడు కర్మకాండ కూడ ప్రజాహితపాలనా సిద్ధాంతమునే ధ్రువపరచును. ఎన్నుకొనబడిన రాజు ముందుగా భూదేవి అనుమతి తీసికొనవలెను. తర్వాత ఈ క్రింది దేవతలను పవిత్రతను, చాకచక్యమును ప్రసాదించుటకై ఆరాధింపవలెను. అగ్ని గృహాధిపతిగా ఇంటిమీద సర్వాధికార మిచ్చువాడు. సోముడు వనస్పతిగా అడవులను, కృషిసాయమును రక్షించువాడు. బృహస్పతి వాచాలత్వము నిచ్చువాడు. ఇంద్రుడు పరిపాలనా సౌష్ఠవమును, స్థిరత్వమును చేకూర్చువాడు. రుద్రుడు పశువులను రక్షించువాడు. ఈ ఆరాధన ధర్మపతియగు వరుణపూజతో సమాప్తిపొందెడిది. హిందూ సిద్ధాంతప్రకారము ధర్మమే రాజు, రాజే దండనాధికారి. పైపూజలన్నియు రాజుకుండవలసిన లక్షణములన్నిటిని విశదీకరించుచున్నవి. వేదసంస్కృతియందు రాజుకు గల అధికారము దైవదత్తము కాదు. ప్రార్థనలమూలముగ దైవాంశసంభూతుడు కావలయును. శుక్రనీతియందు సద్గుణములుగలవాడు మాత్రమే దైవాంశసంభూతుడుగ ఎంచబడినాడు.

తర్వాత సరస్వతీనది, సముద్రము, సుడిగుండము, వరదనీరు, నూయి, కదలిక లేని చెరువు ఆదిగాగల పదునేడు ప్రదేశములనుండి తెచ్చిన నీటితో రాజుపై ప్రోక్షించెడువారు. ఇందులో సరస్వతి వాక్పటిమకు, పారుదల గల నది పటుత్వమునకు, వరదనీరు సమృద్ధికి, సముద్రము అధ్వర్యమునకు, చలనములేని చెరువు అచంచలమగు

రాజశక్తికి సాంకేతికముగ ఎంచబడుచున్నవి. బ్రహ్మ, క్షత్రియ, వైశ్యులు ముగ్గురును ప్రోక్షించుటయందు పాల్గొనువారు. సింహాసన మధిష్ఠించుటకు పూర్వము రాజు స్నానమాచరింపవలయును. తనుపరి ధర్మ, న్యాయ, సత్యములకు బద్ధుడై తాను ధర్మమును తప్పితో సర్వస్వమును కోల్పోవుటయే గాక తన వంశనుకూడ క్షయమగుగాక అని ప్రమాణముచేయువాడు. ప్రజలకు రక్షకుడనని చెప్పుచు రక్షణ నొసగనటువంటి రాజును ప్రజలు పిచ్చికుక్కగా పరిగణించి పట్టి చంపవలెనని అనుశాసనపర్వమందు భీష్ముడు చెప్పియున్నాడు. మౌర్యచక్రవర్తులలో కడపటివాడగు బృహద్రథుడు పట్టాభిషేకసమయమందు చేసిన ప్రతిజ్ఞను నిల్పుకొనలేకపోవుటచే ప్రజలాతని దురుమాడిరని బాణుని హర్షచరిత్రయందు చెప్పబడియున్నది. ఆంగ్లల రాజు పన్నులు తీసుకొని ప్రజలను రక్షింపవలసియున్నదని వేదమందును, తదితర మత గ్రంథములందును స్పష్టముగా చెప్పబడియున్నది. జైమినిఋషి రచించిన మీమాంసాసూత్రములప్రకారము రాజుకు భూమిపై ఎట్టి హక్కు, అధికారము లేవు. పండెడు పంటలో ఆరవవంతు పాలుమాత్రము పుచ్చుకొనవలెను. దరిమిలాను హిందూధర్మమును పునరుద్ధరించి ప్రబలముచేయుటకై రాజును దైవాంశసంభూతునిగ ఎంచి సర్వాధికారములను ఒప్పజెప్పిరి. దేవాలయములను కట్టించి అందు విగ్రహములను స్థాపించుటవల్ల రాజు దైవాంశసంభూతుడగుచున్నాడను వాదము బయలుదేరెను.

ఆనాటి రాజసభలందు రాజ్యాంగమునకు సంబంధించిన ప్రతివిషయము వివరముగ చర్చింపబడుచుండెను. వాచాలత్వము, చమత్కృతి అమూల్యములుగ ఎంచబడుచుండెను. ప్రతి ఉపన్యాసకుడు సభాసదులందరకు హితవుగా మాట్లాడవలెననియు, సభాధ్యక్షునకు, సభాసదులకు ఏకాభిప్రాయము కలుగవలెననియు ముందుగా ప్రార్థన జరిగెడిది. చర్చలన్నియు నియమబద్ధముగ నుండెడివి. ప్రతి విషయము చివరకు వోట్లుతీసుకొని అధికసంఖ్యాకుల అభిప్రాయప్రకారము నిర్ధారణచేసెడివారు. రాజుకు గల అధికారమును సభ లనేకవిధములుగా తమ ఆధ్వర్యమునకు లోబరుచుకొనుచుండెను. రాజుపరోక్షమందుకూడ శాసనములు సభవారిచే ఆమోదింపబడుచుండెడివి. విదేశవ్యవహారములు, ఉద్యోగుల నియామకము, ఖజానాపై పెత్తనము సభవారే జరుపువారు. బ్రిటనునందలి ప్రభువులసభ (House cf Lords) వలె ఆనాటి రాజసభలు ప్రధానన్యాయస్థానముగా పని చేసెడివి. నిర్దోషిగా ఎంచబడిన వ్యక్తి సంతోషముతో రాజసభనుండి తిరిగివచ్చుటనుగురించి ఋగ్వేదమందు చెప్పబడియున్నది. ఆనాటి రాజసభలందు నిజాయితీని పరీక్షించుటకై అగ్నికుండము లుండెడివి.

వేదకాలమందు ప్రజాస్వామికము లున్నట్లు ఐతరేయ, తైత్తిరీయ బ్రాహ్మణములందు చెప్పబడియున్నది. శాంతిపర్వమందు గణ మని పిలువబడెడి (Sovereignty of the many) ప్రజాస్వామికపద్ధతి, అట్టి ప్రజాస్వామికముల కూటము (Confederation of Republics) అమలునందుండెనని చెప్పబడియున్నది. ప్రజాస్వామికములకు చెందియుండిన అంధకులు, యాదవులు, వృష్ణులు, కుకురులు, భోజులు కృష్ణుని ఆధిపత్యముక్రింద కూటము (Federation) గా నుండిరి. కృష్ణుడు సంఘముఖ్యుడు (Federal President) గా నుండి అన్ని జాతులకును సంబంధించిన విషయములను అందరకు అనుకూలమగురీతిని సర్దుబాటుచేసి పరిపాలన జరుపుచుండెడువాడు. ప్రతిజాతికి గల ముఖ్యుని ఈశ్వరుడని పిలుచుచుండెడివారు. కేంద్రప్రభుత్వమందు వివిధ పక్షము లుండెడివి (Party system at the centre). రాజ్యాధికారము చేజిక్కించుకొనుటకై వివిధపక్షముల నాయకులు గట్టిప్రయత్నములు జరిగించినట్లుకూడ కానవచ్చును. ఆహుక, అక్రూర, గద, ప్రద్యుమ్న, సంకర్షణ, బలదేవ, బభ్రు, ఉగ్రసేన ఆదిగా గల నాయకులు రాజ్యాధికారమును చేజిక్కించుకొనుటకై గట్టి ప్రయత్నమును చేసియుండిరి. తుదకు బభ్రు తప్ప మిగతవారందరు కృష్ణుని నాయకత్వమును ఆమోదించిరి. అప్పుడప్పుడు కృష్ణుడు వీరికి గల రాజభక్తిని శంకించువాడు. బలము గల సంకర్ష

గుడు, సద్గుణపుంజమగు గదాధరుడు, రూపసియగు ప్రద్యుమ్నుడు తన కేమియు సహాయము చేయకపోవుటచే అధికారమంతయు ఆహుక, అక్రూరుల పరమగుట వల్ల తాను బభ్రు నెదుర్కొనుట కష్టతరముగ నున్నదని శ్రీకృష్ణుడు నారదునివద్ద ఖేదపడగా, సంఘముఖ్యుడుగా తనకు గల సర్వాధికారములు పూర్తిగా చెలాయించినచో కష్టములన్నియు గట్టెక్కునని నారదుడు సలహాయిచ్చెను.

శాంతిభద్రతలు, పరిశ్రమలు, వర్తకవ్యాపారము పెంపొందించుటకై సామ్రాజ్యవ్యవస్థ ఆవశ్యకమని ఎంచుచో సామ, దాన, భేద, దండోపాయములచే ఆసియాఖండమందు విశాలసామ్రాజ్యమును స్థాపించిన గౌరవము హైందవులకే దక్కవలసియున్నది. సామ్రాజ్యస్థాపకులు శాంతియుతముగ పరిపాలన జరుపగలమని ఆశింపవచ్చును. కాని సామ్రాజ్యతత్వ ప్రాబల్యమువల్లనే తరుచు యుద్ధములు సంభవించుచుండును. జయింపబడినవారిని తిరిగి తలఎత్తకుండ అపుడపుడు అణచుచుండవలెను. అందునిమిత్తమై సైన్యమును, యుద్ధసామగ్రిని ఎప్పటికప్పుడు సిద్ధము చేసి యుంచవలెను. అపుడపుడు నూతన సామ్రాజ్యములతోకూడ యుద్ధములు సంభవించుచుండును. ఇట్టి పరిస్థితులలో యుద్ధములను కల్పించవలసిన ఆవశ్యకత కూడ యేర్పడును. ప్రజలందరు సామ్రాజ్యరక్షణకై దేశభక్తియును సర్వస్వమును త్యాగము చేయుటకు సిద్ధపడు వాతావరణము కలిగియుండవలెను. హైందవ రాజ్యాంగమందు సామ్రాజ్యతత్వము నిబిడీకృతమైయున్నదను విషయము నిర్వివాదాంశము. చక్రవర్తి, ఛత్రపతి, మహారాజాధిరాజ, రారాజ, సామ్రాట్, సార్వభౌమ ఆదిగా గల బిరుదులే యిందులకు తార్కాణము. మరిన్ని సామ్రాజ్య తత్వమును సూచించు వాజపేయ, రాజసూయ, అశ్వమేధ, ఆదిగాగల యజ్ఞయాగములుకూడ జరుపువారు. సర్వాధికార, సామ్రాజ్య తత్వములకు సంబంధించిన సాధనసిద్ధాంతము ప్రాముఖ్యముగా సర్వత్ర వ్యాపించియున్నట్లు తెలియుచున్నది. ఆపస్తంబుని శ్రౌతసూత్రముల ప్రకారము అశ్వమేధ యాగము జరుపుటకు సార్వభౌమునకు మాత్రమే అధికారము కలదు. రాజసూయముచేయుటచే రాజగునని, వాజపేయమును సామ్రాట్ చేయవలెనని, అశ్వమేధము స్వరాట్ చేయవలెనని, పురుషమేధము విరాట్ చేయవలెనని, సర్వమేధము సస్వరాట్ చేయవలెనని గోపథ బ్రాహ్మణమందు చెప్పబడియున్నది. ఇట్టి క్రతువులు చేసి పేరుగాంచిన రాజుల పేర్లు పెక్కు గ్రంథములందు ఉదాహరింప బడియున్నవి. సామ్రాజ్యము స్థాపింపవలెననెడు కాంక్ష సర్వోత్కృష్టమైనదని, అట్టిపని పవిత్రమగు విధ్యుక్తధర్మమని మహాభారతమందు చెప్పబడియున్నది.

జయింపబడిన ప్రజలను క్రమేపి సంతృప్తిపరచుటకై ప్రయత్నములు చేయుచుండవలెనని సభాపర్వమందు నారదుడు యుధిష్ఠిరునకు సలహాయిచ్చెను. నూతనముగ కొంతరాజ్యమును సంపాదింపగనే రాజు ఆదేశపు ప్రజల భాషను నేర్చుకొని, వారి ఆచార వ్యవహారముల ననుకరించి వారి పండుగలందును, ఉత్సవములలోను తప్పక పాల్గొనవలెనని కౌటిల్యుడు అర్థశాస్త్రమందు నొక్కివక్కాణించి యున్నాడు. మరిన్ని బలవంతుడగు రాజు బలహీనులగు రాజుల నెన్నడును నాశనముచేయరాదని ధృతరాష్ట్రుడు ఆశ్రమవాసపర్వమందు చెప్పియున్నాడు. ప్రజాహితపరిపాలనకు రామరాజ్యము పర్యాయపదముగ వాడుకలోనికి వచ్చెను. కళింగయుద్ధము తర్వాత అశోకచక్రవర్తి ప్రజల కొసగిన క్షమాపణ ప్రపంచచరిత్రయందు అద్వితీయమగు ఘట్టమేగాక నిరుపమానమగు పవిత్రచర్యగ నేటికిని పరిగణింపబడుచున్నది. ఆధునికదృష్టితో పరిశీలించినప్పటికిన్ని హైందవసామ్రాజ్యవిధానము సరసమేగాక పెక్కు సందర్భములలో ప్రజాహితముగ నుండెనని చెప్పవలసియున్నది. అంతర్జాతీయ వ్యవహారములుకూడ చట్టబద్ధముగను, సరసముగను జరిగెడివని తెలియుచున్నది. అపుడు సుమారు పండ్రెండుతరహాల రాజ్యాంగవిధానములుగల స్వతంత్రదేశము లున్నవని తెలియుచున్నది. ఆయా దేశముల నడుమ గల సంబంధ బాంధవ్యములు వివరింపబడియున్నవి.

బౌద్ధవాఙ్మయమందు రాజునకు గణదాసని నామాంతరము కలదు. అనగా సంఘసేవకుడని అర్థము.

గౌతమబుద్ధుని కాలమందు పెక్కు ప్రజాస్వామికము లుండెనని తెలియుచున్నది. క్రీస్తుపూర్వము ౬, ౭ శతాబ్దములకు చెందియున్న బౌద్ధజాతకములందు బౌద్ధ సంఘములందు అమలులోనున్న విధానము విపులీకరింపబడియున్నది. ప్రాచీన హైందవప్రజాస్వామికములందు గల విధానమే బౌద్ధసంఘము లనుకరించినవి. తీర్మానము ప్రవేశపెట్టుట, సభయం దుండవలసిన కనీససంఖ్య (Quorum), రహస్యముగ అభిప్రాయము తెలుపువిధానము (Ballot Voting), అధికసంఖ్యాకుల అభిప్రాయము ననుసరించుట, విషయవిచారణసంఘముల నివేదిక (Report of the Select Committees) ఆదిగాగల విషయము లన్నియు బౌద్ధవాఙ్మయమందు కలవు. ఈ విషయములను విశదీకరింపకయే ఉద్ఘాటించుటచే ఈ పద్ధతులు అంతకుపూర్వమే ఆచరణయందుండెనని తేటతెల్లమగుచున్నది. ఈ సందర్భమున బెంగాలు గవర్నరుగా పనిచేసి, తరువాత ఇంగ్లాండులో ఇండియా కార్యదర్శిగా పనిచేసిన సుప్రసిద్ధ వేదాంతి, చరిత్రకారుడు అయిన జట్లాండు ప్రభువు రచించిన 'హిందూ దేశముయొక్క అమూల్యప్రసాదము' (Legacy of India) అను గ్రంథమందలి క్రిందివాక్యములు గమనార్హమైనవి:

"సుమారు రెండువేలసంవత్సరముల క్రితము బౌద్ధసంఘములందు నేటి పార్లమెంటరీవిధానము అమలునందుండెనను సంగతి చాలమందికి ఆశ్చర్యముకలిగించవచ్చును. సభయొక్క గౌరవప్రతిపత్తులను సంరక్షించుటకు నేటి అధ్యక్షునివలె (Speaker) అపుడుకూడ ఒక ప్రత్యేకాధికారి యుండెడువాడు. నేడు పార్లమెంటునందు కనీసపుసంఖ్య గల సభ్యులను చేకూర్చుటకై గల అధికారివలె (Whip) అపుడుకూడ అందుకై ప్రత్యేకాధికారి యుండువాడు. ఏ సభ్యుడైనను తీర్మానమును ప్రవేశపెట్టుటతోడనే అందుమీద చర్చ జరిగెడిది. ఇట్టిచర్చ ఒకసారి, లేక మూడుసార్లుకూడ జరుగుచుండెను. ఈ నాడు పార్లమెంటులో చట్టమగుటకు పూర్వము ప్రతిబిల్లు మూడుసార్లు చర్చింపబడవలె నను పద్ధతికూడ ఆ నాడు కలదని ధ్రువమగుచున్నది. చర్చలయందు అభిప్రాయభేద మేర్పడుచో రహస్యరీతిని వోట్లు తీసుకొని అధికసంఖ్యాకుల అభిప్రాయము ననుసరించి తుదినిర్ణయము జరిగెడిది."

ఇట్లు సింహావలోకన చేసిచూచినచో క్రీ. పూ. ఆరవశతాబ్ది ప్రాంతమందు శాస్త్రబద్ధమగు రాజ్యాంగ విధానము, పరిభాష, సంస్థలు, సాధనవిధానములు అమలులోనున్నట్లు స్పష్టపడుచున్నది.

భారతరాజ్యాంగ వాఙ్మయమందు అత్యంత ప్రసిద్ధి చెందిన కౌటిల్యుని అర్థశాస్త్రమున మంత్రిపరిషత్తులనుగురించి చెప్పబడియున్నది. రాజ్యాధికారము ఒక సంఘమునకు చెందియుండవచ్చును. కొన్ని సంఘములయొక్క రాజ్యాంగకూటము (కుల సంఘ) ప్రజాస్వామికమగుటచే నశింపక చిరస్థాయిగ నుండునని సామ్రాజ్యతత్వవాదియగు కౌటిల్యుడు చెప్పుట గమనార్హమైనది. న్యాయశాస్త్రముయొక్క ఔన్నత్యమును, తత్ప్రవృత్తిని కాపాడుటవల్ల రాజు రాజ్యాంగ సంరక్షకుడగుచున్నాడని అర్థశాస్త్రమందు చెప్పబడియున్నది. న్యాయశాస్త్రమే రాజులకు మించిన రాజని బృహదారణ్యకోపనిషత్తునందు చెప్పబడియున్నది. రాజెప్పుడు దుష్టసహవాసమువల్ల విషయలోలుడై, విధ్యుక్తధర్మము విడచి క్రౌర్యము, జూదము, ప్రజాహింస ఆదిగాగల చెడుపనులు చేయునో అప్పుడు వానిని ప్రజలు పదభ్రష్టుని గావించి దేశమునుండి వెడలగొట్టువారు. ఇట్టి మార్పును చేయుటకై నేటివలె రక్తసిక్తమగు విప్లవము, కల్లోలము, ఆందోళన ఆరోజులలో అక్కరలేకయే యిట్టి మార్పులు శాంతియుతముగ జరుగుచుండెడివి. ప్రజలు తమకు గల బాధలను, కష్టములను నివారింపవలెనని ప్రాయోపవేశములు చేయుచుండెడివారని కథకసంహితయందు చెప్పబడియున్నది. పూర్వకాలమందు రాజులు ఇట్టి ప్రాయోపవేశములనుగురించి వాకబు చేయుటకు గూఢచారులను పంపి విషయమును పూర్తిగా అవగాహనచేసుకొని తగుకృతిని వర్తించెడివారని కల్హణుడు వ్రాసిన 'రాజతరంగిణి'యందు చెప్పబడియున్నది. ఇటీవల మహాత్మాగాంధి ఆచరించిన ప్రాయోపవేశములు పూర్వకాలమందు శాస్త్రబద్ధమేగాక ఆచరణయోగ్యమనికూడ ఎంచవలసియున్నది. మరిన్ని ఆనాటి రాజులు ప్రజల హక్కు


లను, స్వాతంత్ర్యమును ఎట్టివిధముగ కాపాడుచు వచ్చినది 'రాజతరంగిణి' యందు విశదీకరింపబడినది. పదియవ శతాబ్దికి చెందిన చోళచక్రవర్తి రాజరాజు కాలమందు సుమారు వలంబరి గ్రామములు పౌరసభల ద్వారా పరిపాలనజరుపుచుండెడివని తెలియుచున్నది. విజయనగర సామ్రాజ్యమందుకూడ పురపాలకసంఘములు చక్కగా పనిచేసినట్లు అనేకాధారములు నేటికిని కన్పించుచున్నవి. పండ్రెండవ శతాబ్దాంతమున కాకతీయప్రభువగు రుద్రమదేవుడు రచించిన 'నీతిసారము' రాజకీయగ్రంథములలో ముఖ్యమైనదని చెప్పవచ్చును. ప్రస్తుత మీపుస్తకముయొక్క కొన్ని భాగములు మాత్రమే అందుబాటునందున్నవి. అతికష్టముమీద దీని భాగములను శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు సేకరించియుండిరి. ఇందుదాహరింపబడిన పరిపాలనావిధానము రాజరికము. కాని రాజు తనకు గల అధికారము ప్రజల హితవునకు, అభివృద్ధికి వినియోగించవలెనని చెప్పబడియున్నది. రాజుయొక్క అధికారము అంతులేనిదైనను జనకంటకముగ నుండరాదు. హక్కులతోపాటు గల బాధ్యతలు నిర్వహింపబడినవి. రాజు ప్రజలయెడల తనకు గల బాధ్యతలను సక్రమముగ నిర్వర్తించినపుడే రాజరికము జయప్రదముగా జరిగినదని ఎంచవలెను. ఇందు మంత్రివర్గముయొక్క ఆవశ్యకత గుర్తింపబడినది. శాసనసభయొక్క పరిమాణమును చర్చించినపిమ్మట ఈ విషయమై ఎల్లప్పుడును ప్రభుత్వముయొక్క అవసరములనుబట్టి నిర్ణయింపవలెనని చెప్పబడియున్నది. రాజుకు గల వ్యక్తిగతాభిప్రాయమునకు, మంత్రివర్గము సలహాచేసిన పిమ్మట ఏర్పడు అభిప్రాయమునకు గల తారతమ్యము పూర్తిగ విశదీకరింపబడినది. ప్రత్యేకపరిస్థితులందు ఇతరుల సలహానుకూడ తీసుకోవలెనని చెప్పబడియున్నది. ఆంతరంగికమంత్రివర్గము (Inner Cabinet) కూడ పేర్కొనబడినది. మంత్రివర్గముయొక్క సలహాకు రాజు కట్టుబడవలసిన అవసరము లేకపోయినను సాధ్యమగునంతవరకు వారి సలహాప్రకారమే చేయుట మంచిదిగా ఎంచబడినది. న్యాయశాస్త్ర దృష్టిలో అందరును సమానులే అను సూత్రముకూడ ఇందు కలదు. రాజకుమారుడు నేరముచేసినప్పటికిని సామాన్యపునేరస్థుని శిక్షించినట్లే శిక్షించవలెనని యున్నది. రాజు పన్నులు వసూలుచేయుట ప్రజల సౌకర్యములను వృద్ధిచేయుటకొరకని చెప్పబడియున్నది. రాజుకు, ప్రజలకు గల సంబంధము సమిష్టికుటుంబములో కర్తకు, మిగిలినవారికి గల సంబంధమువంటిదే యని స్పష్టముచేయబడినది.

ఆదినుండీ అమలులోనున్న ప్రజాస్వామిక పద్ధతిని ధ్రువపరచుచు కొన్ని శాసనములుకూడ కలవు. తదితర ఆధారములను శంకించినను శాసనములను శంకించుటకు వలనుపడదు. బెంగాలులో గోపాలుడు రాజుగా ఎన్నుకొనబడుటకుపూర్వము పదునేను సంవత్సరముల పాటు ప్రజలచే ఎన్నుకొనబడిన శూద్రుడు రాజ్యము చేసినట్లు శాసనాధారము కలదని కె. పి. జయస్వాలుగారు వ్రాసియున్నారు. కారైకాల్ సమీపమున గల కసకుడియందు దొరికిన శాసనప్రకారము ఎనిమిదవ శతాబ్దమందు పల్లవరాజగు నందివర్ధనుడు ప్రజలచే ఎన్నుకొనబడెను. హైందవరాజ్యాంగమందు అగ్రజాతులకు గల ఆధిక్యత, తదితరులయెడ చూపబడిన ఉదాసీనత ప్రప్రథమమున పెద్దలోటుగా కనుపించును. అందులకు కారణము లేకపోలేదు. ఆదిమనివాసులు హైందవసంఘమందు పూర్తిగా ఐక్యమగుటకు కొంత వ్యవధి, కాలయాపన అవసరమగుటయే యిట్టితేడాలేర్పడుటకు అవకాశమును కల్పించెను. క్రమేపి ఇట్టి తాత్కాలికపు తేడాలు అంతరించినట్లు అనేక తార్కాణములు గలవు. నిమ్నజాతులందు జనించిన వాల్మీకి, వశిష్ఠ, కౌశికాదిమహాఋషులు తమ తపోబలమువల్ల బ్రాహ్మణులైరి. మరియు హైందవసంఘమందు అగ్రజాతులకు, నిమ్నజాతులకు గల భేదము యూదులకు, యూదులుకానివారికి, గ్రీకులకు, బానిసలకు, రోమనులకు, అనాగరకులకు, క్రైస్తవులకు, అన్యులకు, ముసల్మానులకు, కాఫరులకు, శ్వేతజాతులకు, రంగుజాతులకు మధ్యగల భేదములో సహస్రాంశమని చెప్పవచ్చియున్నది.

హైందవరాజ్యాంగవిధానమునకు గ్రామమే పునాది. హైందవరాజ్యాంగమందు గ్రీసునందువలె

పట్టణరాజ్యములకు (City States) స్థానము లేదు. హైందవరాజ్యములందు క్రమేపీ కొన్ని పట్టణము లేర్పడినప్పటికిని వాటి కెక్కువ ప్రాముఖ్యత ఉండి యుండలేదు. బృహస్పతిస్మృతియందు గ్రామసంఘములు శాసనసభకు వసతి, నీటివసతి, తటాకము, ఉద్యానవనము, బీదవారికి, దిక్కులేనివారికి సహాయము ఆదిగాగల సౌకర్యములను గ్రామస్థులకు కలుగ జేయవలెనని చెప్పబడియున్నది. గ్రామసంఘములే గాక కొన్ని గ్రామములు కలిసిన కూటములుకూడ ఉండెడివి. హిందూదేశముపై పైవారెన్నిసారులు దండెత్తివచ్చినప్పటికిని గ్రామములుమాత్రము చెక్కు చెదరలేదు. కొన్ని రాజవంశములు నిరంకుశాధికారము చలాయించినప్పటికిని వారివారి పరిపాలనకు స్థిరత్వమేర్పడుటతోడనే ప్రజాప్రభుత్వములను స్థాపించుటకు కృషిచేసిరి. యుద్ధమందు జయము కలిగిన వెంటనే రాజకీయనిరంకుశత, తరువాత శాస్త్రబద్ధమగు పరిపాలన యేర్పడుచుండెడివి. ప్రతిరాజవంశము యొక్క హయాము నందును ఇటులనే జరిగెను. కాని దురదృష్టవశాత్తు నేడు ప్రచారమందుగల చరిత్రలలో ప్రాచీన యుద్ధములనుగురించి, రాజకీయనిరంకుశతనుగురించి విశేషముగాను, శాస్త్రబద్ధమగు పరిపాలననుగురించి స్వల్పముగాను చెప్పబడియున్నది. జాగ్రత్తగా పరిశీలించుచో ఇట్టిపరిణామము గుప్త, మౌర్య, ఆంధ్ర సామ్రాజ్యములందు కానవగును. మొగలులు ఇండియాపైకి దండెత్తివచ్చినప్పటికి వారిచట స్థిరపడుటచే మొగలాయిపరిపాలన గ్రీకుల పరిపాలనవలె తాత్కాలికము గాక కొన్నిశతాబ్దములపాటు స్థిరముగా నుండెను. అక్బరుచక్రవర్తి నిరంకుశవిధానమును సడలించి, హిందువులకు ముసల్మానులతోపాటు సమానప్రతిపత్తిని కల్పించెను. దరిమిలాను గద్దెనెక్కిన మొగలాయి ప్రభువు లీయుత్కృష్టమగు పద్ధతి ననుసరించి కాలానుగుణ్యముగ ప్రవర్తించినచో వీరి పరిపాలన సుస్థిరముగ నుండు అవకాశ మేర్పడియుండెడిది. తుదకు శాస్త్రబద్ధమగు ప్రజాపరిపాలన యేర్పడియుండెడిది. మరిన్ని నిరంకుశాధికారికి పర్యాయపదముగ 'మొగలు' అను పద మిన్నటికిని ప్రచారములోకి వచ్చెడిదికాదు.

చివరకు గ్రామము లేనాడు స్వయంపోషకములుగా నుండుట అంతరించెనో అప్పటినుండియు హైందవ రాజ్యాంగవిధానము క్షీణింపసాగెను. తిరిగి గ్రామములు ప్రధానస్థానము నాక్రమింపవలసియున్నది. జాగ్రత్తగా పరిశీలించుచో భారతరాజ్యాంగ చరిత్ర కొక ప్రత్యేకవ్యక్తిత్వము కలదని తేలుచున్నది. ఇందలి వివిధఘట్టములకు ఒకవిధమగు కలయికకూడ కలదు. ఈస్థితిని సంపూర్ణముగా అవగాహనచేసు కొనుటకు అందుబాటునందున్న చారిత్రికసమాచారములను సక్రమముగ వ్యాఖ్యానముచేయవలసియున్నది. హైందవ రాజ్యాంగ విధానమందు స్థానిక, జాతీయ, అంతర్జాతీయ సమస్యలకు ఉచితస్థాన మీయబడినది. సింహావలోకన చేసి చూచినచో హైందవరాజ్యాంగ విధానమందు ప్రజాపరిపాలనకు, ప్రజాహితమునకు రాజరికమునకు మాత్రమే తావుకలదని తెలియుచున్నది. సఖ్యము, సహనము, సమీకరణము హైందవ రాజ్యాంగపద్ధతియొక్క ప్రధానలక్షణము లైయున్నవి. ఇందు సమత్వము, సౌభ్రాతృత్వము, స్వాతంత్ర్యము ప్రధానస్థాన మాక్రమించెననుటలో అతిశయోక్తి లేదు. అందువల్లనే క్రైస్తవులు, యూదులు, పార్శీలు ఆదిగాగల అన్నిమతములవారికి మతసహనము అరుదైన కాలమందు ఈదేశమందు సుస్వాగతము లభించెను. ఇన్ని ఆధారములున్నప్పటికిని హైందవరాజ్యాంగ విధానముయొక్క ఉత్కృష్టతనుగురించి శంకించువారనేకు లుండుట విచారకరము. ఇకనైనను భారతీయులు మేల్కొని తమ ప్రాచీన రాజ్యాంగపద్ధతియొక్క ఉత్కృష్టతను గ్రహించి సాధ్యమగునంత వఱకు ఆచరణలో పెట్టుటకై ప్రయత్నముచేయుట విధ్యుక్తధర్మము.



ఇండోనేసియాలో, స్వాతంత్ర్యోద్యమ ప్రచారము.



నేతాజీ సుభాషబోసు జాతకము

= శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు =

దేశభక్తులలో, దేశసేవకులలో, స్వార్థత్యాగులలో, సంగ్రామ వీరులలో, సాహసికాగ్రగణ్యులలో, మహారథశ్రేష్ఠులలో అగ్రతాంబూల గౌరవమునకు అత్యంతార్హుఁడుగా నేఁటికాలమున అఖిలభారత భూమిలో ఆబాలగోపాలముగ నెంచఁబడుచున్న మహనీయుఁడు శ్రీ సుభాషచంద్రబోసు. ఈ 1946 జనవరి 23 వ తేదీ అతనికి ఏఁబదవ వర్ష వర్ధంతి. ఈ కీర్తి ధనునికి దేశమందంతట ఇఁకమీఁద జరుపవలసినవి వర్ధంతులా, శ్రాద్ధములా అను విషయమున కింవదంతులు నానాముఖములుగ నున్నవి. రంగూనునగరము మిత్రమండలివారు స్వాధీనపఱచుకొన్న తరువాత ఇతని కార్యరంగములో మార్పువచ్చుట అవసరమైనది. 1945 ఆగస్టు 6వ తేదీ నాఁడు అటంబాంబు బ్రహ్మాస్త్రమును మిత్రమండలివారు ప్రయోగించి జపాను దేశమందలి 'హిరోషిమా' యను ముఖ్యపట్టణమును నేలమట్టము గావించిరని మన మెఱుఁగుదుము. ఈ కారణమున వణుకు పుట్టి జపానుచక్రవర్తి అదే ఆగస్టు 14 వ తేదీ నాఁడు శస్త్రసన్న్యాసము చేసి "జితోస్మి" అని యుద్ధము చాలించుకొన్నాఁడు. ఆకస్మికముగ యుద్ధరంగ పరిస్థితులలో నిట్లు మార్పువచ్చుటచే సుభాషచంద్రుఁడు, తరువాతి కథనుగూర్చి సంప్రతించుటకు కాఁబోలు, 17 - వ తేదీ నాఁడు సైగానునుండి టోకియోనగరమునకు ప్రయాణముచేయుచు వాయు విమాన ప్రమాదమువలన 22-వ తేదీ నాఁడు మృతినొందెనను వార్తలు పుట్టియుండుట పాఠకలోకమెఱుఁగును. విమానపాతమువలన దెబ్బలు తగిలి అతఁడు మిలిటరీ వైద్యశాలలో నుండెననియు, అతని శవమున కంత్యక్రియలు టోకియోనగరములో సగౌరవముగా జరిగినవనియు సమాచారములు ప్రకటింపఁబడినవి. కాని, సుభాషచంద్రుఁడు మరణించి యుండఁడని కొందరనిరి; ఇతఁడు మృతినొందలేదనుటే తమ నమ్మకమని మరికొందరు ప్రముఖులు తెలిపిరి; ఇట్టి మరణ మతనికి రాదని వేరుకొందఱూహించిరి. తల కొక్కమాటయైనది. వాస్తవముగ నీ భారతవీరుఁడు జీవించియే యుండి మరల మాతృభూమిలో అడుగిడు భాగ్యమే యబ్బెనేని, ఆసేతు శీతాచల పర్యంతము భారతభూమి అతని నెత్తుకొని పూలతో పూజించు ననుటలో వింతయుండదు. ఒకవేళ, ప్రమాదకారణమున కీర్తికాయుఁడై యుండిననేమి, ఆ మహావీరుఁడు నేఁటి భారత యువకుల హృదయములలో నిశ్చయముగ సజీవుఁడై యున్నాఁడే.

సుభాషచంద్రుఁడు 1897 జనవరినెల 23 వ తేదీ పగలు 12 గంటలకు 20°-38' ఉత్తరాక్షాంశలో, 5 గం. 44 ని. పూర్వ రేఖాంశలో జనించెనని బెంగుళూరు అస్ట్రాలాజికల్ మ్యాగజైనులో ప్రకటింపఁబడి

నది. * ఈ క్రింది రీతిగా నిరయన రాశి, నవాంశ కుండలులు దానిలోనే సూచించఁబడినవి:—

	ల	కు	
శు	(రాశి)		కే
ర రా బు			గు
	శ		చ

చ బు	ర		ల శు
కే	(నవాంశ)		కు
			రా
			గు శ

జన్మకాల శని మహాదశాశేషము 4 సం॥లు, 15 దినము లనియు, బోసుగారి జీవితమునందలి అనుభవ విశేషముల నాధారముగ తీసుకొని జన్మకాలమును 11-24 A. M. (L. M. T.) గా సవరించి నామనియు తత్పత్రికా సంపాదకులు సూచించిరి. ఆయుర్దాయమునుగూర్చి చర్చించుచు, శనియొక్క అష్టమస్థితి నుండియు, లగ్నముపై ప్రబల గురుదృష్టి యుండు కతంబునను, సాధారణముగ దీర్ఘాయుర్యోగ ముండినసేమి, ప్రకృతపు మహాదశానాథుఁడగు బృహస్పతి ప్రత్యక్తారాధిపతియై శనిదృష్టి కలిగియున్న కారణమున గురుమహాదశలో కుజభుక్తి ఇప్పుడు నడచుచుండుటచే ప్రమాద మున్నదని వారు అభిప్రాయపడిరి. చతుర్థాధిపతి యగు చంద్రుని షష్ఠస్థితి, శని అష్టమస్థితి - ఇవి వాహన ప్రమాదమువలని మరణమును సూచించు నను సూత్రములను వారు ఆధారముగ తీసుకొని పైయర్థము సాధించిరి.

ఇది యిట్లుండఁ, కలకత్తానగరములో ప్రకటింపఁబడు 'వంగదూత' యను బంగాళీ పత్రికయొక్క పూజా సంచికలో బాబు శంభుసేన్‌గుప్త యను హోరతంత్రజ్ఞుఁడు సుభాష చంద్రుని జన్మకాలము పగలు 12 గంటల 13 నిమిషములని జాతకుఁడే తనకు స్వయముగ తెలిపెననియు, ఆ కాలమును 12 గం. 15 ని.గ తాను శోధనపద్ధతుల ననుసరించినాననియు వ్రాసి ఈక్రింది విధముగ అత్యాశ్చర్యకరమగు జాతక ఫలములను ప్రకటించెనని తెలియుచున్నది. †

“1945 ఆగస్టు 27 వ తేదీకి ముందునాఁడు తా నెందుండెనో, ఆస్థలమునకు 600 మైళ్ల దూరములో నున్న కొండలలోని రహస్య ప్రదేశములకు సుభాషచంద్రుఁడు వెళ్లినాఁడు. అతని మిత్రులైదుగురు అతనివెంట నున్నారు. ఏ గూఢచారులుగాని, ఎంత ప్రయాసపడినా, 1945 డిశంబరు 19 వ తేదీకి పూర్వము సుభాషచంద్రుని పొలకువ తీయఁజాలరు. ఆతరువాత అతఁడు పట్టుబడవచ్చును. 1946 జనవరిలో అతఁడు హిందూదేశమునకు వచ్చుట సాధ్యమనిపించు యోగమున్నది. ఆకాలములో అతఁడు రాఁడయ్యేని, తరువాత మార్చి 23 నుండి ఏప్రిలు 28 వ తేదీలోఁగా అతఁడు హిందూదేశమునకు ఖండితముగ మరలిరాఁగలఁడు. 1947-వ సంవత్సరమున భారతదేశమునకు 'పూర్ణస్వాధీనత' రాఁగలదు. నా వ్రాఁతలో ప్రత్యక్షరము ఫలించఁగలదని పాఠకమహాశయులు చూడఁగలరు. సుభాషచంద్రుఁడు స్వతంత్రభారతదేశమునకు అధ్యక్షుఁడుగా నెన్నుకోఁబడును.”

* 1945 అక్టోబరు సంచిక చూడుఁడు.

† అదే పత్రిక 1946 జనవరి వార్షిక సంచిక చూడుఁడు.

ఈ ఫలితముల నిట్లు ఘంటాఘోషముగ బహిరంగముగ చాటిచెప్పుటకు చాలినన్ని ప్రబలకారణములు 'వంగదూత'యందలి వ్యాసములో ఆ కార్తాంతికుఁడు విశదీకరించియుండనోపును. ఆ వ్యాసమందలి కొన్ని భాగములుమాత్రమే అష్ట్రాలాజికల్ మ్యాగజైనులో పరివర్తింపఁబడి ప్రకటింపఁబడుటచే, ఆ యోగము లెట్టివో మన మిపుడు తెలుసుకొనలేక యున్నాము. ఎట్లయిననేమి, 'వంగదూత'యందు ప్రకటింపఁబడిన జాతకఫలితములు భారతయువకులకు ఆశాజనకములుగ నున్నవి.

ఇట్లుండఁగా, మొన్న—అనఁగా, గడచిన జనవరి 23-వ తేదీన సుభాషచంద్రుని వర్ధంతి మహోత్సవము జరుపు సందర్భమున, మధురానగరములో శ్రీ ఎస్. ఎ. అయ్యరు చేసిన ఉపన్యాసము నైరాశ్యమును సూచించుచుండుట విషాదకరము. ఇతఁడు నేతాజీ సుభాషచంద్రుని రాజ్యాంగమున ప్రకటనశాఖామంత్రిగ 'ఆజాద్ హింద్' సేనకు చేరి పనిచేసివచ్చిన యధికారి. సైగానునగరములో 1945 ఆగస్టు 17-వ తేదీనాఁడు సుభాషచంద్రుని వాయువిమానము విమానాశ్రయమునుండి పైకెగిరినపుడు ఇతఁడు ప్రత్యక్షముగ అపుడుండి చూచినవాఁడఁట. ఆ విమానములో సుభాషచంద్రునితోకూడ ప్రయాణముచేసినవారిలో కర్నల్ 'హబిబుల్ రహిమాన్' అను సుప్రసిద్ధుఁడగు ఆజాదు హిందుఫౌజుసేనాపతి యొక్కఁడేనఁట భారతీయుఁడు. అయ్యరుగారు మరల కర్నల్ రహిమానును చూడఁగలుగుట టోకియోనగరములో 1945 సెప్టెంబరు 8-వ తేదీనాఁడే. అపుడే కర్నల్ హబిబుల్ రహిమాన్ సుభాషచంద్రుని మృతినిగూర్చి విశ్వసనీయమగు సమాచారమును అయ్యరుగారికి తెలియఁజేయుట!

ఇండోచైనాలో తైవాన్‌లో తైహోకు అను పట్టణమున 1945 ఆగస్టు 18-వ తేదీనాఁడు—అనఁగా సైగాను విడిచిన మరుసటిదినమే—పగలు 2 గం.ల కాలమున సుభాషచంద్రుని వాయువిమానము విమానాశ్రయమునుండి ఆకాశమార్గమున ప్రయాణము నారంభించెనఁట. తరువాత రెండుమూఁడునిమిషముల కాలమునకే, ఫిరంగిగుండు ప్రేలినపుడువలె, గొప్ప శబ్ద మొకటి వినవచ్చినది. ఆ విమానముయొక్క ప్రొపెల్లరుయంత్రములలో నొకటి ఆకస్మికముగ పగిలిపోవుటచే విమానము సక్రమప్రయాణము చేయఁజాలక తలక్రిందులు కాఁజొచ్చెనఁట. ఎంత ప్రయాసపడినా, విమానచోదకుఁడు ఆ విమానమును స్వాధీనములో నిలుపుకొనుటకు సాధ్యమైనదికాదు. తరువాత రెండునిమిషములకే విమానము దభాలున నేలపై కూలెనఁట! విమానములో పెట్రోలు నూనె యుంచిన పేటిక పటాపంచలగుటచే విమానములో నున్నవారందరిపైనను పెట్రోలునూనె చిట్లినది. వెంటనే విమానమున కగ్ని అంటుకొనఁగా, అతికష్టములో సుభాషచంద్రుఁడు నేలకు దుమికినాఁడు. అతఁడు ధరించిన యుడుపులు పెట్రోలునూనెతో తడిసియుండినకారణమున అగ్ని అంటుకొని, దేహము కాలి, అతఁడు గొప్ప అపాయమునపాలైనాఁడు. రహిమాను ఉన్నిగుడ్డలు ధరించియుండిన కారణమువలన, అదృష్టవశమున అతనిపై పెట్రోలునూనె హెచ్చుగా పడకుండుటవలనను అతఁడు గొప్ప అపాయమునపాలుగాక తప్పించుకొనఁగలిగెను. తోడనున్నవారిలో ఇద్దరు ముగ్గురు జపానీయు లాక్షణమే యమలోకము చేరుకొనిరఁట! 15 నిమిషములలోనే అంబులెన్సు మోటారులు వచ్చి సుభాషచంద్రుని నొక సైనికవైద్యశాలకు కొనిపోయినవి. ఆత్రములో జరుగవలసిన చికిత్సాకలాపమంతయు సక్రమముగ జరిగినది. కాని, భారతభూమియభాగ్యవశమున నాఁటి రాత్రి 9 గం. లకు నేతాజీసుభాషచంద్రుఁడు ఇహలోకయాత్ర చాలించి కీర్తిశేషుఁడయ్యెనఁట.

ఈ విషాదకథ యంతయు సేనాపతి రహిమాను నుండి తాను వినఁగలిగినదని చెప్పి శ్రీ అయ్యరు తన ప్రభువును స్మరించి, తలమునకలుగా పొంగివచ్చుచున్న దుఃఖవేగమున రుద్ధకంఠుఁడై అశ్రువులు రాల్చుచు కొంతకాల ముపన్యాసమధ్యమున స్తబ్ధుఁడై మాటలాడు శక్తినే కోల్పోయెనఁట! అయ్యరుగారు చెప్పిన కథ విశ్వసింపకుండు టెట్లు? ఇంతటితో ఆశలు అడుగంటవలసినదేకదా?

ఇది యిట్లుండ, శ్రీ అయ్యరు పై విషాదగాథను బహిరంగసభలో తెలిపిననాఁడే (23–1–1946)

అమెరికాదేశమందలి వాషింగ్టనునగరమందున్న తమ ప్రత్యేకవిలేఖరినుండి వచ్చిన వార్తయని ఒక దినపత్రిక యీ క్రిందివాక్యమును ప్రకటించినది:

"శ్రీ బోసు సోవియట్ రష్యాలో, బహుశః మాస్కోలో, ఇపుడు దాగియున్నాడనే విశ్వాసాన్ని యిచటి రాజకీయవర్గాలవారు వెలిబుచ్చినారు."

ఈ రాజకీయవర్గాలవా రెవరో, వారికీ నమ్మకము వచ్చుటకు కారణము లెట్టివో మనకు తెలియదు. ఇట్టి పరస్పరవిరుద్ధవార్తలలో ఏ గుహాంతరమున సత్యము దాగుకొనియున్నదో ఊహించుట దుస్సాధ్యము. 5, 6 సంవత్సరములుగా నేఁడు విన్న సమాచారమునకు రేపు విరుద్ధముగ, రేపు వచ్చిన వార్తకు ఆమరుదినము వ్యత్యస్తముగ యుద్ధవార్తలను వినుచున్న మనకు ప్రకృతవిషయమునకు సంబంధించిన పరస్పరవిరుద్ధ వార్తలునయితము యుద్ధకాలపు రాజనీతికి లోఁబడిన వేనా యని శంకించుట కవకాశము లేకపోలేదు. ఎట్లాయిననేమి, అన్ని దేశములందును రాజకీయవర్గముల వారు సుభాషచంద్రుని విషయమున సత్య మెఱుఁగుటకై ప్రయత్నించుచున్నారనియు, అట్టి ప్రయత్నముల కవకాశమిచ్చు సందర్భము లున్నవని వారు గుర్తించియున్నారనియు మాత్రము మనము నిస్సందేహముగ నమ్మవచ్చును. అది యట్లుండె.

ఆస్ట్రాలాజికల్ మ్యాగజైను సంపాదకులకు తా ముపయోగించిన జన్మకాలము నికరమైనదను నమ్మకము లేదు.* కనుక 'వంగదూత'లో ప్రకటితమైన దను కాలమునే ఆధారముగ కొని సుభాషచంద్రుని సాయన జాతకకుండలి గుణింపఁబడినది. ఈ ప్రక్కనున్నదే ఆచక్రము.

కు 18-43		I 15-45	కు 11-54 ఇ 17-50 (వ)
రా 15-55 X 4-30 ర 3-35 బు 2-4(వ)	నేతాజీ జాతకము [సాయనము]		
ప్ర.స. 12-2			కే 15-55
	వ 28-22 శ 29-4		గు8-56(వ) చ 29-52

ఈ సాయనకుండలిలో సులభముగ గోచరించు ప్రధానయోగవిశేషము లివి:—

1. వృషభరాశిలో వర్గోత్తమాంశ లగ్నము. శ్రీపతిమతము ననుసరించి లగ్నముపై రవి, బుధ, గురు, శని, వరుణుల దృష్టి కలదు. ఇది రాజయోగము.

2. విక్రమస్థానాధిపతియై కన్యారాశిలో వర్గోత్తమాంశలో నున్న చంద్రుఁడు శ్రీపతిమతము ననుసరించి రవి, బుధ, శుక్ర, కుజేంద్రుల దృష్టిని పొంది రాజయోగప్రదుఁ డైనాఁడు. పాశ్చాత్యమతాను సారముగ చూచినచో, ఈచంద్రునిపై రవి, బుధ, శుక్ర, శని, వరుణుల దృష్టి రాఁగలదు. ఎట్లయినను ఇది రాజయోగమే.

"వర్గోత్తమగతే లగ్నే చంద్రేవా చంద్రవర్జితైః,
చతురాద్యైః గ్రహైః దృష్టాః నృపా ద్వావింశతి
స్మృతాః", (బృహజ్జాతకము)

3. లగ్నాధిపతియగు శుక్రుఁడు మీనరాశిలో గురుక్షేత్రమందు, గురునవాంశలో ఉచ్చగతుఁడై లాభ భావమం దున్నాఁడు. లగ్నాధిపతి కీయోగము ఔన్నత్యస్థితిని చూపఁజాలినది.

4. దశమకేంద్రముఖ్యమున సుఖ, పంచమాధిపతులై యోగకారకులగు రవి, బుధులు శని కుజ వరుణుల శుభదృష్టి కలిగి ప్రకాశించుచున్నారు. మఱియు దశమభావమం దున్న రాహువుసయితము వర్గోత్తమాంశనే ఆశ్రయించినాఁడు.

5. ధర్మకర్మాధిపతియై, రాజయోగకారకుఁడైన శని అపారశక్తిసామర్థ్యముల కాటపట్టగు వరుణ గ్రహముతో సంయోగము నంది యోగకారకులగు చంద్ర, రవి, బుధులనుండి అర్ధకోణమిత్రదృష్టి నార్జించి రాజయోగపు విలువ కుత్తేజన మిచ్చుచున్నాఁడు.

* 1945 అక్టోబరు సంచిక 892-వ పుటలో సంపాదకుల సూచికను చూడుఁడు.

6. పుణ్యసహమబిందువు భాగ్య భావములో రాజయోగప్రదుఁడగు శనియొక్క యాజమాన్యములో నుండి లగ్నాధిపతియగు శుక్రునితో, లాభాధిపతియగు గురువుతో మిత్రదృష్టిని సంపాదించినది. రాజయోగ ప్రదమగు పూర్వపుణ్యము పరదేశములలోనే ప్రాముఖ్యమునకు వచ్చునని సూచింపఁజాలిన యోగ మిది.

సుభాష చంద్రుని జాతకమందలి ఈ యోగము లతనిని నాయకునిగా, సేనాధిపతిగా, స్వయంపట్టాభిషిక్తుఁడగు ప్రభువుగా చేయఁజాలినవో, కావో హోరాతంత్రవేత్తలే ప్రమాణము. కేవల నిరయన రాశి కుండలిలో చూపఁదగిన సామాన్యకారణముల కన్న పయి యోగములు ప్రబలములని సులభముగ పాఠక మహాశయులే యూహింపఁగలరు. ప్రకృత మింత చాలును.

జన్మకాలము 11-24 A. M. (L. M. T.)గా గుణించినచో, దశమ కేంద్రము మకరరాశిలో 22½ భాగకు వచ్చును. అపుడు రాహువు దశమ కేంద్రములో నుండనే ఉండఁడు. రవి బుధులు రాజ్యస్థాన బిందువునకు 10 భాగల దూరములో నుండుటచే మంచి ఫలము నియ్యఁజాలరు. ఇట్టి గ్రహస్థితి కంటె 'వంగ దూతలో' నుపయోగించఁబడిన 0-15 P. M. (L. M. T.) కాలమే జీవితమునకు హెచ్చుగా తగియున్న దనవచ్చును. జాతకుని జీవితమున ప్రధాన ఘట్టములు సంభవించిన నికరపు దినములు తెలియని కారణమున ప్రకృత మింతకంటె హెచ్చుగా చర్చించుటకు సాధ్యముకాదు. రాహుదశారంభములో ఆధ్యాత్మికజ్ఞానము నాశించి జాతకుఁడు ఇల్లు వెడలి పోయెననియు, రాహుదశా శనిభుక్తిలో ఇంగ్లాండునకు ప్రయాణము చేసెననియు, రాహుదశా బుధభుక్తిలో ప్రప్రథమమున రాజుగారి యతిథి యయ్యెననియు, గురుదశా బుధభుక్తిలో ఇండియన్ సేవనలు కాంగ్రెస్సున కధ్యక్షుఁడయ్యెననియు మొదలుగ కొన్ని వివరములు అస్ట్రొలాజికల్ మ్యాగజైలో వ్రాయఁబడినవి. కాని, ఈదశాభుక్తులు నెలల కొలఁదిగా ప్రచారములో నుండు కారణమున మన అక్కఱకు కివి యంతగా పనికిరావు. అనఁగా దైనిక జాతకములను గుణించి లగ్నకాలము శుద్ధముచేయుట కివి చాలవనుట.

పోనిండు! జాతకుఁడు ప్రమాదముపాలయ్యెనని మన కిపుడు తెలియవచ్చిన 18-8-1945 నాటి గ్రహస్థితి యీ క్రింది కుండలి చూపఁగలదు. నాఁడు పగలు రెండు గంటలకు విమానము వెడలినదనియు, తరువాత 5 నిమిషములలో అది క్రింద కూలి ప్రమాదముపాలయ్యెననియు చెప్పియుండుటచే 2-5 P. M. (L. M. T.) కాలమునకే ఈ కుండలి సాధింపఁబడినది:—

			వ 16-56 కు 17-10
	నేతాజీ	విమాన ప్రమాదకాలము [సాయనము]	రా 6-40 శు 15-43 శ 19-41
కే 6-40			ర 24-58 బు 29-14 (వ)
I ను 0 చ 20-10		ఇ 4-43	X 27-0 గు 28-38

లగ్నములో అష్టమాధిపతియగు చంద్రుఁ డుదయించుచు అరిష్టము సూచించుచున్నాఁడు. జాతకమున అష్టమస్థానాధిపతి యగు గురువే యిపుడు లగ్నాధిపతియై, తాత్కాలిక దశమకేంద్రములో ఉద్యోగస్థానములో నుండుట గమనింపఁదగియున్నది. జన్మలగ్నాధిపతియగు శుక్రుఁడు తాత్కాలికముగ శనితో చేరి అష్టమస్థానమందే కూర్చున్నాఁడు. సప్తమకేంద్రములో నుండి ప్రమాదసూచకమగు కుజ, వరుణ సంయోగము లగ్నమును వేధించుచున్నది. ఈ కుజ, వరుణ సంయోగము జన్మకాలమందలి ఇంద్ర గ్రహస్థానముంకే సంభవించుట దైయక్తికముగ గొప్ప విశేషము. ఇంద్ర, కుజ, వరుణ సంయోగము అగ్నిప్రమాదమును తెలుపఁజాలిన దందురు. జన్మలగ్నాధిపతియగు శుక్రుని నుండి యీ యోగము సుప్తవైరదృష్టిలో నుండుటచే ప్రమాదవశ

మున జాతకునికి కాయక్లేశము రాఁగల సంభవమున్నది. ప్రయాణ కారకుఁడగు బుధుని తాత్కాలికస్థానము జన్మకాలీన శని వరుణులకు పూర్ణకేంద్రవేధా స్థానమగుటచే విమానప్రయాణమువలని ప్రమాదము కానరావచ్చును. ఇవన్నియు అయ్యరుగారి కథకు అనుకూల పరిస్థితులనే చూపుచున్నవి.

కాని, పైయోగము లన్నియు దైనికచారమునకు సంబంధించినవి. దశాపరిపాకము చెడియుండినచే తప్ప దైనిక చారము పూర్ణఫలము నియ్యఁజాలదు. కావున, దేవమాన దశయందలి గ్రహస్థితు లేమనుచున్నవో చూతము. ఈ క్రింది కుండలి సుభాష చంద్రుని *జాతకమునకు ప్రకృతకాలపు చలితగ్రహస్థితిని చూపఁగలదు:—

X 23-30 ర 23-11 బు 6-13		శు 6-48	ఇ 17-42 కు 26-12
రా12-56	ప్రమాదకాలమునకు చలిత గ్రహకుండలి [సాయనము]		I 3-30 చ 6-0
			కే 12-56
శ 0-46(వ)	వ 29-0		గు 3-0

ప్రమాదము జరిగిన వయసునకు ప్రధాన దశాయోగము లివి:—

1. చలితబుధ, చలితశుక్రులకు అర్ధకోణ పరస్పర మిత్రదృష్టి వచ్చినది. ఇది ప్రయాణ విషయములలో సౌఖ్యము, సౌకర్యము, సాహాయ్య సంపత్తి, ఉత్సాహము వీనిని తెలుపఁజాలినది.

2. చలితపుణ్యసహమము శయితము చలిత బుధ సంయోగమునకే వచ్చి పైఫలముల కుత్తేజన మియ్యఁగలదు.

3. చలితలగ్నము చలితగురువుతో అర్ధకోణ మిత్రదృష్టి నందుచున్నది. గురువునకు అష్టమాధిపత్య దోష ముండుట సత్యమేకాని, అతని దృష్టి చలిత లగ్నముపై నన్నపుడు ఇట్టి ఘోరవిపత్తు సామాన్యముగ సంభవించుట కష్టము.

4. 1945 ఆగస్టునెలకు చలితచంద్రుఁడు కర్కాటక రాశిలో 6-7 భాగలలోనుండి చలితబుధ, చలితశుక్రులతో నిండు స్నేహదృష్టితో నుండుటే కాక, గురువునుండి మిత్రదృష్టి నయితము సంపాదించినాఁడు.

పై యోగములలో నేదియైనను ప్రమాదమువలన అకాలమరణము సూచించునది కానరాదు. మఱియు, ఉదయరవిశశాంక లనఁబడు ఆయువుపట్లు మూఁడును దేవమానదశలో వేధపాలుకానిదే సామాన్యముగ మరణము కల్గుట అసంభవము. లగ్నమును స్థూలదేహమనియు, చంద్రుని సూక్ష్మదేహ మనియు, రవిని ఆత్మయనియు వ్యవహరించుట జ్యోతిషసంప్రదాయమని గమనించినచో పై యర్థము సుబోధమగును. చలితకుండలిలో రవిచంద్రుల కిపుడు వేధయే లేదు. ఉపయోగించిన జన్మకాలము సత్యమైనచో, చలిత లగ్నముకూడ చెడుట కవకాశ ముండదు. ఇట్టి పరిస్థితులలో జాతకుఁడు అకాలమృత్యువువాతఁబడినా డనుట సాహసకార్య మగును.

ఫలిత మేమనఁగా, 18-8-1945 నాఁడు విమాన ప్రమాదము జరిగియుండుట సత్యముకావచ్చును. నాఁటి దైనికగ్రహస్థితి దీనికి నిదర్శనము. కాని, చలితగ్రహస్థితిమాత్రము అకాలమరణమును సూచించలేకున్నది. పైఁగా, మంచి దశాపరిణామమునే అది తెలుపఁగలదు. విమానప్రమాదమువలన నాకస్మికముగ కొంత క్లేశ మనుభవించి జాతకుఁడు గండము గడచుకొనియుండును. తాత్కాలికముగ తగిన సాహాయ్యసంపత్తి లభించుటచే ఆత్మసంరక్షణార్థమై "జీవన్ భద్రాణి పశ్యతి" యను న్యాయము ననుసరించి అతఁ డెందైనను రహస్య స్థలమున దాఁగియుండెనేని, అది యుద్ధనీతిసంప్రదాయమునకు విరుద్ధముండదు. సైనిక వైద్యశాల చేర్చినతరువాత సుభాషచంద్రుని చూచుట

కెవ్వరికిఁగాని జపానువారు అవకాశ మియ్యలేదని వార్తాపత్రికలలో ఎప్పుడో చూచినట్లు జ్ఞప్తియందున్నది. ఇది వాస్తవమైనచో నాటకములో నిది యొక రంగము కావచ్చును. నేతాజీ శవమునకు సైనికమర్యాదలతో అంత్య సంస్కారక్రియలు జరుపుట మున్నగునవి నయితే మానాటకములోని యితర రంగములుగా పరిణమించవచ్చును. అప్పటి పరిస్థితులలో అతఁడితరుల కంటఁబడకుండ ఎట్లు పోఁగలఁడను ప్రశ్నకు అతఁడింతకుమును పొకసారి ఉన్నట్లుండి ఇంటిలో నే మహాద్భుతముగ మాయమైన కథయే తగిన ప్రత్యుత్తర మీఁగలదు. ఏపుట్టలో ఏపామున్నదో భగవంతుని కెఱుక. మిత్రమండలివారి బ్రహ్మాస్త్ర ప్రయోగమునకు భయపడి "జితోస్మి" యన్న జపానుప్రభువు అప్పుడు తానున్న క్లిష్ట పరిస్థితులలో సుభాష చంద్రుని కట్టి సహాయము చేయుటకు సాహసించునా? చెప్పుట కష్టము. మఱి, "ఎందరో మహానుభావులు!"

మహా ప్రబలశుభగ్రహమై లాభస్థానమందున్న లగ్నాధిపతియగుశుక్రునికి ఇంద్రగ్రహకేంద్రదృష్టి యుండుట గమనించితిమేని, జాతకుని కార్యములలో కొంత ఇంద్రజాలప్రభావ ముండునవుట స్పష్టముకాఁగలదు. ఇట్టి ఇంద్రుఁడు 18-8-'45 నాఁడు జన్మకాలపు దశమకేంద్రమునకుమాత్ర మేకాక, అందున్న యోగప్రదులగు రవిబుధులకునయితము నిండుమిత్రదృష్టిలో నుండెననుట చదువరులు గుర్తింపఁగలరు. ఈ అకాల మరణ వార్తలోనయితము ఇంద్రుని కైవాట మేల కలిసి యుండరాదు ?

ఈదృష్టితో చూచినయెడల 'వంగదూత'లో నూచించఁబడిన ఫలములలో కొంతదైన సత్య ముండు నేమోయని తోఁచును. అనఁగా, భావిఫలములకు తేదీలను నిర్ణయించిన విషయ మట్లుంచి సామాన్యఫలమును మాత్రము స్వీకరించవచ్చునను. జనవరినెలలో సుభాష చంద్రుఁడు మరల హిందూస్థానమునకు వచ్చు సంభవమున్నదనుమాట ఇప్పటికట్లుంతము. మార్చి ఏప్రిలు ఫలములకై వేచియుందముగాక !

చెప్పవచ్చిన దేమనఁగా, 'వంగదూత'లో వ్రాయఁబడిన జన్మకాలమే సత్యమైనచో, సుభాష చంద్రుఁడు జీవించియుండునని యూహించుట తప్పు కాదు. అతని జీవితములో నడచిన ముఖ్యఘట్టములకు సంబంధించిన నికరపు దినము లివి యని తగినంత సామగ్రి మనకు లభించుదాఁక మన యింతటితో తృప్తి నొందుదముగాక. అతని రాజనీతి నంగీకరించకపోయినను, అతని ఆదర్శములు తృప్తికరము కాకున్నను, అతని కార్యపద్ధతు లరుచికరములైనను, సుభాష చంద్రుఁ డింకను కొంతకాలము జీవించి మాతృభూమిని కొలువఁదగిన మహనీయుఁడనుట కెవరుగాని వెనుదీయ నవసర ముండదు. దేశభక్తులగు నాయకు లెందరుండినా, సుభాష చంద్రుఁడు లేని లోపము మాత్రము భారతభూమికి చాల గొప్పది.

" నక్షత్ర తారా గ్రహ సంకులాపి
జ్యోతిష్మతీ చంద్రమసైవ రాత్రిః ".

—కాళిదాసు.



అస్తి - నాస్తి

— శ్రీ గొట్టుముక్కల రామకృష్ణశాస్త్రి —

కనులన్ మూసి తదేకదీక్షఁగ భవత్కల్యాణరూపైకభా
వనతో నెన్నిదినంబు లీడ్చితిని దేవా! నేఁటికిన్ విశ్వమో
హనలీలాత్మక తావకీనశుభదివ్యాకారమాధుర్యసం
జనితానందమయానుభూతికయి నోచన్ లేదె నా నేత్రముల్?

మందల్ మందలుగాఁగ ప్రాణుల సృజింపన్ గారణం బేమి? యా
పందల్ జ్ఞానవిహీనులై కుమిలి యేడ్వన్ జూచి లోలోన నీ
మందస్మేరము లేమి? బోధపడ దీమార్గంబు - యుష్మద్రజ
స్సందర్భమ్ముల మమ్ము దింపిన తటస్థత్వంబు నీకే తగున్.

నిను ప్రశ్నించుట గాదుగాని యిటు లుండెన్ వందలున్ వేలుగా
ననుమానంబులు నిన్నుఁగూర్చి పరమేశా! వానిఁ బోకార్చి న
న్ననుకంపింపకయున్న, నాయెడఁద దివ్యజ్ఞానరేఖాంకురం
బనుకల్పింపకయున్న రిత్తలుగదయ్యా నీకృపాసింధువుల్.

కంటికిఁ గానరాని మొనగాఁడవు గావున దేవదేవ! నీ
వుంటి వటంచు, లేవనుచు నున్నవి తర్కము - లెట్టిలోకమం
దుంటివొ? మానిచిత్తముల నుంటివొ? నిశ్చలయోగదీక్షలో
నుంటివొ? ప్రేమదీక్షఁ బడియుంటివొ? నాప్రభు! లేవు నాయెడన్.

అంతర్జాతీయ వ్యాపారమహాసభ, భారతదేశము

★

= శ్రీ కె. సన్యాసయ్య =

అంతర్జాతీయ వ్యాపార మహాసభ ఈ సంవత్సరము మార్చిలో జరుగవలసినది. కాని కారణాంతరములచే జూలై సమీపమున జరుగవచ్చును. ఈలోపుననే బ్రిటిష్‌సామ్రాజ్యములోని దేశములన్నియు ఆర్థిక వ్యాపారసమస్యలను చర్చించుటకు సమావేశము కానున్నవి. ఈ రెండు సభలయందును భారతదేశము ప్రముఖపాత్రను వహించవలసియున్నది.

మొన్ననే యుద్ధము సమాప్తమైనది. దేశ దేశములు యుద్ధసమయమందలి సంక్లిష్టఆర్థిక విధానములోని విధినిషేధములను సడలించి శాంతిమయమైన ఆర్థిక ప్రణాళిక ననుసరించి పునర్నిర్మాణమును అన్వేషించుచున్నవి. గత సంగ్రామము ప్రపంచమందు రాజకీయ పరిణామముతో బాటు గొప్ప ఆర్థికవిపరిణామమును గూడ తెచ్చిపెట్టినది. యుద్ధమునకు పూర్వపు ఇంగ్లాండుస్థితికిని, యుద్ధానంతరపు ఇంగ్లండు ఆర్థికస్థితికిని పోలిక లేదు.

యుద్ధపరిస్థితులవలన అంతర్జాతీయ వ్యాపారము స్తంభించినది. ఇంగ్లండు విదేశములకు ఎగుమతిచేయ లేకపోయినది. సామ్రాజ్యమును బంధించిన 'సువర్ణ శృంఖలములు' సడలిపోయినవి. ఋణగ్రస్తములైన ఇతర దేశములు తమ అప్పులను తీర్చివేయుటయే కాక, పెద్ద పెద్ద మొత్తములను ఇంగ్లండునకు తిరిగి అప్పనిచ్చినవి. ఇతర దేశములు తమకు కావలసిన సరకులను కొన్ని తయారుచేసికొనినవి; లేదా తదితర దేశముల నుండి దిగుమతిచేసికొనుటకు ప్రయత్నించినవి. ఇంగ్లండు యుద్ధమునకు పూర్వము నాటి ఆర్థికౌన్నత్యమును పునఃప్రతిష్ఠించుట దుష్కరము. అయినను, విదేశవ్యాపారమును కొంతవరకు తిరిగి సంపాదించుటకు ప్రయత్నించుచున్నది.

ఈయుద్ధమువలన అమెరికా ఆర్థికౌన్నత్యము స్థిరపడినది. ప్రపంచములో ఆర్థికరాజధాని లండనునుండి న్యూయార్కునకు తరలివెళ్లినది. యుద్ధకాలములో చితికిపోయిన దేశమును, జాతీయజీవనమును పునరుద్ధరించుకొనుటకును, కర్మాగారములను యథాపూర్వముగా నెలకొల్పుకొనుటకును, గృహనిర్మాణాద్యవసరములకును ఇంగ్లండు అమెరికాసహాయ మపేక్షించినది. ఉత్పత్తి అయిన పదార్థములను ఇంగ్లండునకు విక్రయించుటకు అమెరికా సంసిద్ధమైనను ఇంగ్లండు కొనగల స్థితిలో లేదు. కాబట్టి అమెరికా ఇంగ్లండునకు ౩,౭౦౦ మిలియన్ డాలర్లు అప్పుపెట్టినది. దీనివలన అమెరికాసరకులను ఇంగ్లండునకును, తద్వారా సామ్రాజ్యములోని ఇతర దేశములకును సరఫరా చేయుటకు వీలైనది. యుద్ధానంతరము జరుగు మార్పులు అమెరికావ్యాపారమును నిరోధించకూడదనియు, స్వేచ్ఛావ్యాపారమును (Free Trade) అన్ని దేశములును సాగించవలెననియు అమెరికా అప్పునిచ్చుటకు షరతుగా విధించియున్నది. ఈ విధానమునకు అట్లాంటిక్ ఛార్టరు నాలుగవసూత్రము, పరస్పరసహాయ నిర్ణయము (Mutual Aid Agreement) లోని ఏడవ సూత్రమును భిత్తులు నాటేయున్నవి.

భారతదేశము ఈసభలలో విదేశవ్యాపార విషయమై ఏవైఖరిని అవలంబించవలెను?

భారతదేశాభివృద్ధికి పరిశ్రమాభివృద్ధి అత్యంతావశ్యకమని అధునాతన ఆర్థికవేత్తల ఏకాభిప్రాయము. అనిన గృహపరిశ్రమలకు తావులేదని కాదు. భారతదేశార్థిక విధానములో యంత్రపరిశ్రమలకును, గృహపరిశ్రమలకును పోటీ ఉండనక్కరలేదు. ఒకదాని కొకటి అనుబంధములుగా నుండవచ్చును. మన దేశములో వ్యవసాయము ముఖ్యవృత్తి నిజమే. కాని దినదినాభివృద్ధినందుచున్న జనసంఖ్య క్రొత్త క్రొత్త సమస్యలను కల్పించుచున్నది. భారతదేశములో దరిద్రనారాయణుల జీవితసౌభాగ్యము వృద్ధిపొందవలెనన్న పరిశ్రమాభివృద్ధి, అధికోత్పత్తి అవశ్యము వాంఛనీయము. కేవలము పరిశ్రమాభివృద్ధి మాత్రమే దేశమందలి బీదరికమును నశింపజేయగలదనుకొనుట పొరపాటు. సరియగు విభజనవిధానము (System of distribution) ఉండవలెను. లేనియెడల దేశములో సగటు ఆదాయము పెరిగినను, దేశమందెక్కువ మంది దారిద్ర్యము ననుభవింపవలసివచ్చును. ఇంతవరకు మన దేశము ముడిపదార్థములను ఎగుమతి చేసి, తయారైన సరకులను దిగుమతి చేసికొనుచున్నది. ఇది దేశములో ఆర్థికసౌభాగ్యమునకు తీరని నష్టము కలిగించుచున్నదనుట సువిదితము.

ప్రథమప్రపంచ సంగ్రామమునకు పూర్వము పరిశ్రమలు నెలకొల్పుటకును, వానిని జయప్రదముగ కొనసాగించుటకును ప్రభుత్వ మవలంబించిన స్వేచ్ఛావ్యాపారసిద్ధాంతము ముఖ్యప్రతిబంధకముగా నుండెను. ౧౯౨౩ లో Indian Fiscal Commission వారు చేసిన సూచనలను భారతప్రభుత్వము అంగీకరించి పరిశ్రమలకు యథోచితరక్షణ (Discriminating Protection) ఇచ్చుటకు నిశ్చయించినది. రక్షణలను ఆపేక్షించు ప్రతిపరిశ్రమయు కొన్ని సదుపాయములు కలిగియుండవలెను. ఈ రక్షణవిధాన ఫలితముగ పరిశ్రమాభివృద్ధికి కొంతవరకైనను దోహదము కలిగినది. ఉక్కు - ఇనుము, బట్టలనేత, పంచదార, అగ్గిపెట్టెలు, కాగితము మొదలగు పరిశ్రమలు విశేషాభివృద్ధి పొందినవి.

ద్వితీయ ప్రపంచసంగ్రామము మరింత మేలును కలిగించినది. ఇతరదేశము లన్నియు యుద్ధపరికరములను తయారుచేయుటలో నిమగ్నములైనందున దిగుమతులు పూర్తిగా ఆగిపోయినవి. మరియొకవంక సైన్యావసరములకు కొనుబడి హెచ్చయినది. చలామణిలోని నోట్లసంఖ్య అయిదారురెట్లు పెరిగినది. దీని వలనకూడ సరకులకొనుబడి హెచ్చినది. ఈకాలమునందు ఇంగ్లండునకు బాకీయున్న అప్పు తీరిపోవుటయేకాక సుమారు ౧౧౦౦ మిలియనుల పౌనులు బ్రిటీను ఇండియాకు బాకీపడినది. ఈకారణముల వలన పరిశ్రమలు తాత్కాలికముగా అభివృద్ధినందినవి. యుద్ధకాలమునందు కలిగిన ఈపరిశ్రమాభ్యుదయము మాయమైపోకుండ చూచుకొనుట మిక్కిలి అవసరము.

కాని దురదృష్టవశాత్తు భారతదేశము స్వతంత్రవైఖరిని అవలంబించుటకు వీలులేదు. ఆర్థికవిషయములపట్ల బ్రిటిష్‌ప్రభుత్వమువారు, బ్రిటిష్ పెట్టుబడిదారులు నిర్ణయించిన మార్గముననే- వలసదేశముగుటచే- భారతదేశము అవలంబించవలసియున్నది. అయినను, మన దేశమునకు ఏమార్గము శ్రేయోదాయకమో చర్చించుట ముఖ్యావసరము. జాతీయప్రభుత్వము నేర్పరుచుటకు సమాలోచనలు జరుగుచున్న ఈకాలములో ఇట్టిచర్చ మరింత అవసరము.

ఆర్థికవ్యాపార సమస్యలన్నియు అన్యోన్యాశ్రయములు. ఏసమస్యనైనను విడదీసి ఏకదేశముగా పరిష్కరించుటకు వీలులేదు. మొన్న ప్రభుత్వమువారు ఒక టారిఫ్‌బోర్డును నిర్మించినారు. ఈబోర్డువారు యుద్ధకాలములో యుద్ధకృషికి కొంతవరకు సహాయముచేసిన కొన్ని పరిశ్రమలకు మాత్రమే యథోచితరక్షణనిచ్చు విషయము పరిశోధించెదరు. అంతేకాని జీవితసౌభాగ్యమును, ఆర్థికాభ్యుదయమును నెలకొల్పు ప్రధానపరిశ్రమలను అభివృద్ధిచేయుటకు భారతప్రభుత్వము ఏమిప్రోత్సాహము కలుగజేయునో తెలియుటలేదు. కాబట్టి యుద్ధకాలములో నెలకొనిన పరిశ్రమలు, ఇంకను వృద్ధిపొందవలసిన ప్రధాన పరిశ్రమలు, వ్యాపారవిషయములు, ఆర్థిక సంబంధ

ములు, అంతర్జాతీయ వ్యాపారవిధానములు-ఈసమస్య లన్నియు అన్యోన్యమిశ్రితములు. కావున భారత ప్రభుత్వము ఈ సమస్యలను అనుశీలించి ఒక సమగ్ర విధానమును ఆచరించవలయును.

క్రిందటి నాలుగైదు నెలలలోను మన దేశపు దిగుమతులు ఎగుమతులను మించినవి. చిరకాలము నుండియు మన దేశములో దిగుమతులు ఎగుమతుల కంటె ఎక్కువగా నున్నవి. ఆర్థికముగా ఇది చాలా చిక్కుపరిస్థితి. బ్రిటిష్‌వారు మనదేశమందు పెట్టిన పెట్టుబడి తాలూకు వడ్డీ, మనము వ్యాపారనౌకలకు చెల్లింపవలసిన ఖర్చులు, బ్రిటిష్‌ఉద్యోగులకు మన ప్రభుత్వ మీయవలసిన పింఛనులు మొదలైనవికూడ కలుపుకొనినను, ౧౯౩౦ వరకు మనకే బంగారమురూపమున విదేశ వ్యాపారమున వచ్చుచుండెడిది. కాని ఇప్పుడా పరిస్థితి మారి దిగుమతులే హెచ్చుచున్నవి. ఈ యుద్ధ కాలములో మనము వారికి బాకీ తీర్చివేయుటయే కాక, వారే మనకు బాకీపడియున్నారు. ఆ ఋణమును తీర్చివేయుటకును, వారి విదేశ వ్యాపారమును తిరిగి సంపాదించుటకును వారు సర్వవిధములా ప్రయత్నించుచున్నారు. అందుచే ఇంగ్లండు తన ఎగుమతులను వృద్ధిచేసికొనుచున్నది. మన ఎగుమతులు మాత్రము పెరుగలేదు. దీనికి కారణములు:—

(౧) పూర్వోక్తములైన కారణములవలన ఇంగ్లండు తన ఎగుమతి వ్యాపారమును వృద్ధిచేసికొనుటకును, అంతర్జాతీయ జీవనమును పునరుద్ధరించుకొనుటకును ఒక నిర్ణీత కార్యప్రణాళికను అనుసరించుచున్నది. యుద్ధమునకు పూర్వపు రోజులలోని ఎగుమతులలో సగపాలు అప్పుడే ఎగుమతియగుచున్నది. ఎగుమతులపై నిషేధములన్నియు, యుద్ధము ముగియగానే, తొలగింపబడినవి.

(౨) మనదేశమందు ఎగుమతులపై నిషేధములన్నియు యుద్ధము ముగియగానే తొలగింపబడలేదు. కాని దిగుమతులపై విధినిషేధములన్నియు తొలగింపబడినవి. అందుచే క్రిందటి పదినెలలలో దిగుమతులు ఎగుమతులను మించినవి.

(౩) హైదరీ రాయబారము మనకు కావలసిన తయారు సరకుల (Manufactured goods) దిగుమతి విషయమై ఏర్పాట్లు గావించినది. ఇంగ్లండు ఎగుమతులపై నిషేధములు తీసివేసిన కాలమందే మనదేశమందు దిగుమతులపై నిషేధములు తీసివేయుట కేవలము యాదృచ్ఛికము కాదు. ఈ చిదంబర రహస్యము అందరకును తెలిసిన విషయమే.

(౪) ఎగుమతి వ్యాపారమును పెంపొందించుటకయి ఇంగ్లండు సరిక్రొత్త పద్ధతులను అవలంబించుచున్నది. ఎగుమతిచేసిన సరకుల విలువకు మూల్యమును ధనమూలముగా గాక ముడిపదార్థముల మూలముగా దిగుమతి చేసికొనుచున్నది.

(౫) మనదేశమందు ఇతరదేశములవారు కొనుబడి సంఘములు (Purchasing agencies) ఏర్పరచుకొన్నారు. విదేశములు ఈసంఘముల ద్వారా మన దేశములో లాభసాటివ్యాపారమును చేసికొనుటచే మనకు తీరని నష్టము కలుగుచున్నది.

యంత్రసామగ్రి దిగుమతులవలన మనము అంతర్జాతీయ వ్యాపారములో విదేశములకు బాకీపడిన యెడల మనకు అంత నష్టము కలుగదు. కాని మన మెదుర్కొనవలసిన సమస్య అది కాదు. మన దేశమునకు యంత్రసామగ్రి కాక, యంత్రనిర్మిత పదార్థములను దిగుమతిచేయుటచేత ఏర్పడినది. అందువలన మన పరిశ్రమాభివృద్ధికి కూడ ముప్పు వాటిల్లుచున్నది.

ప్రపంచములో అన్ని దేశములును వ్యాపార విషయమై ఒక సమాధానమునకు రావలసియున్నదను సూచన మన మంగీకరించవచ్చును. ఏ దేశమైనను ప్రస్తుత పరిస్థితులయందు ఆర్థిక విషయమై ఇతర దేశములతో సంప్రదించరాదని నిషేధించకూడదు. ప్రపంచ ఆర్థికవ్యవస్థలో భారతదేశముగూడ ఒక ముఖ్యాంగమయియుండదగినది. కాని పారిశ్రామికముగా ముందంజవేసిన బ్రిటన్, అమెరికాల లాభమునే యుద్దేశించి జరుగు ఏర్పాటులను మనము ప్రతిఘటింపవలెను.

అనగా మనము అంతర్జాతీయ ఆర్థికవిధానము నకు చేయూత నీయవలెనన్న ఈ క్రింది మూడు విషయములు మనకు సంతృప్తికరముగా పరిష్కరింపబడవలెను:

(౧) మన పరిశ్రమలకు, పరిశ్రమాభివృద్ధికయి మన మనుసరించు కార్యప్రణాళికకు అంతరాయము లుండకూడదు. అనగా మనకు తయారైన సరకులే గాక సరకులను తయారుచేయు యంత్రసామగ్రి కూడ దిగుమతి చేసికొనుటకు తగిన సదుపాయములు కలుగవలెను. ఇందులకు మనకు బ్రిటన్ బాకీపడిన ధనమంతయు యంత్రసామగ్రి ఇంగ్లండులోగాని, అమెరికాలోగాని కొనుటకు సరఫరాచేయవలెను. ఈ విషయమున అమెరికా బ్రిటనులు మొన్న ఋణ సందర్భమున స్టర్లింగ్ బాకీల విషయమై కావించిన ఏర్పాట్లు చాలా అనుమానమునకు తావిచ్చుచున్నవి. భారతదేశపు అంగీకారము బడయని ఈ ఏర్పాటులు మనను బంధించ నేరవు.

(౨) బ్రిటిష్ సామ్రాజ్యమందలి దేశములతోనే గాక, ప్రపంచమం దన్ని దేశములతోను వ్యాపారము చేయుటకు అంతరాయము లుండకూడదు. అనగా విదేశవ్యాపారముచే సంపాదించిన డాలర్లను బ్రిటను పౌన్లులోనికి మార్చియున్నది. ఆ డాలర్లను తిరిగి మనకు అమెరికాలో సరఫరా చేయవలెను. ఇంతే గాక, మన స్టర్లింగ్ బాకీల చెల్లుబడి నిమిత్తము తయారయిన సరకులను, యంత్రములను ఎక్కువ ధరలు కట్టి మన నెత్తిమీద రుద్దకూడదు. ఏ ఏ దేశము లందు ఏ ఏ సరకులు చవుకగానున్నవో, ఆ యా దేశములందు ఆ యా సరకులు కొనుటకు మనకు స్వేచ్ఛ కావలెను.

(౩) మన దేశము వ్యవసాయము ప్రధానముగా గల దేశము. అందువలన ధాన్యము, ముడిసరకుల యొక్కయు, తదితర వ్యావసాయిక పదార్థముల యొక్కయు ధరలు పడిపోకుండ ఏర్పాట్లు జరుగవలెను. పైన ఉదాహరించిన ప్రకారము ఒక నిర్ణీత ప్రణాళిక ననుసరించి, మన వ్యాపార విధానమును దిద్దుకొనకపోయినచో యుద్ధములో కష్టనష్టములకు గురియైనట్లే, యుద్ధానంతర పునర్నిర్మాణమున కూడా భారతదేశము అష్టకష్టములకు గురికావలసి వచ్చును. సమగ్రప్రణాళిక పైనను, సమిష్టి విధానము పైనను ఇంత నొక్కి చెప్పుటకు కారణము వ్యాపార సమస్య పారిశ్రామికసమస్యపైనను, ఈ రెండును మన చలామణి సమస్య (Currency Problem) పైనను ఆధారపడియుండును కాబట్టి పూర్వోక్తమైన టారిఫ్ బోర్డు అన్ని సమస్యలను సమగ్రముగా పరిష్కరించు నట్టిదిగా ఉండకపోవుట విచారకరము.

ఆర్థికసమస్యలు దేశాభివృద్ధికి అనుగుణముగా పరిష్కరింపవలెనన్న, దేశాభ్యుదయమే పరమలక్ష్యముగా గల ప్రభుత్వము కావలెను. నేటి ప్రభుత్వము ఆ కర్తవ్యమును సక్రమముగా నిర్వహింపలేదనుట సర్వసమ్మతము. స్వతంత్రవైఖరి నవలంబింపగల జాతీయప్రభుత్వము నెలకొల్పబడినగాని మనకు న్యాయము జరుగదు. కేంద్రమున జాతీయప్రభుత్వము, స్వతంత్రవైఖరి అనుట నేటి ప్రతిసమస్యకును పల్లవి, అనుపల్లవిగా మారిపోయినది. నిజమే- జాతీయప్రభుత్వముగాని జాతీయపునర్నిర్మాణమునకు పునాదులు నిర్మించలేదనుట సత్యము. కాని నేటి విశ్వరాజ్యాంగ రంగమున రాజకీయచదరంగపు యెత్తునకు ప్రాతిపదికముగా ఆర్థికకారణము లుండునని వేరుగా చెప్పనవసరము లేదు. భారతప్రభుత్వము అవలంబింప బోవు వ్యాపారవిధానము అవ్యవహితభావిలో జనసామాన్యము యొక్క దైనందిన జీవితమును తీర్చిదిద్దగలదు. ఈ సమస్యలో రాజకీయములలో నున్న భేదాభిప్రాయములకు తావులేదు. సరియైన వ్యాపారవిధానమును భారతప్రభుత్వము అవలంబింపకపోయినచో జనసామాన్యము తీరని నష్టమునకు గురియగుదురు. ఇంత సన్నిహిత సంబంధ మున్నను, జనసామాన్యమును ఈ వ్యాపారసమస్య ఆకర్షింపలేకపోవుట ప్రజలకు తమ జీవితావసరములపై గల విముఖత కన్న ఈసమస్యలోని అంతరార్థము తెలియకపోవుటయే. కావున ప్రజలు ఈ సమస్యయొక్క ప్రాముఖ్యమును గుర్తించవలెను. ఏ ప్రభుత్వమైనను ప్రజాభీష్టము గమనింపక తప్పదు.

వాచస్పతిమిశ్ర

= శ్రీ నిర్వికల్పానందస్వామి =

భారతదేశమున ప్రాచీనకాలమున జన్మించిన మహామేధావుల జీవితచరిత్రములు మనకు తెలియవు. కాని వారి శేముషీప్రతిభలను తెల్పుటకుగాను వారి గ్రంథములే సాక్ష్యము నొసగుచు, కాలమునుగూడ నిరాకరించుచు నిల్చిపోవుచున్నవి. ఈ పరంపరకు చెందినవారిలో వాచస్పతిమిశ్ర యొకడు. ఈయన మిథిలావాస్తవ్యుడై యుండెనో యనియు, క్రీ. శ. ౮౪౧ వ సంవత్సర ప్రాంతమువాడు కావచ్చుననియు శాసనములను పరిష్కరించినపండితులు చెప్పుచున్నారు. ఈయన ముఖ్యదర్శనములను మథించి అన్నిటికిని నిర్దుష్టముగ, ఏదర్శనమును ప్రవచించినప్పుడు ఆ దర్శనవాదమును స్థాపించుచు టీకలను వ్రాసియున్నాడు. వాచస్పతికి పూర్వమునగాని, పరమునగాని ఎవ్వరును ఇట్టి విస్మయకరమగు పాండిత్యమును ప్రదర్శించి యుండలేదు. దార్శనికపండితులలో ఈతని కల్పిన భాషామాధుర్యమును, విషయవివరణానైపుణ్యమును ఇంకెవరికిని పట్టువడలేదనుట సహజోక్తియే.

వాచస్పతివిషయమున నొక కథ ప్రసిద్ధమై భారతదేశమునందంతటను వ్యాప్తిలో నున్నది. తన వివాహసమయమున పండితు లొనర్చిన తర్కవాదమును విస్మయానందములతో పరికించిన మిశ్ర తన జీవితము నంతయును పాండిత్యోపార్జనమునకే వినియోగింప నిశ్చయించుకొనెను. అట్లే జీవితమునంతయును శాస్త్రపఠనమునకే, సంసారచింత లేకుండ, గడిపెను. ఆయన తన్మయత్వముతో వేదాంతభాష్యమునకు టీకను వ్రాయుచుండునప్పుడు ప్రదీపము నిర్వాపిత మయ్యెను. దానిని మరల వెలిగించి అచ్చట నిల్చిన భార్యనుగూడ అతడు గుర్తింపజాలక "నీవెవరవు? నీ కేమి కావలయును?" అని ప్రశ్నించెను. పతివ్రతయగు ఆ లలన "నేను మీ భార్యను. మీ చరణసేవ కాక నేను వాంఛించునది వేరేమియును లేదు. కాని మన 'ప్రాయంపుప్రొద్దు' తిరిగిపోయినది. మన వంశమును నిలిపి పిండోదకముల నొసగుటకు సంతానమూ లేదు. మరణానంతరము నా పేరుకూడ భూమిమీద నిలువదు" అని చెప్పెను. వాచస్పతి "ఈ శరీరము క్షణభంగురము. గడచినదానికి వగచి ప్రయోజనము లేదు. నీ పేరు అజరామరముగ పండితసమాజమున వెలయుటకుగాను నా వేదాంతదర్శనభాష్యటీకకు నీ పేరు పెట్టుచున్నాను" అని ఆమెను సమాశ్వసించెను.

అవును, దర్శనపండితులలో 'భామతి' పేరు ఎరుగనివా రెవరు? శంకరుని హృదయము నెరుగగోరువారు దానిని పఠించియేతీరుదురు.

ఈరీతిగ వాచస్పతి తన భార్యయగు భామతికి అమరత్వము నొసగెను.

గ్రంథములు

న్యాయదర్శనమునకు ఉద్యోతకరుడు రచించిన న్యాయవార్తికమునకు 'తాత్పర్యటీక'ను, దానికి అనుబంధముగ 'న్యాయసూచీ నిబంధము'ను, సాంఖ్యదర్శన గ్రంథమగు ఈశ్వరకృష్ణుని కారికలకు 'తత్త్వకౌముది' యను టీకను, యోగదర్శన 'వ్యాసభాష్యము'నకు 'తత్త్వవైశారది' యను టీకను, పూర్వమీమాంసాదర్శనమున భాట్టమతము ననుసరించుచు 'తత్త్వబిందు'వను టీకను, మండనమిశ్రుని 'విధివివేకము'నకు 'న్యాయకణిక' యను టీకను, వేదాంతదర్శన శాంకరభాష్యమునకు 'భామతి' యను టీకను వాచస్పతి విరచించెను.

వీనిలో న్యాయవార్తికతాత్పర్యమునకు ఉదయనాచార్యుడు 'పరిశుద్ధి' యను టీకను సమకూర్చెను. ఇక 'భామతి'కి అమలానందుడు 'వేదాంత కల్పతరు' వను టీకను, దానికి అప్పయ్యదీక్షితులు 'పరిమళ' మను టీకను, దానికి మరల లక్ష్మీనృసింహులనువారు 'ఆభోగ' మను టీకను రచించిరి. ఇవిగాక, భామతికి శ్రీరంగనాథుడను నామాంతరము గల అఖండానందుడు చేసిన 'ఋజుప్రకాశిక' యను భామతీవ్యాఖ్య యొకటి లభించుచున్నది. మరియు 'భామతీ తిలకము', 'భామతీ విలాసము' అను టీకలుగూడ అముద్రితములుగ నున్నట్లు తెలియుచున్నది.

మండనమిశ్రకృతమగు 'బ్రహ్మసిద్ధి' యను వేదాంతప్రకరణ గ్రంథమునకుగూడ వాచస్పతి 'బ్రహ్మతత్త్వసమీక్ష' యను టీకయును, దానికి మరల జ్ఞానోత్తమాచార్యుడు రచించిన టీకయునుగూడ నున్నవి.

'ఖండనకుఠారము', 'స్మృతిసంగ్రహము' అను రెండు గ్రంథముల కర్తగా వాచస్పతిపేరు పఠింపబడుచున్నది కాని, ఉపర్యుక్త గ్రంథపరంపరకు కారకుడగు వాచస్పతియే ఈ వాచస్పతి యను విషయము సంశయాస్పదము.

ఆచార్యభక్తి

ఇక వాచస్పతి తన టీకలో శాంకరదర్శనమును ప్రస్తరించిన క్రమమును ఒకింత అనుగమింతము. ప్రసన్నగంభీరమగు ఆచార్యవాణి యను గంగాప్రవాహమున రథ్యోదక స్థానీయమగు తన వాక్కు ప్రవేశించి పావిత్ర్యమును చేకూర్చుకొనినదట! దీనినే కదా "విద్య యొసగును వినయంబు" అందురు. వేదాంత వాఙ్మయమున సురేశ్వరుని సిద్ధాంతముల ననుసరించుచు కొందరును, పద్మపాదుల సిద్ధాంతముల ననుసరించుచు కొందరును గ్రంథములను గూర్చిరి. వాచస్పతి విశేషముగ సురేశ్వరులనే (మండనమిశ్రుడు) అనుసరించెను. సురేశ్వరకృతములగు బ్రహ్మసిద్ధి, విధివివేకముల కీయన టీకలను గూర్చుటవలన, ఆయనసిద్ధాంతముల నెంతగ వాచస్పతి అనుసరించినది మన మూహించుకొనగలము.

విధి

బ్రహ్మజిజ్ఞాసాసందర్భమున వేదాంతవాక్యములు "ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యః" అని ఉపదేశించుచున్నవి. ఈ ఉపదేశము విధివలె తోచుచున్నది. విధియైనపక్షమున అపూర్వనియమపరిసంఖ్యా విధులలో నెద్దానిని స్వీకరింపవలెను అను ప్రశ్న ఉదయించును. ప్రకటార్థకారుడు అపూర్వవిధి యనియు, వివరణకారుడు నియమవిధి యనియు వచించుచున్నారు. వివరణమతానుయాయులగు కొందరు, ప్రథమమున శ్రవణఫలముగ నిష్పన్నమగు పరోక్షజ్ఞానమును, మనన ధ్యానఫలితముగ అపరోక్షజ్ఞానమును కలుగునని చెప్పుచున్నారు. మరికొందరు శ్రవణద్వారమునగాక మనోద్వారముననే బ్రహ్మసాక్షాత్కారము సిద్ధించు ననుచున్నారు. వార్తికమతావలంబులగు కొందరు పరిసంఖ్యావిధి యనుచున్నారు. సంక్షేపశారీరకకారుడు శ్రవణఫలితముగ పరోక్షాపరోక్షజ్ఞానములలో నే యొక్కటియును లభింపదనియును, చిత్తకలుషము తొలగి అద్వితీయబ్రహ్మనిర్ణయ మొనర్పగల చిత్తవృత్తి ఉదయించుననియు చెప్పుచున్నాడు. ఈ అభిప్రాయమునే వాచస్పతిగూడ సమర్థించుచు "నతత్ర విధిర్యస్యా వ్యవకాశః" అని ఉటంకించుచున్నాడు.

ఉపాదానము

జగదుపాదానవిషయమున వివరణకారుడు సర్వజ్ఞత్వాదివిశిష్టుడును, మాయాశబలితుడును నగు ఈశ్వరుని గ్రహించుచున్నాడు. పదార్థతత్త్వనిర్ణయకారుడు బ్రహ్మమును వివర్తోపాదానముగను, మాయను పరిణామోపాదానముగను గ్రహించుచున్నాడు. కొందరు బ్రహ్మమును వ్యావహారికప్రపంచమునకును, జీవుని ప్రాతిభాసికమగు స్వప్నప్రపంచమునకును ఉపాదానములుగ గ్రహించుచున్నారు. కొందరు జీవకల్పననే కారణ మనుచున్నారు. సంక్షేపశారీరకకారుడు శుద్ధబ్రహ్మమును ప్రధానకారణముగను, మాయను సహకారికారణముగను గ్రహించుచున్నాడు. సిద్ధాంతముక్తావళీకారుడు మాయాశక్తినే ఉపాదానకారణముగ స్వీకరించెను. వాచస్పతిమతమును ప్రపంచించు కల్పతరుకారుడగు అమలానందుడు—

"అజ్ఞాతసటవద్ బ్రహ్మ
కారణం శంకరోఽబ్రవీత్,
జీవాజ్ఞాతం జగద్బీజం
జగౌ వాచస్పతి స్తథా."

అని నుడివియున్నాడు.

సర్వజ్ఞత్వము

సర్వజ్ఞత్వవిషయమున భారతీతీర్థులు సర్వవాసనా విషయములను సాక్షిరూపమున నెలయుట యని నిర్వచించుచున్నాడు. ప్రకటార్థకారుడు బ్రహ్మము యొక్క స్వోపాధియగు మాయయందు ప్రతిబింబించిన సమస్తప్రపంచముయొక్క స్ఫురణమే సర్వజ్ఞత్వ మనుచున్నాడు. కౌముదీకారుడు వృత్తిసంభూతమగు జ్ఞానబలము నంగీకరింపక, స్వరూపజ్ఞానబలమున స్వసంసృష్టమగు సర్వమునకు ఆభాసకమగుటయే సర్వజ్ఞత్వ మనియు చెప్పుచున్నాడు. వాచస్పతి కౌముదీకారుని మతము నంగీకరించుచు, సర్వజ్ఞానకర్తృత్వమును పరిగ్రహించుచుండుట లేదు.

జ్ఞానాజ్ఞానములు

న్యాయచంద్రికాకారుడు జ్ఞానవిశేషమువలన ఒకానొక అజ్ఞానము నశించినను, ఆవరకములగు ఇతరాజ్ఞానములు నశింప వనుచున్నాడు. మరికొందరు స్వరూపావరకమగు అజ్ఞానము ప్రథమజ్ఞానమున నశించు ననుచున్నారు; ద్వితీయజ్ఞానమున దేశకాలాదివిశేషణాంతరవిశిష్టములగు విషయములు నివర్తితము లగును. అనగా, మొదట సామాన్యాకారమునను, తరువాత విశేషరూపమునను నివర్తితము లగును. ఈ విషయమున వాచస్పతి అభిప్రాయము: ప్రమాణఫలముగనే ప్రమ, అనగా యథార్థజ్ఞానము లభించుచున్నది. జ్ఞానోదయమున అజ్ఞానము నివర్తితమగును. అజ్ఞానము విషయగతము కాదు; పురుషాశ్రితము. ప్రమవలన అజ్ఞానము తొలగును. పరోక్షజ్ఞానమే అజ్ఞాననివర్తకము. ఆప్తోపదేశజన్యమును, నిర్విచికిత్సమును నగు జ్ఞానమే విద్య. ఈ విద్యవలననే అవిద్య ధ్వంసమగును.

ప్రతిబింబవాదము

వాచస్పతి ప్రతిబింబవాది. అవచ్ఛిన్నవాదమును సమర్థింపలేదు. భామతీ ప్రస్థానము నీశ్వరుని అడుగుజాడల నడచినది. పద్మపాదుని అనుసరించెడి వివరణ ప్రస్థానము ఒకే అజ్ఞానమును జీవేశ్వరులకు ఉపాధిగ నంగీకరించుచున్నారు. అనగా, ఈశ్వరుడు బింబమును, జీవుడు ప్రతిబింబమును అగుచున్నారు. కాని వాచస్పతి జీవేశ్వరుల నిరువురను బ్రహ్మమునకు ప్రతిబింబముగ గ్రహించుచున్నాడు. వాచస్పతిమతమును సంగ్రహించుచు కల్పతరుకారుడగు అమలానందుడిట్లు నుడివియున్నాడు:

"జీవభ్రాంత్యా పరం బ్రహ్మ
జగద్బీజమజూఘుషత్,
వాచస్పతిః పరేశస్య
లీలామాత్రమలూలుపత్.
ప్రతిబింబగతాః పశ్యన్
ఋజువక్రాదివిక్రియాః,
పుమాన్ క్రీడేద్ యథా బ్రహ్మ
తథాజీవస్థవిక్రియాః.
ఏవం వాచస్పతేర్లీలా
లీలామాత్రీయసంగతిః,
అస్వతంత్రత్వతః క్లిష్టా
ప్రతిబింబేశవాదినామ్."

ఈ భావమును అంగీకరించుచునుగూడ ప్రకటార్థవివరణకారుడును, పంచదశీకారుడును ఈశ్వరుని మాయాప్రతిబింబముగను, జీవుని అవిద్యాప్రతిబింబముగను చెప్పుచున్నారు.

ఉపసంహారము

వేదాంతదర్శన వాఙ్మయమున వాచస్పతి సముపార్జించుకొనిన స్థానము అతులనీయము. ప్రసన్నగంభీరమగు భాష, అగాధమగు పాండిత్యము ఈయన గ్రంథముల నెచ్చట తెరచిచూచినను తోపగలవు. చిత్సుఖప్రభృతులగు ఆచార్యులందరును ఈయన వాక్యములను ప్రమాణములుగ నంగీకరించి తమ గ్రంథములలో నుదాహరించుకొనిరి. 'లఘుచంద్రికా' కారుడగు బ్రహ్మానంద సరస్వతి వేదాంతమునకు నిర్వచనమొనర్చుపట్ల సూత్రభాష్య భామతీ కల్పతరు పరిమళములనే పరిగ్రహించినాడనిన 'భామతి' పట్ల ఇదానీంతనులకు గల గౌరవ మెట్టిదో యూహింపగలము. భారతదేశమున శంకరుని సూత్రభాష్యము పఠింపబడునంతవరకు 'భామతి' కూడ పఠింపబడుచుండు ననుట కెట్టి సందేహమును లేదు.

రామలక్ష్మణులు

[కథ]

= శ్రీ 'జమదగ్ని' =

నారాయణంగారి ఇంట్లో రెండుగాళ్లగాని బండి ఎద్దు చనిపోవడం ఊరంతటికీ ఎక్కడలేని ఆశ్చర్యమూ కలిగించింది.

ఎద్దు అంటే ఎద్దా అది! కేవలం నందీశ్వరుని అపరావతారం. రామన్నా, లక్ష్మన్నా నడుముల చుట్టూ నల్లని తోలుపట్టాలతో, తలలకు జీకమార్లతో, ముఖాన కుచ్చులతో, మెడల్లో మువ్వలపట్టెడలతో, కాళ్లకు వెండ్రుకలతాళ్లతో, ఘంగుఘంగున కంచు గంటలు మోగించుకుంటూ బండి లాగుతుంటే గోలోకాని కంతటికీ యువరాజు లనిపించుకునేవి. అట్లాంటి జతలోని లక్ష్మన్న అకస్మాత్తుగా రాత్రి మేతమేసి పడుకున్నది పడుకున్నట్టు తెల్లవారేటప్పటికి దీర్ఘనిద్ర పోయిందంటే ఎవరికి ఆశ్చర్యంగాదు ? ఎవరికి విచారకరం గాదు ? ప్రతివారూ ముక్కుమీద వేలు వేసుకునేవారే ! ప్రతివారూ "అయ్యో, ఎంత పాపం, ఎంత పాపం" అని దుఃఖించేవారే !!

అలవాటుచొప్పున ఉదయాన్నే గొడ్లపాకలోకి వెళ్లిన నారాయణం పడిఉన్న లక్ష్మన్నను చూచి 'అలో లక్ష్మణా' అని తన చిన్నకొడుకు చనిపోయినట్లు బావురుమని ఏడ్చాడు. రాత్రివఱకూ ఏవిధమైన జబ్బూ లేని లక్ష్మన్న ఇట్లా చనిపోవడంతో అతనికి ప్రపంచమే శూన్యమనిపించింది. భగవంతుడే లేడనిపించింది. ఆ గాఢదుఃఖంలో అతను నిత్యకృత్యాల విషయమే మఱచిపోయాడు. భర్తదుఃఖతీవ్రతను గమనించిన అన్నపూర్ణ నిశ్చేష్టురాలై అరుగుమీద అట్లాగే చతికిలబడిఉంది.

ఆ నాడు ఊరంతా నారాయణంఇంటిముందే పోగయింది. నారాయణందుఃఖాన్ని తాముగూడా పంచుకుని విచారించారేగాని ఒక్కరూ అతనికి కర్తవ్యం జ్ఞాపకం చెయ్యలేకపోయారు.

ఇంతలో బారెడు పొద్దెక్కింది. పాకలో ఎక్కడి గొడ్లు అక్కడే ఉన్నాయి. పాలవేళ దాటిపోవడంతో లేగదూడలు అరవడం మొదలుపెట్టాయి. పలుపులు లాక్కుంటూ అరుస్తున్న దూడల్ని చూచి కట్టుకొయ్యలదగ్గఱ నిలబడలేక అటూ ఇటూ తిరుగుతూ తల్లులుగూడా అరుస్తున్నాయి. ఆ అరుపులన్నీ రామన్న అరుపులతో కలిసి, పోయిన లక్ష్మన్నకోసం తోటిజంతువులు పలుకుతున్న సానుభూతివాక్యాలుగానే భాసిస్తున్నాయి. ఆ సమయంలో పొలంపనిలో పాలేళ్లకు సాయపడడానికి రాత్రే వెళ్లిన గొడ్లకాపరి బుడ్డాళ్లిద్దఱూ పశువులను తోలుకువెళ్లడానికి వచ్చారు. వచ్చీరావడంతో ఇంటిముందు మూగిన జనాన్నీ, చచ్చిపడిఉన్న లక్ష్మన్ననూ చూచి నిర్ఘాంతపోయారు. తలమీద చేతులు పెట్టుకుని గొంతుకుకూర్చుని లోపల్లోపల క్షోభపడుతున్న నారాయణాన్ని చూచి అడుగుకదపలేకపోయారు.

గాలి సాగిసాగి ఒక్కమాటు స్తంభించిపోయినట్లుగా ఎందుకో అకస్మాత్తుగా అతినిశ్శబ్దత ఏర్పడిపోయింది. రాల్చిన సూదిచప్పుడుగూడా వినబడే ఆ నిశ్శబ్దతను నారాయణంపక్క ఇంటి రాఘవయ్య రెండునిమిషాలు గడిచేటప్పటికి సహించలేకపోయాడు. అతను కల్పించుకుని బుడ్డాళ్లను చూచి "ఇంకా చూస్తా

కేంరా? అంత పొర్లాడిచింది ఆపట్టం లేదూ! ఒకరు పోయి దూడల్ని విడవండి. ఇంకోరు వెళ్లి వెట్టివాళ్లను కేకేసుకురండి" అని అన్నాడు.

వెట్టివాళ్ల మాట వినేటప్పటికి అంత దుఃఖం లోనూ నారాయణంఒళ్లు గజగజా వణికింది. అక్కడ కూర్చునిఉండే "ఎందుకు మామా?" అనిమాత్రం అనగలిగాడు. వెంటనే రాఘవయ్య "ఎందుకేమిటి నారాయణం! చచ్చిన గొడ్డును ఇట్లా ఇంటిముందు పెట్టుకుని ఎంతసేపు కూర్చుంటాం? పోయిన ఎద్దు నందిలాంటిదే అనుకో! అది మళ్లీ బ్రతికిరాదుగదా! దానికోసం ఇంత దుఃఖపడి ప్రయోజనం ఏమిటి? దానికీ, మనకూ ఋణం తీరిపోయింది. అంతే!" అంటూ ఆకాలానికి అవసరమైనంత మాత్రంగా వైరాగ్యం బోధించాడు.

వీళ్ల సంభాషణ వినకుండానే గొడ్లకాపరి వాళ్లిద్దఱూ ఎవరికి చెప్పబడ్డ పనులమీద వాళ్లు వెళ్లిపోయారు.

రాఘవయ్య చెప్పిందంతా విన్నాడో లేదో కాని నారాయణం చిట్టచివఱకు "వాళ్లువస్తే మా వాములదొడ్డిలో గొయ్యి తవ్వమని చెప్పు మామా!" అని ఊరుకున్నాడు. ఆమాట విన్న అక్కడి వాళ్లందఱూ ఆశ్చర్యపడి అతనివంకే చూచారు. ఎన్నడూ కంట నీరుపెట్టని రాఘవయ్యకూడా ఆ సమయంలో కన్నీళ్లు కార్చాడు.

ఇక తరువాతిపనులన్నీ రాఘవయ్యే పూనుకొని చేయించాడు. మరణించిన లక్ష్మన్నను మెత్తగా గడ్డి వేసిన బండిమీదికి ఎక్కించారు. ఊళ్లో బంతి పూలన్నీ - పచ్చవీ ఎఱ్ఱవీకూడా పసుపు కుంకుమల తోబాటు లక్ష్మన్నమృతశరీరాన్నీ అలంకరించాయి. డోలూ, సన్నాయీ పుచ్చుకుని మేళగాళ్లు వచ్చారు. ఒక్క పెద్దపాలేరుతప్ప పొలంనుంచి నారాయణం పాలేళ్లుకూడా వచ్చారు. ముందు మేళగాళ్లూ, తరువాత బండీ, బండివెంబడే రామన్నా, దానిపక్కనే నారాయణం, అతనివెంబడే ఊళ్లోజన మందఱూ ఆబాలగోపాలం అత్యధిక విషాదాన్ని ప్రకటిస్తూ మహారాజవైభవంతో లక్ష్మన్నశరీరాన్ని ఊరేగించారు.

రెండుజాములవేళ అయేటప్పటికి నారాయణం వాములదొడ్లో లక్ష్మన్నమృతశరీరానికి ఖననసంస్కారం పూర్తి అయింది. కన్నకొడుకును పోగొట్టుకొన్నంత దుఃఖంతో అచోటు విడవలేకవిడవలేక రాఘవయ్య బలవంతంమీద నారాయణం ఇంటిముఖం పట్టాడు.

౨

ఆ ఊరంతటికీ నారాయణం పెద్దరైతు. రెండు మూడు తరాలనుంచీ ఆ కుటుంబానికి అరు అరకల వ్యవసాయం ఉంటూ వచ్చింది. నారాయణం ఆ ఆస్తిని ఏమాత్రమూ పెంచలేదుగాని ఉన్నది పాడుచెయ్యకుండా, వచ్చింది పదిమందికీ పెట్టుతూ ధర్మప్రభువనిపించుకుంటున్నాడు. అతను ఎన్నడుగాని ఎవరితోనూ అడిగింది లేదు అని అనలేదు. ఆ వూళ్లో అతని సొమ్ము తిననివాడు లేడంటే అతిశయోక్తికాదు. ఇంత ఆస్తి ఉండి ఇంత గుణవంతుడైనప్పటికీ పూర్వజన్మలో ఏం పాపం చేసుకున్నాడో ఏమో అతనికి సంతానం మాత్రం కలగలేదు. తనకు సంతానం లేదుగదా అని నారాయణం దత్తపుత్రివ్యామోహంలో పడిపోక అనుకూలవతియైన భార్యసహకారంతో తన ఇంట పుట్టిన గోసంతానమే సంతానంగా ఎంచుకుని తన గుండెలోని పితృభావసర్వస్వాన్నీ వానియెడలే చూపుతూ పరోపకారబుద్ధితో కాలక్షేపం చేస్తున్నాడు. అటువంటి నారాయణం అల్లారుముద్దుగా తన చేతులమీదుగా పెంచుకున్న రామలక్ష్మణుల్లో లక్ష్మణుడు అంత పసివయస్సులో చనిపోవడం కేవలం అధర్మవిజృంభణం కాకపోతే మఱేమిటి?

ఈ విషయం ఆ ఊళ్లో ప్రతివాణ్నీ హృదయ దఘ్నంగా కదిలించివేసింది. అందుకనే ఆ నాడు అంత మందీ అట్లా తమ విచారాన్ని సూచిస్తూ లక్ష్మన్న బండివెంట వెళ్లారు.

ఆ ఊళ్లోకల్లా ఈ కదలికను ఏమాత్రమూ పొందంది ఒకేఒక వ్యక్తి. అతడు నారాయణం పెద్ద పాలేరు వెంకాయి. వెంకాయి నారాయణం తండ్రి

దగ్గఱ పనిచేసిన సీతాయికొడుకు. నారాయణంతండ్రి చనిపోయేముందు కొడుకును దగ్గఱకుపిల్చి ఒకేఒకమాట చెప్పాడు: "నాన్నా! సీతాయి తన బ్రతుకంతా మన సేవలోనే వినియోగించాడు. వెంకాయి కొంచెం దురుసువాడుగదా అని వాణ్ని నువ్వు తోసెయ్యకు. వాణ్ని పోషించే భారం నామీద ఉన్నది. ఆభారం నీమీద పెట్టుతున్నాను." తండ్రి చెప్పిన ఈ మాటను అణుమాత్రమూ దాటకుండా నారాయణం వెంకాయిని తన కొలువులోనే ఉంచుకున్నాడు.

లోకంలో మతిమంతుల మనస్సుల్ని కలవర పఱచే విషయాల్లో ఇదొకటి. ఈ జగత్తు నెందుకో బ్రహ్మదేవుడు ద్వంద్వమయంచేశాడు. సూర్యదేవుని భార్యగా ఛాయాదేవి ఏర్పడింది. చీకటిని పోగొట్టే వెలుగునిచ్చే దీపాన్ని అంటిపెట్టుకుని నీడ ఉంటుంది. క్షమాశీలరైన భూదేవికడుపున ఇతరుల ప్రాణాలను మింగేసే విషపుచెట్లు అనేకం పుట్టుతున్నాయి. అలాగే సీతాయికడుపున వెంకాయి పుట్టాడు.

ఎంత చెడ్డా వెంకాయి సీతాయికొడుకు కాక పోలేదు. పనిపట్టిన సమయంలో వెంకాయి ఎన్నడూ ఒళ్లుదాచుకోవడం ఎఱుగడు. పదిమంది చెయ్యవలసిన పనిని తాను ఒక్కడే చేస్తాడు. ఇది తండ్రిలక్షణమే! వెంకాయి రోజూ మతిచెడిపోకుండా తాగుతాడు. ఇదీ తండ్రిలక్షణమే! కాని సీతాయి మోతాదుప్రకార మైనా ఆ తాగిన సమయంలో యజమానికి ప్రాణం పోయినా కనబడేవాడు కాదు. వెంకాయికి మాత్రం ఆ భయం ఏకోశానా లేదు. పైగా యజమానిఎదుట బడి అడ్డమైనసవాళ్లూ వేస్తాడు. అతని స్వభావం తెలుసును కాబట్టి నారాయణమే సాధ్యమైనంత వరకూ అట్టి సమయాల్లో అతని ఎదుట బడకుండా ఉంటాడు.

వెంకాయికి ఇది ఒక్కటే దుర్గుణమైతే పెద్ద కష్టం లేదు. నారాయణం మంచితనంతో దీన్ని లెక్కచేసేవాడే కాదు. కాని వెంకాయిలో అవ లక్షణాలు ఎన్ని ఉండాలో అన్నీ ఉన్నాయి. దొంగతనం, మోసం, లడాయిల్లో దిగడం ఇత్యాదులు లక్షణాలు. ఇవన్నీ వెంకాయికి నారాయణందగ్గఱ పనిలో ప్రవేశించేటప్పుడు బీజప్రాయంగానే ఉన్నాయి. నారాయణం వీటినన్నిటినీ గుర్తించి తగిన చికిత్స చేస్తూనేవచ్చాడు. కాని ఆ చికిత్స అతని మీద ఏ మాత్రమూ పనిచెయ్యలేదు. పైగా అతను స్వబుద్ధిచేత వాటి అన్నింటిలో ప్రవీణత సంపాదించాడు.

వెంకాయి కుటుంబాని కంతటికీ నారాయణం తిండికి గింజ లిస్తాడు. కట్టుకునేందుకు బట్టలిస్తాడు. సీతాయిమీది అభిమానంతో, అతడు పోయిన కొత్త రోజుల్లో, వాళ్ల పాక పడిపోతే గూడెంలోనే మఱొకచోట నాలుగుకొట్టాళ్ల పాకగూడా వేయించి ఇచ్చాడు. తండ్రి చెప్పిన మాటమీది గౌరవంతో తాను ఇంతచేసినా, ఇంత ఆపేక్షతో చూస్తున్నా వెంకాయి తన్ను మోసంచేసి వీలైనప్పుడల్లా ఏదో ఒకటి కాజెయ్యాలని ఎందుకు చూస్తున్నాడో నారాయణానికి అర్థంకాలేదు.

వెంకాయిపెళ్లికి నారాయణం నూరురూపాయలు ఖర్చుపెట్టాడు. తానూ, తన భార్యా తాంబూలం పుచ్చుకోడానికి వీథిలోకి వచ్చినప్పుడు వెంకాయితల్లి కొడుక్కు తన్ను చూపించి "ఆ ధర్మరాజుకాళ్లకు మొక్కు. ఆయనదయ సంపాదించుకుంటూ బుద్ధిగా ఉండు వెంకా!" అని ఉపదేశించింది. తల్లి బతికి ఉన్నన్నాళ్లూ వెంకాయి- ఆమాటమీద అంతో ఇంతో అదుపాజ్ఞల్లోనే ఉన్నాడు. అటు తల్లిపోవడం ఇటు వెంకాయికి ఉన్నమతి ఊడ్చిపెట్టేసింది. నారాయణం కుటుంబం పెట్టుపోతలకు అంతవఱకు ఋణపడక పోయినా కొత్తగా వచ్చిన వెంకాయిపెళ్లాము తనకు పెళ్లిలో నారాయణం పెట్టించిన చీరతోనే కృతజ్ఞురాలై భర్తదుండగాలకు అడ్డుపడి బుద్ధిచెపుతూఉండేది. ఎవ రెన్నిచెప్పినా తాగుమోతువెంకాయి 'కుక్క తోక వంకర'సామెత అయాడు.

మొదట్లో వెంకాయి కళ్లంలోగింజలు కాజెయ్యడం మొదలుపెట్టినప్పుడు "పోనీలే! ఎంత కాజేసినా వాడే తింటాడుగదా" అని నారాయణం "ఒరే వెంకా! నీకు కావలసిఉంటే నన్ను అడిగి తీసుకో! నేను ఇవ్వనన్నానా? ఈ దొంగతనం ఎందుకు?"

అని సౌమ్యంగా బుద్ధిచెప్పి ఊరుకున్నాడు. ఒక ఏడాది వెంకాయి తక్కిన పాలేళ్లతో లాలూచీఅయి గడ్డికడియంలో పదిబస్తాలు దాచేశాడు. కడియం ఎట్లా వేశారో కఱ్ఱతో పొడిచిచూస్తున్న నారాయణం ఈసంగతి గమనించాడు. అన్నీ ఒకచోటే పెట్టితే తేలికగా పట్టుబడతామని బస్తాలు నాలుగుమూలలా పడ్డారు. నారాయణంకఱ్ఱకు నాలుగైదుచోట్ల గట్టిగా తగిలింది. మొదట్లో గడ్డేమో అనుకున్నాడుగాని తూర్పారబోసేటప్పుడు కడియంమీద కూర్చుని ఉండగా బస్తాలే అన్న సంగతి రూఢీ అయింది. కాని నారాయణం వెంటనే బయటపడలేదు. సాయంకాలం మూడుగంటలయేటప్పటికి ధాన్యం బస్తాలకెక్కించడం పూర్తి అయింది. అయిన రెండువందలా పదమూడు బస్తాలనూ బళ్లమీద కెక్కించి రెండుమూడు దఫాలలో సందెవేళ అయేటప్పటికి ఇంటికి తోలించేశాడు. చివరిసారి బళ్లతో నారాయణానికి కనబడకుండానే వెంకాయి ఇంటికి వెళ్లిపోయాడు. కళ్లంలో నారాయణానికితోడు కూలిమనిషి ఒకడూ, ఆ ఏడు కొత్తగా చేరిన పాలేరు ఒకడూ మాత్రం మిగిలారు. అప్పటికి పొద్దుగూకింది. అయినా వెన్నెలరాత్రిళ్లు కాబట్టి బాగా వెల్తురు ఉంది. నారాయణం వాళ్లిద్దఱినీ పిలిచి తాను కడియం తొక్కుతూ, గట్టిగాతాకిన చోట్లన్నీ పగలదీయించి దొరికినంతవఱకూ బస్తాలు బయటపడేయించాడు. మొత్తం పదిబస్తాలు తేలాయి. అవి తీస్తున్నంతసేపూ ఈ మోసం తమమీద ఎక్కడ పడుతుందో అని వాళ్లిద్దఱూ హడిలిపోయారు. నారాయణం వాళ్లను ఏ మాటా అడగలేదు. వెళ్తూవెళ్తూ "ఇంటికి వెళ్లి బండి పంపిస్తాను. బస్తాలు పంపించండి" అని మాత్రం అన్నాడు. నారాయణం ఇంటికి వెళ్లడంతోటే వెంకాయికోసం చూచాడు. కాని వెంకాయి కనబడలేదు. వెంటనే రెండో పాలేరును బండి తోలుకుని పొలానికి వెళ్లమని పంపించాడు. అందఱూ కలిసి చేసిన మోసం బయటపడిపోయిందిగదా అని వాడు భయపడుతూ బండికట్టుకు బయలుదేరాడు. అప్పటికి రాత్రి ఏనిమిదిగంట లయింది. అంతకు అరగంటకుముందే తాగిన మైకం తగ్గింది వెంకాయికి. వెంటనే పెళ్లాన్ని కసిరి నాలుగుమెతుకులు పెట్టించుకుతిని యజమానిఇంటికి వెళ్లకుండానే పొలందారి పట్టాడు. దారిలో బండి కనబడింది. వెంకాయి తెలివి పాదరసంలాంటిది. సంగతంతా కనిపెట్టేశాడు. ఒసికఱ్ఱలు పట్టుకుని అమాంతం బండిలోకి ఎగిరికూర్చుంటూ "ఓ వెదవన్నర ఎదవా! బండీ తోలుకొస్తుండావురా? చూడు నిన్నేం చేస్తానో!" అని అన్నాడు. ఆ పాలేరు వీడి ధోరణిని చూచి గడగడలాడిపోయి బండి ఆపేశాడు. "ఏం, పగ్గాలు లాగావేం? చేతులు చచ్చుబడ్డాయా ఏమిటి? ఇంతలో పానం పోదులే! తోలలోయి తోలు" అని కసిరాడు వెంకాయి. బండి పొలం జేరుకుంది. వచ్చిన బండినీ, వెంకాయినీ చూచి పొలంలో ఇద్దఱు మనుష్యులూ కొయ్యబొమ్మలైపోయారు. బండిలోనుంచి అమాంతం బైటికి దూకాడు వెంకాయి. సరాసరి వాళ్లదగ్గఱకు పోతూ "మీబుద్ధి బుడమేట్లో కొట్టుకుపోయిందా ఏంట్రా? అసలు బస్తాలు ఎందుకు తీశారంట బయటికి?" అంటూ దబాయించాడు. "ఆయన పట్టేశాడు. మమ్మల్ని ఏం చెయ్యమంటావు?" అన్నారు వాళ్లు అమాయికంగా. "ఏం చెయ్యమంటానా! ఏడవమంటాను. రండి. ఇట్లా రండి! బస్తాలన్నీ ఊడదీసి గుమ్మరించండి" అన్నాడు. వాళ్లు కదల్లేదు. ఒకసారి వాళ్ళవంక చుఱచుఱా చూచి తానే పోయి బస్తాలు ఊడదీశాడు. ఒక్కొక్కటే గుమ్మరిస్తున్నాడు. ఇంకా ఊరుకుంటే ఎక్కడ మీదపడి తంతాడో అని వాళ్ళుగూడా సాయంచేశారు. వెంటనే బస్తాలన్నీ తాలూ, తప్పా, మట్టిబెడ్డలూ-వీటితో నింపేశారు. మూతులు కుట్టి బండీ కెక్కించారు. వెంకాయి బండి తెచ్చిన పాలేర్ని పిలిచి "ఇక తోలుకెళ్లి అప్పచెప్పు" అన్నాడు. "నే నాయనదగ్గఱ ఉద్యోగమున్నా మానుకుంటాను గాని, ఇదిమాత్రం తోలుకెళ్ళను" అన్నాడు వాడు. తక్కినవాళ్లిద్దఱూగూడా మేం వెళ్లమంటే మేం వెళ్లమన్నారు. వెంకాయి ఆలోచించాడు. వీళ్లని బెదిరించి పంపించినా అక్కడ నిర్వహించలేక గుట్టుకాస్తా బయటపడవేస్తారు. అందుకని వెంటనే "సరే, నేనే వెళ్తాను. మీరు ముగ్గురూ ఇక్కడే ఉండండి. నేను వచ్చేలోగా ఒక్క గింజ కదిలిందంటే మీ ప్రాణాలు మీవి కావనుకోండి! జాగ్రత్త!" అని

భయపెడుతూ బండితోలుకుని వెళ్ళిపోయాడు. బస్తా మూపుమీద వేసుకునివస్తున్న వెంకాయిని చూచి నారాయణం "వాడేడిరా?" అని అడిగాడు. బరువైన బస్తా దింపుకున్నట్లు ఆయాసపడి "వాణ్ణి పొలంలోనే ఉండమన్నాను" అని సమాధానం చెప్పాడు. మళ్ళీ నారాయణం ప్రశ్న వెయ్యలేదు. పావుగంటలో పది బస్తాలూ చేరవేశాడు వెంకాయి. బండినీ, ఎడ్లనీ వాటి వాటి స్థానాల్లో పెట్టేశాడు. "పదిబస్తాలూ అప్పచెప్పాను. నేను పొలానికి వెళ్తున్నాను. రాత్రే బళ్ల మీద గడ్డితోలుకొస్తాం" అని యజమానితో చెప్పి వెళ్లిపోయాడు. నారాయణం ఆశ్చర్యపోయాడు. వెంకాయిలో ఈ మార్పుకు కారణం ఏమిటో అతనికి బోధపడలేదు. మోసం బైటపడిపోయిందని మిగిలిన వాళ్లు భయపడ్డారుగాబోలు, అందుకని వీడే తెచ్చి ఉంటాడని సమాధానపఱుచుకున్నాడు. వెంకాయిలో ఈ మార్పును వ్యాఖ్యానించి భార్యకు చెప్పాడు. అప్పుడే పటమటింటిపని ముగించివచ్చిన అన్నపూర్ణ ఇది విని మఱీ ఆశ్చర్యపడింది. ఆమె కెందుకనో నమ్మకం కలగలేదు. ముందున్న బస్తాలు చూపిస్తూ "ఇవేనా వెంకాయి తెచ్చినవి?" అని అడిగింది. అవుననగానే మూతి విప్పి చూచింది. అంతా తాలూ, తప్పా, బెడ్డలూనూ! నారాయణం అది చూచి దిగ్భ్రాంతి పొందాడు. ఆ రాత్రి అంతా అతని మనస్సు వెంకాయిప్రవర్తననుగూర్చే ఆలోచించింది. వెంకాయిని మాన్పించెయ్యడం ఆలోచన వచ్చినప్పుడల్లా తండ్రిమాట జ్ఞాపకంవచ్చింది. ఒక్కొక్కప్పుడు తన సొమ్మేతీరే అట్లాంటిదేమో అనుకున్నాడు. మఱొకప్పుడు వెంకాయిని విశ్వాసఘాతకుడు అని తిట్టుకున్నాడు. మళ్లీ అయ్యో అని విచారించాడు. వెంకాయిభార్యనూ, బిడ్డనూ తలుచుకుని జాలిపడ్డాడు. తాను ఎంతచేసినా అతడు మారక పోవడం తోచి ఆ జాలి సడిలింది. వెంటనే వెంకాయికి స్వస్తి చెప్పాలనుకున్నాడు. మర్నాడుదయం నారాయణం లేచీలేవడంతోటే ఏడుస్తూవచ్చిన వెంకాయిభార్యని చూచాడు. రాత్రి తాగివచ్చి వెంకాయిచేసిన అఘాయిత్యం అంతా ఆమె చెప్పుకోగా జాలిగా విన్నాడు. "ఏంచేస్తాంరామీ! ఇదంతా నీఖర్మం నాఖర్మం" అన్నాడు నారాయణం. "అదేంటి బాబయ్యా! అట్టాగంటారు. నాఖర్మం కాలబట్టే ఈడు దాపురించాడు. మారాజులు మీకేం? ఆడిబుద్ధి బుగ్గయిపోనూ! ఈబిడ్డని చూసైనా కాస్త కనికారం సూపండి బాబయ్యా" అని ఏడ్చింది. అది అటు అమ్మగారిచ్చిన అప్పచ్చులు పట్టుకువెళ్లగానే ఇటు వెంకాయి పొలంనుండి వచ్చాడు. ఎడ్ల తలతాడులూడ దీస్తున్న వెంకాయిని చూచి "ఒరే వెంకా! ఇటురా" అని అన్నాడు నారాయణం. వెంకాయి ఎందుకో ఉలిక్కిపడి అరుగుదగ్గఱకు వచ్చాడు. "నిన్న సాయంత్రం పొలంనుంచి నాకు కనబడకుండా వచ్చేశావేం రా?" వెంకాయి తల వంచుకున్నాడు. "బాగా తాగావుకదూ?" వెంకాయి తల ఎత్తలేదు. "నీకు ఇది ఎక్కడి దాపురించిందిరా దరిద్రుడా! తిన్నంత తిని పనిచేసుకోరా బాబూ అని చిలక్కి చెప్పినట్లు చెపుతుంటే వినిపించుకోవు, నీకేం పోయేకాలం వచ్చింది అంటా! పోనీ, తాగినవాడివి తాగినట్లు పడిఉండక ఒళ్లుమత్తెక్కి పెళ్లాన్నీ, బిడ్డనీ చంపుకుతింటావా? చచ్చిస్వర్గాన ఉన్న సీతాయిని తలుచుకుని నీకు ఇంతచేస్తుంటే నే చేసిందంతా విషము అవుతోంది. ఛీ! నీలాంటివాడికి తిండిపెట్టడంగూడా పాపమే! నువ్వు నాదగ్గర పనిచెయ్యక్కరలేదు. ఈ పూట నుంచీ మానేసెయ్యి! పో! నీమొహానికి ఎవడు పని ఇస్తాడో చూస్తాను" ఇలా నారాయణం కేకలు వేసేటప్పటికి అంత దురుసు వెంకాయీ నీరయిపోయాడు. ఉన్నవాడున్నట్లు కూలబడి "మన్నించండి బాబూ! ఈ తప్పకాయండి" అంటూ ఏడ్పు మొదలుపెట్టాడు. "వెధవ దొంగఏడుపులూ నువ్వూనూ! రాత్రి కళ్ళంలో గడ్డికింద దాచిన ధాన్యపుబస్తాలు తీయించి తోలుకు రండిరా అని వాళ్లతో చెప్పి నేను ఇంటికి చక్కా వస్తే నువ్వువెళ్లి గింజలు గుమ్మరించి తాలు మూటకట్టి తోలుకువస్తావా? నిన్నే నటరా నేను రక్షించాల్సింది? ఛీ! నీముఖం చూడగూడదు. లేచిపో అవతలకు!" అని గద్దించాడు నారాయణం. వెంకాయి లేవాలేదు; ఏడుపు తగ్గించనూలేదు. నారాయణం మాత్రం ఇంట్లోకి వెళ్లిపోయాడు. ఒక గంటసేపయాక నారాయణం బైటికివస్తే వెంకాయీ కనిపించలేదు, పాకలో

ఎక్కడా కనిపించలేదు. మరొక గంటసేపటికి వెంకాయి రాత్రి రాత్రే యానాది రంగడికిచ్చిన బస్తాలు వేసుకుని బండితోలుకుని వచ్చాడు. పది ధాన్యపుబస్తాలూ ఇంట్లోకి చేర్చేశాడు. తాలుబస్తాలు పదీ బండిలో వేశాడు. అరుగుమీద కూర్చున్న నారాయణం దగ్గఱకు వచ్చి నిలబడి మళ్లీ గోలపెట్టడం మొదలు పెట్టాడు. "ఈబుద్ధి మొదట్లోనే ఉంటే ఇంత అద్యోదికాదుగా! ఈమాత్రంభాగ్యానికి దొంగతనం ఎందుకురా వెధవా!" అని కోప్పడ్డాడు నారాయణం. నోట మాట రాక దణ్ణం పెడుతూ కూర్చున్నాడు వెంకాయి. అంతలో వాములకొడ్డిలో బళ్లుదింపి, తక్కిన పాలేళ్లుగూడా వామివెయ్యడంకోసం వెంకాయిని తీసుకుపోవాలని వచ్చారు. నారాయణం వాళ్లను గూడా మొహాలు వాచేటట్లు చీవాట్లు పెట్టాడు. ఒక్కరూ తలెత్తలేక పోయారు. చివఱకు నారాయణం వాళ్లందఱివంకా చూస్తూ "ఒరేయి వెధవల్లారా! ఏమైనా కావలసి ఉంటే నన్నడగండి గాని ఇదేం బుద్ధిగా పాడుబుద్ధి! మనిషి బతుకంతా నమ్మకంమీద ఉంటుంది. అది చెడిందంటే ఎందుకూ పనికిరాడు. ఇప్పటినుంచైనా బుద్ధిగలిగి ఉండండి. మీరు ఆశించిన సొమ్ము నాకక్కరలేదు. మీరు దాచిన పదిబస్తాలూ మీరే తీసుకోండి. ఇప్పుడే పట్టుకుపొండి కావలసివస్తే! నాకభ్యంతరంలేదు. మీరు నమ్మకంగా పనిచేసే పక్షంలో ప్రతియేడూ మీకిట్లా పదిబస్తాల ఈనామూ ఇస్తాను. ఇక వెళ్లండి. పోయి మీమీపనులు చేసుకోండి!' అని అన్నాడు. దిగులు గుండెలు మిగులుగుండెలుకాగా ఆ నలుగురూ తలలు వంచుకుని తమతమ పనుల్లోకి వెళ్లారు.

నారాయణంయాజమాన్యం అట్లాంటిది. వెంకాయికైంకర్యం ఇట్లాంటిది. దీనికి ఎవరు ఏం చెయ్యగలరు?

అప్పటినుంచీ నాలుగేళ్లవఱకూ వెంకాయి మర్యాదగానే ఉంటూవచ్చాడు. కాని ఇటీవలనే మళ్లీ యథాప్రకార సిద్ధిరస్తు అయ్యాడు. దీనికి అసలుగుణం మినహాగా కారణాలుగా చెప్పుకోబడేవి అనేకం ఉన్నాయి.

3

లక్ష్మమ్మ చనిపోయిననాడు నారాయణానికి వెంకాయి కనిపించకపోవడానికిగూడా ఇటువంటి దుష్టబుద్ధే కారణం. అంతకు క్రితంరోజునే ధాన్యం అంతా ఇంటికి చేరవెయ్యడం అయిపోయింది. ఈ నాలుగేళ్లబట్టీ బుద్ధిగానే ఉన్నాడుగదా అని బాధ్యత అంతా వెంకాయిమీదే పెట్టి, ఎందుకైనా మంచిదని రాఘవయ్యను కాస్త చూడమని చెప్పి, తప్పకవచ్చిన పనిమీద పొరుగూరువెళ్లి నారాయణం ఆరాత్రే వచ్చాడు. రాత్రి పూర్తిగా గడిచిందో లేదో లక్ష్మమ్మ అకస్మాత్తుగా చనిపోవడం జరిగింది.

ఉదయాన్నే లక్ష్మమ్మ మృతివార్త విన్న వెంకాయి పొలంకాపలా మిన పెట్టి అక్కడే కూర్చున్నాడు. ఈసారి అతను తక్కిన పాలేళ్లను తనతో కలుపుకోలేదు. దాచిందిగూడా అట్టే ఎక్కువలేదు. ఒక్క అయిదుబస్తాలుమాత్రమే! ఈసారి ఈపని చెయ్యడానికి అతనికి పాపం పెద్ద అవసరమే వచ్చింది.

అసలు వెంకాయి గూడెంలోకల్లా ఎఱ్ఱటివాడైన కారణంచేత కొంచెం అందమైన మనిషి. సహజంగా మంచి భారీవిగ్రహం. కష్టపడి పనిచేసేవాడు కాబట్టి కండలుతిరిగిన శరీరం. కొంచెం షోకిల్లా పురుషుడైన కారణంచేత పెంచి మెలితిప్పిన మీసాలు. వీనితోనే అతను గూడెంలోకల్లా రసికశ్రేష్ఠు డనిపించుకున్నాడు. వీనికితోడు విశేషంగా మద్యపానం కల్పించిన నేత్రాంతాల్లోని రక్తిమ అతని రాసిక్యాన్ని ఇనుమడింపజేసింది. అతడు తన రసికతను స్వకాంతకు వెలిగా ప్రదర్శించడానికి ఈ ఏడే-గూడెం అంతా కోతల్లోకి దిగిన కొత్తరోజుల్లో-అవకాశం లభించింది. అప్పుడు ఆ ఊరి కొక యానాదివేషగాళ్ల ముఠా వచ్చింది. అప్పుడప్పుడే నాలుగుడబ్బులు చేతుల్లో పడుతూఉన్నందువల్ల గూడెంవాళ్లందఱూ కలిసి ఒకనాటకం వేయించారు. అది పారిజాతాపహరణం. ఆనాటకంలో ఒక కులంచెడ్డ స్త్రీ సత్యభామపాత్ర ధరించింది. ఆమె సామాజికుల్లో నారాయణం ఇచ్చిన తెల్ల దుస్తులలో మిలమిలా మెరుస్తున్న ఇతనివంక చూచి

కనుసంజ్ఞలు చెయ్యనారంభించింది. వెంకాయి పూల రంగడయి ఓరచూపులు చూస్తూ విూసం పైకి దువ్వాడు. అంతే! ఆ స్త్రీ ఆ ముఠాను వదలిపెట్టి రహస్యంగా ఊరిబయట వెంకాయి నాశ్రయించింది. ఆమెకోసం వెంకాయి తన ఊరుకు పక్కనున్న ఊళ్లో ఒక చిన్న గుడిసె వేసిఇచ్చాడు. తన ఇంట్లో గింజలు పెళ్లాంతో పోట్లాడి ఒక బస్తా లాక్కుని తీసుకునిపోయి దాని ఇంట్లో పడేశాడు. నారాయణం ఇచ్చే పైఖర్చు సొమ్ము తన కులాసాలు సాగించుకోవడానికి రావి ఏ మాత్రమూ ఇవ్వదు. దానిదగ్గఅ తాగుడుకు లాగే టప్పటికే యమయాతన అవుతోంది. ఇక దీనికికూడా ఎక్కడ ఏడవగలడు? అందుకోసం ఈ దొంగతనం చెయ్యవలసివచ్చింది. ఇది పైకి కనబడే కారణాల్లో ముఖ్యమైనది. కాని నిజానికి వెంకాయి తలుచుకుంటే పాలేరుతనంలో ఉండీకూడా పైపనులు చేసి వెధవ అయిదుబస్తాలు అవసరమయితే సంపాదించలేకపోడు. అయితే ఏం? వాడి బుద్ధి అట్లాంటిది.

లక్ష్మన్న చనిపోయిననాడు పాలేళ్లు ఊళ్లోకి వెళ్లిన సమయం చూచుకుని, బళేపీలు దొరికిందిగదా అని గొడ్లకాపరిబుడ్డాళ్లను బెదిరించి గడ్డికడియం చూస్తూ ఉండండని ఆ అయిదు బస్తాలూ బండిమీద వేసుకుని దానిఇంటికి చక్కా పోయాడు వెంకాయి. లక్ష్మన్నమరణం ఇటు యజమాని కెంత దుఃఖం కలిగించిందో అటు పాలేరు కంతసంతోషం కలిగించింది. లోకంలో ఎవరి సుఖదుఃఖాలైనా ఇంచుమించు ఇంతేనేమో!

లక్ష్మన్నమరణంతో ఆర్ద్రహృదయుడైన నారాయణం వెంకాయి కనిపించకపోవడాన్ని గమనించనేలేదు. ఆమర్నాడు ఉదయం దైన్యభావం ముఖంలో సూచిస్తూ వెంకాయి కనబడేటప్పటికి నిద్రతో కొద్దిగా వెనకబట్టిన నారాయణందుఃఖం మఱొకమాఱు పోటుపొడిచింది.

వచ్చిన కన్నీళ్లను తుడుచుకుంటూ - "ఏరా వెంకా! రామన్నను చూశావురా, ఎట్లా ఉన్నదో?"

"చూడకేం బాబయ్యా! మేతమెయ్యడంలేదు." అన్నాడు వెంకాయి.

"అవునురా! మేత ఎట్లా మేస్తుంది? నాకే ఇంతదుఃఖంగా ఉంటే దానికడుపులో ఎంతదుఃఖం ఉందో పాపం!"

"చిత్తం బాబయ్యా! నోరులేని గొడ్డు; అదేం చెప్పకోగలదు?"

"అదేమ్మాటరా వెంకా! మనకు తెలియదు గాని పశువు నిజంగా ఆరూపంలో ఉన్న దేవతరా! నిన్న ఉదయం లక్ష్మన్నను తీసుకుపోయి వాముల దొడ్డిలో పాతిపెట్టేటప్పుడు రామన్న ఏడ్చిన ఏడ్పు ఇంతా అంతా కాదుగదా! చివఱికి పూడ్చిపెట్టాక అంతా వెళ్లిపోయారు. రాఘవయ్యా, నేనూ, రామన్నా మిగిలాము. రాఘవయ్యబలవంతంమీద నేనూ బయలుదేరాను. రామన్నను ఇంటికి తోలుకు వద్దామని ఎంతో ప్రయత్నంచేశాము. అది కదలనే లేదు. చివఱికి రాఘవయ్య వాములో గడ్డిదీసి దాని ముందు పడేశాడు. నువ్వు నమ్ముతావో నమ్మవోగాని అది వాసనైనా చూడలేదు సుమా! ఏం చెయ్యడానికీ తోచక దాన్ని అక్కడే ఉంచి ఇంటికి వచ్చేశాం. ఇంత కంటే ఎక్కువ ఏం చెప్పాలి వెంకా? వాటిబుద్ధిముందు నిజంగా మనం పశువులం అని పిస్తుంది. ఏమంటావ్?"

వెంకాయి కీమాటలు మనసులో శూలాల్లా గుచ్చుకున్నాయి. నారాయణం తన దుఃఖం ఒలకబోసుకున్నాడేగాని ఈమాటలు అనాలని అనలేదు. ఏదో ఆలోచిస్తున్నట్లున్న వెంకాయిని చూచి నారాయణం "ఏమిటిరా ఆలోచన!" అన్నాడు.

"ఏంలేదు బాబయ్యా! వాటి బుద్ధిమాటే అనుకుంటున్నాను. మా దొడ్డబుద్ధండి వాటిది!"

"సరేగాని వెంకా! లక్ష్మన్నకూ, మనకూ ఋణం తీరిపోయింది. ఇక రామన్నైనా మనకు... ..." అని సగంలో ఆగిపోయాడు నారాయణం.

"అట్లా అనుకోగూడదు బాబయ్యా! రామన్న కొత్తలో ఇట్లా ఉన్నా నాలుగునెలల్లో మళ్లీ మామూలుగా అయిపోతుంది. ఈలోగా మనం దానికి దీటైన ఎద్దు సంపాదించి జతగూర్చామంటే మఱీ తొరగా పరిసిపోతుంది విచారం" అన్నాడు వెంకాయి,

నారాయణానికి ఈమాట అంతగా నచ్చలేదు.

"నువ్వు అన్నమాట నిజమేకావచ్చును గాని వెంకా! రామన్నకు సమానమైన ఎద్దు దొరుకుతుందంటావా ఎక్కడైనా?"

"దొరక్కేం బాబయ్యా! మనం డబ్బుపుచ్చుకు తిరగాలిగాని మాచక్కగా దొరుకుతుంది. రాండి పోదాం ఇయ్యాల. ఎల్లుండి పాటికి మళ్లీ లచ్మన్నను పట్టుకొచ్చామన్నమాటే!"

వెంకాయి ఈమాటలు అంటూంటే అన్నపూర్ణమ్మ సమ్మంలోకి వచ్చి "నిన్నవల్లా కనబడనేలేదేమిరా వెంకా!" అని అన్నది.

"గడ్డిమోసుకుంటూ పొలంకాడే పడిఉండానమ్మా! ఇక్కడేమో ఇట్లా జరిగింది. రాలేకపోయాను" అంటూ ఎక్కడలేని విచారమూ వెలిబుచ్చాడు వెంకాయి.

బాష్పరుద్ధమైన కంఠంతో "ఒరే వెంకా! నువ్వు పోయి పనులన్నీ త్వరగా కానీ. నాలుగు రోజుల్లో మనం బయలుదేరదాం" అన్నాడు నారాయణం.

"చిత్తం బాబయ్యా!" అంటూ వెంకాయి సెలవు పుచ్చుకున్నాడు.

౪

ఆ మూడురోజులూ వెంకాయి రాత్రిళ్లు పారగూరూ, పగళ్లు పొలమూగా విహరించాడు. యజమాని ఇంటిముఖమూ చూడలేదు, తన ఇంటిముఖమూ చూడలేదు. దీన్ని చేరదీసిన మర్నాడే "బాలుగోరి ఇంటికి వెళ్లావంటే నెత్తురు కళ్లచూశానన్నమాటే" అని పెళ్లాన్ని మంచితెలివిలోనే బెదిరించిపారేశాడు. ఆ అమాయికపు రామి హడిలిపోయి అప్పటినుంచీ గుడిసె ఇవతలకు అడుగువెయ్యడమేలేదు. వెంకాయికి తన దిలాసా ఏమో తనేమో! రామిగోడు అతనికి అవసరమే లేకపోయింది.

రోజూ సాయంత్రం కాగానే మామూలుకంటె ఎక్కువగా తాగేవాడు. సరాసరి కాళ్లు ఈడ్చుకుంటూ దాని ఇంటికి చేరుకునేవాడు. ఈ మూడో రోజు సాయంత్రం ఇంకోలోటా ఎక్కువ తాగి దాని ఇంటికి చేరుకున్నాడు. ఆ పరవశత్వంలో ఆనాడు వెంకాయి ఒక్క కల్లుకే కాకుండా దానికిగూడా దాసుడైపోయాడు. ఆ ఆటకత్తె ఎట్లా ఆడిస్తే అట్లా ఆడుతున్నాడు. ఆరాత్రి ఆసుందరి అతనిపక్కన జేరి 'వెంకా' అని పిలిచింది. ఆ పిలుపులో వెంకాయి అమృతమే తాగాడు. తన ప్రియురాలి కళ్ళల్లోకి చూచాడు. గట్టిగా చేతులు చుట్టేశాడు. ఆ బిగువు సడలించుకుంటూ ఆసుందరి "నువ్వు ఎప్పుడూ ఇంతే! దీనికేంగాని మనం ఎప్పుడూ ఈపాకలోనేనా ఉండడం?" అని గునుస్తూ అన్నది. వెంకాయి తాగిన ఉద్రేకంలో ఉన్నాడు. "ఛీ! ఈపాకేమిటి? నువ్వు నా రాణివి. చూడు, రెండేళ్లలో నిన్ను మేడలో కూర్చోబెడ్తాను. ఈపని చెయ్యలేకపోతే నాపేరు వెంకాయికాదు"అంటూ మీసం మెలివేశాడు. వెంకాయిని గట్టిగా కుదిపి మైకం వదిలిస్తూ "నిజమేనా? తాగిన మైకంలో అంటున్నావా?"అని కొంచెం ఎడంగా తోసింది ఆ అమ్మాయి. "ఏమన్నావు? నేను తాగానా? అవునవును. ఎప్పుడో తాగాను. ఆ మజా అయిపోయింది. ఓసి నాగువ్వా! నిన్ను నిజంగానే నారాణిని చేసేసుకుంటాను"అన్నాడు వెంకాయి. ఈమాట లన్నప్పుడు వెంకాయికి నిజంగానే తెలివి ఉంది. దీన్ని అంతదాన్ని చెయ్యాలనీ, తాను రాజభోగం అనుభవించాలనీ అతని హృదయంలో గాఢమైన అభిలాషే ఉంది. అటువంటి కలలే కంటూ ఇరువురూ గూడా ఆరాత్రి హాయిగా నిదురించారు.

మర్నాడు ఉదయమే వెంకాయి పొలంలోకి వెళ్లి ఇదివరకు పాలేళ్లు చెయ్యగా మిగిలిన కురదలా పనులన్నీ ఆపూటే ముగించివేసి నారాయణందర్శనం చేశాడు. ఈ మూడురోజులూ నారాయణం ఒక్క రామన్నను చూడడానికి వెళ్లివస్తూఉండడంతప్ప ఇంట్లోనుంచి బైటికి కదలనేలేదు. ఏపూట ఎంతవఱకైందీ చిన్నపాలేళ్లు వచ్చి చెపుతూవచ్చారు, అతను ఊకొడుతూ వచ్చాడు. అంతే! ఈ వేళ వెంకాయి కనబడీకనబడడంతోటే "ఏరా వెంకా! ఇంకా ఎప్పు

తురా బయలుదేరడం ? ఎంతవరకూ అయ్యాయి పనులు ?!" అన్నాడు నారాయణం.

"పని అంతా పూర్తి అయితేగాని మీకు కనబడకూడ దనుకున్నాను. పూర్తిచేసేశాను. ఇక మీరు ఎప్పుడంటే అప్పుడే" అన్నాడు వెంకాయి.

"అయితే రేపు ఉదయమే బయలుదేరదాం. మా ఇంటికాడ గింజలూ గట్రా ఉన్నాయో లేదో కనుక్కొని, అవసరమయితే రెండుబస్తాలు పడేయించు. అవి అయేలోపల రాగలంగదా! తర్వాత చూచుకుందాం" అన్నాడు నారాయణం.

"చిత్తం బాబయ్యా!" అని వెంకాయి సెలవు తీసుకున్నాడు.

ఆ రోజునే తన ఇల్లూ, వాములదొడ్డీ, గొడ్డూ గోదా కాస్త చూస్తూఉండమని రాఘవయ్యకు అప్పచెప్పాడు నారాయణం. తాను వచ్చేవరకూ అవసరమయితే రామిని మనఇంటిదగ్గరే పడుకోమని చెప్పమని భార్యతో చెప్పాడు.

"గొడ్లు చాలా గిరాకీగా ఉన్న రోజులుగదా! ఎటుపోయి ఎటు రావలసివస్తుందో తెలియదాయె! రామన్నకు దీటైన ఎద్దు ఎక్కడైనా కనబడ్డా దాని ఆసామి అమ్ముతానంటాడో అమ్మనంటాడో! కొంచెం ఎక్కువగానే ఆశపెట్టాలి!" అని ఆలోచించుకుని రెండువేలు ఎద్దుకనీ, ఒకవెయ్యి ఖర్చుకనీ మొత్తం మూడువేలు మూటకట్టాడు. కొత్త ఎద్దుకూ,రామన్నకూ స్నేహం కుదురుతుందో కుదరదో, తీరా తెచ్చాక ఇబ్బందిపడవలసి వస్తుందేమో, ఎందుకైనా మంచిదని రామన్ననుగూడా వెంట తోలుకువెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు.

రామన్న ఈ మూడురోజులూ వాములదొడ్లోనే ఉన్నది. మొదటిరోజు గడ్డి ముట్టలేదు గాని రెండో రోజునుంచీ వాముమీద పడి కొద్దికొద్దిగా మేస్తూనే ఉన్నది. అక్కడే ఒకతొట్టి వేయించి నారాయణం నీళ్లు పోయిస్తూవచ్చాడు. ఆ నీళ్లు తాగి ఆ గడ్డి తిని రామన్న అక్కడే పడిఉన్నది. ఆరోజు సాయంత్రం నారాయణం రేపే ప్రయాణంగదా అని రామన్నను ఇంటికి తోలుకువద్దా మనుకున్నాడు. సరాసరి వాములదొడ్డికి వెళ్లేటప్పటికి లక్ష్మన్నను పాతిన చోటుకు దగ్గర్లో పడుకుని నెమరువేస్తోంది రామన్న. నారాయణం తలుపుతెరిచి లోపలికి వచ్చేటప్పటికి రామన్న లేచి నుంచుంది. అతను మెల్లగా దానిదగ్గరకు వెళ్లి వెనక జబ్బలమీద చేత్తో తట్టాడు. ఆ తట్టడంలో ఏం భావ ఉందో ఏమో రామన్న పెండెంవైపు నాలుగు అడుగులు వేసింది. నారాయణం ఆనందతన్మయుడై నిలబడ్డాడు. పెండెందాకా వెళ్ళిన రామన్న ఎందుకో చటుక్కున ఆగి ఒక పెద్దఅంకె వేసింది. అకస్మాత్తుగా వెనక్కుతిరిగి వేగంగా లక్ష్మన్నను పాతిన చోటుదగ్గరకు వచ్చి ఆస్థలం అంతా మూచూచింది. నారాయణం ఉబికివస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ దాని అబ్బు గోకాడు. అబ్బు గోకించుకుంటూనే నాలు గయిదుమాట్లు అంభా అంభా అని అరిచింది రామన్న. నారాయణం దుఃఖభారం సహించలేకపోయాడు. ఒకచేత్తో గుండెనూ, ఒక చేత్తో తలనూ పట్టుకుని పెండెంవైపుకు నడిచాడు. అతని వెంబడే రామన్నా బయలుదేరింది. నారాయణం గమనించనేలేదు. రోడ్డు ఎక్కాక రామన్న మళ్ళీ అరిచింది. ముఖంలోకి పొంగి వస్తున్న దుఃఖంతో నారాయణం వెనుదిరిగిచూచాడు. రామన్న తన వెంబడి వస్తోంది. ఆపేక్షతో దాని అబ్బు గోకాడు. మళ్లీ వెనకతట్టు మెల్లగా తట్టాడు. రామన్న సరాసరి ఇంటిదారి పట్టింది. నారాయణం దాని వెంబడే ఇంటికి వచ్చాడు.

ఆ రాత్రి దీపం పెట్టుకుని నారాయణం రామన్నను అలంకరించాడు. పదిమాట్లైనా లేచి మేత చూచాడు. దాని నిద్రలో తన నిద్ర, దాని తిండిలో తన తిండి, దాని క్షేమంలో తన క్షేమం చూచుకుని తృప్తిపొందాడు.

వాములదొడ్డిపెండెం తీసివచ్చిన సంగతి తెల్లవారుజామున వేసివచ్చిన వెంకాయి చెపితేగాని నారాయణానికి తెలియలేదు.

వెంకాయి వచ్చినతక్షణమే అతన్ని వెంటబెట్టుకుని, ముందు రామన్నను తోలుకుంటూ, లక్ష్మన్న నన్వేషించడం కోసం బయలుదేరాడు నారాయణం.

౫

అదిమొదలు తన ఊరుకు చుట్టుప్రక్కల ఏభై మైళ్ల దూరంలో నారాయణం తిరగని ఊరు లేదు. ఆహద్దులో ప్రతిపల్లెనూ, ప్రతిగ్రామాన్నీ గాలించి విడిచిపెట్టాడు. రామన్ననూ లక్ష్మన్ననూ చూచిన కళ్లతో ఆయాఊళ్లల్లో ఎడ్లను చూస్తే వాటినీ వీటినీ ఒకేజాతిగా ఎంచడం తప్పు అనిపించింది. ఈరెంటినీ తనకు పరమశివుడు కేవలం వరప్రసాదంగా ఇచ్చాడన్న నమ్మకం దృఢపడింది. అటువంటివాటిలో లక్ష్మన్నను కోల్పోయిన తనకు దానికి దీటైనది ఇంకోటి దొరుకుతుందనే ఆశ పెట్టుకోవడం కట్టి ప్రయాస అనిపించింది.

రామన్నను చూచిన ప్రతివాళ్లూ ముక్కుమీద వేలువేసుకుని ఆశ్చర్యపడేవాళ్లే! ప్రతివాళ్లూ అటువంటిది మనకుంటే ఎంత బాగుండునని ఆశపడేవాళ్లే! కాని వెంటనే వాళ్లంతట వాళ్లే అటువంటిది ఇంకోటి మనదగ్గఱ లేదుగదా, మఱి ఎక్కడైనా సంపాదించినా మనం ఎక్కడ నిభాయించగలం వీటిని అని నిరాశపడుతూనేవచ్చారు. కొందఱుకొందఱు మోజుపడి ఒంటరిదైనా సరే అటువంటిది మనదగ్గఱ ఉంటేనే చాలునని దాన్ని కొనాలని నారాయణాన్ని అడిగి అతని కోరిక తెలుసుకుని దిగులుపడి వెనక్కు తగ్గారు.

ఈ ప్రయాణంలో రెండోఊరు దాటినదగ్గఱ నుంచీ నారాయణానికి ఒక విషయంలో అమిత భయం ఏర్పడింది. అది ప్రతివాడికన్నూ రామన్నమీదే పడుతూ ఉండడం. ఆభయంతో అతడు ప్రతిపూళ్లోనూ దేవతలకు కొబ్బరికాయలు కొట్టి దిష్టితాళ్లు వేయిస్తూనేవచ్చాడు. ఇంతదాకా వచ్చేటప్పటికి వెంట్రుకలతాళ్లు రామన్న నాలుగుకాళ్లనూ నిండిపోయాయి. అప్పటినుంచీ చూచేవాళ్ల చూపులన్నీ ఆ వెంట్రుకలతాళ్లమీదే పడుతున్నాయి. ఇక భయం లేదనుకున్నాడు నారాయణం. కాని అటువంటి ఎద్దును కలిగివున్న తనమీద జనుల చూపులు పడుతూవుండడం అతను గమనించనేలేదు.

చిట్టచివఱకు ఇబ్రహీంపట్టణానికి వచ్చినాకూడా తనకు కావలసిన ఎద్దు దొరక్కపోయేటప్పటికి నారాయణానికి పూర్తిగా నిరాశ అయిపోయింది. "ఇక పోదాం పదరా వెంకాయి" అన్నాడు నారాయణం. వెంకాయి కింకా ఆశపోలేదు. మన ప్రయత్నం ఫలించేదాకా మొదలుపెట్టిన పని మానివెయ్యగూడదని బాగా నచ్చచెప్పాడు. ఇంతవఱకూ నారాయణం చూడగలగడానికైనా వెంకాయి ప్రోద్బలమే ముఖ్యకారణం.

మళ్లీ నడక సాగించారు. ఊళ్లు చూస్తున్నారు. ఎక్కడా దొరకడం లేదు. ఒక్కొక్క వూరే విడిచిపెట్టి సాగిపోతున్నారు.

అట్లా వెళ్లి వెళ్లి చిట్టచివఱకు నందిగామ సమీపించారు. అది గోధూళిసమయం. అప్పుడే పొలాల నుండి గొడ్లన్నీ ఇళ్లకు మళ్లుతున్నాయి. అప్పటికి సంక్రాంతిపండగ వెళ్లింది కాబట్టి ఆ మెట్ట వూళ్లల్లో ఇంచుమించు పొలంపనులన్నీ అయిపోతాయి. అందుచేత అవి పశువులన్నీ విశ్రాంతి ననుభవించే రోజులు. కోసిన జొన్నచేలల్లో ఇగురుపట్టిన చొప్పా, బీళ్లల్లో మంచుకు సేవలంగా పెరుగుతున్న గడ్డీ కడుపులనిండా మేసి కాలికొద్దీ యథేచ్ఛగా తిరిగి పశువులు ఋష్యవారణతోపాటు విశ్రాంతి సుఖా న్ననుభవిస్తున్నాయి. మానరూపాన విజయగానం చేస్తూ క్రమశిక్షణలో తీర్చి నడిచే శాంతి సమరసైనికులవలె బారులుగట్టి వెళ్తున్న ఆ గోలోకాన్ని చూచి నారాయణంమనస్సు కుదుటబడింది. అతనికి తన ఆశ ఫలోన్ముఖమైన ట్లనిపించింది. వెంకాయి తన పట్టు సెగ్గినట్లే పరవళ్లుతొక్కాడు.

ఆరాత్రి వాళ్లు ముగ్గురూ వూరిబయట చెట్టుకిందే మకాం వేశారు. నారాయణమూ, వెంకాయీ ఏదో ఇంత తిని గొంగళ్లు ముసుగుపెట్టి పడుకున్నారు. రామన్నమాత్రం పక్కవూరునుంచి వెంకాయి మోసి తెచ్చిన గడ్డిమోపులో సగం పక్కపఱుచుకుని తక్కిన సగంలో సగం తిని బ్రూగన్నుపెట్టి జాగ్యంశతో నిద్రాపోయింది; సామాంశతో పాలకభారమూ వహించింది.

మర్నాటిపుదయం నారాయణం ఆ చెట్టుకిందే రామన్నను పెట్టుకుని ఉండిపోయాడు. గొడ్లన్నీ

ఇచ్చే వస్తాయిగదా, పరీక్షగాచూచి వాటిల్లో కంటికి నచ్చింది ఏదైనా వుంటే ఆలోచిద్దామని అతని వుద్దేశం. వెంకాయిమాత్రం లేచీలేవడంతోటే యజమానితో చెప్పి వూరివెంబడి పడ్డాడు. ఇళ్లల్లో వాకబు చేసి, అమ్మతామన్న ఎడ్ల నన్నిటినీ చూచాడు. మిగిలిన వూళ్లల్లో వున్నంత నాసిగా లేవు ఇక్కడివి. దూరాన్నుంచి చూస్తే రామన్నతో సమానంగానే కనిపిస్తాయి. దగ్గలకుబోయి పరీక్షగా చూడగా కొమ్ములు బాగుండక పోవడమో, బక్కతోకఉండడమో, తప్పుడు సుళ్లువుండడమో ఏదో ఒక లోపం కనిపిస్తూనేవచ్చింది. ఇల్లాంటి లోపాలేవీ లేవుగదా అని కొన్నిటిని చూస్తే ముఖంలో పొత్తిగా కళ లేకపోవడం తటస్థించింది. కొన్నంటివి వట్టి ఆవుముఖా లయిపోయాయి. వెంకాయికేం చెయ్యడానికీ తోచలేదు. విసుగుపుట్టి దిగులుపడ్డ గుండెతో మకాం చెట్టు చేరుకున్నాడు.

అప్పటికి నారాయణం చికుకులు పోగేసి తాటేటికాయలో నీళ్లతోనే కూడు ఉడకవేశాడు. వచ్చిన వెంకాయిముఖం చూచి సంగతంతా గ్రహించాడు. "సరేరా! గిన్నె తీసుకో! కూడు తిందుగాని. తర్వాత ఏమైతే అదే అవుతుంది"అన్నాడు. గోగాకు పచ్చడి వేడిఅన్నంలో కలుపుతూ వెంకాయి తాను చూచిన వివరమంతా సగం ఆశ్చర్యంతో, సగం దిగులుతో చెప్తున్నాడు యజమానికి. నారాయణం అతను చెప్పేది వింటూ, మధ్య మధ్య దిగాలుపడి చూస్తూ తన భోజనం తాను కానిచ్చాడు.

అప్పుడు పదిగంటలవేళ అయింది. రోడ్డువెంబడి పశువులు అప్పుడప్పుడే మందలుమందలుగా బయలుదేరి వస్తున్నాయి. వస్తున్న పశువుల్ని చూచి రామన్న లేచి నిలబడి మేత మేస్తూ అప్పుడప్పుడు అరుస్తోంది. నారాయణం అప్పుడే లేచి రెండోతాటేటికాయ నీళ్లతో చెయ్యి కడుక్కొని రోడ్డుపక్కనే నిలబడి కంటికి నచ్చినట్టు కనబడ్డ ప్రతియెద్దునూ చూచాడు. గంటసేపు అట్లా గొడ్లు వస్తూనేఉన్నాయి. నారాయణం వాటివెంబడి తిరిగి చూస్తూనేఉన్నాడు. మటీ నచ్చినట్లు కనబడ్డ ఒకొక్కొక్క ఎద్దును చూస్తూ ఒకొక్క ఫర్లాంగు నడిచాడు. అందాకా పోయాక బాగు లేదనుకోవడం, వెనక్కి నాలుగుఅడుగులు వెయ్యడం, అంతలో మరొకటి ఏదో నచ్చినట్లనిపించడం, మళ్లీ దానివెంబడి పోవడం, వెనక్కి తిరగడం - ఇట్లా మకాం చెట్టునుండి మైలుదూరం తనకు తెలియకుండా నడిచాడు. ఇక గొడ్లురావడం లేదు. చేతులు కట్టుకుని, తలవంచుకుని, మెల్లిగా అడుగు దీసి అడుగు వేస్తూ వెనక్కి వచ్చేశాడు. అంతా వెంకాయి చెప్పినట్లే అయింది.

చెట్టుకిందికి వచ్చి రామన్న పక్కన నుంచున్నాడు. రామన్న సంతోషంతో తల ఆడించి మువ్వల పట్టెడ మోగించింది. అతని చెయ్యి రామన్న అట్టుగోకింది. చూపుఎదురుగా చింత చెట్టుమ్రాను చూస్తోంది. మనసు ఎక్కడున్నదో, ఏలోకాల్లోకి పోయిందో!

కాసేపుండి వెంకాయి యజమానిదగ్గఱ పైకం తీసుకుని ఎద్దుమేతకోసమూ, చుట్టపొగాకుకోసమూ ఊళ్లోకి వెళ్లాడు. అప్పటికి పదకొండు దాటిందేమో! నారాయణం అట్లాగే రామన్నపక్కనే నిలబడినిలబడి ఎదురుగా చూచిచూచి దాని వకుమువిూదే కళ్లుమూసుకుని తల వాల్చాడు.

పదినిమిషాలు అతినిశ్శబ్దంగా గడిచింది.

అంతలో రామన్న 'అంభా' అని అరిచింది. వెంటనే మఱొక అంభారవం వినపడింది.

నారాయణం ఉలిక్కిపడి తల ఎత్తాడు. రామన్నచేత అట్టు నాకించుకుంటూ దానిముందున్న గడ్డిపరకలు నములుతున్న ఎద్దును చూచి తానున్న దెక్కడో నమ్మలేకపోయాడు. కంగారుపడి కళ్లుతుడుచుకుని చూచాడు. ఇతని కంగారు చూచి వాటి కెదురుగా చేతికఱ్ఱతో, బుట్టతలపాగతో త్రిభంగిగా నిలబడిఉన్న గొల్లకుఱ్ఱవాడు భయపడి తన ఎద్దును అదిలించాడు. ఆఎద్దు అరుస్తూ ముందడుగు వేసింది. రామన్న తల త్రాడు లాక్కుంటూ అరిచింది. నారాయణం "ఉండు అబ్బాయి"అంటూ వెంటబడ్డాడు. నడుస్తున్న ఎద్దును వీపుమీద తట్టి ఆపాడు. అట్టుగోకుతూ కాసేపు నిలబెట్టాడు. ముఖం చూచాడు, ముక్కు చూచాడు. మూపురం చూచాడు, ముందుభాగం చూచాడు. తోక

చూచాడు, తోకకుచ్చు చూచాడు. నడుం చూచాడు, నాణ్యం చూచాడు. రంగు చూచాడు, శృంగారం చూచాడు. రెండు చేతులతోనూ ఒకమాటు ఒళ్లంతా తడివి చూచాడు. అంతా తన లక్ష్మన్నే! దోరదానికి లక్ష్మన్న అనీ, కత్తిదానికి రామన్నఅనీ తనే పేర్లు పెట్టుకున్నాడు. ఆనందం పట్టలేక నారాయణం ఎగిరి గంతువెయ్యడం మొదలుపెట్టాడు. ఆ గొల్లబ్బాయి "మాఎడ్లు పోతున్నాయిసామీ! దీన్ని విడిచిపెట్టు!" అంటూ నారాయణందృష్టి నాకర్షించాడు. నారాయణం తన చొక్కా జేబులోంచి పది రూపాయల నోటు తీసి వాడి చేతికిచ్చి "నువ్వు చాలా మంచి వాడివి. దీన్ని తీసుకో! నన్నూ, నారామన్ననూ బతికించావు"అంటూ అధికానందోన్మాదపరవశు డై పోయాడు. ఆనోటు చేత్తో పుచ్చుకుని "నాకెందు కయ్యా ఇదీ! నన్ను పోనియ్యి!"అన్నాడు గొల్లాడు. "ఎందుకేమిటిరా అబ్బీ! లక్ష్మన్న పేరు చెప్పి గుడ్డలు కుట్టించుకో!"అని ఎద్దువంక చెయ్యిచూపిస్తూఅన్నాడు నారాయణం. గొల్లవాడు ఉలిక్కిపడ్డట్లయి "దీనిపేరు లక్ష్మన్న అని నీ కెట్లా తెలుసు?" అన్నాడు. నారాయణం ఒకనిమిషం స్తబ్ధుడైపోయాడు. అంతలో తెలివితెచ్చుకుని "అవునులే! ఇది మాలక్ష్మన్నే! నాకు తెలుసు"అన్నాడు. ఇతని మాటలు విని నవ్వుతూ గొల్లవాడు ఎద్దును అదిలించాడు. నారాయణం నడుస్తున్న దానివంకే చూస్తున్నాడు. అతన్ని పిచ్చివాడనుకున్నాడో ఏమో కొంతదూరం పోయాక వెనక్కి తిరిగి ఆ గొల్లవాడు "ఏమయ్యోయ్! మాపటేళ చెట్టుకాడే ఉంటావా? ఆఇల్లే మాఅయ్యగోరిది. సందేళ తోలుకొస్తాలే"అని పదిరూపాయల కాగితం చేత్తో చూపిస్తూ అన్నాడు. ఎద్దువంక చూచిచూచి నారాయణం చెట్టుకిందికి వచ్చాడు.

ఈ ప్రయాణంలో మ్లానమైన నారాయణం ముఖం ఇప్పటికి శశాంక బింబ మయింది. కాని అతని మనసులో ఒక ఆందోళన బయలు దేరింది. "ఈ ఆసామి ఎద్దును అమ్మతాడో అమ్మడో! ఈయనగూడా ఎద్దును లక్ష్మన్న అని పిలుస్తాడుట! పశువుల్ని పేరుపెట్టి పిలుస్తాడంటే ఎంతో ప్రేమతో పెంచేవాడన్నమాట. బహుశా ఇంట పుట్టిందే అయి ఉండాలి. దేశాచారంబట్టి అయినా కాడిగట్టినట్లు కనబడడం లేదు. జతకుదర్చలేక ఊరుకున్నాడో ఏమో! ఒకటే ఎడ్లజత ఉండబట్టి అంత మోతుబరి కాడనుకోవచ్చు. అందుచేత ఎంత ప్రేమగా పెంచినా డబ్బు కాశపడవచ్చు. అయితే కొంపచూస్తే బ్రాహ్మణకొంప అనిపిస్తోంది. అంబోతుగా అచ్చు పొయ్యడానికి అట్టే పెట్టాడో ఏమో! భగవంతుడి దయ ఎట్లా ఉంటుందో! అంతా ఆయనదే భారం!" చెట్టుకింద చతికిలపడి నారాయణం మనసులో ఇట్లా గుంజాటనపడుతున్నాడు.

అంతలో ఊళ్లోకి వెళ్లిన వెంకాయి చొప్ప మోపుతో చక్కా వచ్చాడు. అతను తలమీది మోపు కింద పడవెయ్యకముందే "ఒరే వెంకా! లక్ష్మన్న కనపడ్డదిరా" అన్నాడు నారాయణం. మోపు అమాంతం కిందపడవేసి "ఎక్కడ ఎక్కడ, ఏదిఏది" అంటూ కంగారుపడ్డాడు వెంకాయి.

"రామన్నకు మేత వేసిరా, చెప్తాను"

ఒక్క ఊపున మోపుకట్లు తెంపేసి రామన్న ముందు మేత వేసి ఆత్యాతురతతో నారాయణం ముందు కూర్చున్నాడు వెంకాయి.

"ఏం చెప్పమంటావురా వెంకా? అంతా మన లక్ష్మన్నేరా! దాని పేరుగూడా లక్ష్మన్నేటరా! పైగా అది ఈఇంటిఆయనదేట! చూడు విచిత్రం. కలిసిరావడం అంటే ఇదేరా! మనం ఈ ఊరు వచ్చి వచ్చి ఇక్కడే మకాం వేశాము. మన తెలివితక్కువ చూశావా? మనపక్కన మనకు కావలసిందాన్ని పెట్టుకుని ఊళ్లో గొడ్లన్నీ వెదికాము. ఇంతకూ వేళ రావాలి! ఏమంటావ్? కాని, వెంకా, ఆయన అమ్మనంటాడేమో అని లోపల అనుమానం బాధపెట్టుతోంది రా. ఇంతకూ నీ తెలివితేటలూ, మన అదృష్టమూ దీంతో బయటపడాలి."

"నా తెలివిలో ఏముంది బాబయ్యా! చేతిలో డబ్బుంటేసరి, కొండమీది కోతికూడా దిగివస్తుంది."

"డబ్బు కేం భయం లేదురా వెంకా. ఇప్పటికి చేతిలో రెండువేలా అయిదు వందలకు పైగా ఉంది.

ఇంకా అవసరముంటే ఎల్లుండీపాటికి రాఘవయ్యకు తంతికొట్టి మళ్లీ తెప్పిస్తాను."

ఈమాట వినగానే వెంకాయిముఖం ఒకమాటు విప్పారి అంతలో వచ్చిన ఆలోచనతో కొంచెం కుంచించుకుంది. నారాయణాని కీమార్పు కనిపించ నియ్యకుండా వెంటనే సర్దుకుని "డబ్బు ఉందిగదా! ఇంకేం! మనకు దక్కక ఎక్కడికి పోతుందో చూస్తాను. ఏదీ! ఎద్దు ఇంటికాడ ఉందా ఇప్పుడు?" అన్నాడు.

"లేదురా! నువ్వు అటు వెళ్లాక నేను రామన్న దగ్గఱ నుంచున్నాను. అది మేతకు వెళ్తూ వైటికివచ్చి మన లక్ష్మన్న నుంచునేటట్లే రామన్న దగ్గఱ నుంచున్నదిరా. నేను రామన్న మీదే తలవంచి కళ్ళుమూసి నిలబడి ఉన్నాను. రెండూ ఒకదాని తరువాత ఒకటి అరిచేటప్పటికి ఆశ్చర్యపడి చూచాను. చూస్తే ఇది! ఎంత వింతో చూడు! అది సరాసరి మనదగ్గఱకే వచ్చింది. అయితే అది ఇప్పుడు మేతకు వెళ్లిందా, సందెవేళకు గాని రాదు. కాని నువ్వు పోయి ఆయన ఉన్నాడేమో చూచి, అమ్ముతాడో అమ్మడో కనుక్కురా! తర్వాత మన మిద్దఱమూ వెళ్లి మాట్లాడుదాం."

వెంకాయి లేచి వేగంగా అడుగులు వేస్తూ ఆయనఇంటి వేపుకు వెళ్లాడు.

ఆ ఇల్లు రోడ్డుకు పదిగజాలదూరంలో వుంది. చుట్టుపక్కల మరో ఇల్లు ఏదీ లేదు. ఊళ్లో స్థలం దొరకకనో, ఊరిబయట ఉండడం ఆరోగ్యకరమనో తన పొలంలో సేగాబోలు అబ్రాహాము చిన్న పెంకుటి భవంతి వేసుకున్నాడు. దానికి చుట్టూ ప్రహరీగోడ లేదు. వీధివైపు వసారా వున్నది. వెంకాయి వెళ్లి వసారాదిగువనే పందిట్లో మెట్లదగ్గఱ నిలబడి "అమ్మగారూ" అని కేక వేశాడు. "ఎవరువారు?" అంటూ అయ్యగారే వచ్చి తలుపు తెరిచారు. ఆయన అప్పుడే భోజనం చేశాడు కాబోలు, త్రేన్పుతూ గుమ్మందాటి వసారాగుంజ వానుకుని నిలబడి "ఏవూరు మీది? ఎందుకు వచ్చావ్?" అని ప్రశ్నించాడు.

ఆయన కనబడిన దగ్గఱనుంచీ చేతులుజోడిస్తూ "దణ్ణాలు బాబయ్యా! మాది నర్సన్నపాలెం లెండి. మాఊరికు దగ్గిఱ. తమకాడ ఒక ఒంటరెద్దు ఉన్నదని విని మాబాబుగారు పంపించారు" అన్నాడు వెంకాయి అతి వినయంగా.

ఆయన ఆశ్చర్యపడుతూ "అయ్యో! పాపం! అంతదూరంనుండి ఇంతవఱకూ వచ్చారా ఒక ఎద్దు కోసం!" అన్నాడు.

"అవునండి బాబయ్యా! మంచి భారీది దోరఎద్దు కావాలి. ఎక్కడా దొరకలేదు. ఇక్కడకు వచ్చాక తమకాడ ఉందని తెలిసింది. మావెంబడి మా ఎద్దును గూడా తోలుకువచ్చాము. రెంటికీ జతకుదురుతుందేమో అని ఆశగా వుంది. ఏంసెలవు బాబయ్యా!"

ఈమాటలు వింటూ రోడ్డుమీది చెట్టువంకకు చూచాడు అబ్రాహాము. ఆయనచూపు రామన్న మీదే పడింది, అక్కడే నిలిచిపోయింది.

వెంకాయిగూడా అవంకే చూస్తూ "అదే నండి మా బాబుగోరు. పిల్చుకురమ్మంటారా సామీ!" అన్నాడు.

ఆయన ఉలిక్కిపడి "పిలు! పిలు! ఇంకా చూస్తావేం? ఇవాళ పొద్దున్న లేస్తూనే గరుడదర్శనం చేశాను. వెతకబోయిన తీగ కాలికే తగిలింది" అన్నాడు.

వెంకాయి ఒక్క అంగన నారాయణాన్ని సమీపించి పిలుచుకువచ్చాడు. అబ్రాహాము అతి సంభ్రమంతో ఇంట్లోకిపోయి ఒకచాప తెచ్చి వసారాలో గోడఅంచున వేసి నారాయణాన్ని ఆహ్వానించాడు. ఆగామి సౌఖ్యాన్ని అనుసంధించుకుంటూ ఒళ్లంతా గగుర్పొడవగా నారాయణం కూర్చున్నాడు. వెంకాయి ఎద్దు నూడదీసి ఆయనకు చూపించాలని ఇంటిముందుకు తీసుకువచ్చాడు. అబ్రాహాము దాన్ని ఆవాలముఖపర్యంతం ఆశ్చర్యపడుతూ అవలోకించాడు. నారాయణాన్ని చూస్తున్న దానివీపుమీద చేత్తో రాస్తూ "పాలేరు చెప్పగా అన్ని సంగతులూ విన్నాను. నాదగ్గఱ ఒక దోరఎద్దు ఉంది. కాలితీరూ, ఒంటితీరూ అంతా దీని మాదిరే! నాదాని జతకోసం కష్టేది కావాలని దాని చిన్నతనంనుంచీ వెతు

కుతూ వచ్చాను. ఇన్నాళ్లకు దీన్ని చూసే అదృష్టం కలిగింది" అన్నాడు ఆ బ్రాహ్మడు.

అకస్మాత్తుగా తీవ్రమైన చలిగాలి తగిలినట్లు నారాయణం ఒళ్లు బిగుసుకుపోయింది. నోట మాట లేక గోడకు జేర్లబడి ఒరిగిపోయాడు. ఆ బ్రాహ్మడు హడలిపోయి కంగారుపడి నీళ్లు తెచ్చి ముఖాన చల్లి నానాపరిచర్యలూ చేశాడు. పావుగంటసేపటికి తెప్పరిల్లిన నారాయణం కళ్లు తెరిచి నాలుగువైపులా పరిశీలించిచూచి తనవంకే చూస్తున్న రామన్నను చూచుకుని స్పృతిలోకి వచ్చాడు. ఎద్దును పట్టుకునుంచున్న వెంకాయిని చూచి "అమ్మయ్యా!" అనుకున్నాడు. పాడివుత్తరీయం చేత్తో పుచ్చుకుని "ఆ తడిచి తీసి ఇది కప్పుకోండి" అంటున్న బ్రాహ్మడివంక తనవంక ప్రసరిస్తూవున్న సానుభూతిని గుర్తిస్తూ చూశాడు. ఇతడు పడిపోవడం విని వసారాలో వచ్చి కూర్చున్న ఆ బ్రాహ్మడి తల్లి ఎనభై ఏళ్ల ముసలిది ఇతనివంక అతిజాలిగా చూచింది.

ఇంతలో రామన్న అంకె వేసింది. అది నాందిగా నారాయణం పూర్తి తెలివి తెచ్చుకున్నాడు.

ఇంకా నిల్చుండేవున్న బ్రాహ్మణ్ణి చూస్తూ "గుడ్డ తడిస్తే ఇంతలో మునిగిపోయింది ఏమీ లేదు గానీండి సామీ తమరుగనక కూర్చుంటే ఒక్క మనవి చేసుకుంటాను" అన్నాడు నారాయణం.

ఆ బ్రాహ్మడు అప్రయత్నంగా కూర్చుండిపోయాడు.

అప్పుడప్పుడు కన్నీళ్లు పెట్టుకుంటూ, మాటి మాటికీ రామన్నవంక చూస్తూ, డగ్గుత్తికపడ్డ గొంతుతో రామలక్ష్మణులకూ, తనకూ గల సున్నిగ్ధభావాన్ని వివరించాడు నారాయణం. అతడు చెపుతున్నంతసేపూ ఆ బ్రాహ్మడు అత్యాశ్చర్యంతో తన్మయుడై విన్నాడు. గోడనానుకున్న ముసలమ్మగూడా చెవులొగ్గి విన్నది.

"అట్లాంటి లక్ష్మన్న నన్నూ, రామన్ననూ విడిచిపెట్టి తనదారి తాను చూచుకుంది" అని నారాయణం దుఃఖంతో మాటరాక ఆగిపోయాడు.

వెంటనే రామన్న గాఢదుఃఖసూచకమైన ఒక్క అరుపు అరిచింది. అందరూ ఆశ్చర్యపడి అటువైపే చూచారు.

ఒక్క నారాయణంమాత్రం మళ్లీ తనధోరణి అందుకుని "చూచారా బాబూ! దీని గుండెమెత్తదనం ఇట్లాంటిది. మనం ఏమనుకుంటున్నామో అంతా దానికి తెలుసు. లక్ష్మన్న పోయినప్పుడు దాంతో ఇదీ పోతుందనుకున్నాను. అట్లాకాక, స్వార్థం చంపుకుని రామన్న నాకోసం బతికిఉన్నది. నేను రామన్నను విడిచిపెట్టి బతకలేను. దాన్ని విడిచిపెట్టడమంటే నేను నాప్రాణాలు నాచేతులతో తీసుకోవడమే! ఇప్పటికే లక్ష్మన్న పోవడంతో సగంచచ్చి మిగతాసగం ప్రాణంతో రామన్నకోసం బతికిఉన్నాను. మీరు రామన్నమీద ఆశ సూచించినప్పుడు నాప్రాణం సొమ్మసిల్లిందంటే ఆశ్చర్యంలేదు. తమ దయవల్ల భగవంతుడు నన్ను బ్రదికించాడు. ఆయన నాకొక ధైర్యం చెప్పాడు. ఆ ధైర్యంతోనే ఈకథ అంతా తమకు విన్నవించుకున్నాను. ఇది వింటున్నంతసేపూ మీలో కలుగుతున్న ఆర్ద్రతను గమనిస్తున్నాను. మీ రిక రామన్నను కోరలేరు. నా రామన్న ఇన్నాళ్లకు ఈడుదయాన మీలక్ష్మన్న అబ్బు నాకింది. రామన్నా, లక్ష్మన్నా తమలో తాము మాట్లాడుకున్నాయి. అవి రెండూ ఒకటయాయి. రామన్న తిరిగి తన లక్ష్మన్నను సంపాదించుకుంది" అని అంటూ తన్మయుడై కళ్లు మూసుకున్నాడు.

ఆ బ్రాహ్మడు తలవంచుకుని కొల్లాయిగుడ్డతో కళ్ల నీళ్లు తుడుచుకున్నాడు.

అంతలో నారాయణం కళ్లు తెరిచి "ఏం బాబూ, చెప్పరేం? దీన్ని మీరు కాదనగలరా" అని అంటూ ఆయనచేతులు తన రెండుచేతులతోనూ పట్టుకున్నాడు. ఆ బ్రాహ్మడి గుండె నీరయిపోయింది. నోట మాట రాక గద్గదులుపడ్డాడు.

"ఏమిటో ఆలోచిస్తున్నట్టున్నారు? తమ ఔదార్యం వృథాపోదు. దీన్ని స్వీకరించి మమ్మల్ని ఆశీర్వదించండి" అని అంటూ పది వందరూపాయల నోట్లు ఆయనచేతుల్లో పెట్టాడు నారాయణం.

తన ఎద్దు అయినవండల విలువచెయ్యడమే ఘనమనుకుంటున్న ఆబ్రాహ్మడు ఇంతసామ్ముచూచి మఱీ నిశ్చేష్టుడైపోయాడు. నారాయణం ముడిచి పెట్టిన ఆయనచేతులు తమంతటతామే విడివడి కాగితాలు కిందికి జారిపోయాయి.

అప్పటికి సందవేళ అయింది. లక్ష్మన్న వస్తూనే అంకెవేసి రామన్నను పిలిచింది. రామన్న తిరిగి అంకెవేసి లక్ష్మన్న నాహ్వానించింది. అవి రెండూ ఒకదాన్నొకటి మూమూచుకున్నాయి. ఒండొంటితో ఒరసికొని గాఢాశ్లేషం కావించుకున్నాయి. ముఖంలో ముఖం పెట్టి చూచుకుని హృదయాలు కలుపుకున్నాయి. ఒక కంచంలోనే తినే అన్నదమ్ములవలె మూతీమూతీ కలుపుకుంటూ ఒక పోసులోనుంచే చొప్పదంట్లు లాగి నమిలాయి.

ఆ బ్రాహ్మడు అపుకోలేని తమకంతో "సుఖమస్తు నిత్యం" అని మనసులో ఆశీర్వదించాడు.

పాలు తీసి పశువులను కట్టివేసి ఇంటికివెళ్తున్న గొల్లకుఱ్ఱవాణ్ని పిలిచి "నీమాట నిలబెట్టుకున్నావురా" అంటూ మఱొక పదిరూపాయలనోటు అతని చేతిలో పెట్టాడు నారాయణం. వాడు విస్మితుడై పిచ్చిచూపులు చూస్తూ నమస్కరించి వెళ్లిపోయాడు.

ఎప్పుడు వెళ్లాడో, ఎటు వెళ్లాడో ఏమో అంతకుముందు చాలాసేపటినుంచీ వెంకాయి అక్కడ లేడు.

౬

ఆ బ్రాహ్మడు ఎంత బలవంతంచేసినా ఆరాత్రి నారాయణం ఇంట్లో పడుకోడానికి ఒప్పుకోలేదు. ఎడ్లను పాకలో కట్టివెయ్యడానికీ ఒప్పుకోలేదు. తాను వాకిటివసారాలోనే ఆయన ఇచ్చిన మడతమంచంమీద పక్క వేసుకున్నాడు. ఎడ్లను రెంటినీ వసారాకు దిగువగా గుంజలు పాతించి కట్టివేశాడు. మంచంమీద కూర్చుంటే చేతికి ఎడ్లతలలు అందేటంత చివఱగా వసారాఅంచువెంబడే మంచం వేసుకున్నాడు. ఆ బ్రాహ్మణాయన భోజనం అయేవఱకూ అప్పుడప్పుడు ఎడ్లవీపులు నిమురుతూ, అట్లులంగోకుతూ, కొంతసేపుకూర్చుని వాటినిగూర్చి కలలుగంటూ, అన్నింటికీ మధ్యమధ్య పోయిన లక్ష్మన్నను జ్ఞాపకంచేసుకుంటూ కాలక్షేపం చేశాడు.

అంతలో ఆబ్రాహ్మడు మధ్యసావడిలో పీట వేయించి భోజనానికి లెమ్మన్నాడు నారాయణాన్ని. "ఇక్కడే పెట్టించండి బాబూ! ఎడ్లను చూసుకుంటూ తింటాను" అన్నాడు నారాయణం. వేసిన విస్తరి తియ్యకేం తప్పు అనుకుంటూనే ఆయన నారాయణం మాటలోని గాఢత గమనించి తప్పనిసరిగా వసారాలోనే భోజనం పెట్టించాడు.

నారాయణం ఇటు భోజనంచేసి లేచాడో లేదో అటు వెంకాయి తూలుకుంటూ, చీకట్లో తడబడుతూ చక్కా వచ్చాడు. ఇంతవఱకూ నారాయణానికి వెంకాయినిగుఱించిన ఊహే రాలేదు. వెంకాయితత్వం తెలుసుకాబట్టి నారాయణం వాణ్ని పలకరించనైనాలేదు. వెంకాయి వచ్చివచ్చి ఎడ్లనుకట్టిన వసారాముందటి పందిట్లోనే అటుపక్కగా గోడవానుకుని కూలబడ్డాడు. తూలుతున్న వెంకాయిని చూచి ఏదో అనబోయిన ఆబ్రాహ్మణ్ని చెయ్యిచూపి వారించాడు నారాయణం. నారాయణం వసారాలోకి రావడంతోటే వెళ్లగా "మఱి భోజనమాటేమిటి" అన్నాడు ఆయన. "దానికేం లెండి! ఏదో తినేవచ్చి ఉంటాడు. అంతగా తినకపోతే నేను పెడ్తాను. ఒక విస్తట్లో పెట్టించి ఈ మూల పెట్టించండి" అన్నాడు నారాయణం. సంగతి గ్రహించి ఆబ్రాహ్మడు అట్లాగే పెట్టించాడు.

ఆయనా, నారాయణం వసారాలో కూర్చుని కొంతసేపు లోకాభిరామాయణం చెప్పుకున్నారు. ప్రసంగంలో నారాయణం అచింతితంగానే వెంకాయినిగూర్చి అదీఇదీ కొంత కొంత చెప్పారు. అప్పటికి రాత్రి పదిగంటలయింది. ఎంత పరిపుచ్ఛుకున్నా ఈ అమావాస్య చీకట్లో, తనది ఊరిబయట ఇల్లుకూడానాయె, నారాయణాన్ని అట్లా వీధివసారాలో పడుకోనివ్వడానికి ఆయనకెమనస్సు ఏమాత్రమూ ఒప్పుకోలేదు. వెంకాయి తాగిరావడం, నారాయణం అతన్ని గుఱించి కొంతచెప్పడం వీటితో ఆయనకు నిజంగానే భయం

తోచి "ఎడ్లను పాకలో కట్టివేయిస్తాను. మీరు లోపల పడుకోవలసింది" అని ఎంతెంతో బతిమాలుకున్నాడు పాపం. నారాయణం తనకోసం కాకపోయినా ఆయన కోసమనైనా అంగీకరించలేదు. ఆయన సూచించిన భయాన్ని కూడా అదీఇదీచెప్పి పరాభూతం చేశాడు. చివఱకు ఆ బ్రాహ్మడు భగవంతునిదయ గాఢంగా అర్థిస్తూ వెళ్ళలేక వెళ్ళలేక లోపలికి వెళ్లి తలుపువేసుకున్నాడు.

వెంకాయికి ఈ లక్ష్మణాన్వేషణ ప్రయాణంలో నారాయణంమొహం తప్పించి తిరగడానికే అవకాశం లేకపోయింది ఈనాటివఱకూ! ఒకటి రెండు పెద్ద ఊళ్లల్లో రెండు మూడు రోజులవఱకూ ఆగారుకాని వెతకాలన్న తీవ్రతలో ఉన్న నారాయణం వెంకాయిని వెంటబెట్టుకునే తిరగడంవల్ల అతనికి వెసులుబాటు చిక్కనేలేదు. ఇంతదాకా వచ్చి ఈఊళ్లో నారాయణం నిరుత్సాహంతో, నిరాశతో వచ్చుబడడంవల్ల ఉదయమే ఊరువెంబడి పనిమీద రెండుమాట్లు తిరిగిరావడమూ, సాయంకాలానికి ఆశగా కనిపించిన ప్రయత్నఫలం దక్కేదీ దక్కందీ తేలేవఱకూ ఈ ఊళ్లోనే తివ్వవేసే అవకాశం ఏర్పడడంవల్ల ఈ వాహ్యాళి పోగలగడమూ సాధ్యమయాయి వెంకాయికి. ఆసాయంత్రం వెంకాయి పగలు ఎద్దు మేతకనీ, చుట్ట పొగాక్కనీ నారాయణం ఇచ్చిన డబ్బుల్లో తాను మిగుల్చుకున్న ఎనిమిదణాలూ సురాదేవతకు మనః పూర్వకంగా సమర్పించుకున్నాడు. ఆ తాగిన తాగుడులో వెంకాయి తాను ఈఊరు వచ్చిన విషయమే మఱచిపోయాడు మొదట. అతనిమనస్సు అతని ప్రియురాలిపై పుకే వెళ్లింది. "ఓసీ నారాణీ"అంటూ వెఱ్ఱికేకలు వేశాడు వీథివెంబడి నడుస్తూ. మైకంలో తెలివి వచ్చి అతని మనసులో ఏదో మెఱుపు మెఱిసినట్లయింది. తానీప్రయాణానికి బయలుదేరబోయేముందు తన ప్రేయసితో తానన్న మాటలు జ్ఞాపకంవచ్చాయి. అతని బుఱ్ఱ ఆలోచనలతో—అంటే లోపల ఊహించేవిగావు, బయటికి ఆ కేవాటితో సే-వేడెక్కిపోయింది. పదినిమిషాలు కాకముందే అతని కళ్లకు తనరాణికి రాజైన తాను కట్టించిఇచ్చిన మేడ కనిపించింది. ఇక ఆ

పిమ్మట వెంకాయి ఏంచేశాడో చేశాడు. ఆరాత్రివేళ ఇంటికిమాత్రం అట్లా వచ్చిపడిపోయాడు.

నారాయణం మంచంమీద పడుకుం వాల్చాడే కాని ఇంకా నిద్రపట్టలేదు. రెండు మూడు మాట్లు అటూ ఇటూ దొర్లి ఎడ్లవంక చూచేటప్పటికి దీపపు వెలుగులో అప్పుడే లేచి అక్కడ నిలబడ్డ వెంకాయి కనిపించాడు. నారాయణం లేచికూర్చుని "ఏరా వెంకా! అన్నం తింటావురా?" అన్నాడు. వెంకాయి తల ఆడించాడు. నారాయణం లేచి మూల నున్న విస్తరి తీసి మెట్లదిగువను పెట్టి దీపం అక్కడ పెట్టాడు. అయిదు నిమిషాల్లో వెంకాయి భోజనంచేసి లేచాడు. నారాయణం పక్కమీదే కూర్చుని ఆవులిస్తూ "దీపం పైనపెట్టి తగ్గించి పడుకో వెంకా" అని తాను పడుంవాల్చాడు. అతడు చెప్పినట్లుగా దీపం పెట్టి వెంకాయి పందిరికిందే కాళ్లుముడుచుకు తొంగున్నాడు.

అప్పటికి ఒంటిగంటే దాటిందో, రెండే అయిందో. లేక ఇంకా ఎక్కువే అయిందేమో! అంతా కారుచీకటి. అతినిశ్శబ్దం. అక్కడక్కడ మిణుగురు పురుగుల మెఱుగూ, కీచురాళ్ల ధ్వనీ దృక్ఛ్రోత్రగోచరా లవుతున్నాయి. రామలక్ష్మణు లిద్దఱూ గ్రాగన్నపెట్టి నిద్రపోతున్నారు. దూరాన చెట్లనుండి గుడ్లగూబల కూతలూ, వానివోట బడ్డ కాకిపిల్లల అరుపులూ ఆ రాత్రివేళ మేల్కొన్న వారికి భయాన్ని కలిగిస్తున్నాయి. ఆచీకట్లో ఇంటి ముందు చింతచెట్టు మహాభయంకరంగా ఉంది. దాన్ని ఆనుకుని పెరిగి దానికొమ్మల్లో తలదూర్చిన తాడిచెట్టు ఎవడో క్రూరుడు పొంచిచూస్తున్న భ్రాంతి కలిగిస్తోంది.

నిర్మానుష్యమైన ఆప్రదేశంలో ఆ వేళ రెండు చీకటిముద్దలు కదిలాయి. ఒక సన్నని ఈల వినరావడంతో పందిట్లో తొంగున్న మూడో చీకటిముద్ద లేచింది. అది మెల్లమెల్లగా అడుగులు వేస్తూ ఆ మొదటి రెంటిలో ఐక్యమయింది. ఆ మొత్తం ముద్ద మళ్లీ రెండుగా చీలింది మఱునిమిషంలో. అందులో చిన్నముద్ద ఇంటివెనక్కి వెళ్లింది. మిగిలిన పెద్దముద్ద

వసారాలో ప్రవేశించి రెండు సమానభాగాలుగా చీలింది. వసారాలోని సన్నని దీపపువెలుగులో ఆ చీలినభాగాలు చీకటిముద్దతనం గోల్పోయి భయంకర మనుష్యరూపం తాల్చాయి. అత్యల్ప కాలంలో అంతా ఒకటే చీకటిముద్ద అయింది. ఇన్నాళ్లుగా ఇంతదేశం తిరిగితిరిగి అలిసిపోయి తుట్టతుదకు పూనిన పని ఫలించిన ఆనందంలో అతిగాఢనిద్రనందుతున్న నారాయణం పడుకున్న మంచం తలవైపునా, కాళ్ల వైపునా కర్రలుకట్టి ఎత్తబడగా మడతబడకుండా మెల్లగా కదిలింది. మెట్లుదిగుతుండగా ఒకకోడు మెట్టుకు తగిలి కొంచెం శబ్దమయింది. మంచంమీది దుప్పటి ఏమాత్రమూ కదలలేదు. కాని రామన్న హఠాత్తుగా లేచి నిలబడింది. వెంటనే లక్ష్మన్న లేచింది. హడావిడిపడి మంచం చరచరా చింతచెట్టు దాటిపోయింది. ఎద్దులేచిన ధ్వని విని ఇంటివెనుకకు వెళ్లిన చీకటిముద్ద ఇంటిముందుకు వచ్చింది. కన్ను పొడుచుకున్నా కానరాని ఆచీకట్లో మంచంవెళ్లిన వైపు తిరిగి తలతాళ్లు లాక్కుంటున్న ఎద్దకళ్లలో చంద్రహాసం మెరిసింది. ఆముద్ద అటు కదిలిందో లేదో ఇటు రెంటి తలత్రాళ్లూ తెగిపోయాయి. రామన్న ముందూ, లక్ష్మన్న వెనకా మంచంవెళ్లిన వైపు పరుగుదీశాయి. ఇవి వస్తున్న వేగానికి హడిలి ముందుపోయిన చీకటిముద్ద చింతచెట్టులో కలిసిపోయింది. దూరాన వస్తున్న వీటిని చూచి మంచం చటుక్కున ఆగిపోయింది. కాని రెండుమెరుపులు ఒక్కసారి మెరిశాయి. హఠాత్తుగా ఆగడంలో అయిన కుదుపూ, రామలక్ష్మణులు రివ్వున దూసుకువస్తూ ఉండడంలో అయిన ధ్వనీ మంచంమీది నారాయణానికి మెలకువ తెచ్చాయి. వెంటనే అతని మొహాన గుడ్డపడింది; చేతులు వెనక్కు విరువబడ్డాయి. పెనగులాటలో నారాయణం మంచందూకి తన్ను పట్టుకుంటున్న వ్యక్తిని పది అడుగులు రోడ్డుమీదికి లాక్కురాగలిగాడుగాని లొంగిపోక తప్పిందికాదు. ఆవ్యక్తి నారాయణాన్ని నేలమీద పడవేసి నోట గుడ్డలుకుక్కి చేతులూ, కాళ్లూ కట్టివేసేశాడు. అతని ఒళ్లంతా: దేనికోసమో వెతికాడుగాని ఏమీ దొరకలేదు. అంతలో తమ్ము అడ్డడానికి వచ్చిన వ్యక్తిని తప్పించుకుని రామన్న ముందుకు వచ్చేసింది. తనమీదికి వస్తున్న లక్ష్మన్నపైకి ముందువెళ్లిన వ్యక్తి కత్తి ఎత్తాడు. లక్ష్మన్న అతని కత్తికి తనకొమ్ము బలియిచ్చి, రెండో కొమ్ముతో డొక్కలో పొడిచి ఎత్తి ఆకాశానికి ఎగరవేసింది. క్రిందపడి ప్రాణంవిడిచిన అతన్ని తొక్కుకుంటూనే లక్ష్మన్న రామన్నను కలుసుకుంది. పొడవవచ్చిన రామన్నను నారాయణందగ్గరనుండి లేవబోయిన వ్యక్తి కత్తితో వేశాడు. ఆకత్తి ఒక కొమ్మును నరికి రెండోకొమ్ముమొదట్లో వాలుగా రామన్నతలమీద గాయంచేసింది. గాయంకావడంతో పొంగిన ఉద్రేకంతో మీదికిదూకిన రామన్నధాటి కాగలేక ఆవ్యక్తి కత్తిజారవిడిచి నేలమీద పడిపోయాడు. పడడంలోనే దెబ్బతగిలి అతని తల నెత్తురు కారింది. కాని మళ్లీ లేవబోయిన అతన్ని తన దెబ్బతిన్న తలతోనే తిరిగి ఎన్నటికీ లేవకుండా చేసింది. వెంటనే పది అడుగుల దూరంలో పడివున్న నారాయణాన్ని మూచూచింది రామన్న. నారాయణం మాటరాక తల ఆడించాడు. అతని ముఖాన మూతిపెట్టి నోటిలో గుడ్డలు లాగివేసింది రామన్న. తన మొహాన నెత్తురుకారుతుండగా అతనితలవైపు తన ముఖం పెట్టి తన నాలుగు కాళ్లసందునా అతన్ని ఇముడ్చుకుని అక్కడే నిలబడిపోయింది రామన్న. అట్లా నిలబడ్డ రామన్నను లక్ష్మన్న కలుసుకుంది. రెండు మూతులూ ఒకమాటు కలిశాయి. అంతలో ఎక్కడో చప్పుడయింది. లక్ష్మన్న వెనుదిరిగిచూచింది. చింతచెట్టు దిగి ఎవడో మనిషి పారిపోతున్నాడు. లక్ష్మన్న అతని వెంబడి పడలేదు. రామన్నచుట్టూ ప్రదక్షిణం చెయ్యడం మొదలుపెట్టింది.

అప్పుడు నాలుగుగంటలవేళ అయింది. ఆ రోడ్డున ఆవాడు అంతవఱకూ ఎవ్వరూ రాలేదు. అప్పుడే లేచిన ఆఇంటి బ్రాహ్మడు తలుపుతెరిచి వసారాలో అడుగుపెట్టాడు. నారాయణం మంచంగాని, ఎద్దులుగాని లేకపోవడంతో కంగారుపడ్డాడు. గజగజలాడుతున్న శరీరంతో పైమీదగుడ్డఅయినా లేకుండానే రోడ్డువైపుకే పరుగెత్తాడు. ఫర్లాంగుదూరంలో రోడ్డు కడ్డం

తిరిగిఉన్న లక్ష్మన్నా, దానివెనుక వెలుగుతున్న దీపాలతో ఆగిపోయినకారూ కనిపించాయి. దారిలో పడిఉన్న శవాన్నైనా చూడకుండా ఆ బ్రాహ్మడు అక్కడికి పరుగెత్తాడు. కారు ఆగడంతోటే రామన్న వెనక్కు నాలుగుఅడుగులు వేసి నారాయణాన్ని ఆపాదమస్తకం చూస్తూ నిలబడింది. ఆ కారులో నంది గ్రామపోలీసుఅధికారులు ఉన్నారు. వారి అందరి మనస్సులనూ ఆశ్చర్యం ఒక్కటే ఆవరించింది. కొందరు ఇటుపక్క శవాన్ని చూచి దానివైపుకు వెళ్లారు. మరికొందరు కట్టివేయబడిఉన్న నారాయణాన్ని చూచి అతని కట్లు విప్పారు. నారాయణం తనకు మెలకువవచ్చినదగ్గరనుంచీ తెలిసింది అంతా చెప్పాడు. ఎవ్వరూ నమ్మడానికి వీల్లేని విషయం. కాని లక్ష్మన్న తమకారును రోడ్డుకు అడ్డంనిలిచి ఆపి వేయడమూ, తమ కారు ఆగడంతోటే రామన్న వెనక్కు అడుగులు వేసి నారాయణాన్ని చూపించడమూ తామందరూ తమ కళ్లతో చూచిన విషయాలు. తక్కినది కాదనడానికి ఎట్లా వీలు? అదరబాదరగా అప్పుడు పరుగెత్తుకు వచ్చిన ఆ బ్రాహ్మడు ఈరంగానికి పూర్వకథ అంతా చెప్పి సాక్ష్యమిచ్చాడు. ఎద్దుకొనడు నారాయణం ఇచ్చిన వెయ్యీ, రాత్రి జాగ్రత్తచెయ్యమని ఇచ్చిన తక్కినసొమ్మూ ఇంటిదగ్గర ఉన్నది, చూపిస్తాను రండి అన్నాడు. పోలీసులు రెండుశవాల్నీ పరిశోధించారు. ఒకశవంపొట్టమీద నెత్తురుమరకలున్నాయి. కత్తి దెబ్బ ఏమో అని పరీక్షించారు. కాని కాదు. రామన్న ముఖం నెత్తురుకారుతోంది. నారాయణం చెప్పినట్లు దాన్నీ దీన్నీ కలుపుకున్నారు. ఆశవంతలే పగిలి ఉంది. అది హఠాత్తుగా కిందపడడం ఫలితంగా నిజమే ఊహించారు. అది అతని పాలేరు వెంకాయి శవమట! శవపరీక్షా, నారాయణమూ బ్రాహ్మడూ చెప్పిన విషయాలూ, అన్నింటికంటే తాము చేసిన పనికి సూచకంగా ఎద్దు రెండూ తమఎదుట ప్రదర్శించిన చేష్టలూ అన్నీ ఒకవిషయాన్నే నిశ్చయించాయి. పోలీసువారు ఆశ్చర్యపడుతూ సమస్తమూ నమ్మవలసి వచ్చింది.

తెల్లవారింది. నందిగామ ఊరంతా అక్కడే పోగుపడింది. వెంకాయిశవానికి అంత్యక్రియలు తానే చేయిస్తానన్నాడు నారాయణం. రెండోశవానికి సంబంధించినవారు వచ్చి అడగగా ఊరిపెద్దల సమక్షంలో పోలీసువారు ఇచ్చివేశారు.

ఆనాడు నారాయణం తనదగ్గర మిగిలిన సొమ్మంతా వెచ్చించి ఆ బ్రాహ్మడి సహాయంతో రామలక్ష్మణులపేరట అన్నదానం చేశాడు. ఆసమారాధనలో నారాయణధనాపహరణప్రయత్నంలో పాల్గొన్న మూడవ వ్యక్తికూడా కూడుగుడవకపోలేదు. నారాయణం చేసిన ఈ అన్నదానఫలితంలో వచ్చిన వెంకాయికికూడా కొంతభాగం దక్కకపోదు.

రెండురోజులు గడిచాక నారాయణం దారి ఖర్చులకు ఆ బ్రాహ్మడిదగ్గర కొంతసొమ్ము తీసుకుని, సీతాయికన్యాయం జరిగిన బాధతోనూ, పోయిన లక్ష్మన్న మళ్లీశరీరంతో, తనకూ రామన్నకూ తిరిగి లభించిన సంతోషంతోనూ సర్వాలంకారశోభితులైన రామలక్ష్మణులను ముందు నడుపుకుంటూ స్వగ్రామోన్ముఖుడయ్యాడు.





అసలు నువ్వెవరవు రమణభగవాన్!

✿

— శ్రీ చింతా దీక్షితులు —

నీదర్శనానికి వచ్చిన భక్తులు నిన్ను ఏప్రశ్న అడిగినా ఆ అడుగుతూన్నది ఎవరని ప్రశ్నిస్తావు. 'నేను' అంటే, ఆ నేను అనేది ఎవరో తెలుసుకోమంటావు.

నీ ప్రత్యుత్తరం అర్థంగాక, నీమాటలమీద గౌరవం కొద్దీ కొంద రూరుకొంటారు.

కొందరు మహత్తరమైన ఆ నీ ఉపదేశప్రభావం వల్ల "నే నెవరు" అనే ప్రశ్నకు సమాధానం పొందడానికి సాధనచేస్తారు. సాధనచేసి, కొంత దారిలో పడి, ఆదారిలో కాలునిలవదొక్కుకోడానికి మళ్లీ నీదర్శనానికి వస్తారు.

నమ్మల్ని మా అసలుస్వరూపం తెలుసుకోమంటావే—మరి నువ్వెవరవు అసలు?

నిన్నే ఆప్రశ్న అడిగితే నువ్వు చెప్పవు. సరిగదా ఆ అడిగే దెవరంటావు. 'నేనంటే ఆ నేనెవరో కనుక్కో'మంటావు. ఇక మాట ముందుకు సాగదు.

అయినా అడుగుతున్నాను. అయితే అసలు నువ్వెవరవు?

ఇదివరలో నువ్వెవరవని నేను నిన్ను అడగనూ లేదు, నువ్వు నాతో చెప్పనూలేదు. కాని నువ్వెవరవో నాకు కొంచెం కొంచెం తెలుస్తోందా అనిపిస్తోంది.

"తనుకంచుకగుప్త మహోమహసా" అన్నాడు నిన్ను గణపతిముని.

ఈ కంచుకంలో గుప్తమైఉన్న మహాతేజస్సు చూడ్డం నీ అనుగ్రహమే లేకుంటే ఎవరికి సాధ్యమవుతుంది?

నువ్వు గీతలు చెప్పావు. గీతాసారం తీసి లోకానికిచ్చావు. గోవణాన్ని పెట్టుకొన్నావు. భక్తుల్ని ఆకర్షిస్తున్నావు. నువ్వు శ్రీకృష్ణపరమాత్మవేమో ననిపిస్తుంది.

బాల్యంలో నీవు స్వగ్రామమైన తిరుచుళినుంచి బయలుదేరి అరుణాచలం చేరుకొన్నావు. వెంటనే అరుణాచలేశ్వరుడి దర్శనం చేసుకొన్నావు. "నాన్నా, నాన్నా, నువ్వు రమ్మంటే వచ్చా"నని అరుణాచలేశ్వరుడితో చెప్పుకొన్నావు. నువ్వే స్కందుడవనడానికి ఇక సందేహంలేదు. అందుకనే గణపతిముని నువ్వు కుమారస్వామివే అని లోకానికి వెల్లడించి నిన్ను నలభైశ్లోకాలతో స్తుతించాడు.

నువ్వు నీ అక్షరమణిమాలలో అరుణాచలేశ్వరుణ్ణి వరించి అతని కంఠాన్ని క్షరముకాని పూలమాల వేసి అతనిని పాణిగ్రహణం చేసుకొన్నట్లు చెప్పుకొన్నావు. ఆయనదేహాన్నే పంచుకొన్నావు. ఆయనలో లీనమయ్యావు. ఆయన నిన్ను తనచేశాడన్నావు. అంటే నువ్వు జగజ్జనని వయ్యే వన్నమాట. లేకుంటే అర్ధనారీశ్వరుడ వయ్యేవన్నమాట.

ఇక నువ్వెవర వసలు అని మళ్లీ తర్కిస్తే భావములు పరంపరగా వస్తూనేఉన్నవి.

నువ్వు ఆ సోఫామీద కూర్చుని బ్రాహ్మణులు పఠించే వేదవాక్కులూ, భక్తులు పాడే ద్రావిడస్తోత్రములూ ఆలించే దివ్యతరుణంలో నిన్ను పరిశీలించి చూచాను. నీముఖం దక్షిణపార్శ్వమునకు తిరుగుతుంది. తిరిగి అలాగే ఉంటుంది.

మద్రాసు మ్యూజియంలో దక్షిణామూర్తి విగ్రహం జ్ఞాపకంవచ్చింది. దక్షిణాభిముఖుడై ఉన్న — దక్షిణపార్శ్వంగా ముఖముతిప్పుకొని హృదయ కేంద్రాన్ని చూస్తున్నట్లు ఉన్న — ఆ శివమూర్తిని చూచాను.

నిన్ను చూచాను. నువ్వు దక్షిణామూర్తివే అని నిశ్చయించుకున్నాను. నిజం చెప్పు. నువ్వు దక్షిణామూర్తివే కాదూ?

లేకుంటే వాక్కుకన్న మౌనం ఎంతో బలమైనదని నువ్వు చెప్పలేదూ? మౌనంతోనే నువ్వు భక్తులను తరింపజేయడం లేదూ? నిన్ను ప్రశ్నలడిగి సంశయాలు తీర్చుకొందామని కోరేవారికి నీ సమాధానాలిచ్చే శాంతికన్న నీమౌనమే వారికి ఎక్కువ శాంతి నిస్తోందికాదూ? మరి మౌనవ్యాఖ్యతో పరబ్రహ్మతత్త్వాన్ని ప్రకటించిన దక్షిణామూర్తిన్నీ, ఆ మౌనముతోనే ముముక్షువులకు శాంతిని ప్రసాదించే నువ్వున్నూ ఒక్కరుకాదంటే ఎవ్వరు నమ్ముతారు?

ఇంకోవిషయం చెప్పనా? నీసోఫా. నీసోఫా ప్రక్క కుంపటి. కుంపటిలో కణకణలాడే నిప్పులు. దశాంగధూపము నిత్యమూ వెలువడుతూ నీ అనుగ్రహంతో కలిసి భక్తుల్ని ఆవరిస్తూ ఉంటుంది. అప్పుడు నువ్వేం చేస్తావంటే—ఏదో చలికాచుకుంటూన్నట్టు ఆ నీ చేతుల్ని ఆ కుంపటివైపు తిప్పుతావు. తిప్పి వాటిని అలాగే ఉంచుతావు. చూచా నాచేతుల్ని నేను. చూచినా కొంతకాలంపాటు గ్రహించలేకపోయాను. నీ అనుగ్రహం లేనిదే ఏ చిన్నవిషయమైనా ఎవరెట్లా గ్రహించగలరు? చివరికి గ్రహించాననుకొన్నాను. కూర్చుని, భక్తులవైపు చూపిస్తూ, చలికాచుకొంటూన్నట్టు పెట్టిన ఆ నీచేతులు అభయహస్తాలని గ్రహించాను. అక్కడ కూచున్నవాళ్లమట్టుకేనా అభయం, లోకానికంతటూనా? నువ్వు అవతరించింది లోకాన్నంతనూ ఉద్ధరించాలనే! నీ అభయహస్తాలు లోకాన్నుద్దేశించే!

ఎందువల్లనంటే — ఎవరెవరి హృదయాల్లో ఎంతెంత ఇరుకుసందుల్లో దూరి, భగవాన్! నువ్వు బాగుచేస్తున్నావో, ఎంతెంత బరువురాళ్లు ఎత్తిపాకేస్తున్నావో, ఎంతెంత మురికి కరిగించివేసి బంగారం చేస్తున్నావో, ఎవరూహించగలరు? ఎట్టి ఎడారులవంటి హృదయాలను సస్యశ్యామలం చేస్తున్నావో ఎవరికి తెలుసును? ఎట్టి కర్కశశిలామయ హృదయాల్ని మృదువుచేస్తున్నావో ఎవరికి తెలుసు?

ఈ అభయహస్తాలు చూపే నువ్వెవరవు అసలు అంటే నువ్వెవరవు కావు అని సమాధానం వస్తోంది.

ఇంకోవిషయం చెప్పనా? నీదగ్గిర దాపరికమెందుకు నాకు? నువ్వే నాకు నిదర్శన మిచ్చావు. నే నెప్పుడూ అనుకోలేదు—నువ్వే అగస్త్యేశ్వరుడవని. నిన్ను చూచాను మొదట. తరువాత నువ్వు మారి

పోవడం చూచాను. నీ సుజ్జురూపం, నీ చిరిబొజ్జ, నీ ప్రసన్నవదనం నేను చూచాను. ఆ దర్శనం నాకు ఆనందం యిచ్చింది. నువ్వు అగస్త్యేశ్వరుడవని నాహృదయానికి తట్టింది. అవునో కాదో నీకే తెలియాలి.

శ్రీరామవర్మ అప్పన్ తంపురాన్ అన్నమాటేమిటంటే—నీచరిత్ర వ్యక్తిపరమైన జీవితచరిత్ర కాదనిన్నీ, సమిష్టియగు ఆత్మప్రకాశవమనిన్నీ—అంటే నువ్వు సర్వభూతాత్మభూతాత్ముడవన్నమాట. క్షేత్రజ్ఞుడవన్నమాట! నేడు నువ్వు అరుణాచలపాదమున నివాసమేర్పాటుచేసుకొని హృదయవిద్య మానవులందరికీ ఉపదేశించి అమృతత్వము పంచిపెడుతున్నావు.

అసలు నువ్వెవరవని ప్రశ్న వేశానుకాని దానికి సమాధానం తేల్చానా? తేల్చే సామర్థ్యం నాకుందా? అసలు నువ్వెవరవో నీకే తెలియాలి! మనుష్యమాత్రులకు తెలియదు. నువ్వు కృష్ణుడవే అన్నా, దక్షిణామూర్తివే అన్నా, అగస్త్యుడవే అన్నా, ఏమన్నా ఆవాక్యాలన్నీ స్తోత్రవాక్యాలే అవుతున్నాయి.

ఇక నే నెవరు అని ప్రశ్నించుకోమంటావే. ఇలా ప్రశ్నించుకోగా ప్రశ్నించుకోగా ఈ 'నేను' అనేది ఆ 'నువ్వు' అనే సముద్రంలో లీనమయ్యేటట్లు ఉన్నది. ఈ 'నేను' ఆ 'నువ్వు'లో కరిగిపోడానికి నీ అనుగ్రహం నామీద పడుతూ ఉండాలికదా.



నటుడు - నటన*

❀

[ఒక పరిశీలన]

౧. నటుడు కేవలమూ నటుడేనా? భాష్యకారుడు కూడానా? రచనను మార్చడానికి నటున కేమైనా అధికారము గలదా?

౨. నాటకప్రయోజన మేమిటి?... కేవలము జనుల నాహ్లాదపరచుటయేనా? లేక సంఘమర్యాదలలో మార్పుదెచ్చుటకూడ నటునిపనియా?

3. నటునకు, అతడు నటించు పాత్రకు సంబంధమెట్టిది? నటుడు తన పాత్రలో లీనముకావలయునా? లేక సదా తన వ్యక్తిత్వమును జ్ఞాపక ముంచుకోవలయునా? నటునకు తాదాత్మ్యసిద్ధి యున్నదా?

౪. ప్రేక్షకులకొరకు నటిస్తూన్నానన్న జ్ఞానము నటుని కవసరమా? ఉదా.—నటుడు వన్స్‌మోర్‌ను పాటించవలయునా?

౧

నటుడు కేవలమూ నటుడేనా? భాష్యకారుడు కూడానా? ... రచనను మార్చడానికి నటున కేమైనా అధికారం కలదా?

శ్రీ వై. వి. రావు:— ప్రకృతిని చిత్రించడంలో చిత్రకారు డెట్లో, నాటకమునందలి యొక పాత్రను నటించుటలో నటుడుకూడ అట్లే. బ్రహ్మసృష్టిని విమర్శించుటకు చిత్రకారున కెంత అధికారమో, కవిబ్రహ్మకృతిని విమర్శించుటకు నటుడి కంతే అధికారం.

"నాటకరచనలో లోపము ఉండవా?" అని అందురేమో, లోపము ఉండునది నాటక మనిపించుకొనదు. రచనలో లోపములు లేని నాటకమునే మనము దృష్టియందుంచుకొని చర్చించుచున్నాము. అట్టి నాటకము రచించిన కవిబ్రహ్మను విమర్శించు శక్తి నటున కుండదు. కాని ఒక విధముగా ఆలోచించినయెడల భాష్యకారునికి నటుడు సహకారి కాగలడేమో అని తోచుచున్నది. అది యెట్లన, తన నటనచేత నాటకములోని గుణములను మరింత ప్రకాశింపచేయుటచేతను, లోపములను కప్పిపుచ్చి కవిప్రతిభను హెచ్చింపచేయుటకును నటుడు మిక్కిలి సమర్థుడగుట. అదియుగాక, నిజమైన నటుడు లోపభూయిష్ఠమై, అతి విమర్శకు గురియగునట్టి నాటకమును ఎన్నుకొనడు. అందుచేత, అత డెన్నడుగాని విమర్శకుడు కావలసిన అవసరమే ఏర్పడదు.

ఇక "రచనను మార్చుటకు నటున కధికారము గలదా?" అని. దోషరహితమైన నాటకమునందు నటుడుగాని, మరెవరుగాని మార్చదగిన దేదియు నుండజాలదు. అయితే, కవి వ్రాసిన గ్రంథమునంతను నటించవలసిన అవసరముగూడ లేకపోవచ్చును. మిక్కిలి దీర్ఘమైన నాటకములందు ప్రేక్షకుల సౌకర్యముకొఱకును, విసుగు పుట్టింపకుండుటకును, రసభంగము గాకుండుటకును, నాటక ప్రభావమును హెచ్చించుటకును నాటకమునందు కొంత భాగమును నటుడు విసర్జింపవగును. కాని, అట్లు విసర్జించుటలో కథాలోపము, రసభంగము, కవి ప్రతిభకు లోపము, వీటికన్న ముఖ్యముగ కథలోని నీతికి భంగము కలుగ నట్లు చేయవలయును.

శ్రీ నందివాడ చిదంబరం:— కావ్యం కవి సృష్టించింది. పాత్ర ప్రపంచమందలి వ్యక్తి. పాత్రరూపం కవి

---

* ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రమువారి సంక్రాంతి నటసమ్మేళనపు పరిశీలన, వారి అనుమతితో.

యొక్క అభిప్రాయంమీద ఆధారపడిఉంటుంది. అందుచేత కావ్యమే పాత్రతత్వమునకు మాతృక.

అయితే, అభినయం వ్యాఖ్యానంవంటిది. రసస్ఫూర్తికి కూడా చిత్రమైన కల్పన అవసరం. అందుచేత నటుడు గూడా వ్యాఖ్యాతపదవి నిర్వహించవలసిన సందర్భములు ఉంటాయి. పాత్ర నటుని మాతృక అయినా, అవస్థమాత్రం ప్రకృతిసిద్ధంగా ఉండాలి. సంస్కారము, కళానుభవము, లోకానుభవము, కళాసంప్రదాయముతో పరిచితీ ఉన్న నటుడు తన పాత్రను పోషించడంలో, నాటకం అయ్యేసరికి, కవి ఇచ్చిన మాటలు తప్ప, ఇతర మాటలెన్నో వాడకుండా, తన పాత్రకు ఒక నూతనమైన వికాసం తెస్తూ, తద్వారా నాటకమునకు ఒక వ్యాఖ్యాత అయి ఊర్కోవడం గూడా లేకపోలేదు.

ఆంధ్ర నాటకరంగంలో ఇట్టిది తరుచు కనబడక పోయినా, ఏ మాటకు ఆమాటే చెప్పాలి, పాశ్చాత్యదేశాల్లో నటుడే (సర్వవిధములా శిక్షణపొందిన నటుడి మాట లెండి నే చెప్పేది.) నాటకము అయ్యేసరికి, మాతృకకు అక్షరం చేర్చకుండా, వ్యాఖ్యాతగా పరిణమించి, కవి చిత్రించిన పాత్రలోని పాత్రతత్వమునందు అఖండమైన మార్పు కళాభివృద్ధి కొరకు - కళా సౌందర్యం కొరకు తీసుకు రావడం వింటున్నాం. ఆ కారణం వల్లనే షేక్స్పియరు రచించిన నాటకములలోని కొన్ని ముఖ్యపాత్రల విషయమై, నేటికిని భేదాభిప్రాయాలు ఉండిఉన్నాయి. దానికి కారణం ఉత్తమనటులే వ్యాఖ్యాతపదవి తీసికొని, ఆ యా పాత్రలను ప్రేక్షకులకు అందజేయడంలో వచ్చిన భేదములని తెలుస్తుంది. అయితే, నటుడు కవికంటే ఎక్కువ రసానుభవము, లోకజ్ఞానము, కళాసంప్రదాయసంపత్తి కలిగినప్పుడే వ్యాఖ్యాతపదవికి బూనుకొని ప్రత్యేక సౌందర్యము తెచ్చుటకు ప్రయత్నించడం తటస్థిస్తుంది.

ఆంధ్రనాటకరంగంలోకూడా పాత్రను యథావిధి నటిస్తూ, వ్యాఖ్యాతపదవి స్వీకరించి కళాభివృద్ధికిన్ని, నూతన కళోత్పత్తికిన్ని కృషిచేసిన నటులు అసలే లేకపోలేదు. నటుడే కవి యిచ్చిన పాత్రతత్వమునకు ఒక నూతనకాంతిని ఇచ్చి, తమ పాత్రకున్ను, అందువల్ల నాటకమునకునూ ఒక నూతనశోభ, ఒక ప్రత్యేక ప్రతిభ ఇస్తూ, కళారాధనములో క్రొత్త పోకడలు తెస్తూ, నూతనకళోత్పత్తికిన్ని, కళా సౌందర్యము ఇనుమడింపచేయుటకున్నూ కృషిచేస్తున్నారు. కవి రచించిన కావ్యమునకు ఉచితాచారసంప్రదాయములను, లోకానుభవమున్ను అతవర్చి, హావభావవిలాసములచే తాను, కవి ఇచ్చిన పాత్రను మరల చిత్రించును. నటుడు ఇలా తిరిగి చిత్రించిన సందర్భములలో నటుడు చేసిన వగిషీ పనివలన నటుడు ఒక వ్యాఖ్యాత అయి, పాత్రకు ఒక నూతనవికాసము ఇవ్వడం స్పష్టంగా కనిపిస్తుంది.

శ్రీ జి. వి. సుబ్బారావు:—నేను ఇద్దరినీ అవగాహన చేసుకున్నప్రకారం ఇద్దరికీ వ్యతిరేకాభిప్రాయం ఇవ్వవలసి వస్తోంది. లోకంలో లక్షలుంక్షలు నాటకా లున్నాయి. వీటిలో నూటికి తొంభై పఠనయోగ్యాలు. పదిమాత్రమే ప్రయోగార్హాలు. ఇలా ఖేలనయోగ్యమైనవాటిలోనే, బహుకొద్దిపాటే ఉత్తమరచన లున్నాయి. అలాంటి ఉత్తమరచనలను ఖేలనం చేస్తూంటే నటుని విషయమై ఎత్తుకుందాము. రావుగా రన్నట్లు, అలాటి రచనలలో నటుడు వేలుపెట్టడానికిగాని, సినీమా ఎడిటర్‌లాగ తన కత్తెర నుపయోగించడానికిగాని అధికారము సంక్రమించనేరదు. లేదుకూడాను. అలాంటి సందర్భంలో, నటుడు కేవలము వ్యక్తీకరణకుడేగాని మరియొకడు కానేరడు. కాని, వ్యక్తీకరణకు—అనగా సరియైన వ్యక్తీకరణకు—నిశితమైన తన విమర్శనాజ్ఞానము, ఏమైనా తనలో ఉన్న భాష్యకారత్వముకూడ జోడించినగాని తన పాత్ర స్వరూపమును తాను ప్రత్యక్షముచేసుకొనజాలడు, చేయ జాలడుకూడాను.

రెండవతరగతిరచనలనుగూడ మొదటితరగతివానినిగా మార్చుటకును, ఖేలనాయోగ్యముచేయుటకును నటునికి తప్ప మరెవ్వరికిని సామర్థ్యముగాని, శక్తిగాని, దక్షతగాని లేదు. కాని ఒకమాట. అటుల మార్పుచేసినతరువాత—అనగా ఒక మారు నిశ్చితముచేసినతరువాత—దానిని తన జీవితానంతరమువరకు లోకమునకు మరలమరల మార్పుచేసి ప్రయోగింపకూడదు.

ఇట్టి వ్యక్తీకరణము, ఇట్టి భాష్యకారత్వము కల నటుడు సంఘప్రేమను, లోకప్రేమను చూరగొంటాడు. పైసామర్థ్యములు కల నటుడు, గతమానవచరిత్రలోని ఘట్టములలో తాను ప్రవేశించి, వాటిని సజీవముచేసి, చూపరుల మన్ననలను పొందుచున్నాడు. వర్తమానములోని ఘట్టములను, ప్రపంచభావిఘట్టములను తా నూహించి, ప్రజల మనోనేత్రమును విప్పి వికసింపజేయుచున్నాడు. కాబట్టి గతించిన సృష్టినో, రానున్న సృష్టినో తాను తన కౌశలముచే పునఃసృష్టి, ప్రతిసృష్టి చేయుచున్నాడు. నటుడు కేవలము అంత కేవలనటుడు కాడని నా ఉద్దేశ్యము. అతడు పైగా సృష్టికర్త అని నా అభిప్రాయము.

శ్రీ బళ్లారి టి. రాఘవ:—నా ఉద్దేశములో నటుడూ, తత్వవేత్త ఒకేతెగకు చెందినవారు. ఇరువురును సంఘశ్రేయమును మిక్కుటముగ కోరువారే. ఇరువురును దీక్షాపరతంత్రులే. మానవకల్యాణమే తత్వవేత్తలక్ష్యము. జనులయందు ఉన్నతమైన మానవికప్రవృత్తిని కలిగించుటయే ఉత్తమనటుని లక్ష్యము. కాని, నటుడు తన లక్ష్యమును పొందు యత్నమునందు ఒక గొప్ప ఆటంకము నేటి నాటక రచనలు అని నా అభిప్రాయము. జీవితమే ఒక మహానాటక రంగము, సృష్టికర్తయే మహానాటకరచయిత, ఐనపుడు అతని రచన సర్వమానవశ్రేయస్సును ఉద్దేశించినదై, భక్తిదాయకమై, ముక్తిప్రదమై యుండును. మన నాటకరంగపు రచనలుమాత్రము అట్టివి కావు.

కొన్నికొన్ని రచనలు కేవలము ఒక్క నటుని ఔన్నత్యమునకు దోహదమిచ్చుటయే పరమావధిగా వ్రాయబడియున్నవి. ఏవి సన్నివేశములు తన అభిమాననటుని నటనాచాతుర్యమును వెల్లడిచేసి, ప్రేక్షకుల వెర్రిపొగడ్తలను జారగొనగలవో, అట్టివి కల్పించి, కథావస్తువుయొక్క ఔన్నత్యమును ఏమాత్రమును పాటింపక, ఆ ఒక్క నటునకు ఆర్థికముగ లాభము సంపాదించుటయే అట్టిరచన ఉద్దేశమైనపుడు నటవర్గము ఉన్నతాదర్శములతో ఎట్లు వర్తింపనగును? ఈరచనలు గాలరీల ఆమోదముకొరకై మాత్రము సృష్టింపబడినవి. వీనిని అభినయించు నటులు కంట్రాక్టర్ల సంచులు నింపి, తాము సంపన్నులగుటయే పరమలక్ష్యముగా కలవారు. ఉన్నతరచన, ఉన్నతమైన నటుడు—వీరికి చాల దూరము.

నిజమైన నటుడుమాత్రము రచన యెట్టిదైనను తానొక గొప్ప సృష్టికర్తయని గుర్తించి సర్వవిధములను ఈ ఉత్తమధర్మమును నెరవేర్చు కౌశలమును సంపాదింపవలెను. నేటి కొన్నిరచనలను అభినయించుటకు ఎట్టిప్రజ్ఞయు అవసరములేదు—అది వేరుమాట. కాని, ప్రజలలో ఆర్థికముగ హెచ్చుతగ్గులవలన కలిగెడి అపాంతరములను వారించుట, అనాథులను రక్షించుట, సర్వవిధములను, సర్వకాల సర్వావస్థలందును ప్రజాక్షేమమునే పరమావధిగ పరిగణించుట—ఇవి సామ్రాజ్యరక్షణ మొనర్చు మహామంత్రి గుణము లెట్లగునో, అట్లే లోకకల్యాణమునకై పాటుపడవలసిన నాటకరచయితధర్మములును ఇట్టి రచయిత అసాధారణమేధాసంపన్నుడు కావలెను. అతని రచనను ప్రకటించు నటుడు అసమాననటనాకౌశలము కలవాడును, దీక్షాపరతంత్రుడును కావలెను. అతడు గొప్ప విద్యావంతుడు కావలెను. అపరిమితసంస్కారయుతుడై యుండవలెను.

శ్రీ ఎస్. వి. శేషయ్య:—ఈ పెద్దలందరితో నేను ఏకీభవిస్తున్నాను, భేదిస్తున్నానుకూడా. అసలు నావుద్దేశం— ఆదర్శప్రాయమైన రంగస్థలంలో ఈప్రశ్నకు అవసరంగానీ, అవకాశంగానీ లేదని. ఏమంటే, ఆదర్శరంగస్థలంలో కవీ, నటులూ, వీరిద్దరిమధ్యా 'ప్రొడ్యూసర్' అనే అర్థంలో నాటకప్రయోక్తా ఉంటారు. నాటకప్రయోక్తనే మన పూర్వ నాటకకర్తలు సూత్రధారుడని పేర్కొన్నారు. ఈ సూత్రధారుడే కవిరచించిన నాటకానికి భాష్యకారుడు, లేక వ్యాఖ్యాత, కవిహృదయాన్ని గ్రహించి, కవి సృజించిన పాత్రల శీల పరిశీలన చేసి, కవి వూహించిన వాతావరణాన్ని నిర్మించటానికీ, నటసముదాయం ద్వారా కవియొక్క కావ్యాన్ని సహృదయులైన ప్రేక్షకలోకానికి ప్రదర్శించటానికీ పూనుకుంటాడు. అన్ని విధాలా కవిరచన ప్రయోగయోగ్యమైనట్టయితే ఇక తగాదా లేనేలేదు. కాని, కవికి కవిత్వదృష్టితోపాటు నాటకకళాదృష్టీ, రంగస్థలవస్తుపరిచయం, సాంకేతిక శిల్పపరిజ్ఞానం — ఈ మొదలైనవి సమగ్రంగా వుండటం అరుదు. ఆడబడేదీ, చూడబడేది నాటకం అనిపించుకుంటుంది గాని, కేవలం వ్రాయబడిందీ, చదవబడిందీ మాత్రమే నాటకం కాదు. అందుచేత ఆడవలసిన దృష్టితోనూ, చూడబడవలసిన దృష్టితోనూ ప్రొడ్యూసరు, లేక సూత్రధారుడు కవికి నాటకరచనలో తోడుపడితే ఉత్తమం. లేదా కవి వ్రాసినతరువాత ఆ నాటకాన్ని యథానుకూలంగా మార్చుకోటానికీ, చేర్చుకోటానికీ ప్రొడ్యూసరుకు అధికారమూ, అవకాశమూ ఉండితీరాలి. నటుడే ప్రొడ్యూసరుగా వుండరాదా అంటారేమో. వుండకూడదనే నామతము. ఒక్క నటుడితో నాటకం జరగదు. పదుగురు నటుల యొక్క సరస సమరస సమ్మేళనమే నాటక విజయము యొక్క రహస్యం. అనేకమైన నటీనట సముదాయాన్ని ఒక సూత్రంమీద నడిపించవలసిన భారం వహించవలసినవాడూ, కవి నటధర్మాలను రెంటినీ గ్రహింపగలిగినవాడూ సూత్రధారుడేగాని నటుడు కాడు.

అందుచేత సూత్రధారుణ్ణి భాష్యకారు డనవచ్చు కొంతవరకు. కవి నాటకం రచించడంలో ఈ సూత్రధారుడి యొక్క సాయంగనక పొంది వ్రాస్తే, ఏచిక్కూ వుండదు. ఒకవేళ అదివరకు వ్రాయబడిన రచనను ప్రయోగానుకూలంగా మార్చవలసివుంటే, ఆ అధికారం నేను నటుడికివ్వను, సూత్రధారుడి కిస్తాను.

ఇక, ఒక నటుడికిగాను నాటకం వ్రాయబడటం స్టార్ సిస్టం బలిసిపోయిన అమెరికా మొదలైన పాశ్చాత్యదేశాల్లో

అమల్లోవున్నదేమోగాని మన తెలుగుదేశంలో అంతగా నాకు కనుపించదు. అంతకంటే నాకు అధికంగా కనిపించేది ఒక నటుడు ఒక నాటకాన్ని తనకు ఆధిక్యత వుండేట్లు దబాయించి మార్పుచేసికోటం. సూత్రధారుడన్నవాడు లేకుండా నటుడు స్వతంత్రించడంచేతనే ఈ అత్యాచారం ఇంతగా చెల రేగుతున్నది.

అందుకే నటుడికి స్వాతంత్ర్యం వుండరా దంటాను ఈవిషయంలో. ఈ స్వాతంత్ర్యానికీ. నటుడికి వ్యక్తిత్వం వుండటానికీ సంబంధం లేదు. వ్యక్తిత్వంవిషయం వేరు. నటుడికి వ్యక్తిత్వం వుండాలని అనేవాణ్ణే నేను.

౨

నాటకప్రయోజన మేమి? కేవలము జనుల ఆహ్లాదముకొరకేనా నటించుట? లేక సంఘమర్యాద లలో మార్పుతెచ్చుటకూడ నటుని పనియా?

శ్రీ వై. వి. రావు:—నాటకములు, చిత్రపటములు, సినీమాలు—ఇత్యాదుల ముఖ్యోద్దేశము జనుల కాహ్లాదము నిచ్చుటయే అయినను, సంఘసంస్కారముగూడ ఒక ఉద్దేశ మయిఉండవలయును. నటు డేపని చేసినను అది ఒకరికో, అందరికో ఉపకారి అగునట్లుండవలెను. ప్రేక్షకుల ఆహ్లాదమే మహోపకార మనబడదు. సంఘసంస్కార మొనర్చుటకు నాటకముగాని, సినీమాలుగాని ఉత్తమసాధనము లనుట అనుభవముచేత ఇప్పటికే రుజువయియున్నది. ఉదాహరణకు—నాటకములను, సినీమాలను చూచి చూచి, విద్యావిహీనులైన ప్రేక్షకులుగూడ గొప్ప విమర్శనాశక్తి నార్జించుకొనియుండుట మనము చూస్తూనేయున్నాము. సినీమాల మూలమున వివిధదేశాచారములను, మర్యాదలను, వేషభాషలను ప్రజలు గుర్తెరిగి, తమకు రుచించినట్టివానిని అభ్యసించి అలవరచుకొనుటయు చూచుచున్నాము. సంఘములోని కొన్ని దురాచారములను, దురభ్యాసములను నాటక, సినీమాల వెలుగులో ప్రజలకు పారజూపి, అట్టి దురాచార ములను, దురభ్యాసములను ఎదుర్కొనుటకు ధైర్యమును నటుడు ప్రజలకు కలుగజేయుటకూడ మనము చూచుచునే యున్నాము. సదా ఇట్టివి మనయెదుట జరుగుచుండ, నాటకము కేవలము ప్రజల ఆహ్లాదముకొరకే అనుట సత్యమునకు దూరమగును. "ఇట్టి సంఘసంస్కారములను చేయవలసిన పని నాటకముల; సినీమాలదేనా?" అని అందురేమో. విజువల్ ఎడ్యుకేషన్ లాంటిది మరొకటి లేదని శాస్త్రవేత్త లందరు నేడు సిద్ధాంతముచేసియుండుటకూడ అందరకు తెలిసిన విషయమే. కావున, సంఘములో ఎట్టిమార్పుల నైన తేగల సాధనములు—నాటక, సినీమాప్రదర్శనముల కన్న గొప్పవి లేవని నా అభిప్రాయము. కావున నాటకమునుగాని, సినీమానుకాని సృష్టించు ప్రతివాడును సంఘమునకు తమ సృష్టియొక్క ప్రయోజనమును తమ దృష్టియం దుంచుకొని నిర్మించి నటింపకతప్పదని నామతము. కేవలము ప్రజల ఆహ్లాదముకొరకే అడబడు ప్రదర్శనములు ఎడారిలో కురిసిన వర్షమే అగును.

శ్రీ నండివాడ చిదంబరం:—కాని, రంగస్థలంలో భావచిత్రీకరణోద్యోగానికి పూనుకొన్న నటుడు సంస్కారం కొరకు ప్రయత్నం చేయడు. ప్రయత్నంచేయడానికి అవకాశమూ లేదు. కవి సంస్కారంకొరకు కావ్యం రచియిస్తే రచియించివుండవచ్చు. ఎందుకంటే, వేషంలో లీనమైవుండి, పాత్రపోషణప్రయత్నములో నిమగ్నుడైవున్న సందర్భము లలో నటునకు ఇతరచింత లేమీ ఉండవు. ఉండడానికి వీలు లేదు. అదీగాక, పాత్రనిర్వహణలో, రంగస్థలమునుండి ఒక్క సంఘసంస్కారంకొరకుమాత్రమే ఎందుకు కృషి చెయ్యాలి? ఇతరవిషయములను ఏల పాటింపకూడదు? నటుని విధి, నటుని గమ్యస్థానము వేరు. ఏదైనా, సంఘ సంస్కారంమాత్రం అతని గమ్యస్థానం కాదు. ఐతే, అనుకొననిదే, తనపట్ల ప్రయత్నములేనిదే, తన అపూర్వ నటనాకౌశలప్రకటనవలన సంస్కారంగూడా ఐయలుదేరితే, నటునికి పరిపూర్ణ ఆనందమే. కాని సంఘసంస్కారము అతని గమ్యస్థానము గాదు.

ఇట్టి సంస్కారమే గమ్యస్థానమయితే, ప్రేక్షకుల నిమిత్తం తాను నటిస్తూవున్న విషయం ప్రతినిమిషమూ నటుని మనోవీథిని గోచరమవుతూ, నటనను కుంటుపడునట్లు చేయుట కలుగును.

శ్రీ బళ్లారి టి. రాఘవ:—నటుడు మార్గదర్శకుడు కావలెను అనియే నామతము. తనజాతియౌన్నత్యమును చక్కగా గుర్తెరిగి, ఇతరజాతుల కళాసంస్కారమును అవగాహనచేసికొని, జనులకు ఉన్నతాదర్శములను ప్రకటించుటయే అతని ధర్మము. సాధారణజనులకు ఉన్నతాదర్శము లతో పనిలేదు; వారి కవి అర్థముకావు అని కొందరి అభిప్రాయము. ఇది నిజముకాదు. మామూలుమనిషి, పదేపదే, ఉత్కృష్టసత్యములను గ్రహించి, వానికై తన సర్వమును త్యాగముచేయ సంసిద్ధుడైనట్లు మనకు తెలియును. ఇట్టివారి మనస్సులలో తగిన సంచలనము కలుగజేయుటయే నటుని పని. ఇతరదేశములలో ప్రజలు అనేకవిధముల ముందుకు

నడచిపోవుచున్నారు. "మన ప్రజలకు ఈ ముందునడక పనికిరాదు. వీరి కిట్టి అభ్యుదయము రుచింపదు" అని కొందరు రంగస్థలాధికారులును, నటులునుకూడ భావించుట నే నెరుగుదును. అది తప్పు. తగిన నాయకత్వమున ఎంతటి అభ్యుదయసంపాదనకును తోడ్పడగలరు జనసామాన్యము. నటుడు ప్రజాసేవకుడు, ప్రజానాయకుడు, మార్గదర్శి, తత్వవేత్త, రాజకీయవేత్త, సంఘసంస్కర్త, విద్యాదాయకుడు– వీరందరి ప్రత్యేకగుణములు నటునిలో సమ్మిళితమైనపుడే అతడు నిజమైన నటుడు కాగలడు.

"సాధారణజనులకు కేవలము ఆనందముకొరకే నాటకములు పనికివచ్చును. అంతకంటె ఎక్కువగా వాని విలువ వారు గ్రహింపజాలరు" అనుట వెర్రిమాట. గ్రహించు నటుల చేయుటయే నటుని కర్తవ్యము. వారిని ఒక మెట్టు పైకి లేవనెత్తుట, వారిలో గొప్ప గొప్ప అభిరుచులను నెలకొల్పుట, వారిని ఉత్తమకళాభిజ్ఞులుగ చేయుట, తమలో ఇమిడివున్న దైవికమైన శక్తులను తాము తెలిసికొనునట్లు చేయుట నటుని విధి. ప్రేమ అనగా ఆశాభంగమువలన కలిగే రోదన కాదు. ప్రేమించుట ఒక గొప్ప మనోబలము ను అలవరచుకొనుట, దేవత్వమును అపాదించుకొనుట అని నటుడు వ్యక్తపరుపవలెను. జనులలో కనపడు పశుత్వము ను క్రమశిక్షణవలన దైవత్వముగ పరిణామముచెందు నటుల చేయుటయే నటుని గొప్ప బాధ్యత. ఈ ఆశయము లేని నటుడు ఎంతటి ప్రజ్ఞావంతుడైనను నిజమైన నటుడు కాజాలడు. అతడు కేవలము బఫూనే.

శ్రీ జి. వి. సుబ్బారావు:— నటుడు సృష్టికర్త అని ఇంతకు ముందే చెప్పేను. ఇంత స్థానాన్ని నేను ఇచ్చి నటువంటి నటుడు కొన్ని మహత్తర విషయాలకు కారణభూతు డవుతున్నాడు. గ్రంథకర్తవల్ల సృష్టింపబడ్డాడు. తన పాత్రను పోషించుకొంటూ, నాటకాన్ని, ఫలనాన్ని రసవంతముగాను, విజయవంతముగాను పరిణమింపజేస్తాడు. దీనివల్ల తన దేశానికి పెద్దపరివర్తన కలుగచెయ్యొచ్చు, మానవ కల్యాణానికి హారతి ఎత్తి అక్షింతలు చల్లవచ్చు. కాని, తాను ఇలా చేస్తున్నాననే అభిప్రాయం కాని, తన కిట్టి విధి నెత్తిమీద ఉన్నదని కాని వెర్రితాదాత్మ్యాలు పడితే, తన పాత్రనిర్వహణ యాబదిపాళ్లయినా తప్పకుండా కుంటుబడి పోతుంది. కాబట్టి, తనకు తెలిసిచేసే నటనకంటే తనకు తెలియకుండా కలిగించే గుణములు చాలా ఎక్కువ అని నా నమ్మకము.

ప్రశ్న:— మీరు గిరీశముపాత్రను అతినిపుణతతో నిర్వహించటం ప్రజలందరూ గిరీశాలు కావాలనా మీ అభిప్రాయం?

శ్రీ జి. వి. సుబ్బారావు:— అటువంటి గుణం కలిగించేటట్లు నే నభినయించితే, ఆ ఉత్తరక్షణమే నేను గిరీశం పాత్రను ధ్వంసము చేసినట్లును, కీర్తిశేషులైన శ్రీ గురజాడ అప్పారావుగారి ఎడల అత్యపచారం చేసినట్లును భావిస్తాను. అది నాలోనే ఉంది. అంటే నటుడిలోనే ఉంది. పాత్రను సరిగా అర్థంచేసుకొని, త్రోవలు పోకుండా సరియైన నటన చేసినప్పుడు ఇట్టి విపరీతగుణం ఎప్పుడూ ఉద్భవించదు. బుచ్చమ్మను వల్లో వేసుకొనే ఘట్టాలలో నన్నందరూ తిట్టిపోసి, అసహ్యించుకొనవలెనని, అట్టి గుణము కలుగునట్లే నటించవలెనని నా ఆశయము. అన్నింటను పాత్రైక్యత ఉన్నప్పుడు కలుగవలసిన గుణమే కలిగి, రచనాశయము సఫలీకృత మగుచున్నది. నాటకాంతానికి గిరీశంపాత్ర నిర్వహణంమీద ఎంత మోజు కలుగుతుందో, గిరీశం మీద అంత నిరసన కలిగినప్పుడు పాత్రాభినయము సరియైన పంథాలో పడిందన్నమాట. లేకున్న, ఆదినం నేను మామూలు సుబ్బారావునే. ఒక్క మాటతో ఈ విషయము ముగిస్తాను. పుష్పము తనలో అన్ని సౌరభాలు, అన్ని నవనవోన్మేషాలు, అన్నిశక్తులు, అన్ని సామర్థ్యములు ఉన్నవని తెలియకుండా మొగ్గవిలావిడుస్తున్నదో, అంత అమాయికమయిన అవ్యక్తతతో, అనన్యచింతతో నటుడు తాండవించాలని నా ఉద్దేశము.

శ్రీ రాఘవ:—నిజము. టాల్‌బట్‌మందే చెప్పినట్లు, ఒక కుర్రవాడు ఏడేళ్లు వరుసగా విలన్‌పార్ట్ యాక్టుచేస్తే ఎనిమిదవ ఏట అతడు సెయింటు అవుతాడు.

ప్రశ్న:— రావు గారు చెప్పినదే నిజమైతే, ఈ పాతిక ముప్పై సంవత్సరాలలో ప్రేక్షకుల ఎదుట ఆదర్శంగా ఉంచబడ్డ హరిశ్చంద్ర, సావిత్రి ఇత్యాది పాత్రలను సక్రమంగా నిర్వహించడమువల్ల సంఘములో సత్యసంధత, పాతివ్రత్యము ఎక్కువైనట్లూ, స్థిరమైనటూ చెప్పగలమా?

శ్రీ వై. వి. రావు:— ఇది కొంచెం పట్టిచూపే ప్రశ్నే. అయినాసరే నా అనుభవంలో నాకు తేలినంతవరకు చెప్తాను. ప్రశ్నలో పౌరాణిక పాత్రలను గురించి మాత్రమే అడుగబడివుంది. నిజంగా కూడా. నిన్నటివరకూ కూడ సాంఘిక నాటకాలు మన మెరుగం. నిన్న నేడు ఒకటో,

రెండో బయలుపడటం ఆరంభమైంది. అదట్లుండగా, పౌరాణికాలు ప్రేక్షకులలో ఏదైనా సంచలనం కలుగ జేశాయా అని విచారిద్దాం. దాదాపు యిరవై ఏండ్ల క్రితం, ఒక నాటకం నేను చూస్తూవుండగా, నా ముందుకుర్చీలో కర్మనిష్ఠాపరుడున్నూ, దైవచింతగలవాడున్నూ అయిన ఒక జిల్లాకోర్టు వకీలు కూర్చొని, నాతోపాటు నాటకం చూస్తూవుండినాడు. ఒక సీనులో పాలకడలిలో శేషశాయి అయిన శ్రీమన్నారాయణుని కొన్ని సీనిక్ ఎఫెక్ట్సుతోటి చూపారు. తక్షణం యీ వకీలుగారు చెంపలువేసుకొని, నోటితో ఏమో గొణుగుకొనుచు, చేతులు పైకెత్తి నమస్కారంచేశారు. ఆ పాలకడలిదృశ్యంవల్ల ఆ చదువుకున్నాయనలోనే ఒక సంచలనం ఆక్షణంలో కలిగిందనే చెప్పకతప్పదు. అయితే పైప్రశ్నప్రకారం ఆయా నాటకాలవల్ల నేర్చుకోవలసిన నీతులను ప్రేక్షకులు నేర్చుకొని అనుష్ఠిస్తున్నారా అంటే, ఇంకొక కొంచెం విపులంగా మనవి చెయ్యవలసివుంటుంది నేను. ఈ పాతికేండ్లలో ప్రజలలో కొత్త ఆశయాలు, ఊహలు, కాలానుగుణ్యముగ సంఘ మర్యాదలలో, ఆచారాలలో మార్పులు ఏర్పడుతూ వస్తూ వున్నాయి. ఆమార్పు యింకా పూర్తికాలేదు. ఇంకా వర్తమానకాలంకూడ సంధినమయంగానే భావించాలి. నేటి మానవజీవితనిజానికిన్నీ, పౌరాణికాలలో మనము ప్రదర్శించే అంశాలకున్నూ చాలా వ్యత్యాసమున్నది. ఎంత వ్యత్యాసమంటే, నేటి మానవుడు ద్రౌపదికి అయిదుగురు భర్తలు వుండినారన్నమాట మొదట నిజమని ఒప్పుకోకపోవడం, ఒక వేళ జరిగియుండవచ్చునేమో అనుకున్నా, నేడు ఆపద్ధతిని తీవ్రంగా ఖండించడంవరకు నేటి మానవునికి జీవితంమీద దృష్టియే మారింది. ఇంకా మారుతూవుంది. కనుక రోజూ తన జీవితంలో ప్రపంచంలో జరిగేవాటికంటే, చాలాదూరం గాను, నమ్మసాధ్యం కానటువంటి విషయాలను ప్రదర్శించి, వానిలోని ఆదర్శాలను అనుష్ఠానంలోకి తెచ్చుకోమంటే, నేటి జీవునికి దుస్సాధ్యమని నా అభిప్రాయం. కనుక, మానవునికి నేటి జీవితాని కుపయోగపడే ఆదర్శాలతో నిండిన ప్రదర్శనాలను చూపి, వాటిని అనుష్ఠించమని అడిగి, అప్పటికీ అత నలా చేయకపోతే అప్పుడు యీ నాటకాలు సినీమాలు కేవలం ఆహ్లాదంకొరకే అని నేను ఒప్పుకుంటాను. ఇంతే కాక కొన్ని ముఖ్యమైన సంఘ సమస్యలను కథావస్తువులుగా వుంచుకొని తీయబడ్డ ఫిలిములు తాముద్దేశింపబడ్డ కార్యాన్ని లవలేశమైనా చేయగలిగినట్లు నా సినీమా ప్రపంచానుభవంలో నాకు నమ్మకం కలిగింది కనుకనే సాక్షితి. హరిశ్చంద్రుడు ప్రేక్షకులను తమ మార్గానికి త్రిప్పలేకపోవడమున్నూ, చక్కగా నటింపబడ్డ గిరీశాన్ని చూచిన తర్వాత తమ జీవితాలలో అలాంటి టోపీరాయ డెవడైనా తటస్థించితే, వాణ్ణి శీఘ్రంగా గుర్తెరిగి "ఏమండీ హనుమాన్లుగారూ" అని సంబోధించడమూ జరుగుతూవుంది.

శ్రీ ఎస్. వి. శేషయ్య:—కళ కళకొరకా, నీతి కొరకా అన్న వాద మిది. ఈవిషయమై పాశ్చాత్యపండితులలోగాని, ప్రాచ్య ఆలంకారికులలోగాని పూర్వంనుంచీ ఉభయమతాలకూ చెందినవా రున్నారు.

కళ లన్నింటిలోనూ నాటకకళకూ, జీవితానికీ సన్నిహితమైన సంబంధం వున్నది. ప్రజల చిత్తాలను రంజింప చెయ్యడంలోగాని, ప్రజల అభిరుచులను తీర్చి దిద్ది పదును పెట్టడంలోగాని, ప్రజలకు ఉపదేశం చెయ్యడంలోగాని నాటక కళకు వున్నంత ప్రభావం మరేకళకుగాని లేదు. అందుచేత అత్యంత ప్రభావకలితమైన ఈ కళను ప్రజోద్ధరణకు, సంఘోద్ధరణకు ఉపయోగించుకోటంలో నాకు దోష మెంతమాత్రం కనిపించదు. మన పూర్వ నాటకాలన్నీ ఏదో వొక గొప్ప ధర్మాన్నీ, ఏదో వొక నిత్యసత్యాన్నీ ప్రతిపాదించినట్టివే. అలాగే ఈకాలానికి తగినట్టు ఇప్పుడుకూడా నాటకం ఒక సందేశాన్నీ, ఉపదేశాన్నీ ప్రజకు అందజేయవచ్చు. ఐతే, ఆ వుపదేశంగానీ, సందేశంగానీ కళకు అడ్డుతగలకూడదు. కళను అణగదొక్కి తాను పైకి కనిపించకూడదు. అలాగ్గా నగ్నస్వరూపంతో బయటబడినప్పుడు అది కేవల ప్రచారమో, ప్రకటనపత్రమో అనిపించుకొంటుంది గాని కళ అనిపించుకోదు. ఇక, నీతి నుద్బోధించే నాటకాలవల్ల ఎందరు నీతిమంతులైనారు అన్న ప్రశ్నకు సమాధానం చెప్పటం ఎంత కష్టమో, అంత సులభం కూడాను. నీతి అనేది దేశకాలపాత్రలను బట్టి భేదిస్తుంది. సంఘంలో మార్పులు కొలిచేందుకు స్థిరమైన కొలబద్దలు లేవు. అనేక ఉద్యమాలయొక్క ప్రభావం వ్యక్తిమీదా, సంఘంమీదా ప్రసరించినప్పుడు దేనికి దేనికి ఫలితం ఎంతెంతమాత్రమో చెప్పటానికి సాధ్యం కాదు. ప్రపంచచరిత్రలో ఒక గొప్ప మార్పు ఒక శతాబ్దంలోపలనే జరగవచ్చు. ఒక్కొక్కప్పుడు పదిశతాబ్దాలలో కూడా మార్పు లేకుండా వుండవచ్చు. అదీగాక, నీతిని బోధిస్తూ నాటకాలు ఆడుతూవుండబట్టే ఇంతమాత్రమైనా మన సంఘంలో సత్యసంధతా, పాతివ్రత్యం మొదలైనవి ఇంకా నిలిచివున్నవని నా వుద్దేశం. ప్రస్తుతం ఎక్కువగా ఆధునిక సమస్యలకూ, వర్తమాన ప్రజాజీవితానికి

సంబంధించిన రచనలు కావలెనని తప్పకుండా కోరుతారు. అయితే, పౌరాణికాలు అసలే నిషేధించాలి అనేవారితో నే నేకీభవించలేను.

శ్రీ నందివాడ చిదంబరం:— అవును. ప్రపంచం ముందుకు నడుస్తోందిగాని వెనక్కి వెళ్ళడం లేదు. ఆర్థికం గా హిందువులు అథోగతిలో ఉన్నా, వారి బుర్రలు మాత్రం ఇంకా పనిచేస్తూనే ఉన్నాయి. ప్రతీ మానవునికీ నిన్నటి కంటే ఈ రోజున మరి రెండు ఊహలు ఎక్కువ అవుతున్నాయి. నిన్నటి కంటె ఈ రోజున ఎక్కువ ఉత్సాహం బయలుదేరుతోంది. ఈ ఉత్సాహానికి తోడు ఆంధ్రులకి ఉద్రేకం గూడా ఉండటంవల్ల ఆంధ్రుడు ఈ ఉత్సాహ ఉద్రేకముల జోడుగుర్రాలబండి నెక్కి విప రీతమైన వేగంతో పోతున్నాడు. అంతవేగంగా పోయే గుర్రాల్ని ఆపనూ కూడదు; ఆపినా లాభమూ లేదు. అందు చేత, ఈ ఉత్సాహ ఉద్రేకములను దేశాభ్యుదయమునకు తోడ్పడేటట్లు, నైతిక సాంఘిక ఆధ్యాత్మికజయం సాధించే టందుకూ, కళోత్పత్తికీ, విజ్ఞాన విస్తరణకూ తోడ్పడేటట్లు మంచి మార్గములలోకి త్రిప్పుకోవడం ముఖ్యావసరమై ఉం టుంది. "మేము ముందుకు వెళ్లం. మేము మా పాత అభి ప్రాయాలలోనే వెనకబడి ఉంటాం." అంటే నే ననేది ఏమీ లేదు. వారి కొక నమస్కారం.

ప్రస్తుతంలో, పాత నాటకములను పరీక్ష చేస్తూ కాలం వృథాపుచ్చే బదులు జాతీయ స్వభావములు, జాతీయ దృక్ప థము, యుగసందేశాన్ననుసరించి ఉన్నతాశయములను పురికొల్పే ఉద్రేక పూరితములైన నాటకములను వెంటనే వ్రాయడానికి పూనుకోవడం చాలా సమంజసం.

3

నటుడు తాను నటించు పాత్రలో లీనము కావల యునా? లేక సదా తన వ్యక్తిత్వమును జ్ఞాపక ముంచుకొనవలయునా? నటునకు తాదాత్మ్యసిద్ధి ఉన్నదా?

శ్రీ వై. వి. రావు:— అద్భుతముగా నటించిన ఒక నటుని మనము సాధారణముగా "ఆహా, పాత్రలో లీనమయినాడురా" అనుచుందుము. అంతమాత్రముచేతనే నిజమయిన నటుడు తన పాత్రలో లీనమయి మైమఱచినా డనుకొనుట పొరపాటు. తన వ్యక్తిత్వమును మరచి పాత్రలో లీనమయి ఒక నటుడు చేయు హావభావములు నటన కాదు. అవి ఆవేశపు చేష్టలు అనవచ్చును. నటన ఒక అవ ధానము వంటిది. తన్మయత్వము చెందిన ఒక నటునకు పరిసరజ్ఞానము శూన్యమగును. అపుడు ఆ నటు డున్మత్తున కేవిధమున వేరగును? నా స్వానుభవములో, పాత్రలలో లీనమయి నటించిన కొందరి చేష్టలను నివేదించె దను. హిరణ్యకశ్యపుడై "చూచవోయి, శుంతహారిని" అని పాడుచు, కత్తి ఝళిపించుచు, ప్రహ్లాదుని భుజము కీలూడునట్లు చేయిపట్టిలాగినవారిని నే నెరుగుదును. భీముని పాత్రధరించి, కీచకవధ సలిపి, తెరవెనుక నుండు వారిని నిజముగా వధింపవచ్చినవారిని ఎరుగుదును. షేక్స్పియరు ఒథెల్లో నాటకమునందు డెస్డిమోనాను నిజముగ గొంతుపిసికిన ఒథెల్లోను కూడా చూచాను. ప్రహ్లాదలో నృసింహావతారపాత్ర ధరించి, పసుపునీళ్ల హోర తులు జరుగునందాక శాంతింపక ప్రళయతాండవ మొనర్చు చుండినవారలనుగూడ చూచియున్నాను. తన్ను తాను మఱచి తమ పాత్రలలో పూర్తిగ లీనమగువారి చేష్ట లివియే. కావున రంగస్థలమునందున్నంతవరకు ప్రతిక్షణము తన వ్యక్తిత్వమును మఱువక, పరిసరజ్ఞానము గలవాడై, తన్నుతాను మరచి నిజముగా తన పాత్రలో లీనమయినవాని వలె అభినయించి ప్రేక్షకలోకమునకు అట్టి అభిప్రాయమునే కలుగజేయువాడే నటుడు. నటన అను పదమునందే యీ అర్థమున్నది. అట్టిచో తన పాత్రలో పూర్తిగా లీనమయి చేయు చేష్టలను నటన యనుట తప్పుకదా? తమ పాత్రలో లీనమయి చేయు కొందరి భావప్రకటనముకూడ ఒక్కొక్క ప్పుడు శ్లాఘనీయముగ ఉండినట్లే ఉండును. కాని అది కొనవఱకు రసభంగముగాక నిలువదు. అట్టివారి భావప్రకట నము నిద్రలో లేచి నడచిపోవువారి నడకవలెనే యుండును. అట్టివారు ఎట్టి స్వల్పఅంతరాయము కలిగినను ముందుకు సాగక కూలుదురు. కనుక, తన వ్యక్తిత్వమును రంగస్థల మం దేక్షణమునందైనను మరచి మెలగు నటుడు రసభంగము నొనర్చి, తానును భంగపడును. అట్టివాడు నటుడు కాడు.

శ్రీ జి. వి. సుబ్బారావు:—రావుగారు యిచ్చిన అభి ప్రాయంతో ఏకీభవింపలేకుండా ఉన్నాను. గ్రంథస్థవిజ్ఞానాన్ని అవతలుంచి, నా స్వంత అనుభవాన్ని చెప్పుతాను. నటుడు తనపాత్రలో లీనముకాకపోయినయెడల, నటనకు పరిపూర్ణత సిద్ధించదని నా అభిప్రాయం. వ్యక్తీకరణకు దీన్ని మూడు భాగాలుగా విభాగించి మాట్లాడుతాను.

మొదటిది రూపసైన్యం. తాను నటించబోయ్యే పాత్ర స్వరూపం తాను తాల్చటం రూపసైన్యం అంటాను. రూపసమ త్వంకోసం పరికరాలన్నీ సమకూర్చుకోవాలి. తన ఒడ్డూ

పొడుగూ, తన వయస్సు, భావప్రకటనకు కావలసిన తన ముఖం మొదలైనవాటినన్నీ, కావలసిన ఆహార్యాన్నంతా సేకరించుకొని తయారుకావాలి. తాను నటించబొయ్యేపాత్ర యొక్క సరియైన నమూనాగా తయారుకావాలి. అంటే, ఓ పరకాయప్రవేశం చెయ్యాలన్నమాట. ఆ కాయం దొరకదు కనుక, తన కాయాన్నే అలా మార్చుకోవాలన్నమాట. దీంట్లో ఎక్కడో కొంత కొరత వస్తే, రూపలైన్యం పరిపూర్ణత పొందక, అలా పొందలేదన్నజ్ఞానం తన్ను వేధిస్తూ ఉండటంవల్లనే నటనలో కొంత బింకమూ, పేలవత్వమూ కలుగుతున్నాయేమోనని నాభయం. ఏది అంత సరిపోకపోయినా, ఇది ఉండదుగాని ముఖం సరిపోగకపోతే ఉంటుందని నా అభిప్రాయం. పెద్ద బవిరిగడ్డాలు, మీసాలు, జటాజూటాలూ కావలసిన వేషాలు, మిగతావాటికి జంకినా, వీటిని జంకకుండా మట్టుకు వేస్తారు. ఎందువల్ల? అవి ముఖభావాల్ని కప్పిపుచ్చి, లోపల లొసాగం బయటపడకుండా కాపాడుతూంది గనక. అందుకే శివుడి వేషంగాని, ఋషులవేషాలుగాని ఎవ్వరైనా తేలిగ్గా వెయ్యవచ్చు. వేస్తారుకూడా. కాని ఆ లోకసమ్మోహనమైన ఆ శ్రీకృష్ణపరమాత్మవేషం వెయ్యమనండి చూతాం, ఎలా తయారవుతాడో?

రెండవది హావభావలైన్యం. పరకాయప్రవేశం చేసినా, వ్యక్తియొక్క హావభావాలను అలవరుచుకొనుట మరొక పనీ, సాధనానూ. ఇదికూడా చక్కగా అలవడ్డ కొన్నగాని చేసేనటన సౌరభాలను వెలిగ్రక్కదు. ఇది ఒక్కొకరి సంస్కారంకొద్దీ లభ్యమయ్యే పదార్థం.

మూడు రసలైన్యం. అక్కడా వచ్చింది మనకు చిక్కు. మీరు లైన్యం, అంటే తాదాత్మ్యసిద్ధి ఏమాత్రం లేదంటారు. నేను క్వచిత్, అంటే అంతో ఇంతో ఉంటుందంటాను. ఈ విషయాన్నిగురించి, నటన మొదలుపెట్టిన నాచిన్ననాటినుండీ పరిశీలించి చూస్తూఉన్నాను నన్నూ, నా ప్రక్కనటులనూ, రంగస్థలంమీద నటించే ఇతరనటులనూ. రానురాను నా అభిప్రాయం గట్టిపడింది కాని తేలిక్కాలే దేమాత్రం.

తాదాత్మ్యం కొంతవరకే సిద్ధిస్తుందని నామతం: పూర్ణంగా అని కాదు. ఇందుకనే పైసిద్ధా లేర్పడ్డవంటా కనుకొంటాను. దానికి నా సమాధానం ఏమిటంటే, రసోద్వేగంలో హద్దులు మరిచి మీరుతాడేమోనని భయంచేత ఏర్పడ్డవనీ, కొంతవరకు నటుడికి తాదాత్మ్యసిద్ధి తప్పదనీ భరతుడుకూడా, అనుమానించాడనే నానమ్మకం.

తన వ్యక్తిత్వాన్ని సాంతం మరువకుండా, రసావేశం లేకుండా, ఎంతదూరం నవరసాల్లోకీ లైన్యంకాగలడో, దాన్నిబట్టి ఉత్తమనటు డవుతాడు. ఈ యాంప్లిట్యూడ్‌నుబట్టి వస్తుంది అతడిస్థానం.

ఇంకొక విషయం. రంగస్థలం ప్రక్కలనుండి ఎన్నిమార్లో నిష్క్రమిస్తూన్న, నిష్క్రమించిన నటులను పరీక్షగా చూశాను, నాతో సహా. నటించిన రసంలోనుండి పూర్ణవ్యక్తిత్వములోకి ఎందుకో వెంటనే రావటం లేదండీ. కొంతకాలం పట్టుతున్నది. కారణం లైన్యసిద్ధే. వాంట్లోనించి గ్రుక్క తిప్పుకుంటున్నారు. అంతే.

ఇంతకన్నా మరొక విషయం. చాలా మంది నటులు రంగస్థల జీవితం ముగిసీ ముగియకముందే హరిదాసులు, హరికథకులూ అయిపోతున్నారు. మన మాదే నాటకాలెక్కువగా భక్తిరస ప్రాధాన్యాలు కావటంవల్ల, ఆ భక్తిరసమాధుర్యాలు, అవ్యయానందాలు మరగాని ఉండటంవల్ల, ఆలైన్యపు తాకిడీలవల్ల మారుతున్నారేమోనని నా అనుమానం. టాల్‌బట్ మందే చెప్పినదానిలో యథార్థతకు భిన్నముగా ఏమీ లేదు. ఒకప్పుడు బెజవాడలో రామదాసు నాటకమయిన తర్వాత ఓ గొప్ప నటుని "ఈ వేషధారణ మిమ్ము మార్చివేసిందా లేదా?" అని అడిగాను. "ఏమాత్రమూ లే"దని వారు గట్టిగా చెప్పారు. ఆశ్చర్యము వేసింది. ఈ విషయములో వారి నప్పు డెంత నమ్మానో, ఇప్పుడూ అంతే నమ్ముతున్నాను. వారిని కొంతవరకూ మార్చిందనీ, దానివల్ల వారిలో కొన్ని కొత్త మానసికమ్ము కలిగినట్లు గానూ నాకు గోచరమయింది.

రసానుభవంగాని, లైన్యంగాని ఎంతవరకు చెయ్యవచ్చునంటే, ఇంతవరకు చెయ్యవచ్చు—నోటిలో చల్లని ఇక్షురసం పోసుకొని, బుగ్గనపెట్టి, మ్రింగనువ్విళ్లూరించినా మ్రింగక, ఆ తీపిని గ్రహించిన హద్దులలో వర్తించాలి. ఇక తాదాత్మ్యం ఎంతవరకూ సిద్ధిస్తుందంటే, ఇంతవరకూ— "స్థానవిశేషమాత్రమున తామరపాకున నీటిబొట్టు...." అన్న పద్యం జ్ఞప్తికి తెచ్చుకోండి: నేనంతా అర్థమయిపోతాను. తామరాకున నీటిబొట్టులాంటిది నటుడి రసలైన్య సంబంధం.

చివర కొకమాట చెప్తాను. ఈ లైన్యపరిమితికూడా అయారసాన్నిబట్టి వ్యత్యసిస్తూ ఉంటుంది. అన్నిటికన్నా హాస్యరసంలో అంటీఅంటనంతే ఉంటుంది.

శ్రీ వై. వి. రావు:—సుబ్బారావుగారు నా మతానికి చాలా దూరంగా లేరు. నే ననేది నటుడు ఏక్షణంలోగాని

తన వ్యక్తిత్వాన్ని మరువకూడదని. వారనేది నటుడు పాత్రలో లీనమైనప్పుడు ఒక్క క్షణమైనా మరువక తప్పదని. వారి నటునికిన్నీ, నా నటునికిన్నీ భేదమేమంటే, పాయసంలాగుండే పదార్థానికిన్నీ, అసలు పాయసానికీ వున్నంతే. మోక్షమార్గంలో కొన్ని మెట్లు, సాధనలు వున్నట్లు పరిపూర్ణమైన నటుడగుటకుకూడ కొన్ని మెట్లు సాధనలు కలవు. ఏనాడు నటుడు తను నటించుచుండే ప్రతి క్షణంలోనూ తనవ్యక్తిత్వాన్ని మరువక, మరచినవానిలాగే ప్రేక్షకులను వొప్పించుచూ నటిస్తాడో, ఆనాడే అతడు నిజమైన పరిపక్వమైన నటశేఖరుడు. ఏక్షణమాత్రం తన వ్యక్తిత్వాన్ని నటుడు మరుస్తాడో ఆక్షణమాత్రం పరిసరజ్ఞానం పోతుంది అతనికి.

శ్రీ ఎన్. వి. శేషయ్య:—నటుడికి తాదాత్మ్యం సిద్ధించేట్టయితే, స్వవశత తప్పినవాడై, ఇతికర్తవ్యతామూఢుడు కావచ్చుననీ. అందుచేత నాటకం రసాభాసమవుతుందనీ నేనుకూడా అంగీకరిస్తాను. నటుడు పరవశుడు కారాదు. ప్రేక్షకులకు భ్రమకలుగజేయడం నటుని ప్రయత్నం కావచ్చు. నిజమే. అంతమాత్రంచేత నటుడు నిర్వర్తించేవని ట్రిక్కుగాని, హస్తలాఘవంగాని కాదు. ఇంద్రజాలంతోగాని, కనుకట్టు విద్యతోగాని పోల్చదగిందీ కాదు. నటన కేవలానుకరణమని నేను భావించడం లేదు. ఉత్తమనటన కేవలం నటుడి వాకదక్షంపైనగానీ, బుద్ధివిభవంపైనగానీ ఆధారపడివుండదు. నటుడి మెదడుకు ఎంత పని వుంటుందో, అంతకంటె అధికంగా నటుడి హృదయంకూడా అతని నటనలో పాలుగొంటుంది. రసార్ద్రమైన హృదయం లేని వాడు ఉత్తమనటుడు కాజాలడు. రసావేశపూరితమైన నటన ఉత్తమనటనగా నేను పరిగణిస్తాను. గోపీనాథునాట్యంలోలాగ ప్రతి అవయవాన్నీ, ప్రతినరాన్నీ కదిలించ గలిగినంత మాత్రాన్ని, అన్నప్పుడల్లా కంటికి నీరు తెప్పించగలిగినంత మాత్రాన నటన అనిపించుకోదు. భావానుకరణమే అభినయం కాదు. అభినయం ఉత్తమనటుని అంతరంగంనుంచి ఉత్పన్నమౌతుంది. కవి సృష్టించిన పాత్రలకు నటుడు ప్రాణప్రతిష్ఠ చేస్తాడు. వాస్తవికజగత్తునుంచి ప్రేక్షకలోకాన్ని నటుడు రసమయజగత్తులోకి లాక్కువెళ్లతాడు. అప్పుడు నటుడు తన వ్యక్తిత్వాన్నే కాదు, తన కళనుకూడా ప్రేక్షకులకు తాత్కాలికంగా మరుపుకుతెస్తాడు. ప్రేక్షకుడికి నాటకం తాలూకు పాత్రనుమాత్రమే ప్రత్యక్షంచేస్తాడు. తాను ధరించే పాత్రనని తాత్కాలికంగానైనా నటుడు భావించక వీలులేదు. అలా భావించనిపక్షంలో నటుడు ప్రేక్షకుల సహానుభూతిని అందుకోలేడు. అందుచేత నటుడు తాత్కాలికమైన రసావేశానికి యత్నించితో లోనుగాకతప్పదు. ప్రతిభావంతుడైన నటుడు తన పాత్రను భావిస్తూ, పాత్రతాలూకు అనుభూతిని అందుకుంటూ, వ్యక్తిత్వాన్ని కోలుపోకుండా వుంటాడు.

౪

ప్రేక్షకులకోసము నటిస్తున్నాననే జ్ఞానము నటునికి అవసరమా ? ఉదాహరణకు నటుడు వన్సుమోరులను ఏమాత్రమైనా పాటించవచ్చునా ?

శ్రీ వై. వి. రావు:—ప్రేక్షకులు సమయాసమయ మెరుగక వన్సుమోరనుటయు, నటకులు అట్టికోరికలను మన్నించుటయు పరిపాటి అయియున్నది. ఉత్తమనాటకము లందును, నటులందును భావప్రకటనమే ప్రాధాన్యముగ నుండును. ఉండవలెనుకూడ. అట్టి నటనాప్రాధాన్యములగు ఘట్టములందు ప్రేక్షకుల కోరికలకు లొంగి నటుడు చర్వితచర్వణమొనర్చుటవలన రసభంగమగును. వాతావరణము కూడ మారిపోవచ్చును. ముఖ్యముగా విషాదాంతనాటకములలో, అందును విషాదఘట్టములందు ప్రేక్షకుల వన్సుమోరులు నటునికిని, నాటకమునకును, అప్పటి వాతావరణమునకును విషాదకరములే యగును.

శ్రీ డి. వి. సుబ్బారావు:—ప్రేక్షకునకు నటిస్తూ ఉన్నానన్న జ్ఞానంకాని, జ్ఞాపకంకాని నటుడికి అవసరమూ లేదు, అగత్యమూలేదు. ఇట్టి జ్ఞానం ఉంటే నటన రసాభాసమై, రక్తికట్టక, ప్రదర్శనం ఒక వీథిబడి, ఒక సంత అయిపోతుంది. కాని, నటుడు ప్రస్తుత రంగస్థల పరిస్థితులనుబట్టి ప్రేక్షకులపైపే తిరిగి నటించవలసివస్తున్నది చాలాభాగం. కాబట్టి, వీరిద్దరికీ ఏదైనా సంబంధ ముండక పోతుందా అని ఊహ కలుగుతుంది. అలా కలగడానికి ఆస్పదంకూడా ఉంది. ప్రేక్షకుల ముఖములను తిలకించు నటుడు నటన చేసినయెడల నటన కున్న జీవమే నశిగి పోతుంది. తా నొక కథలో, ఆ ప్రవాహాన పడి, వివిధపరిణామములకు చెందుచున్న విషయము ఒకరు చూచుటకుగాను చేయుచుండలేదు. అది జరిగినప్పుడు ప్రేక్షకులు లేనేలేరు. కథాప్రవాహాన పడిపోవు ఆ నటీనటులకు లోకమే లేదు; వారి లోకమే తప్పు. నిజమైన ప్రేక్షకలోక మేదనగా రంగస్థలాన ఒక వింతదృశ్యము, మానవ జీవితఘట్టములో జరుగబోవుచున్నది. దానిని పొంచి, దొంగవేటుగ నాటకశాలలో ప్రవేశించి చూచు నాశయము గలవారే. దొంగవేటుగ, ద్వారపాలకునికి లంచమిచ్చి, ఒక దృశ్యమును చూచి, ఆనందింప

రావలిసినవారు ప్రేక్షకులు. మొదటనుండి ఆసాంతమువరకు నటుడు వీరిని ఏ సందర్భములోనూ గుర్తింపకూడదు. మెల్లిగా, పిల్లిగా వచ్చి వేంచేసిన ప్రేక్షకలోకానికి నటనతో ఏమాత్రమూ సంబంధముండరాదు; ఉండకూడదు. ఎటుల ఆలోచించినను, వీరి కీహక్కు కలుగలేదు. కలుగదు.

వన్సుమోర్‌ను పాటింపవచ్చునా అని నన్ను వేరే అడుగనేల? నేను వేరే చెప్పనేల? అయినను ప్రస్తుత పరిస్థితు లనుబట్టి, నటనటీవర్గము రంగస్థలమున ఎటుల అగౌరవింప బడుచున్నదో అను విషయమును పురస్కరించుకొని దీని విషయము కొంత చెప్పెదను.

చాలకాలము క్రిందట ఒక వ్యాసమున వన్సుమోరును ఇట్లు వివరించితిని: "రసోన్మాదోద్వేగమున ప్రేక్షకలోకమున భీకరధ్వానములతో నుద్భవించి, నటలోకమున వినబడి, అందుకొనబడి, గత పాతాభినయములను వర్తమానము చేయు ఒక ఇచ్ఛ వన్సుమోరు నాబడు" అని చెప్పియుంటిని. మొదట వ్యాసము వ్రాసినప్పుడు, నేను దీనికి కారణభూతులు ప్రేక్షకులనియే ఊహపడితిని. కాని, తరువాత దీనివిషయమై మరింత భేదించి పరిశీలించి చూచితిని. చూడగా చూడగా, విచారించి చూడగా దీనికి కారణము కాని, జన్మస్థలము కాని, ఈ నటవర్గములోనికి కాదు కారని మార్చుకొంటిని. మీ కిది విపరీతముగా కనపడునేమో కాని వివరించి చెప్పెదను. చెప్పవలసిన రీతిగా గద్య చెప్పినప్పుడును, వలసిన రీతిగా పద్యము కాని, కీర్తనగాని పాడినప్పుడును, సరియైన నటన చేసినప్పుడును, సరిగా ఔచిత్యమెరిగి నటన చేసినప్పుడును ప్రేక్షకలోకమున ఏమాత్రమూ సంచలనముగాని, కోలాహలముగాని కలుగనేరదు. అది కలిగినయెడల నటుని వలననే కలుగుచున్నదని మరల చెప్పుచున్నాను. పాపము, ప్రేక్షకులు మంత్రరుద్ధ భుజంగములు. వాటిచే కరిపించుకొని బుసకొట్టించుకొనిన యెడల లోపము నటునిదే కాని వారిది కాదు.

శ్రీ బళ్లారి టి. రాఘవ:—పాశ్చాత్యదేశాలలో వన్స్ మోర్ అన్నది లేనే లేదండి. అక్కడ ఆఖరము నాటకాంతాన్ని చక్కగా నటించిన నటుని సామాజికులు చేరి కరస్పర్శలతోను, కరతాళధ్వనులతోను తమ సంతోషమును అతనికి తెలియజేస్తారు.



ఎనమండుగురు సూర్యులు

✽

= శ్రీ పల్లాది సూర్యనారాయణశాస్త్రి =

వేదాధిష్ఠానము, కర్మసాక్షి, జగచ్చక్షువు, ప్రత్యక్ష దైవతము నని వేదములు విశదీకరించిన సూర్య దేవుని స్వరూపస్వభావములను, మహిమను సంగ్రహముగా నిందు కనుగొందము.

పరమేశ్వరుని యిచ్ఛామాత్రమున, జంగమస్థావరాత్మకము నైన యీ ప్రపంచము నుదయస్థితిలయములకు ప్రధానసాధనము సూర్యుడన్న పరమార్థము నే నాడో వేదము విదితముకావించినది. అట్టి సూర్యుడిపుడు సర్వసాధారణముగా కనిపించుచున్న యొక్కడే కాడు. సూర్యు లసంఖ్యాకముగా నున్నారు. సూర్యులే కారు, ద్యులోకము లనంతములు, భూమండలములు మెలకొలది అనియు వేదములు సృష్టితత్వము నావిష్కరించినవి.

"సప్త దిశో నానాసూర్యాః.

"ఏతద్వైవాన్యతాఽఽ సహస్రసూర్యతాయా ఇతి వైశంపాయనః.

"యద్ద్యావ ఇంద్రతే శతగ్ం శతం భూమీః ఉతస్యుః.

"నత్వా వజ్రిన్ త్సహస్రగ్ం సూర్యాః"

ఇత్యాది వాక్యముల యర్థము వివరించు భాష్యకర్తలు వేదప్రతిపాదితమైన బహుసూర్యత్వమును సోపపత్తికముగా స్పష్టీకరించియున్నారు. కావున సూర్యమండలము లనంతము లనెడి సత్యవిషయ మతిప్రాచీన మహర్షులైన వేదద్రష్టల దివ్యజ్ఞాననేత్రములకు గోచరించినదేకాని నేడు మనవారు క్రొత్తగా కనుగొన్నది కాదని ముందు విశ్వసింతము.

సనాతనమహర్షులు ఖగోళపరిశోధనమున నేవేని యితరసాధనము లుపయోగించినారేమో చెప్పజాలము కాని వారికి వారి దివ్యజ్ఞానమే పరమసాధనమై యుండునని మన మిపుడు భావింతము. ఆ పరిశోధన మప్రతిహతము, సర్వతోముఖము, సర్వంకషము, యథావస్తుసందర్శనచణము. కావుననే వారి మాటలు తిరుగులేని సిద్ధాంతములై యర్వాచీనమహర్షుల జగత్తత్వ పరిశీలనమున కవలంబనములైనవి; వేదమే ప్రమాణమన్న విశ్వజనీన విశ్వాసమును స్థాపించినవి.

వేదము పెక్కండ్రు సూర్యు లున్నారని నిర్దేశించి యం దెనమండుగురిని పేర్కొన్నది. ఆరోగుడు, భ్రాజుడు, పటరుడు, పతంగుడు, స్వర్ణరుడు, జ్యోతిష్మంతుడు, విభాసుడు, కశ్యపుడు ననునవి వారి పేళ్లు. వారిలో కశ్యపుడు ప్రధానుడగ్రిముడు. అతడు జగదుత్పత్తిహేతుభూతమైన పరమేశ్వరుని తేజోంశము. సోమనామకమైన యీశ్వరుని సంకల్పప్రభావవిశేష, మాకశ్యపుని జగత్ప్రకాశనసమర్థమైన తేజస్సునకు ప్రేరకము. స్వర్ణకారుడు కొలిమితిత్తి నూది నిప్పు మండించి దానిచే సువర్ణమును నిర్మలినముగావించి ప్రకాశింపజేయునట్లే సోముడు కశ్యపసూర్యుని తేజస్సును ప్రజ్వలింపజేసి తత్ప్రేరణముచే ఆరోగాది సప్తసూర్యులను ప్రకాశింపజేయుచున్నాడు. కావున తక్కిన సూర్యుల నిరంతర దీప్తికిని, తన్మూలకమైన జగత్ప్రకాశనమునకును పరమాధారమైనట్లు గోచరించువాడు కశ్యపసూర్యుడని విదితమగును. అతడే పరమాత్మాధిష్ఠాన మని వేదము.

"కశ్యపా దుదితా స్సూర్యాః
తే అస్మిన్ సర్వే కశ్యపా జ్జ్యోతి ర్లభంతే"

ఇత్యాది శ్రుతివాక్యముల భావమునుబట్టి యీశ్వరప్రేరణమున కశ్యపుడు తన తేజఃకణముల నా

ఖగోళమునఁదుఁగడల విరియఁజిమ్మి వాటి నందందు నిలిపి తేజోమండలాకృతుల నిచ్చి యామండలముల ననవరతముఁ ప్రకాశింపఁజేయుచున్నాఁడనియు, వేదోక్త బహువిధసూర్యులకు ప్రత్యక్షాధార మతఁడనియు, అతఁడు పరమేశ్వర సంకల్పమున సృష్ట్యాదిని సృష్టిసాధనముగా వెలసినవాఁడనియు తెలియుచున్నది.

కశ్యపనామక సూర్యుని శిల్ప మతివిచిత్రము, అనిర్వచనీయ మహిమాన్వితము, సర్వేంద్రియ సామర్థ్య సంపన్నము, సకలప్రభావ సంపూర్ణము. మఱియు—

"పృథివ్యన్తరిక్షం ద్యౌర్దిశో ఽవాంతరదిశః
అగ్నిర్వాయు రాదిత్య శ్చంద్రమా నక్షత్రాణి
ఆప ఓషధయో వనస్పతయ ఆకాశ ఆత్మా"

ఇత్యాది తైత్తిరీయవాక్య ప్రతిపాదితమైన పృథివ్యాదిలోకసాంక్తమును, అగ్న్యాది దేవతాసాంక్తమును, ఆకాశాదిభూతసాంక్తమును ఆవిర్భవింపఁ జేయుచున్న పరమేశ్వరుని దివ్యసాధనము. ఇంద్ర మిత్రాగ్ని యమవరుణాది దేవతానామరూపముల బహువిధజగత్కార్యముల నిర్వహించు సర్వదేవతాస్వరూపుఁడు, సకలభువనవ్యాపనశీల తేజోనిలయుఁడు, బ్రహ్మాండగోళద్రష్ట, సంవిద్రూపుఁడు. అట్టి కశ్యప సూర్యుఁడు సర్వకాలసర్వావస్థలయందును మేరువు నాశ్రయించి కదలకయుండును. ఉత్తరధ్రువమునకు మేరువని నామాంతరము. అనఁగా, ఆమేరువునకు సరిగా నెత్తిమీఁద నున్న గగనభాగమున నతఁడు నిశ్చలుఁడై వెలుఁగుచుండునని "స మహామేరుం న జహాతి" అను మంత్రము తెల్పుచున్నది.

కశ్యపానుగ్రహమున రోదసీకుహరమున నందందు నిలిచియున్న యసంఖ్యాకసూర్యులలో, అందును ముఖ్యులు పేర్కొన్న సప్తసూర్యులలో, భూభ్రమణ మును బట్టి నిత్య ముదయించి యస్తమించుచున్నట్లు సర్వమానవసాధారణముగా కనవచ్చుచున్న సూర్యుఁ డారోగనామకుఁడు. ఇతఁడీభూమండలమునకు సన్నిహితుఁడగుటచే జనసామాన్యమునకు గోచరించుచున్నాఁడనియు, ఇతరసూర్యులు మిక్కిలి దూరమం దుండుటచే నట్లు కనరాకున్నారనియు సప్తసూర్యులను సందర్శించిన మహర్షులు వచించియున్నారు. వారి మాటలనుబట్టి భ్రాజపటరపతంగు లను మువ్వురును మేరుమార్గమున కధోభాగమందును, స్వర్ణరజ్యోతిష్మ ద్విభాసులు ముగ్గురును మేరుమార్గమున నూర్ధ్వభాగము నందు నందందు కదలకయుండి ప్రకాశించుచున్నారని తెలియుచున్నది. ఆ చూచినవారు పంచకర్ణ సప్తకర్ణ మహర్షులు. వారు కశ్యపసూర్యుని మేము చూడలేద న్నపుడు ప్రాణత్రాతమహర్షి "నే నాకశ్యపుని జూచితి"నని చెప్పి వారికి మేరుమార్గ ముపదేశించినట్లును తైత్తిరీయారణ్యకము చెప్పుచున్నది.

ఇట్లష్టసూర్యులు కనవచ్చిరనుట యతిశయోక్తి యనువా రుండఁబోరుగాని, ద్యులోకభూలోకముల లెక్కకు మిక్కిలిగా నున్న వన్నమాటలనుబట్టి కన వచ్చుచున్న యారోగసూర్యుఁడుగాక తక్కినవారితరరోదసీకుహరముల నున్నవారేమో యని కొందఱు సంశయింపకపోరు. అగోచరమైన విషయమున నట్టి సందేహము కలుగుట సహజమేకాని ఆ యాఖ్యానము లోని తరువాతి కథనమునుబట్టి పూర్వోక్తసూర్యు లీరోదసికి చెందినవారే యని విదితమగుచున్నది. పూర్వమహర్షులు ఖగోళమును పరిశోధించి యా యా సూర్యుల యునికిని కనిపెట్టిరనియు నవగతమగుచున్నది. ఆకాశమున వెలుఁగుచున్న నక్షత్రములలో నెన్ని సూర్యమండలములో, వాటిలో ఋషులు పేర్కొన్న భ్రాజాదిసూర్యమండలము లేవో పరిశోధింపఁగలిగినచో సత్యము తెల్లముకాకపోదు. ఇపుడు పాశ్చాత్యులు కొందఱు నక్షత్రములను పరిశోధించి యం దనేకములు సూర్యమండలము లనుట వినుచున్నాము గదా! నిన్నగాక మొన్న, అమెరికాపరిశోధకుఁ డొకఁడు భూమికి డెబ్బదికోట్ల మైళ్లదూరమున నొక నక్షత్రమిపుడు కనవచ్చిన దని చెప్పిన మాట ప్రసిద్ధము గదా! ఇఁక మన పూర్వమహర్షులు కనిపెట్టి పేర్కొన్న సూర్యమండలములనుగూర్చి సంశయింప నేల? వేద ప్రతిపాదితమైన వారి ఖగోళవిజ్ఞాన మమోఘము, సుస్థిరము ననుట విశ్వసనీయము. ఇంతకుమున్ను పేర్కొన్న సూర్యు లెనమండుగురు నీరోదసీకుహర

ములోనివారే యనుటయు విశ్వాస్యము. ప్రాణత్రాత మహర్షి కశ్యపసూర్యసందర్శనాభిలాషులైన ఋషులకు చేసిన యుపదేశ మిది: భ్రాజాది సూర్యులు ముగ్గురును మేరుమార్గమునకు క్రిందిభాగమునం దధోముఖులై ప్రకాశించుచుందురు. అందుచే వారి కిరణముల వేఁడిమి పైకి సోఁకదు. స్వర్ణరాదులు మువ్వురు నామార్గమునకు పైభాగమునం దూర్ధ్వముఖులై వెలుఁగుచుందురు. అందుచే వారి కిరణముల వేఁడిమి క్రిందికి రాదు. కావున తన్మధ్యమార్గము చల్లగానుండును. ఆ మార్గమున వెళ్లి యెన్నఁడును మేరువును విడువని కశ్యపసూర్యుని మీరు చూడవచ్చును. ఆవాక్యము లివి:

"అపశ్య మహా మేరు తస్సూర్యమండలం పరివర్తమానమ్,
గార్గ్యః ప్రాణత్రాతః గచ్ఛన్త మహామేరుమ్,
ఏకం చాజహాతమ్.
భ్రాజపటరపతంగా నిహాసే తిష్ఠ న్నాతపంతి,
తస్మా దిహ తప్త్రితపాః, అముత్రే తరే,
తస్మా దిహాతప్త్రి తపాః"

దీనినిబట్టి యానాఁటి ఖగోళవిజ్ఞాతల పరిశోధన పరిశీలనవిజ్ఞానము తెలియకపోదు. ఉత్తరధ్రువ ప్రాంతదేశమం దార్యులు నివసించిన కాలమందే యీ యష్టసూర్యుల యునికి వారు కనిపెట్టియున్నారనుట నిజము. అది సుమా రెనిమిది వేల సంవత్సరములక్రిందటి మాట. అష్టసూర్య వివేకము రమారమి నాలుగువేల సంవత్సరములక్రిందట గ్రంథస్థమైనది. ప్రాచీనఋషి పరంపరాగతమైన సూర్యవృత్తాంతము విన్న ప్రాణత్రాతుఁ డుత్తరధ్రువమునకు వెళ్లి సూర్యమండల పరిశోధనము కావించి వచ్చినవాఁ డనుటకు పైవాక్యములే ప్రమాణము. మహామేరువు చెంతకు వెళ్లకుండఁగానే పంచకర్ణాది ఋషులు సప్తసూర్యులను చూచిరనుటకు "అపశ్య మహా మేరౌ న్సప్త సూర్యానితి" ఇత్యాది వాక్యములు ప్రమాణము. కాని వారి సూర్యసందర్శన విధానము మాత్రము గ్రంథస్థము కాలేదు. అది యోగదృష్టిమూలకమే యైనచో ఆర్యావర్తమందుండి సప్తసూర్యుల నట్లు సందర్శించినవారు మహామేరుగత కశ్యపసూర్యునిమాత్ర మెందుకు చూడలేరు? కావున మహాప్రతిభాశాలులైన యీ ఋషు లపూర్వములైన ఖగోళపరిశోధనసాధనము లుపయోగించియుందురని యూహింపవలసియున్నది. ఆసాధనములు, ఆశక్తియు పిదప మఱుఁగుపడిపోయినంతమాత్రమున గ్రంథస్థమైన పై యష్టసూర్యవిషయము కేవలము కల్పితమనిమాత్రము కలలోనైన స్మరింపరాదు. నిష్కాములైన యీ మహర్షులు లోకప్రతారకులా? బహువిధోపాయముల నేఁడు ఖగోళము పరిశోధించుచున్న బుద్ధిమంతులు భ్రాజాదిసూర్యులని పూర్వులు పేర్కొన్న సూర్యమండలము లివే యని కనిపెట్టి చెప్పఁగలిగినచో వైదికర్షుల మాట లప్రమాణములు కావని మనవారు భావింతురుగదా! దైవవశమున నట్టి మాట పుట్టుఁగాక.



జి. డి. బిర్లాగారి సందేశము

"బిర్లా బ్రదర్స్ లిమిటెడ్ యొక్క మేనేజింగ్ డైరెక్టరును, యునైటెడ్ కమర్షల్ బ్యాంకు లిమిటెడ్ యొక్క చేర్మను అయిన జి. డి. బిర్లాగారు.

"జాతీయ ప్రభుత్వము ఏర్పడి అధికారము చెలాయించు నప్పుడు, జాతీయ పురోభివృద్ధి విధానములో డబ్బు దాచుకొని ఆ డబ్బును ప్రభుత్వానికి అప్పు ఇచ్చుట ముఖ్యమైన ఒక భాగము కాగలదు. త్వరలోనే జాతీయ ప్రభుత్వము ఏర్పడుతుందనే నా అభిప్రాయము. ఈ పద్ధతివల్ల దేశానికి ధనము నిలువ కాగలదు. అందు మూలముగా పెట్టుబడిదార్లకు భద్రమైన ప్రతిఫలము చేకూరడమే కాకుండా, ప్రజల జీవిత ప్రమాణాన్ని వృద్ధి చేయుటకు గాను పెద్ద పెద్ద విధానములను ప్రవేశ పెట్టడానికి కూడా జాతీయ ప్రభుత్వానికి డబ్బు వసతి కలుగుతుంది. కాబట్టి, తమ అవసరాలకు మించి కొద్దిగానో గొప్పగానో వస్తువులను కొనుగోలు చేయుటకు శక్తిగలవారు, డబ్బును దాచి, దానిని పెట్టుబడి పెట్టుటకు తమంతట తామే ప్రయత్నించవలెను."

చూచియు చూడడముతో తెలిసే విషయములు

1. మీరు నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్లను 5, 10, 50, 100, 500, 1,000 లేక 5,000 రూపాయలకు కొనవచ్చును.

2. రూ. 5,000 లకు మించి యే ఒక మనిషియు కొనుటకు వీలులేదు. ఇవి ఎంతో ప్రశస్తమైనవి. అందువల్ల వీటిని కానుకచేయుట (బహుమతిగా యివ్వడ) మైనది. అయితే, యిద్దరు కలిసి రూ. 10,000 లకు కొనవచ్చును.

3. 12 సంవత్సరములలో వీటి విలువ 100_కి 50 వంతులు పెరుగును. పెట్టుబడి చేయు ఒక్కొక్క రూపాయి రూ. 1_8_0 అవుతుంది.

4. వీటి కాలము పూర్తి యగునప్పటికి, వాటికి 100_కి 4⅙ వంతుల సాధారణ వడ్డీ గిట్టుతుంది.

5. వచ్చే వడ్డీమీద ఇన్కంటాక్సు కట్టనవసరము లేదు.

6. 2 సంవత్సరములు దాటిన తరువాత వీటిని రొక్కముగకు మార్చుకొనవచ్చును. (5 రూపాయల సర్టిఫికేట్ల విషయములో 8 మాసములు దాటిన చాలును) వాటి కాలము పూర్తి అయ్యేవరకు వాటిని ఉంచుకొన్నట్లయితే మంచిది.

7. కొద్దికొద్దిగా దాచుకోగలవారు 1 రూపాయకు, 8 అణాలకు లేక 4 అణాలకు సేవింగ్సు స్టాంపులను కొనవచ్చును. ఇట్లు కొనగా కొనగా, స్టాంపుల మొత్తము 5 రూపాయలయినపుడు, వాటికి బదులుగా ఒక సర్టిఫికేటును పుచ్చుకొనవచ్చును.

8. సర్టిఫికేట్లు స్టాంపులు రెండుకూడా పోస్టాఫీసులలోగాని, గవర్నమెంటువారిచే నియమింపబడిన అధికారము పొందిన యేజెంట్లవద్దగాని, సేవింగ్సు బ్యాంకులోగాని పొందవచ్చును.

మీ డబ్బుతో 100_కి 50 వంతులు లాభము వచ్చునట్లు చేసికొనుడు.

నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లను కొనుడు

శాంతికాలపు ఆర్థిక సమస్యలు

❋

— శ్రీ పండితారాధ్యుల నాగేశ్వరరావు —

ప్రపంచము కలవారు (The Haves), లేనివారు (The Have-nots) గా విభాగమై ఉన్నంతకాలము ఆర్థికరాజకీయసమస్యలను తీరుచేయుటకు వీలుగాదు. సాధారణవర్గసంఘర్షణలు మొదలు అసాధారణప్రపంచసంగ్రామములవరకు ప్రతిదానికి హేతువు పైకి రాజకీయముగ కనిపించినను అసలు హేతువు ఆర్థికసంబంధమైనదే నని స్పష్టమగును. దేశీయులవలెనే దేశములును రెండుతరగతులుగా ఏర్పడియున్నవి. ఈ తరగతితారతమ్యముచే ప్రథమసంగ్రామమునకును, ద్వితీయసంగ్రామమునకును దారితీసినవి. చరిత్రలో ఏసంఘర్షణ విచారించినను అవి ఆర్థికసమస్యల జనితమేనని ఋజువుకాగలదు. ఈ సంఘర్షణబీజముల నిర్మూలన ఎట్లు అనే విషయమై ఏకీభావము కలుగక పోయినను, అన్ని సంఘర్షణలకు హేతువు ఒక్కటే అనే విషయమును నేడు అన్ని దేశములును అంగీకరించినవి. నిర్మూలనమునకు మార్గముల నన్వేషింప నుపక్రమించినవి. వీరనుసరించు మార్గములు మరొకరకము తరగతివిభజనకు దారితీయునను విశ్వాసము కలుగుట లేదు. నేడు ప్రపంచదేశములు తిరిగి రెండు వర్గములుగా ఏర్పడినవి - పారిశ్రామిక దేశములు; వ్యావసాయక దేశములు. ఈ భేద మిదివరకు లేకపోలేదు. కాని పారిశ్రామిక దేశములలోనే రెండువర్గములు ఉన్నందున వ్యావసాయక దేశముల విషయమున ఒకే విధానమును అనుసరించుటకు వీలుగాకుండెను. పారిశ్రామిక దేశములలో 'కలదేశములు' ఒకవైపునను, 'లేనిదేశములు' మరొకవైపునను ఉండి గతరెండుదశాబ్దములుగా వ్యావసాయక దేశములను స్వార్థమునకు ఉపయోగించుకొనుటలో తీవ్రముగ పోటీపడుచుండెను. ఈ పోటీయే ద్వితీయసంగ్రామముగా పరిణమించినది. ఒక వర్గము పూర్తిగా నాశనమైపోయినది. యుద్ధమునుండి ప్రాణములతో బయటపడగలిగిన రాజ్యములు చరిత్ర పునరావృత్తముకాకుండ చూచుటకు సమిష్టిప్రయత్నములు చేయుచున్నవి. వ్యావసాయిక దేశములను స్వప్రయోజనమునకు ఉపయోగించుకొనుటలో పోటీ లేర్పడకుండునట్లు ఈ కూటమి తగిన బందోబస్తు చేయుచున్నది. ఈ మాసమున అమెరికాలో జరుగనున్న అంతర్జాతీయవాణిజ్యసభ అట్టి ఏర్పాటులలో ఒకటి. యుద్ధము ముగింపునకు రాకపూర్వమునుండియు బ్రిటన్, అమెరికాలు ఇందుకు విపులసన్నాహములు చేయసాగినవి. అట్లాంటిక్ ప్రణాళికయందు ఈ స్వేచ్ఛావాణిజ్యసిద్ధాంతమును ప్రత్యేకము చేర్చిరి.

అన్నివిషయములలోను ఏదేశమును స్వయంపోషకము కాజాలదు. పారిశ్రామిక దేశములకు ముడిపదార్థములు కావలసియుండును. ముడిపదార్థములను సప్లయి చేయగల దేశములకు పారిశ్రామిక సామగ్రి కావలసియుండును. లోగడ వివిధపారిశ్రామిక దేశములమధ్య పోటీ ఉండినందున వ్యావసాయిక దేశములు కొంత స్వేచ్ఛను అనుభవింపవీలయ్యెను. అంతర్జాతీయ వాణిజ్యసభ ఫలితముగా ఈ స్వాతంత్ర్యము చాలావరకు తగ్గిపోవచ్చును. ఈ ఒప్పందములవల్ల భారతదేశమునకు లాభముకంటె నష్టమే ఎక్కువ కలుగవచ్చును. ౧౯౪౬-౪౭ బడ్జెటును ప్రతిపాదించుచు దిగుమతిసుంకములను తగ్గించుటనుగురించి కేంద్రప్రభుత్వ ఆర్థికసభ్యులు రోలండ్స్ తెలిపిన విషయములు ఈ సందేహములకు బలము నిచ్చినవి. స్వేచ్ఛావాణిజ్యమునకు గల తీవ్రఆటంకములలో దిగుమతి సుంకము లొకటి. గత యుద్ధానంతరమువలెనే ఈ యుద్ధము తరువాత వివిధదేశములు తమ ఆర్థిక

సౌష్ఠవమును నిలుపుకొనుటకు ఈ సుంకముల నుపయోగింపవచ్చునని, అందువల్ల తిరిగి అర్థికరంగమున ప్రతిష్టంభన మేర్పడి మరొక ప్రమాదకరమగు ఆర్థిక మాంద్యమునకు దారితీయునని అమెరికన్ వ్యాపార ప్రముఖులు భయపడుచుండిరి. బ్రిటన్ అమెరికాలు ఎగుమతి వ్యాపారములపైననే హెచ్చుగా ఆధారపడి యున్నందున అట్టి వ్యాపారమున కంతరాయము కలుగుటను సహింపజాలవు.

ప్రపంచవాణిజ్య సభద్వారా అట్టివాటిని నివారించుటకు అమెరికా బ్రిటన్ సహాయముతో తీవ్రముగా ప్రయత్నము చేయును. ప్రపంచ వ్యాపారసభకు ప్రాతిపదికగ ముందు వ్యాపారవిషయమున ముఖ్యమైన దేశముల సమావేశ మొకటి జరుగును. ఇందుకు ఆహ్వానింపబడిన దేశములలో భారతదేశ మొకటి. అంతర్జాతీయ వ్యాపారమున భారతదేశస్థానము ప్రముఖమైనదని ఎగుమతివ్యాపార మొత్తమును గమనించినచో ధ్రువపడును. భారతదేశపు ఎగుమతి వ్యాపారము హెచ్చుగా బ్రిటన్, జపాన్, అమెరికా, జర్మనీలతోనే జరుగుచుండెను. గత యుద్ధానంతరము ౧౯౨౮-౨౯ సంవత్సరములో బ్రిటన్, అమెరికా, జపానులే భారతదేశమునుండి ఎక్కువగ దిగుమతులు చేసుకొనుచుండెను. ఆసంవత్సరములోని మొత్తము ఎగుమతివ్యాపారములో నూటికి ౩౯.౨ వంతులు బ్రిటన్, ౧౨.౧ వంతులు జపాన్, ౧౩.౮ వంతులు అమెరికాలతోనే జరుగుచుండెను. ౧౯౩౨-౩౩ లో ఒటావా ఒడంబడిక ఫలితముగా అమెరికాకు భారతదేశపు ఎగుమతులు చాలా తగ్గిపోయెను. ఆ సంవత్సరము ౧౯౨౮-౨౯లో ఉన్న వ్యాపారములో సగముమాత్రమే యుండెను. అదేవిధముగ జర్మనీతో వ్యాపారమున్నూ తగ్గిపోయినది. బ్రిటనుతో గల ఎగుమతి వ్యాపారము మాత్రము దాదాపు నిలకడగనే యుండెను. ౧౯౨౮-౨౯ లో ౩౯.౨ ఉండగా ౧౯౩౫-౩౬ లో ౩౧.౫ మాత్రము పెరిగినది. జర్మనీ, జపానులు ద్వితీయ సంగ్రామము వల్ల చితికిపోయినందున భారతదేశము ఆదేశములతో తిరిగి వ్యాపారమును సాగింపజాలంగాదు.

అందుచేత ఇంకమీదట భారతదేశము ఎక్కువగా అమెరికా, బ్రిటన్, బ్రిటిష్ కామన్వెల్తురాజ్యములతోనే వ్యాపారము చేయవలసియుండును. కాని బ్రిటన్ ఎంతవరకును ఎగుమతివ్యాపారమును విస్తరింపజేసుకొనుటకే ప్రయత్నము చేయవలసివచ్చును. బ్రిటన్ వాణిజ్యసంఘాధ్యక్షులు సర్ స్టాఫర్డ్ క్రిప్స్ ఈవిషయమును అనేకదఫాలు విస్పష్టముగ ప్రకటించెను. కనీసావసరములనే దిగుమతిచేసుకొనును కనుక భారతదేశ మింతవరకు బ్రిటనుతో జరుపుచుండిన ఎగుమతి వ్యాపారమును తగ్గించుకొనవలసివచ్చును. ఈలోటును భర్తీచేసుకొను టెట్లు అన్న ప్రశ్నకు అంతర్జాతీయ వాణిజ్యమహాసభ ఏవిధముగ జవాబొసగునో చూడవలసియుండును. అమెరికా లోగడకంటె ఇకముందు ఎక్కువగ భారతదేశమునుండి దిగుమతిచేసుకొనునని ఆశించుటకు ఆధారము లిప్పటికిని కనిపించుట లేదు. వాషింగ్టనునందలి భారతవ్యాపారకమీషనరు నివేదికనుబట్టి అమెరికా భారతదేశమునుండి దిగుమతిచేసుకొను సరుకు ఒక పరిమితికి లోబడేయుండునని వెల్లడి అయినది. ఆ సరుకయినను చాలాభాగము ముడిపదార్థములే అయియుండునని కూడ ఆయన సూచించెను. భారతదేశమునుండి అమెరికా దిగుమతి చేసుకొను సరుకుజాబితాను గమనించినచో బర్లప్, జూట్, వూల్, కాటన్, షెల్లాక్, మైకా, మాంగనీసులే అమెరికాకు ఎక్కువగ కావలసియున్నట్లు వ్యక్తమగుచున్నది. ఇందు తెలుగుదేశమునకు సంబంధించినవి అభ్రకము, దూది. కాని అమెరికా తన దేశములో తయారగు దూదిని చైనాకు ఎక్కువగ ఎగుమతిచేయ నిశ్చయించుకొనినట్లు ఇటీవలి వ్యాపార ఒప్పందములు ప్రకటించినవి. భారతదేశమున తయారగుచున్న దూదికి అనువైన విక్రయశాల ఇప్పటికి లభించలేదు. దేశమున నూలు వస్త్రయంత్రములు యావత్తు దూదిని ఉపయోగింపలేవు. కనుకనే భారత ప్రభుత్వము దూదియెగుమతి విషయమున చైనాప్రభుత్వముతో ఒప్పందము చేసుకొనుటకొక రాయబారమును పంప నిశ్చయించినది. అభ్రకము విషయమున ఇప్పటికి అట్టి పోటీ యేమియూ ఏర్పడలేదు. ప్రపంచము

కంటెకు అవసరమగు అభ్రకమును ఒక్క భారతదేశమే తయారుచేయుచున్నది కనుక ఆ పరిశ్రమ కెట్టి పోటీగాని కలుగకపోవచ్చును. అయితే భారతదేశమున అభ్రకమును వినియోగింపగల పరిశ్రమలు లేవు. అమెరికా ఈ అభ్రకము నుపయోగించుకొని రేడియో ఎలాక్ట్రానిక్ పరికరములను తయారుచేసి భారతదేశమునకే తిరిగి ఎగుమతిచేసి అధికలాభములను చేయవచ్చును. ఈ శతాబ్దారంభమునుండియు భారతదేశపు ఎగుమతి దిగుమతి వ్యాపారమును పరిశీలించినచో ఈవిషయము స్పష్టమగును. భారతీయులు ఎగుమతిచేయునది ముడి పదార్థములు; దిగుమతిచేసుకొనునది పారిశ్రామికవస్తువులు. నూనెగింజలను ఎగుమతిచేసి వాటినుండి తయారగు నూనెలు, సబ్బులు మొదలైన సరుకును దిగుమతి చేసుకొనుచుండుట సర్వసాధారణవిషయమైనది. ప్రతి వస్తువువిషయమునను ఇది యథార్థము.

రెండుశతాబ్దముల బ్రిటిష్‌పాలనఫలితముగా భారతదేశము తన ప్రకృతిసంపదను సద్వినియోగము చేసుకొనజాలని పారిశ్రామికదుస్థితియందున్నదన్నచో భారతదేశ ఆర్థిక, సాంఘిక, పారిశ్రామికాభివృద్ధి విషయమున బ్రిటన్ అవలంబించుచున్న స్వార్థపూరితవిధానము వెల్లడియగును. ఈవిధానము క్లైవ్ కాలమునాటికీ, వేవెల్ కాలమునాటికి ఎట్టిమార్పును చెందలేదు. బ్రిటిష్ ప్రభుత్వధోరణి ఇకముందు మరీ ఎక్కువగ భారతదేశ పరిశ్రమాభివృద్ధికి ప్రతిబంధకముగ నుండగలదు. కేంద్రప్రభుత్వప్లానింగ్ సభ్యులు సర్ ఆర్ధేషిర్ దలాల్ రాజీనామా ఇట్టి అభిప్రాయ మేర్పడుటకు దోహదము చేయుచున్నది. రానున్న బ్రిటిష్‌మంత్రివర్గ రాయబారములో బ్రిటిష్‌వాణిజ్యసంఘాధ్యక్షులు సర్ స్టాఫర్డ్ క్రిప్స్ ఉండుటవల్ల ఈఅభిప్రాయమునకు అదనపు బలము చేకూరినది. బ్రిటన్ తన రాజకీయఆధిపత్యమును కొంతవరకైనను వదలుకొనుటకు సిద్ధపడునేగాని, ఆర్థికవాణిజ్యవిషయములలో భారతదేశముపై తన పట్టును వీలైనంతవరకు గట్టిచేసుకొనుటకే ప్రయత్నించునని నిస్సందేహమైనది.

వాషింగ్టనులో జరుగు ప్రపంచవాణిజ్య, ఉద్యోగమహాసభ ఈ రెండు అగ్రపారిశ్రామికరాజ్యముల యాజమాన్యమున జరుగును. రెండు దేశములును తమ పారిశ్రామికవస్తువులను వీలైనంతహెచ్చుగా ఇతరదేశములకు దిగుమతిచేయుటకు ప్రయత్నములు చేయుచున్నవి. ఆంగ్లో - అమెరికను అప్పు ఒడంబడికపత్రములో ఈవిషయము బహిరంగముగ ప్రకటితమైనది. అమెరికా ప్రభుత్వకార్యదర్శి జేమ్స్‌బెర్నెస్ అమెరికా శాసనసభలు వీలైనంతత్వరలో ఈ అప్పును ఆమోదించవలసిందని కోరుతూ అట్టి చర్యవల్ల కలుగు ఫలితముల నిట్లు వివరించెను:

“ఒక మహోత్కృష్టమగు లక్ష్యమును పొందుటకు ఇంత ధనమును పెట్టుబడిపెట్టినాము. అది లేకపోయిన రోజురోజుకు విస్తరింపగల ప్రపంచఆర్థికవ్యవస్థానిర్మాణము సాధ్యముగాదు. అందుకు మనము చేయు ప్రయత్నము లన్నియు విఫలమగును. కాని ఈఅప్పును అంగీకరించుటవల్ల మన మొక శక్తివంతమైన రాజ్యమైత్రిని, సహకారమును పొందగలుగుదుము. వాణిజ్యవిస్తరణను అరికట్టు సుంకములు, దారిద్ర్యమును వర్ధిల్లజేయు సంకుచితఆర్థికవిధానముల నిర్మూలనమునకు ఈమైత్రి ఉపయోగపడగలదు.”

ఇందుకే అమెరికా ప్రపంచవాణిజ్యసభ నేర్పాటుచేయుచున్నది. లోగడ జరిగిన అంతర్జాతీయసభలవల్ల ఎంత ప్రయోజనము కలిగినదో ఇప్పుడున్నూ భారతదేశమునకు అంతటి ప్రయోజనమే కలుగగలదు. యుద్ధపుతాకిడిఫలితముగా యూరపురాజ్యములు యావత్తూ పూర్తిగ దెబ్బతినిపోయినవి. అవి ఎగుమతిచేయగల స్థితిలోగాని, దిగుమతిచేసుకోగల స్థితిలోగాని లేవు. అంతేగాక పారిశ్రామికముగా ప్రాచ్యదేశములంత వెనుకబడిలేవు పాశ్చాత్యదేశములు. కనుకనే బ్రిటన్ అమెరికాలు తమ దృష్టిని ప్రాచ్యదేశములవైపుకు మరల్చి, ఆ యా దేశములను ఆర్థికబానిసలుగా చేయుటకు తమ శక్తిని పూర్తిగా వినియోగించుచున్నవి. ఏ ప్రపంచవిభజనమును నివారించుట అవసరమని అమెరికనుప్రభుత్వాధికారులు ఘోషించుచుండిరో అట్టి విభజనే నేడు జరుగుచున్నది. అమెరికా చైనాను, బ్రిటన్ ఇండియాను పంచుకొన్నవి. ఒకరి రంగమున మరొకరు జోక్యము కలిగించుకొనరాదని

ఒకరితో నొకరు చెప్పుకొనిరి. ఆదేవిధముగ తమ వైదేశిక విధానములను నిర్ణయించుకొనిరి. ఆవిధానమున కనుగుణముగనే నడచుకొనుచుండిరి.

రేపు జరుగు వాణిజ్యమహాసభలో ఈవిషయము మరింత స్పష్టముగ వెల్లడియగును. భారత దేశపుఎగుమతి వ్యాపార మిదివరకు ఏయే దేశములలో హెచ్చుగా జరుగుచుండెనో ఆయా దేశములనుండియే భారత దేశము ఎక్కువగా దిగుమతులు చేసుకొనుచుండెను. మొత్తముమీద భారత దేశపుఎగుమతివ్యాపారమే దిగుమతి వ్యాపారముకంటె ఎక్కువగనున్నను ఈ వ్యాపారసంపర్కము వివిధదేశములమధ్య సమానముగ లేదు. బ్రిటన్ వ్యాపారవిధానమును అనుసరించియే ఇది జరుగుచుండెను. ౧౯౧౩-౧౪ మొదలు నేటి వరకు ఈ ద్విముఖ వ్యాపారమును పరిశీలించినచో భారతదేశము ఎక్కువగ బ్రిటనునుండియే దిగుమతి చేసుకొనుచున్నదని తేలుచున్నది. ౧౯౧౩-౧౪ వ సంవత్సరములో మొత్తం భారత దేశపుదిగుమతులలో నూటికి ౬౪ వంతులు బ్రిటనునుండియే వచ్చుచుండెను. ఆ సంవత్సరము జర్మనీనుండి ౬.౯ వంతులు, జపాను నుండి ౨.౬ వంతులు, అమెరికానుండి ౨.౬ వంతులు చొప్పున భారతదేశమునకు సరుకు దిగుమతియగుచుండెను. ౧౯౧౮-౧౯ సంవత్సరములో - అనగా ప్రథమ ప్రపంచసంగ్రామానంతరము ఈ దిగుమతి వ్యాపార మీరీతిగ నుండెను. బ్రిటన్ ౪౫.౫, జపాన్ ౧౯.౮, అమెరికా ౯.౫ వంతుల చొప్పున దిగుమతులు చేయుచుండెను. జర్మనీనుండి దిగుమతులు పూర్తిగ నిలిచిపోయెను. జపాను మిత్రరాజ్యముల పక్షమున పోరాడియున్నందున యుద్ధానంతరము జపానుకు ఎగుమతివ్యాపారమును వృద్ధిచేసుకొనుటకు అదనపు అవకాశములు లభించినవి. కాని ౧౯౩౨ సరికి బ్రిటిష్ దిగుమతులు దారుణంగా పడిపోయినందున సామ్రాజ్య దేశాలతో ప్రత్యేకఒడంబడిక నేర్పాటుచేసుకొని తిరిగి ఎగుమతివ్యాపారమును వృద్ధిచేసుకొనెను. ఈ ఒడంబడికఫలితముగ ౧౯౩౩-౩౪ లో అమెరికా వ్యాపారము ౬.౨ వరకు, జపాన్ వ్యాపారము ౧౪.౨ వరకు తగ్గెను. తిరిగి ఇట్టి పరిస్థితి యేర్పడకుండా చూచుటకే అమెరికాప్రభుత్వము ఇన్ని ప్రయత్నములు చేయుచున్నది. కిందటియుద్ధముతరువాతకూడ పారిసులో జరిగిన ఆర్థికమహాసభలో అమెరికన్ ప్రతినిధులు ఇదే విధముగ ప్రయత్నించియుండిరి. ధరలను ప్రమాణబద్ధము చేయవలెనని, అన్ని దేశముల ద్రవ్యప్రమాణములు ఒకేప్రమాణమునకు కట్టుబడియుండునట్లు చేయవలెనని ఆసభలో గావింపబడిన ప్రతిపాదనములు బ్రిటన్, ఫ్రాన్సుల ప్రతిఘటనవల్ల వీగిపోయినవి. ధరల స్థిరీకరణ జరుగనందున, స్వేచ్ఛావ్యాపారము న ఒకరితో నొకరు పోటీపడి తుదకు ఆర్థికమాంద్యమునకు దారితీసిరి. ఈ విషాదచరిత్ర పునరావృత్తము కారాదని, అందుకు అన్ని దేశములు కలసి పనిచేయవలెనని అమెరికనులు కోరుచున్నారు.

ప్రపంచము ఆర్థిక కూటములుగా విభాగము కాకుండ చూచుటే శాంతికాలపు సమస్యలలో అత్యంత ప్రధానమైనదని, అందుకొరకే ఐక్యరాజ్యముల సంఘము, బ్రెటన్ వుడ్స్ ద్రవ్యనిధి, బ్యాంకు, ప్రపంచవాణిజ్యసంఘములు ఏర్పాటుచేయుట జరిగినదని అమెరికను ప్రభుత్వాధికారులు ప్రకటించుచుండిరి. కాని వీటివల్ల అట్టి విభజన నివారణగుటకు బదులు త్వరగా జరుగును. ఈ పద్ధతిని శాంతికాలపు ఆర్థిక సమస్యలు పరిష్కారము కానేరవు.

ప్రపంచవాణిజ్యమహాసభ చర్చించవలసినవిషయముల ముసాయిదా తయారుచేసి అమెరికాప్రభుత్వము ప్రకటించినది. ఈ ముసాయిదాను పరిశీలించిన ఒక్క విషయము బోధపడును. స్వేచ్ఛావ్యాపారము పేరిట వివిధప్రభుత్వములు తమ దేశపరిశ్రమల రక్షణకు ఏర్పాటుచేసుకొనిన సుంకములను పూర్తిగ రద్దుచేయించి గాని, కనీస ప్రమాణమునకు తగ్గించిగాని యథేచ్ఛగా వ్యాపారమును సాగించుకొనుటకు అమెరికా ప్రయత్నించుచున్నది. జపాన్, జర్మనీలు పారిశ్రామికముగ పూర్తిగ చితికిపోయినవి. లోగడ ఆదేశములు ఎగుమతి చేయుచున్న వాటిని తమ మధ్య పంచుకొనుటకు బ్రిటన్, అమెరికాలు ఒక ఏర్పాటుకు వచ్చినవి. ఆంగ్లో-అమెరికన్ ఆర్థిక ఒప్పందములోని సామ్రా

ట్యాక్సీమాన విసర్జనకు సంబంధించిన వరకు ఈ విషయమును విస్పష్టము చేసినది.

భారతప్రజాభిప్రాయమును తెలుసుకొనకనే భారతప్రభుత్వము అమెరికా ఆహ్వానమును అంగీకరించి ప్రాతిపదిక చర్చలలో పాల్గొనుటకు ప్రతినిధులను కూడ నియమించినది. బ్రెటన్ వుడ్స్ ద్రవ్యమహాసభలో జరిగినరీతినే తిరిగి ఈసమావేశమునందును భారతదేశమునకు న్యాయము జరుగకపోవచ్చును. ప్రపంచసభ చర్చించు నాలుగు అంశములలో భారతదేశములాంటి వ్యవసాయిక దేశములకు సంబంధించిన దేదియు లేదు. దిగుమతిసుంకములను తగ్గించువిషయమున భారతదేశము జేమరతుగ అంగీకరింపజాలదు. భారతదేశము దిగుమతి చేసుకొనవలసియున్నది కీలకయంత్రములు. అందును ప్రధానముగ ప్రజల దైనికావసరములకు చెందిన వస్తువులను తయారుచేయుగల యంత్రములు. బ్రిటన్ అమెరికాలు తిరిగివచ్చిన భారతపారిశ్రామికులు ఈవిషయమున నిస్పృహ చెందిరి. భారతపారిశ్రామిక సంస్థలలో భాగస్వామ్య మొసగినగాని బ్రిటిష్ అమెరికన్ పారిశ్రామికులు యంత్రసామగ్రిని తమదేశములనుండి భారతదేశమున కెగుమతిచేయనిరాకరించిరి. భారత పారిశ్రామిక కూటములు కొన్ని అట్టి భాగస్వామ్యమును అంగీకరించుచు విదేశీకూటములతో ఒడంబడికలు చేసుకొనినవి. ప్రభుత్వ మిట్టి "అపవిత్రభాగస్వామ్యము"లను నివారింపలేకపోయినది. కనుక ఈవిధముగనే ఈదేశమున బ్రిటిష్‌కంపెనీలు సంపాదించిన ఆస్తులు తిరిగి భారతీయుల పరమగుటకు దాదాపు అర్ధశతాబ్దము పట్టినది. రైల్వేకంపెనీలను కొనివేయుటే దశాబ్దము పట్టినది. ఏదో విధముగ ఆసమస్య పరిష్కారమైనదని తృప్తి చెందుతూ ఉన్న క్షణములో తిరిగి బ్రిటిష్‌సంస్థలు భారతదేశ నిస్సహాయస్థితిని ఉపయోగించుకొని కొత్తఆస్తులను సంపాదించుచున్నవి. వీటిని నివారింపగల, నిషేధింపగల భారతప్రభుత్వము ఉపేక్షించినది. కనుక భారతపరిశ్రమల భవిష్యత్తు పూర్తిగ బ్రిటన్, అమెరికాల దయాదాక్షిణ్యములపై ఆధారపడియుండవలసివచ్చెను. ఈపరిస్థితులలో భారతదేశమునకు అంతర్జాతీయసభవల్ల ఏమి ప్రయోజనము కలుగునో బోధపడుట లేదు. ఆసభ నిర్ణయములతో నిమిత్తము లేకనే కేంద్రభారతప్రభుత్వము యంత్రసామగ్రి దిగుమతుల సుంకమును, భారతపరిశ్రమల కవసరమగు ముడిపదార్థములకు సంబంధించిన సుంకములను తగ్గించుటకు నిర్ణయించినది. ఇందువల్ల చిల్లరపరిశ్రమలకు మేలు కలుగవచ్చును. కాని భారతపరిశ్రమలరక్షణ భారతప్రభుత్వ లక్ష్యమైయున్నచో సుంకములనుతగ్గించకనే ఆయాపరిశ్రమలకు ఆర్థికరక్షణల నేర్పాటుచేసియుండవచ్చును. ఈ దిగుమతియగు యంత్రము లెట్టివో తెలియదు. ఏపరిశ్రమలకో తెలియదు. నూలు వస్త్రముల తయారుయంత్రముల కవసరమగు సామగ్రిని సప్లయిచేయ నిరాకరించెను. బ్రిటన్ భారతదేశమునుండిగాని, ఈజిప్టునుండిగాని, లేదా అమెరికానుండిగాని ప్రత్తిని దిగుమతి చేసుకొని, బట్టలను తయారుచేసి భారతదేశమునకు ఎగుమతి చేయును. ఇప్పటికి బ్రిటను భారతదేశమునకు విపరీతముగ బాకీపడినది. కనుక ముమ్ముందు బ్రిటను వెనుకటిలాగా భారతదేశమునుండి దిగుమతులను చేసుకొనజాలదు. ఇప్పటి బ్రిటిషుఆర్థిక స్థితిని గమనించినచో బ్రిటను తనపరిశ్రమల కవసరమగు ముడిపదార్థములను తెప్పించుకొని, వస్తువులనుతయారుచేసి ఇతరదేశముల కెగుమతిచేయుటకు మించి ఏమీ చేయలేదని వెల్లడికాగలదు. వీటన్నింటివల్ల భారతపరిశ్రమలకు అంతర్జాతీయవ్యాపారమహాసభ చేయు సుంకముల తగ్గింపునిర్ణయము నష్టదాయకముగనే యుండును.

కాగా, ఈ మహాసభ విచారించు ఇతర మూడు విషయములలో ప్రయివేటు వ్యాపారకూటములు ఏర్పాటుచేయు నిబంధనలు ఒకటి. బ్రిటిష్ ప్రభుత్వము తమ దేశములో ప్రధాన పరిశ్రమలనన్నింటిని ప్రజాయత్తము చేయుచున్నది. ప్రయివేటు వ్యాపారకూటముల ప్రమాదములను తొలగించుట కంతకంటె వేరుమార్గము లేదు. అమెరికా ఇందుకు సమ్మతించదు. తనదేశపు కార్మికులకు పని కలిగించుటతోబాటు తన పారిశ్రామికవర్గమునకు తగిన రక్షణలను కలిగించుటకుకూడ అమెరికా ప్రయత్నము చేయుచున్నది. ఈ సమస్య అంతర్జాతీయ పరిష్కారమునకు తగ్గదే అయినను, వివిధదేశములందు వివిధరకముల ప్రభుత్వములున్నవి. అధిక సంఖ్యాక

ములు ధనికవర్గముల అదుపులోనున్నవి. వారి యపేక్షలకు విరుద్ధమగు చర్యల నీ ప్రభుత్వములు తీసుకొనజాలవు. కనుక ఈ సమస్యను సంతృప్తికరముగ అంతర్జాతీయవాణిజ్యసభ పరిష్కరింపజాలదు.

అసలు ప్రధానమగు ధరల స్థిరీకరణవిషయ మీ సమావేశమున చర్చకు వచ్చునట్లే కన్పించదు. ఇది జరుగనిది ప్రపంచవ్యవసాయిక దేశముల ఆర్థికస్థితి బాగుపడదు. పంటదారులకు గిట్టుబాటుగనుండునట్టి ధరలు రావు. పారిశ్రామిక సరుకుల ధరలనుబట్టి వీటిధరలను నిర్ణయింప వాషింగ్‌టన్‌లో నిర్ణయము జరుగవచ్చును. కాని అది న్యాయబద్ధముగనుండజాలదు. పారిశ్రామికులకు విక్రయశాలలను, కార్మికులకు పని, వేతనములను కల్పింప యత్నించిన ప్రభుత్వము వ్యవసాయికదారుల విషయమున పంటకు మంచి ధరలను చేకూర్చు విషయమై శ్రద్ధవహింపకుండుట అనేక అనుమానములకు కారణమగుచున్నది.

వాషింగ్టను సభ ఫలితములు ఏమైనప్పటికీ ఒక్క విషయము మాత్రము సమావేశారంభమునకు పూర్వమే స్పష్టమైనది. బ్రిటను, అమెరికాలు ప్రపంచమును రెండు భాగములుగా విభజింప ప్రయత్నించుచున్నవి. వీరి ప్రయత్నము ఫలించినచో ప్రాక్‌పశ్చిమ దేశములు రెండు వేరు వేరు వర్గములుగా ఏర్పడును— పారిశ్రామిక రాజ్యములు, వ్యవసాయిక దేశములు. రాజకీయ స్వాతంత్ర్యము నిచ్చివేసినను ఆర్థికముగ ఆసియాను అణచియుంచుటకు వీరు ప్రయత్నించుచున్నారు. ఈ ప్రయత్నములు తృతీయప్రపంచసంగ్రామమునకే దారితీయగలవు.

భారతప్రతినిధులు అంతర్జాతీయ వాణిజ్యసభయందు వ్యవసాయిక దేశములకు నాయకత్వము వహించి ఈ ప్రమాదమును నివారింపవలసియున్నది. ఇప్పటి ప్రభుత్వ ప్రతినిధు లీ పనిని చేయగలరా? ఇది జరుగకుండ చూచుటకే ముందుగ కామన్వెల్తు రాజ్యాల సభను బ్రిటన్ ఏర్పాటుచేసినది. రాబోవు బ్రిటిష్ మంత్రివర్గ రాయబారము బ్రిటన్, భారతదేశముల వాణిజ్యసంబంధముల భవిష్యత్తు విషయమును ప్రత్యేకము చర్చించెదరు. ఇవి అన్నియు మరొక ఒటావా ఒడంబడికకు దారితీయకుండునట్లు జాగ్రత్తపడవలసియున్నది.



కలగూరగంప

కోహినూరు వజ్రము

ఈ వజ్రపు కీర్తిప్రభావములనుగురించి తెలియనివా రుండరనుకొంటాను. ఇది గోదావరీనదీ గర్భములో దొరకినదని కొందరంటారు. గోలకొండ వజ్రపుగనిలో ౧౫౫౦ సం.లో ఇది చిక్కినదని డాక్టరు బ్రూయరు వ్రాసినాడు. ౧౩౦౪ సం. నాటికే అది దొరికిఉండినదనిన్ని, అప్పు డది మొగలాయి చక్రవర్తుల అధీనమైనదనిన్ని, అంతకుపూర్వము వాలుగువేల యేండ్లకు పూర్వమునుంచిన్ని అది ఉండినట్టు గాథలు కలవనిన్ని డాక్టరు జి. ఎఫ్. హెర్బర్టుస్మిత్తు గారు వ్రాసినారు. కృష్ణుని కాలమునుంచిన్ని అది ఉండినట్టు హిందూపురాణములు చెప్పుతున్నట్లు ఇమాన్యుయల్ గారు వ్రాసినారు. గోలకొండకు ౮౦ మైళ్ల దూరములో ఒక పొలమును దున్నుతూఉండగా అది నాగలికి తగిలి బయటికివచ్చినదనిన్ని, ఆదిలో అది పెద్ద కోడిగ్రుడ్డంత ఉండేదనిన్ని కింగ్ అనేఆయన వ్రాసినాడు. దానిని ఔరంగజేబుచక్రవర్తికిరీటములో చూచినట్టు టావెర్నియ రనే ప్రయాణికుడు తెలిపినాడు. ఔరంగజేబు దానిని సరిదిద్దడానికి హోర్టెన్సియో బోర్గియో అనే ఇటాలియనుచేతి కివ్వగా, వాడు దానిని కోసికోసి ౭౯౩ రతుల ఎత్తుగలదానిని ౧౮౬ రతుల ఎత్తుకు దించినాడట. అందుమీద ఔరంగజేబుకు



బెంగుళూరులో జరిగిన అఖిలభారత ఒలింపిక్ ఆటలలో చెడుగుడుపోటీలో ప్రథమబహుమతి పొందిన ఆంధ్రజట్టు.

వానిమీద ఆగ్రహము కలిగి, వానికున్న ఆస్తిఅంతా లాగుకొని, చావచంపి చెవులుమూసి పంపించినాడట.

ఈ వజ్రమును ధరించిన రాజులకు దురాశాక్రౌర్యములు కలిగి అందుమూలమున గొప్ప కీడు కలిగితీరుతుందని హిందువుల నమ్మకము. ౧౭౩౯ లో నాదర్ షా ఢిల్లీని దోపిడీ చేసినప్పుడు దానిని మహమ్మద్ షానుండి లాగుకొని దానికి "కోహ్-ఇ-నూర్"—ప్రభాపర్వతము అని పేరుపెట్టినాడు. దానిని తీసికొని పెర్షియాకు పోగానే నాదర్ షాను అతని దండనాయకులు చంపివేసినారు. ఈ హంతకులలో ఒకడైన మహమ్మద్ షా దుర్రానీ అనేవాడు ఆఫ్ఘను వంశమును స్థాపించినాడు. ఈవంశములో తుదివాడు షాషుజా అనేవాడు. రణజిత్ సింగు ఆవజ్రమును తన కిమ్మన్నప్పు డివ్వలేదని అతడిచ్చేవరకూ కూడూ నీళ్లూ లేకుండా పస్తుంచినాడు. దానితో అతడిచ్చివేసినాడు. మరణకాలమందు రణజిత్ సింగు దానిని జగన్నాధదేవునికి సమర్పించినాడు. కాని, అతని తరువాతివారు తిరిగీ లాగుకొన్నారు. ౧౮౪౯ లో బ్రిటిషువారు పంజాబును తమ యేలుబడిలో చేర్చుకొన్నప్పుడు దానిని తూర్పు ఇండియా వర్తకసంఘమువారు డాల్ హౌసీ ప్రభువుద్వారా విక్టోరియారాణికి బహుమతిగా ఇచ్చినారు. అది విక్టోరియా-కిరీటములో చేరిన పదిసంవత్సరములకే సిపాయీల తిరుగుబాటు జరిగినది. అప్పుడు ఇండియా బ్రిటిషువారి అధీనమునుంచి తప్పిపోవలసినదే. కాని చావుతప్పి కన్నులొట్టపోయినట్టు జరిగినది. ఇప్పటికిన్ని ఆవజ్రము బ్రిటిషుచక్రవర్తికిరీటములో ఉన్నంతకాలమున్నూ అట్టి అపాయము నిరంతరమూ ఉండనేఉన్నదని బ్రిటిషువారిలో కొందరు నమ్ముతున్నారు.

ఈ వజ్రమును తిరిగీ ౧౮౫౨లో హాలండులోని ఆమ్ స్టర్ డామ్ నివాసి అయిన కాస్టర్ అనే ఆయన తిరిగీ మెరుగుపెట్టడానికి కోసి మరి ౮౦ రతుల ఎత్తు తగ్గించినాడు. ఇప్పుడీవజ్రపు ఎత్తు ౧౦౬ రతులున్నదట. దాని వెలను కొందరు ఒకలక్ష పౌనులుగాను, కొందరు ౧౨ లక్షల పౌనులుగాను ౧౯౩౭ సం.లో కట్టినారు.

ఈ వజ్రమును ముంచిన నీటి నిస్తే ఎటువంటి రోగములయినా కుదురునని ఇంగ్లాండులో ఒక ప్రతీతి ఉన్నది. జ్యోతిశ్శాస్త్రము ప్రకారము ఇండియామీద శనిదృష్టి ఉండడముచేతను, అది మకర రాశిలో ఉండడముచేతను ఆవజ్రము ఇండియాకు కీడుకలుగజేసేదికాబట్టి అక్కడ ఉండకూడదనిన్నీ, శుభవీక్షణము కలిగి, మేషరాశిలో ఉన్న ఇంగ్లాండుకది శుభకరమనిన్నీ ఇంగ్లీషుజ్యోతిష్కులంటున్నారు. ఎందు కంటున్నారో స్పష్టమే.

—చిలుకూరి నారాయణరావు.





విమర్శనము

కళాతరంగిణి

ప్రస్తుతకాలమున వెల్లివిరిసిపోవుచున్న భరతాభినయవిద్యను గమనించి, హృదయమున బహు తపించి, తత్స్వరూపావగమము తదభ్యాసకులకు కొంత వరకైన కలిగించునూహతో వ్రాయబడిన లఘు గ్రంథము.

రచయిత : శ్రీ రామాచార్యులుగారు, నర్తనశాల, రాజమహేంద్రవరము. వెల ఒక రూపాయి.

నూతనవర్ష ప్రార్థనలు

'తల్లిగారు' ప్రతియేడాదియందును ఆ యేటి కంతకు శ్రీ అరవిందసాధకులకు మార్గదర్శకముగాను, ప్రోత్సాహకరముగాను ఉండుటకై ఒక్కొక్క క్రొత్తభావమును నిరూపించుచు క్రొత్తక్రొత్త ప్రార్థనలను చేర్చుట చిరకాలముగా వచ్చుచున్న పరిపాటి. ఆ చిన్ని ప్రార్థనల క్రోడీకరణమే ఈ చిన్న పుస్తకము. ఆకారమున బహు చిన్నదయినను ఇది గడచిన పంద్రెండేండ్లలోను ప్రపంచమందు జరిగిన చారిత్రక సంభవములయొక్క ఆధ్యాత్మికాభివృద్ధిని స్పష్టముగా వెల్లడి చేయజాలియున్నది.

అనువాదకులు : సి. సీతారాంగారు, శ్రీఅరవిందాశ్రమము, పుదుచ్చేరి. వెల మూడణాలు.

చెదపురుగు

చిన్న ఖండకావ్యము. ఆకారములో, వస్తువులో కూడ ఇది చిన్నదే. అధికారమదాంధులు సత్పురుషుల కపకృతి గావించి, ఫలితముగా అధఃపతనము ననుభవింతురన్నది ఇందలి సందేశము.

కవి : శ్రీపాద శ్రీరామమూర్తిగారు, విశ్వకళామండలి, రంగారాయపురం అగ్రహారము. ప్రకాశకులు: వెంపరాల రామలింగంగారు, డాబాగార్డెన్సు, వాల్తేరు.

పూలగుత్తి

అక్కడక్కడ పత్రికలలో ఒకసారి తమ వాసనను వెదజల్లిన కొన్ని పద్యకుసుమములు ఇందులో ఒక గుత్తిగా కూర్పబడినవి. జాజులు, విరజాజులు మొదలైన మేలితరపువి కావుకాని నేటి నవనాగరక కుసుమాలజాతికి ఇవి తప్పక చేరగలవు.

కవి : బూదూరు రామానుజులురెడ్డిగారు. ప్రకాశకులు : వెంకటరామా అండుకో., బెజవాడ. వెల ౮ అణాలు.

దీనప్రభ

దీనజనాభ్యుదయలక్ష్యముతో ఈ యేడు జనవరిలో క్రొత్తగా ప్రారంభమైన మాసపత్రిక. పేరుకు తగినట్లు నిరాడంబరమైన స్వరూపము. సంపాదకుడు : భట్టకుమారస్వామిగారు. కార్యాలయము : ఇస్లాంపేట, బెజవాడ. సంవత్సర చందా ౩ రూపాయలు. విడి సంచిక ౪ అణాలు.

గ్రంథస్వీకారము

జ్యోత్స్న

మూడంకముల నాటకము. రచయిత : దుగ్గిరాల విశ్వనాథంగారు. ప్రకాశకులు: రాధాకృష్ణ అండుకో., బెజవాడ. వెల ఒక రూపాయి.

శ్రీ అరవిందుని యోగము

మొదటిభాగము. శ్రీ నలినీకాంతగుప్తగారి ఆంగ్ల గ్రంథమున కనువాదము. అనువాదకులు : సి. సీతారాంగారు, శ్రీ అరవిందాశ్రమము, పాండుచేరి. వెల ౧౨ అణాలు.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., G. T., Madras. Editor—S. Sambhu Prasad.